
బుధవారం 16-10-2024


'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 205

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



**ఐ4సీ అంబాసిడర్‌గా రష్మిక**
ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం - 15లో



**5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం..**
తయారీ రంగానికి టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తీపికబురు - 17లో



**గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ కావాలి**
డిజిటల్ టెక్నాలజీ, ఏఐ వాడకం విషయంలో స్పష్టమైన విధివిధానాలు ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు.
- వివరాలు 6లో▶



**నేడు ఒమర్ అబ్దుల్లా ప్రమాణం**
కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ తొలి సీఎంగా నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా నేడు ప్రమాణం చేయనున్నారు.
- వివరాలు 6లో▶



**ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు ఖరారు**
అమెరికా నుంచి దాదాపు రూ. 33,624 కోట్ల విలువైన ఎంక్యూ9బీ రకం 31 సాయుధ డ్రోన్లను భారత్ కొనుగోలు చేయనుంది.
- వివరాలు 6లో▶



**ఈవీ బ్యాటరీల స్వాపింగ్**
దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) చార్జింగ్‌కు ప్రత్యామ్నాయంగా బ్యాటరీలను మార్చుకొనే విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది.
- వివరాలు 7లో▶

## న్యూస్‌రీల్

### ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా ఐవీఎఫ్ సేవలు



రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రుల్లో ఐవీఎఫ్ సేవలు ఉచితంగా పొందొచ్చని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ తెలిపారు. నిరుపేదలకు మాతృత్వపు మమకారాన్ని అందిస్తామని చెప్పారు.
- వివరాలు 3లో▶

### గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు లైన్‌క్లియర్



రాష్ట్రంలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు హైకోర్టు లైన్‌క్లియర్ చేసింది. అక్టోబర్ 21 నుంచి అక్టోబర్ 28వ తేదీ వరకు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు ఉన్న చట్టపరమైన అడ్డంకులను తొలగించింది.
- వివరాలు 7లో▶

### ప్రముఖ గైనకాలజిస్టు ఉషాలక్ష్మి కన్నుమూత



బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్‌ను స్థాపించి విశేష సేవలందించిన ఉషాలక్ష్మి 8లో




# దేశ రక్షణలో రాజీలేదు

**దామగుండం వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ శంకుస్థాపనలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్**

**సకాలంలో అందే సమాచారమే యుద్ధంలో గెలుపోటములను నిర్ణయిస్తుందని వ్యాఖ్య**

- కచ్చితమైన, వేగవంతమైన సమాచారం చేరవేతలో వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రాలు అత్యంత కీలకం
- దేశ రక్షణ, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావుండొద్దు
- పర్యావరణానికి హాని కలుగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తామని వెల్లడి
- రాడార్ కేంద్రాన్ని కొందరు రాజకీయం చేస్తున్నారన్న సీఎం రేవంత్




రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ పటాన్ని బహూకరిస్తున్న నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి, సీఎం రేవంత్‌రెడ్డి ▶

సాక్షి, హైదరాబాద్: దేశ రక్షణ విషయంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా రాజీపడేది లేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. అత్యాధునిక పరికరాలు, ఆధునిక సాంకేతికతను సమకూర్చడం ద్వారా రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. యుద్ధ రంగానికి సంబంధించిన సవాళ్లలో మార్పుల నేపథ్యంలో కచ్చితమైన, అత్యంత వేగవంతమైన సమాచార వ్యవస్థ ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. యుద్ధంలో బలగాలకు సరైన సమయానికి అందే సమాచారమే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుందని అన్నారు. యుద్ధ క్షేత్రంలోని వారికి సరైన సమయంలో కచ్చితమైన సమాచారాన్ని చేరవేస్తేనే శత్రువును దెబ్బకొట్టగలుగుతారన్నారు. అందుకు వెరీ లో ఫ్రీక్వెన్సీ (వీఎల్ఎఫ్) రాడార్ కేంద్రాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లోని 2,900 ఎకరాల్లో రూ.3,200 కోట్ల నిధులతో భారత నావికాదళం నిర్మిస్తున్న వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్‌కు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి రాజ్‌నాథ్ సింగ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన

మిగతా 8వ పేజీలో ▶

**నేతల కట్టడి.. ముందస్తు అరెస్టులు**
రాడార్ స్టేషన్ శంకుస్థాపనకు భారీ బందోబస్తు.. పోలీసుల అదుపులో ప్రజా సంఘాలు, జేఏసీ నాయకులు
వివరాలు 8లో

మంగళవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఈసీ రాజీవ్ కుమార్. చిత్రంలో కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్ సింగ్ ▼




# మోగిన ఎన్నికల నగారా

**మహారాష్ట్రలో 288 సీట్లకు ఒకే విడతలో నవంబర్ 20న.. జార్ఖండ్‌లో 81 సీట్లకు నవంబర్ 13, 20 తేదీల్లో పోలింగ్**

- దేశవ్యాప్తంగా రెండు లోక్‌సభ సహా 48 అసెంబ్లీ స్థానాలకూ ఉప ఎన్నికలు
- ఎన్నికల షెడ్యూళ్లను ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం
- నవంబర్ 23న ఓట్ల లెక్కింపు

6 లో

# భారత్‌పై కెనడా అడ్డగోలు ఆరోపణలు

**ఖలిస్తాన్ నేతలను భారతీయ ఏజెంట్లు లక్ష్యంగా చేసుకున్నారు.. అందుకోసం కెనడాలో బిష్ణోయ్ గ్యాంగ్‌తో కలిసి పనిచేస్తున్నారు**

- భారత్‌పై కెనడా పోలీసుల తీవ్ర ఆరోపణలు
- భారత్ హత్యలకు తెగిస్తోంది: ప్రధాని ట్రూడో
- అసంబద్ధ ఆరోపణలంటూ కొట్టిపారేసిన భారత్

6 లో



మీడియాతో మాట్లాడుతున్న కెనడా ప్రధాని ట్రూడో, మంత్రులు

**సిక్కుల ఓట్ల కోసమే చిచ్చు!**
కెనడా పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ నెగ్గడానికి ట్రూడో జిత్తులు 6 లో

# కుటుంబసభ్యులే గూఢచారులు!

**టీజీ న్యాబ్‌కు డ్రగ్స్ బాధిత పిల్లలపై ఫోన్‌కాల్స్**




వారి ప్రవర్తన, కదలికలపై పోలీసులకు సమాచారం.. దీంతో వారిపై నిఘా పెట్టి పెడ్లర్ల పనిపడుతున్న ఖాకీలు

18 లో

# దోచుకోవడంలో 'స్కిల్' నిజమే..

**ఏపీఎస్ఎస్‌డీసీలో అది కుంభకోణమే.. షెల్ కంపెనీలతో కొల్లగొట్టారు**

**చంద్రబాబు గత ప్రభుత్వ అవినీతిని నిర్ధారించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్**




14 లో

- బోగస్ ఇన్వాయిస్‌లు.. విదేశాలకు నిధుల తరలింపు
- హవాలా మార్గంలో తిరిగి దేశంలోని నిందితులకు చేరిన నిధులు
- ఇవన్నీ ఆధారాలతో సహా రుజువైనట్టు వెల్లడి
- షెల్ కంపెనీ డిజైన్ టెక్, సీమెన్స్ నాటి ఎండీ ఆస్తులు తాజాగా రూ.23.54 కోట్లు అటాచ్.. ఇది వరకు రూ.31.20 కోట్లతో కలిపి మొత్తంగా రూ.54.74 కోట్లు అటాచ్

# ఎక్కడి వారక్కడికి వెళ్లాల్సిందే!

**ఏడుగురు ఐఏఎస్‌లకు క్యాట్‌లో ఎదురుదెబ్బ**

**కేటాయించిన రాష్ట్రంలో నేడు రిపోర్టు చేయాలన్న ట్రిబ్యునల్**




- రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వారిని రిలీవ్ చేయాలని ఆదేశం
- డీవోపీటీ ఆదేశాలపై ఎలాంటి స్టే ఇవ్వలేమని వెల్లడి
- తదుపరి విచారణ నవంబర్ 1కి వాయిదా

14 లో

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాల గేట్‌కు యజమాని తాళం వేయడంతో బయట వేచిచూస్తున్న ఉపాధ్యాయులు ▼




# అద్దె భారం.. గురుకులాలకు తాళం!

**పేరుకుపోయిన ప్రైవేటు భవనాల్లోని గురుకులాల అద్దె బకాయిలు**

**పెండింగ్‌లో రూ.150 కోట్లకు పైగా బిల్లులు!**

- దసరా సెలవుల తర్వాత మంగళవారం తెరుచుకున్న పాఠశాలలు
- కొన్నిచోట్ల సిబ్బందిని, విద్యార్థులను లోనికి అనుమతించకుండా గేట్లకు తాళాలు వేసిన యజమానులు
- స్కూళ్ల ఎదుట నిరసన.. బకాయిలు చెల్లించలేదంటూ బ్యానర్లు
- సొసైటీల కార్యదర్శుల జోక్యంతో శాంతించిన యజమానులు

5 లో



**అద్దె బిల్లులు వేగంగా క్లియర్ చేస్తాం**
గురుకుల సొసైటీల కార్యదర్శులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 5 లో


CENTUARY DEAL - WALI DIWALI
Centuary® MATTRESSES
INDIA KA SLEEP SPECIALIST
INDIA'S QOOLEST
Q-GEL™ MATTRESS
Q-Gel® Copper Crystal Memory Foam with CuSense Technology®
Centrik Pro Responsive® Contour Foam
Ergo-form® Transition Foam
Viscose Fabric Cover with EuroTop Finish
Conditions Apply*
ASSURED FREE GIFTS WORTH UP TO ₹15,000*
MATTRESS PROTECTOR
WEDGE PILLOW
COMFORTER
BODY PILLOW
BEDSHEET, PILLOW & MANY MORE...
CENTUARY SLEEP SPECIALIST STORES: SRI ANU FURNITURE PRIVATE LIMITED – 8978033033| ANAGHA FURNITURE – 9959813033|BATCHA'S SLEEP ZONE – 8919755166| DEVAGURU FURNITURE-9394795213|GEETA ENTERPRISES – 8801179234|R S MODERN FURNITURES – 9849379465|SOWMYA FURNITURES – 9848038795|COLOR TRENZ – 9030425399|INDUS FASHIONS – 9866700761|INDUS EAST – 9866077362|INDUS HITECH- 7093321061|INDUS RETAIL – 8179110840|MANOMAY – 8143893669|SRI AAVISHKAR – 9948214520|INDUS FABRICS – 7093321060|INDUS NALLAGANDLA – 7285994994|BALAJI FURNITURE -9866916940|JAYADURGA FURNISHING -9246359346|SRI VISHAL FURNITURE-8106901569|K B FURNITURE WORLD – 9848375496| MALLIKARJUNA ENTERPRISES – 9849114456| SAI DIVYA ENTERPRISES – 9985000270| CENTUARY COMFORT STORES: NEW MS FURNITURE ENTERPRISES –7013435576|RR HAPPY HOMES–9100600362|SAINATH ENTERPRISES-9849307008|CELEBRATIONS (BHEL)–984856497|PARTH BOMBAY DYEING SHOWROOM-8179780303|HEAVEN – 9989646643|HEERA–9848486466|RISHABH-9849050636|S.V. HOME DECORS – 9848050582|THE EXCELLENT–9676546199|ROSHINI–9246107771|VEDA BOMBAY DYEING SHOW ROOM–9440072324|INDUS DLS–9494603603|MAIRA FURNISHING – 8374413469|SAI FURNITURE – 9966996818|FURNITURE TRENDS – 9394325114|POONAM ENTERPRRIZ – 9949423263|M.R. FURNITURE'S – 9985331787|MS FURNITURE &DOORS – 9391046378|ISHAANAA INTERIORS - 9026566666|SRI VENKATESHWARA FURNITURE – 7093992282|FUSION DECOR'S–9985957401|AISHWARYA B-HUB INTERIOR STUDIO – 9985603577|SHOBHA DECORS 9000339938|ENLIVEN FURNITURE – 9642437788|CHITRA DECORS – 7337511766|KLASSIK DEKORS – 7013359757| VINAYAKA FURNITURES –9849876231|K.K.DECORS INTERIOR & FURNITURES–7386371111|SAI SHUBHAM FURNITURES–9966747423|NAKSHATRA FURNITURE- 9293146264|KEERTHANA FURNITURE–9963333435|DHARANI FURNITURE–9246559720|JAGINI FOAMS & FURNITURE – 9246736533|NOVA FOAMS AND MATTRESSES – 9346660381|SRI GURU DATTA FOAMS – 9676493707| AAKASH FURNITURE – 9849344634|SRI LAKSHMI NARASIMHA ENTERPRISES–9908140627|ANKIT STUDIO THE FURNISHING WORLD – 9885019825|NEW SHIVANI FURNISHING–9177095621|SWAPNA ENTERPRISES–9391614044|THIRUMALA ELECTRONICS–9440842535|AMBICA FURNITURE–6281560580|RK FURNITURE –7095291222|RAMALINGAM & SONS 9391032478|JAYANTH FURNITURE–9949470662|SRI KRISHNA ENTERPRISES – 9949628428|S FURNITURE VILLAGE-9959689044|HUNDHA HOME FURNISHING–9491618313|MAX FURNITURE – 8977896392|LAXMI DÉCOR – 9550245465| NEW SRI SAI ENTERPRISES-9391016483| CENTUARY DISTRIBUTOR FOR HYDERABAD: PANCHAJANYA FOAMS - 98485 98848.
FOR TRADE & BULK ENQUIRY: +91 79893 49268


## అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశ గడువు పెంపు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ/పీజీ కోర్సుల్లో చేరడానికి చివరి తేదీ అక్టోబర్ 30 వరకు పొడిగించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధారాణి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వర్సిటీలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో డిగ్రీలో చేరిన ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని, అంతకుముందు చేరిన విద్యార్థులు ఫీజు చెల్లించలేకపోయిన వారు కూడా అక్టోబర్ 30వ తేదీ లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం ఆన్‌లైన్ లేదా సమీపంలోని అధ్యయన కేంద్రంలో లేదా వర్సిటీ హెల్ప్‌డెస్క్ నంబర్లు 7382929570 / 580, 040-23680222/ 333/444/555, టోల్‌ఫ్రీ నంబర్ 18005990101లో సంప్రదించవచ్చన్నారు.

## జీవో 317పై పునఃసమీక్షించాలి

సాక్షి, హైదరాబాద్: జీవో 317పై పునఃసమీక్షించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని టీఎన్జీవో కోరింది. ఈ మేరకు మంగళవారం సీఎస్ శాంతికుమారిని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేన్ కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. పెండింగ్ డీఏ, బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఏపీ నుంచి తెలంగాణకు తిరిగి వచ్చిన తెలంగాణ ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇచ్చి జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సీఎస్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ఉద్యోగుల అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారని టీఎన్జీవో తెలిపింది.





రాష్ట్రంలో తొలిసారి ప్రభుత్వ దవాఖాన్లలో ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులకు ఇది ఓ రకంగా శుభవార్త అని డాక్టర్లు చెబుతున్నారు. సంతానం కోసం అనేకమంది దంపతులు ఐవీఎఫ్ సెంటర్లను ఆశ్రయిస్తూ లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఫర్టిలిటీ ట్రీట్‌మెంట్ పేరిట ప్రత్యేక ప్యాకేజీలు పెట్టి మరీ బాధితుల వద్ద రూ. లక్షల్లో వసూలు చేస్తున్నారు. రూ. 50 నుంచి రూ. 80 వేల ఖర్చులో పూర్తయ్యే ఐవీఎఫ్ చికిత్సకు, రూ.3 నుంచి రూ.6 లక్షలు వసూలు చేస్తున్నారు. ఇంత ఖర్చు చేస్తున్నా, సగం మందికి ఫలితం దక్కడం లేదు. కానీ, ప్రైవేట్ ఆస్పత్రులు మార్కెటింగ్ ట్రిక్స్‌తో బాధిత దంపతులను మభ్యపెట్టి లక్షల్లో దండుకుంటున్నాయి. -సాక్షి, హైదరాబాద్

## అందరికీ సంతాన భాగ్యం!

**ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత ఐవీఎఫ్ సేవలతో లక్షల ఖర్చు తప్పినట్టే**

రాష్ట్రంలో యువతకు సంతాన సమస్యలు పెద్ద తలనొప్పిగా మారాయి. ప్రతి వంద జంటల్లో 30 నుంచి 40 జంటలు ఏదో ఒక స్థాయి ఇన్‌ఫర్టిలిటీ సమస్యను

### పెరుగుతున్న ఇన్‌ఫర్టిలిటీ సమస్యలు

ఎదుర్కొంటున్నాయని వైద్య, ఆరోగ్యశాఖ చెబుతోంది. ప్రభుత్వ దవాఖాన్లలో ఇన్‌ఫర్టిలిటీకి ట్రీట్‌మెంట్ అందించే సౌకర్యాలు లేకపోవడం, ప్రైవేట్ ఆస్పత్రులు రూ.లక్షల్లో చార్జీలు వసూలు చేస్తుండడంతో ఎంతో మంది మానసికంగా, ఆర్థికంగా కుంగిపోతున్నారు. మారిన జీవనశైలితో ఆడ, మగ ఇద్దరిలోనూ ఇన్‌ఫర్టిలిటీ సమస్యలు పెరిగాయని వైద్య,ఆరోగ్యశాఖ అంచనా వేస్తుంది. పిల్లలు పుట్టకపోవడంతో కొత్త జంటలు మానసిక వేదనను అనుభవిస్తున్నాయి. ఈ సమస్య తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ దవాఖాన్లలో ఫర్టిలిటీ సెంటర్లు పెడుతామని 2017లో అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. 2023 వరకూ ఒక్క గాంధీలో మాత్రమే ఫర్టిలిటీ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే అందులో సౌకర్యాలు కల్పించలేదు. నెల రోజుల క్రితం గాంధీ ఆస్పత్రికి వెళ్లిన మంత్రి దామోదర దృష్టికి ఈ విషయాన్ని అధికారులు తీసుకొచ్చారు. దీంతో ఆయన ఎంబ్రయాలజిస్టును నియమించాలని, అవసరమైన పరికరాలు, మెడిసిన్ కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. సమస్య తీవ్రత దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

# గాంధీ ఆస్పత్రిలో 'ఐవీఎఫ్' సేవలు

- మరో 15 రోజుల్లో పేట్లబురుజు ఆస్పత్రిలో ఐవీఎఫ్ సెంటర్ ఏర్పాటు
- వరంగల్, కరీంనగర్, నిజామాబాద్‌లోనూ సంతాన సాఫల్య కేంద్రాలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఐవీఎఫ్ సేవలు ఉచితంగా పొందొచ్చని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ తెలిపారు. నిరుపేదలకు మాతృత్వపు మమకారాన్ని అందిస్తామని చెప్పారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో రూ.80 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వైద్యవిద్యార్థుల వసతిగృహ భవన సముదాయానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి దామోదర రాజనర్సింహ మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం ఎంసీహెచ్ భవనంలోని ఐవీఎఫ్ సెంటర్‌ను వైద్య ఉన్నతాధికారులతో కలిసి మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఏడాది క్రితం అప్పటి ప్రభుత్వం గాంధీఆస్పత్రిలో ఐవీఎఫ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వసతులు కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారిందని, తనకు తెలిసిన వెంటనే డైరెక్టర్, గైనకాలజిస్ట్, ఎంబ్రయాలజిస్ట్‌లను నియమించి, రీఏజెంట్స్ కోసం నిధులు కేటాయించి, సంబంధిత శాఖ నుంచి అనుమతులు పొంది, గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. సంతానలేమితో బాధపడుతున్న వారిక్కడ వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్‌లలో ప్రభుత్వ సెక్టార్‌లో ఐవీఎఫ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్టు తెలిపారు.




గాంధీ ఐవీఎఫ్ కేంద్రం వద్ద మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్

15 రోజుల్లో పేట్లబురుజు ఆస్పత్రిలో ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. సుల్తాన్‌బజార్ ప్రసూతి ఆస్పత్రిలో ఐవీఎఫ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్య,ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆదేశించారు.

**గాంధీలో అదనపు విభాగాల ఏర్పాటు**

గాంధీలో ప్రస్తుతం ఉన్న 34 విభాగాలతోపాటు అదనంగా మరో నాలుగు విభాగాలు, యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6 కేన్సర్ కేర్, 74 ట్రామాకేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఐవీఎఫ్ సేవలను ఉచితంగా అందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులు పేదలకే అనే అభిప్రాయం పోగొట్టాలని, ఐఏఎస్, ఐపీఎస్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందేలా రాష్ట్ర ప్రభుత్వ వైద్యరంగాన్ని తీర్చిదిద్దేందుకు వైద్యులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చొంగ్తూ, కమిషనర్ కర్ణన్, డీఎంఈ వాణి, గాంధీ ప్రిన్సిపాల్ ఇందిర, సూపరింటెండెంట్ రాజకుమారి, రాజ్యసభ సభ్యు డు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ రియాజ్, టీజీఎంఎస్ఐడీసీ చైర్మన్ హేమంత్‌కుమార్, వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీఎస్ఎస్పీ లీవ్ మాన్యువల్ మార్చడం దుర్మార్గం

**మాజీమంత్రి హరీశ్‌రావు ట్వీట్**



సాక్షిప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్పీ)లో నవంబరు ఒకటో తేదీ నుంచి అమలు కానున్న కొత్త లీవ్ మాన్యువల్ దుర్మార్గమని మాజీమంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక 'నెలకు ఒకసారే ఇంటికి'అన్న శీర్షికతో సాక్షి దినపత్రిక ప్రధానసంచికలో కథనం ప్రచురితమైంది. దీనిపై హరీశ్‌రావు 'ఎక్స్'వేదికగా ఘాటుగా స్పందించారు. నెలరోజుపాటు కుటుంబాలకు దూరంగా ఉంచడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. పాత విధానంలో 15 రోజులకు ఒకసారి ఇంటికి పంపే విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సివిల్, ఏఆర్ ఇతర విభాగాల పోలీసులకు 15 రోజుల టీఏ ఇచ్చేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడు రోజులకు దాన్ని కుదించిందన్నారు. వారి పొట్ట కొట్టకుండా పాత విధానం ప్రకారమే 15 రోజుల టీఏ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న టీఏ, ఎస్ఎల్, జీపీఎఫ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల సరెండర్ లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ పెండింగ్ డబ్బులు చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే క్లియర్ చేయాలని, సివిల్ పోలీసులు వినియోగించే వాహనాల డీజిల్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సీఎం రేవంత్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కానిస్టేబుళ్ల సంక్షేమం గురించి మాట్లాడి, అధికారమొచ్చాక శ్రమదోపిడీకి పాల్పడుతున్నారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌కు యజమాని తాళం వేసే పరిస్థితి ఏర్పడిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ పాలనలో గురుకులాల నిర్వహణ అధ్వాన స్థితికి చేరుకుందన్నారు. రోజురోజుకు దిగజారిపోతున్న విద్యారంగంపై సీఎం దృష్టి సారించాలని చెప్పారు.

**లీవుల్లో ఎలాంటి షరతుల్లేవు: ఎస్‌కే జైన్, ఏడీజీ (టీఎస్ఎస్పీ)**

టీఎస్ఎస్పీ సిబ్బందికి సెలవుల జారీలో ఎలాంటి ఆంక్షలు, షరతులు విధించలేదని టీఎస్ఎస్పీ ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్ ఒక ప్రకటన విడుదలలో తెలిపారు. 'సాక్షి'లో ప్రచురితమైన 'నెలకు ఒకసారే ఇంటికి'అన్న కథనంపై ఆయన స్పందించారు. అందరిలాగే వారికి కూడా సీఎల్స్, ఈఎల్స్ అన్నీ అడిగిన వెంటనే ఎలాంటి ఆంక్షల్లేకుండా ఇస్తున్నామన్నారు. మిగిలిన డిపార్ట్‌మెంట్లలా ఆదివారం వారాంతపు సెలవు కుదరని నేపథ్యంలో వారికి ఒకేసారి నాలుగురోజులపాటు రికార్డెడ్ పర్మిషన్ (ఆర్పీ) కింద సెలవు అనుమతిస్తున్నామని వివరించారు. ఈ సదుపాయం సివిల్, ఏఆర్, ఇతర ఏ పారా మిలటరీలోనూ లేదని గుర్తు చేశారు. సిబ్బంది సంక్షేమానికి తెలంగాణ పోలీసు డిపార్ట్‌మెంట్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



## పీఆర్ శాఖలో త్వరలో కారుణ్య నియామకాలు

- ఏఈఈల శిక్షణ కార్యక్రమంలో మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: కొత్తగా నియమితులైన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఏఈఈ) నాణ్యతపై రాజీలేకుండా, ప్రమాణాలు పాటిస్తూ శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు చేపట్టాలని మంత్రి సీతక్క సూచించారు. తమ శాఖ పరిధిలో త్వరలోనే 500కు పైగా కారుణ్య నియామకాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకారం తెలిపారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,375 కోట్లతో రోడ్లు వేయబోతున్నామని, ఏఈఈల ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభం కావడం అదృష్టమని తెలిపారు. 'అభివృద్ధి పనుల్లో మీ మార్కును చూపాలి. నాణ్యత లేని పనులు చేస్తే సస్పెండ్ అవుతారు'అని హెచ్చరించారు. ఇటీవల నియామక పత్రాలు అందుకున్న ఏఈఈలకు మంగళవారం పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, అందరూ నిబద్ధతతో అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమ గురుకులాలు మూతపడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆనందపడుతున్నారని, బీఆర్ఎస్ హయాంలోనే గురుకులాల అద్దెలు రూ. కోట్లలో పెండింగ్‌లో పెట్టారని చెప్పా రు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పార్టీ సమీక్ష అనంతరం ఆమె గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు.

## రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేంతవరకు నిరవధిక బంద్: టీపీసీఎంఏ నిర్ణయం

కాచిగూడ: విద్యార్థుల రూ.4 వేల కోట్ల ఫీజు బకాయిల్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేంత వరకు కళాశాలలను నిరవధికంగా బంద్ చేస్తామని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజేస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీసీఎంఏ) నిర్ణయం తీసుకుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ టీపీసీఎంఏ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలు స్వచ్ఛంద బంద్ జరిగిందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సత్యనారాయణరెడ్డి, ప్రధానకార్యదర్శి యాద రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.పరమేశ్వర్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో కలసి వారు మాట్లాడారు. 48 గంటల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే విద్యార్థులతో కలసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏపీలో గతంలోనే వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్‌షిప్స్ రూ.20 వేలకు పెంచి చెల్లించేదని, తెలంగాణలో కూడా రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



మీకు నిజమైన సంతోషం కావాలంటే, దాన్ని వర్తమానంలో వెతుక్కోవాలి.
ఎందుకంటే, గతం అనేది వెళ్లిపోయింది. భవిష్యత్ అనేది అనిశ్చితం.
– థానిస్సరో భిక్కు (బౌద్ధ ధర్మం)



సాక్షి
బుధవారం, 16 అక్టోబర్ 2024

# మన పాలిట మరో పాకిస్తాన్!

ఇరవై నాలుగు గంటల్లో అంతా మారిపోయింది. భారత, కెనడా దౌత్యసంబంధాలు అధఃపాతాళానికి చేరుకున్నాయి. ఏడాది పైగా రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఘర్షణాత్మక వైఖరి నెలకొని ఉన్నా, తాజా పరిణామాలతో అది పరాకాష్ఠకు చేరింది. అతివాద సిక్కుల నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి అనుమానితుల జాబితాలో తమ దేశంలోని భారత దూతనూ, ఇతర దౌత్యవేత్తలనూ కెనడా చేర్చేసరికి సోమవారం సాయంత్రం కొత్త రచ్చ మొదలైంది. తీవ్రంగా పరిగణించిన భారత్ ఘాటుగా ప్రతిస్పందిస్తూ, కెనడా యాక్టింగ్ హైకమిషనర్‌తో సహా ఆరుగురు దౌత్యవేత్తలను దేశం నుంచి బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది. కెనడా సైతం ఆరుగురు భారతీయ దౌత్యవేత్తలతో ఇదే రకంగా వ్యవహరించింది. భారత్ 'ప్రాథమికమైన తప్పు' చేస్తోందనీ, ఢిల్లీ చర్యలు అంగీకారయోగ్యం కాదనీ సాక్షాత్తూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సోమవారం ప్రకటించారు. వెరసి, వ్యవహారం చినికిచినికి గాలివాన నుంచి దౌత్యపరమైన తుపానైంది. రానున్న రోజుల్లో కెనడా ఆంక్షలు విధించే అవకాశం కనిపిస్తోంది. ఇరువైపులా మరిన్ని పర్యవసానాలు తప్పవని తేలిపోయింది.

ప్రజాస్వామ్య దేశాలైన భారత, కెనడాల మధ్య ఎప్పటి నుంచో స్నేహసంబంధాలున్నాయి. ప్రజల మధ్య బలమైన బంధం అల్లుకొని ఉంది. కెనడాలో 18 లక్షలమంది భారతీయ సంతతి వారే. మరో 10 లక్షల మంది ప్రవాస భారతీయులున్నారు. అలా కెనడా మొత్తం జనాభాలో 3 శాతం మంది భారతీయ మూలాల వారే! ఇక, దాదాపు 5 లక్షల మంది దాకా భారతీయ విద్యార్థులు ఆ దేశంలో చదువుతున్నారు. దానికి తోడు ఉభయ దేశాల మధ్య పటిష్ఠమైన వ్యాపారబంధం సరేసరి. దాదాపు 600కు పైగా కెనడా కంపెనీలు భారత్‌లో ఉన్నాయి. మరో వెయ్యికి పైగా భారత విపణిలోని వ్యాపార అవకాశాలకు సంబంధించి చురుకుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి మిత్రదేశాల నడుమ ఈ తరహా పరిస్థితినీ, దౌత్యయుద్ధ వాతావరణాన్నీ ఊహించలేం. తాజా పరిణామాల వల్ల రెండు దేశాల ప్రజలకూ, ప్రయోజనాలకూ దెబ్బ తగలడం ఖాయం.

కెనడా గడ్డపై గత జూన్‌లో జరిగిన నిజ్జర్ హత్యపై విచారణలో భారత్ సహకరించడం లేదని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపణ. సహకరించాలని కెనడా విదేశాంగ మంత్రి వ్యాఖ్యానం. అయితే, ఆ హత్యలో భారత ప్రమేయం గురించి సాక్ష్యాధారాలేమీ లేకుండానే అన్నీ సమర్పించినట్టు ఒట్టావా అబద్ధాలు ఆడుతూ, అసంబద్ధమైన ఆరోపణలు చేయడం పట్ల ఢిల్లీ తీవ్రంగా స్పందించింది. పైగా, తమ దేశంలోని కెనడా జాతీయులను లక్ష్యంగా చేసుకొని భారత్ కోవర్ట్ ఆపరేషన్లు చేస్తోందంటూ ట్రూడో ఎప్పటిలానే నోటికి వచ్చిన ఆరోపణలు చేయడం ఏ రకంగా చూసినా సహించరానిది. భారత ప్రమేయం గురించి గత ఏడాది సెప్టెంబర్‌లో హౌస్ ఆఫ్ కామన్స్‌లో తొలిసారిగా ప్రకటన చేసినప్పటి నుంచి ట్రూడోది ఇదే వరస. ఒకవేళ ఆయన ఆరోపణల్లో ఏ కొంచెమైనా నిజం ఉందని అనుకున్నా... మిత్రదేశంతో గుట్టుగా సంప్రతించి, వ్యవహారం చక్కబెట్టుకోవాల్సినది పోయి ఇలా వీధికెక్కి ప్రకటనలతో గోల చేస్తారా? ఇక్కడే ట్రూడో స్వార్థప్రయోజనాలు స్పష్టమవుతున్నాయి. భారత్ అన్వేషిస్తున్న తీవ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడమే కాక, అవాంఛిత ఆరోపణలకు దిగుతూ, ఓటు బ్యాంకు రాజకీయాలకు ఆయన పాల్పడుతున్నారని అర్థమవుతోంది.

భారత్ వెలుపల సిక్కులు అత్యధికం ఉన్నది కెనడాలోనే! అందులోనూ వేర్పాటువాద ఖలిస్తానీలూ ఎక్కువే. ఈ అంశంపై ఇందిరా గాంధీ కాలం నుంచి ఇండియా మొత్తుకుంటున్నా ఫలితం లేదు. 1985లో కనిష్క విమానం పేల్చివేతప్పుడు ప్రధానిగా ఉన్న ట్రూడో తండ్రి నుంచి ఇవాళ్టి దాకా అదే పరిస్థితి. సిక్కులను ఓటుబ్యాంకుగా చూస్తూ... వాక్ స్వాతంత్ర్యపు హక్కు పేరిట ట్రూడో ప్రభుత్వం ఖలిస్తానీలను పెంచిపోషిస్తూ వచ్చింది. ఆ అండ చూసుకొని తీవ్రవాద బృందాలు రెచ్చిపోయి, కొంతకాలంగా అక్కడి భారతీయ దేవాలయాలపై దాడులు చేస్తూ వచ్చాయి. మాజీ ప్రధాని ఇందిర హత్యను సమర్థిస్తూ ఊరేగింపు జరిపాయి. చివరకు భారత వ్యతిరేక వ్యాఖ్యలు, చర్యలకు దిగడమే కాక భారతీయులనూ, భారతీయ సంతతి వారినీ ప్రాణాలు తీస్తామని బెదిరించే దశకు వచ్చాయి. కనీసం 9 ఖలిస్తానీ తీవ్రవాద బృందాలు కెనడాలో ఉన్నాయి. పాకిస్తానీ గూఢచర్యసంస్థ తరఫున పనిచేస్తున్నవారూ అక్కడే ఆశ్రయం పొందుతున్నారు. నేరాలకు దిగుతున్న ఇలాంటి వారిని మన దేశానికి అప్పగించాలని పదే పదే కోరుతున్నా, ఆ ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది.

ట్రూడో సారథ్యంలోని కెనడా, పొరుగున ఉన్న మన దాయాది దేశం తరహాలో ప్రవర్తిస్తూ వస్తోంది. కశ్మీర్‌ను రాజకీయంగా వాడుకుంటూ, అక్కడ నిప్పు రాజేసి తమ వాళ్ళ మెప్పు పొందాలని పాకిస్తాన్ చూస్తే... భారత వ్యతిరేక ఖలిస్తానీలపై ప్రేమ ఒలకబోస్తూ వచ్చే 2025లో జరిగే జనరల్ ఎలక్షన్స్‌లో లబ్ధి పొందాలని ట్రూడో ఎత్తుగడ. ప్రస్తుతం ఆయన సారథ్యంలోని సంకీర్ణ సర్కార్ సైతం ఖలిస్తానీ జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని న్యూ డెమోక్రాటిక్ పార్టీ చలవతోనే నడుస్తోంది. వెరసి, భారత్ పాలిట కెనడా అచ్చంగా మరో పాకిస్తాన్‌గా అవతరించింది. 2019 పుల్వామా దాడుల తర్వాత పాక్‌తో దౌత్య బంధాన్ని తగ్గించుకున్నట్టే... దౌత్యవేత్తల బహిష్కరణ పర్వంతో భారత్ ఇప్పుడు అధికారికంగా కెనడాను సైతం పాక్ సరసన చేర్చినట్లయింది. అసలిలాంటి పరిస్థితి వస్తుందని తెలిసీ, జాగ్రత్త పడకపోవడం మన దౌత్య వైఫల్యమే! అదే సమయంలో తాము పాలు పోసి పెరట్లో పెంచుతున్న పాములైన ఖలిస్తానీలు ఏదో ఒకరోజు తమనే కాటేస్తారని కెనడా గ్రహించాలి. దేశాన్ని అగ్రరాజ్యంగా మార్చాలన్న కల సంగతేమో కానీ, అక్షరాలా తీవ్రవాదం, అప్పులు, గృహవసతి సంక్షోభంతో కెనడాను మరో పాక్‌గా మార్చడంలో ట్రూడో సక్సెసయ్యారు. అదే విషాదం.

# బలహీనులకు అణ్వస్త్రాలే బలమా?

విశ్లేషణ



టంకశాల అశోక్

పశ్చిమాసియా ప్రస్తుత పరిణామాల సందర్భంలో బలహీనమైన దేశాలకు అణ్వస్త్రాలే బలమా అన్న ప్రశ్న ఉదయిస్తోంది. చైనా నుంచి అణ్వస్త్ర ప్రమాదం లేనట్లయితే భారతదేశం ఆత్మరక్షణ కోసం అణ్వస్త్రాలు తయారు చేసుకునేదా? భారత్ నుంచి అదే ప్రమాదం లేనట్లయితే పాకిస్తాన్ తన అస్త్రాలు ఉత్పత్తి చేసుకునేదా? అమెరికా, రష్యాల అణు ప్రమాదం లేని పక్షంలో చైనా గానీ, అమెరికా ప్రమాదం లేని స్థితిలో సోవియెట్ యూనియన్ గానీ అణ్వాయుధాలు చేసేవా? వియత్నాం వద్ద అణ్వాయుధ శక్తి ఉండి ఉంటే, మొదట ఫ్రాన్స్, తర్వాత అమెరికా ఆ చిన్న దేశాన్ని ఏళ్ళ తరబడి ధ్వంసం చేసేందుకు సాహసించేవా? సూటిగా అడగాలంటే, పాలస్తీనాకు అణ్వస్త్ర శక్తి ఉండినట్లయితే ఇజ్రాయెల్ ఈ తరహా యుద్ధానికి పాల్పడి ఉండేదా?

బలహీనమైన దేశాలకు బలవంతుల నుంచి ఆత్మరక్షణకు అంతిమంగా అణ్వస్త్రాలే శరణ్యమవుతాయా అన్నది ఆలోచించదగ్గ ప్రశ్న. మరీ ముఖ్యంగా తక్కిన ప్రపంచం, ఐక్యరాజ్య సమితి వంటి సంస్థలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నప్పుడు. బలహీనమైన దేశాలకు అణ్వస్త్రాలే బలమా, రక్షణా అని పశ్చిమాసియా ప్రస్తుత పరిణామాల సందర్భంలో చర్చించటానికి ముందు... ఇపుడు ఇండియా, పాకిస్తాన్, చైనా, రష్యాలు తమ అణ్వస్త్రాలను కవచంగా మార్చుకుని ఎంత భద్రతను అనుభవిస్తున్నాయో గమనించాలి. సూటిగా అడగాలంటే, పాలస్తీనాకు అణ్వస్త్ర శక్తి ఉండినట్లయితే ఇజ్రాయెల్ వంటి శక్తిమంతమైన దేశం గాజాలో గానీ, వెస్ట్ బ్యాంక్‌లో గానీ, తాజాగా లెబనాన్‌లో గానీ ఈ తరహా యుద్ధానికి పాల్పడి ఉండేదా? ఇరాన్ నాయకత్వాన్ని హతమార్చి మొత్తం పశ్చిమాసియా స్థితి గతులనే మార్చి వేయగలమనే ఇటీవలి హెచ్చరికలను ఒకవేళ ఇరాన్ ఇప్పటికే అణ్వాయుధాలు తయారు చేసుకుని ఉండినట్లయితే జారీ చేయగలిగేదా?

ఈ ప్రశ్నలన్నింటి ఉద్దేశం ప్రపంచం అంతా అణ్వస్త్రాల మయం అయిపోవాలని సూచించటం కాదు. అవెంత వినాశకరమైనవో అమెరికన్ల హిరోషిమా, నాగసాకి ప్రయోగాల అనుభవం తర్వాత ఎవరికీ చెప్పనక్కర లేదు. ఉద్దేశపూర్వకంగా కాకున్నా ప్రమాదవశాత్తునో, ఏదైనా యాంత్రికపరమైన పొరపాటు వల్లనో ఏ అగ్రరాజ్య శిబిరం వైపు నుంచో అణు ప్రయోగం జరిగి మరుక్షణం ఎదుటి శిబిరం కూడా వాటిని ప్రయోగించటం జరిగితే పరిస్థితి ఏమిటని? అసలు అణ్వస్త్రాలు అన్నవే మొత్తం మానవాళికి ఒక భయంకర స్థితి అనటంలో ఎటువంటి సందేహాలు లేవు. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధానికి, అణ్వస్త్ర దేశాల వద్ద గల అణ్వాయుధాల పరిమితికి, కొత్తగా అణు పరీక్షలపై నియంత్రణకు, రోదసీలో అస్త్రాల మోహరింపుపై నిషేధానికి అనేక ఒప్పందాలు జరిగాయి. కానీ వాటన్నింటి ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నది గమనించవలసిన విషయం.

పాలస్తీనా వంటి ఒక అతి చిన్న దేశం వద్ద, ఇరాన్ వంటి ఒక మధ్యమ స్థాయి దేశం వద్ద అణ్వస్త్ర శక్తి ఉండి ఉంటే, పాలస్తీనా సమస్య 1948లోనే పరిష్కారమయ్యేదని కాదనగలమా? అందుకు ఇజ్రాయెల్‌తో పాటు అమెరికన్ శిబిరం అంగీకరించేవని చెప్పలేమా? ఈ పరిణామాల మధ్య మరొకవైపు ఏమవుతున్నదో గమనించండి. ఇరాన్ వద్ద అణ్వస్త్రాల ఉత్పత్తికి తగిన సామర్థ్యంతోపాటు, అవసరమైన సామగ్రి అంతా ఉన్నది. కానీ అణ్వస్త్రాలు ఇస్లాంకు విరుద్ధమైనవని అంటూ వాటి తయారీని ఇరాన్ అధిపతి అలీ ఖమేనీ బహిరంగంగా నిషేధించారు. శాంతియుత వినియోగానికి మాత్రమేనని చెబుతూ వారు ఆ శక్తిని అభివృద్ధి పరుస్తున్నారు. దానిని కూడా సహించని అమెరికా ఇరాన్‌పై అనేక ఆంక్షలు విధించింది. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అనేక తనిఖీలు జరిపింది.



నెతన్యాహూ గత వారం ఒక రికార్డెడ్ వీడియో విడుదల చేశారు. అందులో రెండు గమనార్హమైన హెచ్చరికలున్నాయి. హమాస్, హిజ్బుల్లా తరహాలో ఇరాన్ నాయకత్వాన్ని కూడా అంతం చేసి ఇరాన్ ప్రజలను విముక్తం చేయగలమన్నది ఒకటి. మొత్తం పశ్చిమాసియాలో ఏ ప్రాంతం కూడా తమ శక్తికి అతీతమైనది కాదని, తాము క్రమంగా మొత్తంగానే ఆ ప్రాంతపు రూపును, స్థితిగతులను మార్చివేయనున్నామనేది రెండోది.

దీనంతటి మధ్య మరొక గమనించదగ్గ ఘటన చోటు చేసుకుంది. ఇరాన్‌లోని సెమ్నాన్ ప్రాంతంలో కొద్ది రోజుల క్రితం 4.4 మాగ్నిట్యూడ్‌తో భూకంపం సంభవించింది. దాని ప్రభావంతో ఆ ప్రాంతంలోని అరదాన్ పట్టణంతో పాటు టెహరాన్ నగరంలోని ఒక భాగంలో కూడా ప్రకంపనలు వచ్చాయి. ఇంతకూ అది నిజంగా భూకంపమా లేక భూగర్భ అణ్వస్త్ర ప్రయోగ ఫలితమా అన్న చర్చలు బయటి ప్రపంచంలో సాగుతున్నాయి. పాశ్చాత్య నిఘా సంస్థలు కూడా ఇంతవరకు నిర్ధారణగా ఏమీ చెప్పలేదు. సెమ్నాన్ ప్రాంతానికి సమీపంలోనే ఇరాన్ అణుశక్తి పరీక్షల ప్రధాన కేంద్రాలైన నాతాంజ్, ఫార్దోవ్‌లు ఉండటం గమనించదగ్గది. ఒకవేళ రహస్యంగా అణ్వస్త్ర పరీక్షలు జరిగి ఉంటే భూప్రకంపనలు రావటం సహజం. భారత ప్రభుత్వం రాజస్థాన్ ఎడారిలోని పొఖ్రాన్ వద్ద పరీక్షలు నిర్వహించినప్పుడు ఇదే జరిగింది. ఒకవేళ ఇరాన్ పరీక్షలు నిజమనుకుంటే, దేశాధిపతి తన నిషేధాన్ని సడలించి ఉంటారా అన్నది ఒక ప్రశ్న. ఇజ్రాయెల్ హెచ్చరికలతో నాయకుల ప్రాణాలు, దేశ రక్షణ ప్రమాదంలో పడినపుడు, బయటకు చెప్పకుండా ఎందుకు సడలించరాదన్నది మరొక ప్రశ్న.

మరొకవైపు, పోయిన ఆగస్టు చివరలో ఖమేనీ తమ ప్రధానికి ఒక ఆదేశాన్ని బహిరంగంగా ఇచ్చారు. ఒకవేళ తాము అణ్వస్త్రాలు ఉత్పత్తి చేయరాదంటే తమకు ఎటువంటి రక్షణలు కల్పించగలరో, పశ్చిమాసియాలోని వివిధ పరిస్థితుల గురించి ఏమి హామీలివ్వగలరో బైడెన్‌తో చర్చించాలని! అటువంటి చర్చలు ఇంతవరకేమీ జరగలేదు గానీ ఈ లోపల యుద్ధ రీత్యా అనేక పరిణామాలు చోటు చేసుకుంటూ పరిస్థితి దాదాపు చేయి దాటింది. వచ్చే నెల అమెరికా ఎన్నికలున్నాయి. ఈ దశలో ఇక అటువంటి చర్చలకు అవకాశం లేదు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడే సరికి ఇక్కడ గాజా, లెబనాన్, ఇరాన్‌లలో ఏమైన జరగవచ్చు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని ఇరాన్ నాయకత్వం తమ అణు విధానాన్ని రహస్యంగా సడలించుకున్నదేమో తెలియదు.

ఇంతకూ ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేయాలని ఇజ్రాయెల్ నిర్ణయించినా ఆ పని ఎంతవరకు సాధ్యమనే ప్రశ్న కూడా ఒకటున్నది. ఆ కేంద్రాలు ఇరాన్ తూర్పు ప్రాంతంలో ఏదో ఒక చోట కాకుండా విస్తరించి ఉన్నాయి. వాటిలో ప్రధానమైనవి నాతాంజ్, ఫార్దోవ్‌లు. వాటి పరిశోధనాగారాలు భూగర్భంలో చాలా లోతున దుర్భేద్యమైన రక్షణలో ఉన్నాయి. ఇవన్నీ ఇజ్రాయెల్ నుంచి వెయ్యి మైళ్ళకు పైగా దూరం. అంతవరకు వచ్చి దాడి చేయాలంటే సుమారు వంద యుద్ధ విమానాలు అవసరమని, అవి ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను, యుద్ధ విమానాల ఎదురుదాడులను దాటుకుంటూ రావాలన్నది అమెరికాయే ఒకప్పుడు వేసిన అంచనా. ఇది ఒక సమస్య అయితే, ఎంతో లోతున గల అణు కేంద్రాలను దెబ్బతీసే శక్తి అమెరికన్ బంకర్ బస్టర్లకు తప్ప ఇజ్రాయెల్‌కు లేదు. మరి అమెరికా ఆ సహాయం చేస్తుందా? దీనంతటిలో అనిశ్చితి ఉంది. ఒకవేల పరిస్థితులు ఇరాన్ ఆశించినట్లుగానే లేనట్లయితే? అందుకే ఇరానియన్ రిపబ్లిక్ అధికారులు, రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్లు ఇటీవల, పరిస్థితులు ఈ విధంగానే కొనసాగితే తమ సైనిక రక్షణ విధానాన్ని మార్చుకొనక తప్పదని తరచూ ప్రకటిస్తున్నారు.

ఇదంతా ఏమి చెప్తున్నది? మొదటి నుంచి కూడా బలవంతులదే రాజ్యం అన్నట్లు ఉన్న ప్రపంచ పరిస్థితులు ఇప్పటికీ అదే విధంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ సంస్థలు, చర్చలు, ఒప్పందాల వంటివన్నీ బలవంతుల ఉల్లంఘనలకు గురవుతున్నాయి. ఆయుధ బలం, ధన బలం మాత్రమే రాజ్యమేలుతున్నాయి. న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు, నీతి అవినీతుల ప్రసక్తే లేదు. అణ్వస్త్రాల మాట కూడా అందులో భాగమే. అంతెందుకు, జపాన్ వద్ద బాంబులు ఉండినట్లయితే వారిపై మొదటి అణ్వస్త్ర ప్రయోగం జరిగేదా? ఇప్పుడు ఉత్తర కొరియా వద్ద అవి ఉన్నందుకే గదా అమెరికా వెనుకాడుతున్నది? ఉక్రెయిన్ యుద్ధంలో అణుప్రయోగ ప్రస్తావనలు ఎందుకు వస్తున్నాయి? ఇట్లా చెప్తూ పోవాలంటే రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో అనేక ఉదాహరణలున్నాయి. అందువల్లనే, బలహీన దేశాల రక్షణకు అణ్వస్త్రాలే బలమా అనే ప్రశ్న వస్తున్నది. అదెంత ప్రమాదకరమైనది, అవాంఛనీయమైనది అయినా. చర్చకోసం.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### ఇరవై ఏళ్ల ఆనందం



నా జీవితం, కెరియర్‌లో 'ఆనంద్' (2004 అక్టోబర్ 15న విడుదలైంది. దర్శకుడు శేఖర్ కమ్ముల) ఒక ఉద్వేగపూరిత మైలురాయి. నటుడిగా, గాయకుడిగా నన్ను ఆమోదించినందుకు ప్రపంచం అంతటా ఉన్న తెలుగు ప్రజలకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. చరిత్రలో నేను చిన్నభాగం అయినందుకు గర్వపడతాను.

– అనూజ్ గుర్వారా, 'ఆనంద్'లో రాహుల్ పాత్రధారి

### ఎందుకలా?



సిక్కు అతివాదులతో అంటకాగే రికార్డు ఉన్నప్పటికీ, జీ7 శిఖరాగ్ర సమావేశంలో మోదీతో జరిపిన యాధాలాప సంభాషణను తప్పుదోవ పట్టించే ప్రకటనకు వాడుకున్నప్పటికీ, (కెనడా ప్రధాని) ట్రూడోను మళ్లీ మోదీ లావోస్‌లో ఎందుకు కలిశారు? మరోసారి బహిరంగంగా మోసపూరిత వ్యాఖ్యలు చేసే అవకాశం ఎందుకిచ్చారు?

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

### ఇంటి నుంచే...



వర్షాలు పడుతున్నప్పుడు ప్రతి కార్పొరేట్ కంపెనీ చేయాల్సింది – ఉద్యోగులను ఇంటి నుంచి పని చేయమని చెప్పడం! ఉదయాన్నే ట్రాఫిక్‌లో చిక్కుకుపోతామన్న ఒత్తిడి, వ్యాకులత ఏమాత్రం అక్కర్లేనివి. ఈ ఒక్క నిర్ణయం ఉత్పాదకత, మానసిక ఆరోగ్యం పెంచగలదు. ట్రాఫిక్‌లో కదలలేని అంబులెన్స్‌ను చూడటం బాధాకరం.

– దిలీప్ కుమార్, ఆంత్రప్రెన్యూర్

### తగ్గింపు చర్యలు



ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ఖర్చు తగ్గింపు చర్యలు చేపడుతూ, వివిధ ప్రభుత్వ శాఖల్లోని 228 మంది రాజకీయ నియమితులను పదిహేను రోజుల్లో తొలగించాలని ఆదేశించాను. దీనివల్ల ప్రభుత్వ బడ్జెట్‌లో నెలకు 5.714 మిలియన్ రుఫియాలు ఆదా అవుతాయి (ఒక రుఫియా= 5.48 రూపాయలు).

– మహమ్మద్ ముయిజు, మాల్దీవుల అధ్యక్షుడు

### అయినవాళ్లకు...



చాలామందికి జైలు అనేది శిక్ష. ఎంపిక చేసిన కొంతమందికి అది రక్ష.

– సయేమా, రేడియో జాకీ

ఇన్ బాక్స్

## ఆహార భద్రత ఏదీ?

1945లో ఐక్యరాజ్యసమితి ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) స్థాపన తేదీని గుర్తుచేసుకోవడానికి అక్టోబర్ 16న ప్రతి సంవత్సరం 'ప్రపంచ ఆహార దినోత్సవం' జరుపుకొంటున్నాం. ఆకలి, ఆహార భద్రతకు సంబంధించిన ఇతర సంస్థలు... ప్రపంచ ఆహార కార్యక్రమం, ప్రపంచ ఆరోగ్య సంస్థ, వ్యవసాయ అభివృద్ధికి అంతర్జాతీయ నిధి వంటివి ఈ రోజును ఘనంగా జరుపుకుంటాయి. ఆకలిని ఎదుర్కోవడానికి, సంఘర్షణ ప్రాంతాలలో శాంతికి దోహదపడటానికి, యుద్ధం సంఘర్షణలకు ఆకలిని ఉపయోగించడాన్ని ఆపడంలో ప్రముఖ పాత్ర పోషించినందుకు ప్రపంచ ఆహార కార్యక్రమం 2020లో నోబెల్ శాంతి బహుమతిని అందుకుంది. 'ప్రపంచ ఆహార దినోత్సవం 2024' యొక్క సారాంశం 'మెరుగైన జీవితం, మంచి భవిష్యత్తు కోసం ఆహార హక్కు'.

2022 నివేదిక ప్రకారం ఆహార భద్రత కలిగిన మొదటి ఐదు దేశాలు ఫిన్‌లాండ్, ఐర్లాండ్, నార్వే, ఫ్రాన్స్, నెదర్లాండ్‌లు. అత్యంత ఆహార అభద్రత ఉన్న దేశాలు యెమెన్, హైతీ, సిరియాలు.

భారతదేశంలో ఆహార భద్రత ప్రధాన ఆందోళన కలిగిస్తోంది. 2022లో, ప్రపంచ ఆహార భద్రతా సూచిక పరంగా 113 ప్రధాన దేశాలలో భారత దేశానికి 68వ స్థానాన్ని ఇచ్చింది. 2024లో, ప్రపంచ ఆకలి సూచిక (జీహెచ్ఐ -2024) ప్రకారం 127 దేశాలలో భారతదేశం 27.3 స్కోరుతో 105వ స్థానంలో ఉంది. దేశంలో 27 కోట్ల మంది ఆకలితో ఉన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యధికం.

భారతీయ జనాభాలో అధిక భాగం వ్యవసాయ కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నప్పటికీ, దేశంలో పెరుగుతున్న జనాభా కారణంగా అందరికీ ఆహారం లభించడం సవాలుగా ఉంది. కరవు, వరదల అస్థిర చక్రాలను దేశం అనుభవిస్తున్నందున, వాతావరణ మార్పుల కారణంగా భారతదేశం ఆహార భద్రత ముప్పులో ఉంది. దేశంలో సగటు కంటే కొంచెం ఎక్కువ వర్షపాతం మాత్రమే నమోదవుతున్నప్పటికీ, అవపాతం హెచ్చుతగ్గులు వివిధ ప్రాంతాలలో తీవ్రంగా మారుతూ పంటలను అస్థిరపరుస్తున్నాయి.

ఆహార భద్రతను మెరుగుపరచడానికి... ఆహారాన్ని వృథా చేయడాన్ని తగ్గించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, న్యాయమైన వ్యాపార పద్ధతులను ప్రోత్సహించడం, వైవిధ్యంపై శ్రద్ధ చూపడం, దిగుబడి అంతరాన్ని తగ్గించడం, వాతావరణ మార్పులను ఎదుర్కోవడం, ఆహార అభద్రతకు పరోక్ష కారణాలను పరిష్కరించడం వంటి మార్గాలు అవసరం.

– డా॥ పి.ఎస్. చారి । మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్, తిరుపతి

# 'మహా'త్యాగం కాంగ్రెస్‌కు సాధ్యమా?

సందర్భం




దిలీప్ రెడ్డి

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే సమూలంగా మార్చివేసిన భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నిక కోసం ఎప్పుడో సన్నద్ధమైపోయింది. హరియాణా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారానికి తెర పడ్డప్పుడు, ప్రధాని నరేంద్ర మోదీ మహారాష్ట్రలో పర్యటిస్తూ రాజకీయ ప్రసంగం చేయడం ఇందుకు నిదర్శనం. మహారాష్ట్ర ఎన్నికల కోసం కాంగ్రెస్‌లో ఇప్పుడిప్పుడే కదలిక ప్రారంభమయ్యింది. కాంగ్రెస్ సన్నద్ధతపై ఆ పార్టీ విజయమొక్కటే ఆధారపడి లేదు. బీజేపీకి, దాని నేతృత్వంలోని ఎన్డీఏకు సవాల్ విసురుతున్న 'ఇండియా' విపక్ష కూటమి బలం పుంజుకోవడం కూడా కాంగ్రెస్ మంచి చెడుల పైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రవర్తన మీద!

మహారాష్ట్ర, రెండు కూటములకూ ఎంతో కీలకమైన రాష్ట్రం. ప్రతి కూటమిలోనూ కనీసం మూడేసి ముఖ్యమైన భాగస్వామ్య పక్షాలున్నాయి. బీజేపీతో శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్ పవార్)లు జట్టుకట్టి ఏర్పడ్డ 'మహాయుతి' కూటమి ఎన్డీఏ శిబిరంలో ఉంది. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న శివసేన (ఉద్ధవ్ థాక్రే), ఎన్సీపీ (శరద్ పవార్)ల 'మహా వికాస్ ఆఘాడి' (ఎమ్వీఏ) ఇండియా శిబిరంలో ఉంది. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్ర సంక్లిష్ట రాజకీయాల్లో కూటమి విజయాలన్నవి భాగస్వామ్య పక్షాల మధ్య పొత్తుల సాఫల్యతను బట్టి ఉంటాయి.

2019 ఎన్నికల తర్వాత ఎన్నో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతూ వచ్చాయి. కలిసి ఎన్నికల్లో పోరిన బీజేపీ- శివసేన పార్టీలు గెలిచి కూడా సర్కారు ఏర్పరిచే సఖ్యత కుదరక విడిపోయాయి. ఎన్సీపీ- కాంగ్రెస్ జోడీతో చేతులు కలిపి శివసేన 'ఎమ్వీఏ' కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కొత్త పొత్తులతో ఏర్పడ్డ ఎమ్వీఏ ప్రభుత్వం కొంత కాలానికే కుప్పకూలింది. రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా ఉన్న బీజేపీ 'చొరవ' తీసుకొని, శివసేన చీలికవర్గం (తమదే అసలు శివసేన అంటారు) నేత ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కొంత కాలం తర్వాత, ఎన్సీపీ నుంచి చీలి వచ్చిన (వీరిది అదే రాగం) అజిత్ పవార్‌ను ఉపముఖ్యమంత్రిని చేసి, ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. ఈ చీలికలు మహారాష్ట్ర ప్రజలకు నచ్చినట్టు లేదు, అందుకే 2024 లోక్‌సభ ఎన్నికల్లో పాలక కూటమికి చుక్కెదురైంది. 48 లోక్‌సభ స్థానాలకుగాను మహాయుతికి 17 స్థానాలు దక్కితే, ఎమ్వీఏ 30 స్థానాల్లో నెగ్గి సత్తా చాటింది.




ఇదివరకటిలా కాకుండా, రాహుల్‌గాంధీ రాజకీయంగా కొంత రాటుదేలుతున్నాడనే భావన ప్రజాక్షేత్రంలో వ్యక్తమౌతోంది. పొత్తుల్లో కొన్ని సార్లే కాంగ్రెస్ లాభపడ్డా, ఆ సానుకూల వాతావరణం వల్ల మిత్రులకు మేలు కలిగిన సందర్భాలే ఎక్కువ. 2004 తర్వాత మళ్లీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో అది కొట్టొచ్చినట్టు కనిపించింది. పొత్తుల్లో పట్టువిడుపులు లేకుండా కాంగ్రెస్ మొండికేసిన చోట, వారి వల్ల మిత్రులు నష్టపోయిన సందర్భాలూ ఉన్నాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పట్టుబట్టి ఎక్కువ సీట్లు తీసుకొని, తక్కువ స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్ కారణంగానే, ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కోల్పోయారనే భావన అత్యధికుల్లో ఉంది. 243 స్థానాల్లో మ్యాజిక్ నంబర్ 122 అయితే 'మహా ఘట్ బంధన్' 110 వద్ద ఆగిపోయింది. ప్రభుత్వ ఏర్పాటుకు 12 సీట్లు తగ్గాయి. 70 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 19 చోట్ల మాత్రమే నెగ్గింది. ఏ మాత్రం తేడా వచ్చినా ఇటీవల ముగిసిన జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో ఒమర్ ఫరూక్ పరిస్థితి అట్లానే ఉండేది! 90 సీట్లకు, పొత్తుల్లో 51 చోట్ల పోటీ చేసి నేషనల్ కాన్ఫరెన్స్ 42 చోట్ల నెగ్గితే, 32 స్థానాలు తీసుకొని (మరో 5 చోట్ల స్నేహపూర్వక పోటీలో ఉండి) 6 చోట్ల మాత్రమే కాంగ్రెస్ నెగ్గింది. హరియాణాలో, 'ఇండియా' కూటమి పక్షమైన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి పొత్తుల్లో పది స్థానాలు (90లో) ఇవ్వడానికి వెనుకాడిన కాంగ్రెస్, వారు దాదాపు అంతటా పోటీ చేయడానికి పురిగొల్పింది. సమాన ఓటు వాటా (సుమారు 40 శాతం) పొందిన బీజేపీ, కాంగ్రెస్ మధ్య సీట్ల తేడా 11 మాత్రమే! కానీ, ఆప్‌కు సుమారు 2 శాతం ఓటు వాటా లభించింది.

క్షేత్రంలోని వాస్తవిక బలం తెలుసుకొని, పొత్తుల్లో కొంచెం తగ్గితే వచ్చే నష్టమేంటి? ఈ సంస్కృతి కాంగ్రెస్ మరచిపోతోంది. ఇటువంటి పరిస్థితే లోగడ తలెత్తినపుడు... సోనియాగాంధీ నేతృత్వంలోనే కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వెనుకంజకు సిద్ధపడింది. 'బీజేపీని, దాని నేతృత్వపు ఎన్డీఏను గద్దె దించడానికి ప్రతి యుద్ధం ప్రకటించాలి. ప్రతి పోరూ సాగించాలి. ఏ త్యాగానికైనా సిద్ధపడాలి' అని బెంగళూర్ (2001)లో జరిగిన ప్లీనరీలో నిర్ణయించారు. ఆ మేరకు రాజకీయ తీర్మానం ఆమోదించారు. 2002 మౌంట్ అబూలో జరిగిన కాంగ్రెస్ ముఖ్యమంత్రుల కాంక్లేవ్‌లో, ఈ పంథాకు సోనియాగాంధీ మరింత స్పష్టత ఇచ్చారు. 'ఛాందసవాదుల్ని గద్దె దించడానికి లౌకిక శక్తుల్ని ఏకం చేయాలి... మన లక్ష్యం సొంతంగా ప్రభుత్వం ఏర్పరచడమే, కానీ, అవసరమైతే సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకూ మనం సంసిద్ధంగా ఉండాలి' అని ఆమె ఉద్బోధించారు. నేను స్వయంగా విని, రిపోర్ట్ చేసిన, 1997 కలకత్తా ప్లీనరీలో సీతారాం కేసరి అధ్యక్షోపన్యాసం... 'ఇది సంకీర్ణాల శకం అనుకోనవసరం లేదు. కాంగ్రెసే ఓ విజయవంతమైన సంకీర్ణం. మనకు ఏ పార్టీలతో పనిలేదు. సొంతంగా సర్కారు ఏర్పరిచే సత్తా మనకుంది...' అన్న ఆలోచనాసరళి దిశనే సోనియాగాంధీ పూర్తిగా మార్చేశారు. దీనికి, 1999 ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ కొత్త పాఠాలు నేర్చుకోవడమే కారణం. వివిధ రాజకీయ పార్టీల్లో నెలకొన్న 'కాంగ్రెస్ వ్యతిరేక ధోరణి' తారస్థాయికి చేరి, అప్పుడు తేలిగ్గా ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. 'పొత్తులతో మాత్రమే కాంగ్రెస్ గెలువగలదు...' అని ప్రణబ్ ముఖర్జీ నేతృత్వంలోని కమిటీ 2003 డిసెంబరులో ఇచ్చిన నివేదికతో సోనియా ఈ దిశలో మరింత క్రియాశీలమయ్యారు. 2004 ఎన్నికల్లో దాన్ని పక్కాగా అమలు పరచి, ఎన్నికలు గెలిచి, కాంగ్రెస్ నేతృత్వంలో విజయవంతంగా 'ఐక్య ప్రగతిశీల కూటమి' (యూపీఏ) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 'త్యాగాలు' అనే మాట ఊరకే రాలేదు. రాజీవ్‌గాంధీ హత్యలో డీఎమ్‌కేకు భాగముందని కాంగ్రెస్ స్వయంగా విమర్శించినా... తమిళనాడులో ఆ పార్టీతోనే పొత్తుపెట్టుకున్నారామె. ఆమె జాతీయతనే ప్రశ్నించి కాంగ్రెస్‌ను చీల్చిన శరద్‌పవార్ నేతృత్వపు ఎన్సీపీతో మహారాష్ట్రలో ఆమె పొత్తులకు సిద్ధమయ్యారు. సఖ్యతకు తలుపులు తెరచిన కమ్యూనిస్టులతో జతకట్టి యూపీఏను విజయతీరాలకు చేర్చారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమపార్టీ టీఆర్ఎస్‌తో చేతులు కలిపి గెలిచారు. ఈ పంథాయే ఇప్పుడు కాంగ్రెస్‌కు శరణ్యం.

2029 ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే రాజకీయ పునరేకీకరణలకు కాంగ్రెస్ వ్యూహరచన చేయొచ్చు. బీజేపీతో ముఖాముఖి తలపడే రాజస్థాన్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు సరేసరి! మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, పంజాబ్, జార్ఖండ్, కేరళ వంటి రాష్ట్రాల్లో మరింత వ్యూహాత్మకంగా కాంగ్రెస్ కూటములను బలోపేతం చేసుకోవచ్చు. ఇతర 'ఇండియా' పక్షాలు లేని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా వంటి రాష్ట్రాల్లో కొత్త మిత్రుల్ని వెతుక్కోవచ్చు. అయితే వారే పేర్కొన్నట్టు 'త్యాగాల'కు సిద్ధమైతే తప్ప పొత్తు ధర్మం పొద్దు పొడవదు, రాజకీయ ఫలం సిద్ధించదు!

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్, 'పీపుల్స్ పల్స్' డైరెక్టర్

**గ్రహం అనుగ్రహం**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.7.47 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.7.20 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ఉ.5.56 నుండి 7.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.24 నుండి 12.12 వరకు, **అమృత ఘడియలు:** ప.2.51 నుండి 4.19 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.56, **సూర్యాస్తమయం:** 5.36.

## 'ప్రజాహక్కులపై గొంతెత్తిన సాయిబాబా'

చర్ల: ప్రజా హక్కుల పరిరక్షణ కోసం ప్రొఫెసర్ జీఎస్ సాయిబాబా గొంతెత్తారని, ఆయన మృతి తీరని లోటని మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయిబాబా ఆశయాలు, ఆదర్శాలను కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులు కొనసాగించాలని కోరారు. పౌరహక్కుల పరిరక్షణకు పోరాడిన సాయిబాబాను బ్రాహ్మణీయ, హిందుత్వ ఫాసిస్టు రాజ్యమే పథకం ప్రకారం హత్య చేసిందని ఆయన ఆరోపించారు.

## అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు 33 రెగ్యులర్ పోస్టులు

### ఆర్థిక శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు 33 రెగ్యులర్ పోస్టులు మంజూరయ్యాయి. ఈ మేరకు కొత్త పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో సీనియర్, జూనియర్ స్టెనోలు, లీగల్ ఎగ్జిక్యూటివ్‌లు, రిజిస్ట్రార్‌లు, డిప్యూటీ డైరెక్టర్లు, ఐటీ మేనేజర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, రికార్డు కీపర్లు తదితర పోస్టులున్నాయి. వీరికి వేతన శ్రేణిని కూడా ఈ ఉత్తర్వుల్లో నిర్ధారించారు.

## 19 మంది సబ్‌రిజిస్ట్రార్ల బదిలీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 19 మంది సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఇటీవలబదిలీలు జరగ్గా, 2నెలలు గడవకముందే మరోమారు బదిలీ చేస్తూ శాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలి బదిలీల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో.. పలువురు జిల్లా రిజిస్ట్రార్లను, తాజాగా సబ్‌రిజిస్ట్రార్లను బదిలీ చేయడం ఆ శాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది.



**అద్దె భారం..**

పేరుకుపోయిన ప్రైవేటు భవనాల్లోని గురుకులాల అద్దె బకాయిలు

పెండింగ్‌లో రూ.150 కోట్లకు పైగా బిల్లులు!

# గురుకులాలకు తాళం!



- దసరా సెలవుల తర్వాత మంగళవారం తెరుచుకున్న పాఠశాలలు
- కొన్నిచోట్ల సిబ్బందిని, విద్యార్థులను లోనికి అనుమతించకుండా గేట్లకు తాళాలు వేసిన యజమానులు
- స్కూళ్ల ఎదుట నిరసన.. బకాయిలు చెల్లించలేదంటూ బ్యానర్లు..
- సొసైటీల కార్యదర్శుల జోక్యంతో శాంతించిన యజమానులు

కోదాడ: మైనారిటీ గురుకుల కళాశాల భవనానికి తాళం వేయడంతో బయట కూర్చున్న ఉపాధ్యాయులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు సంక్షేమ గురుకుల విద్యా సంస్థలకు తాళాలు పడ్డాయి. ప్రభుత్వం చెల్లించాల్సిన భవనాల అద్దె బకాయిలు భారీగా పేరుకుపోవడంతో యజమానులు వాటి గేట్లకు తాళాలు వేశారు. బకాయిలు చెల్లిస్తేనే గేట్లు తెరుస్తామని స్పష్టం చేశారు. కొన్నిచోట్ల యజమానులు తాళాలు వేయడమే కాకుండా, ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించలేదంటూ బ్యానర్లు సైతం ఏర్పాటు చేయడం గమనార్హం. దీంతో ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కొన్ని గంటల పాటు హాస్టళ్ల బయటే నిరీక్షించాల్సి వచ్చింది. హాస్టళ్లకు నెలవారీగా చెల్లించాల్సిన అద్దె బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో గత కొంతకాలంగా భవనాల యాజమానుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాగా దసరా సెలవుల నేపథ్యంలో మూతపడిన గురుకులాలు మంగళవారం పునఃప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో బడులు తెరిచేందుకు వచ్చిన గురుకుల పాఠశాలల సిబ్బంది, గేట్లకు వేరే తాళాలు వేసి ఉండడంతో ఎటూ పాలుపోని స్థితిలో ఉండిపోయారు. అద్దె బకాయిలు చెల్లించిన తర్వాతే సిబ్బందిని, విద్యార్థులను లోనికి అనుమతిస్తామని యజమానులు స్పష్టం చేశారు. కళాశాలల భవనాలకు సంబంధించి కూడా బకాయిలున్నట్లు సమాచారం.

### పలు గురుకులాలకు తాళాలు

యాదాద్రి జిల్లా మోత్కూరులోని సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల పాఠశాలకు యజమాని తాళం వేశారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు 6 గంటల పాటు పాఠశాల ఎదుట నిరీక్షించాల్సి వచ్చింది. సూర్యాపేట జిల్లా కోదాడలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి చూసిన తర్వాత అందరూ వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇక్కడి మైనార్టీ గురుకుల పాఠశాల భవనానికి యజమాని బకాయిలు చెల్లించలేదంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. హుజూర్‌నగర్‌లో గంటపాటు బయటే వేచిచూసిన తర్వాత ప్రిన్సిపాల్ రెహనాబేగం విజ్ఞప్తి మేరకు యజమాని తాళం తీశారు. తుంగతుర్తిలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు బయటే ఉండాల్సి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులం, మైనార్టీ బాలికల గురుకులం, నాంచారి మడూరులోని బీసీ బాలుర డిగ్రీ గురుకుల కళాశాల గేట్లకు యజమానులు తాళాలు వేశారు. గూడూరు మండలంలోని మర్రిమిట్ట శివారు మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల విద్యాలయానికి, ఖానాపురం మండలం ఐనపల్లిలో, దుగ్గొండి మండలం గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల గేట్లకు తాళం వేశారు. దుగ్గొండి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల హాస్టల్.. చెన్నారావుపేట మండల కేంద్రంలో నిర్వహిస్తుండగా భవనానికి తాళం వేశారు. రేగొండ మండలంలోని లింగాల, వరంగల్ ఉర్సు గుట్ట వద్ద మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాల భవనానికి కూడా తాళం వేశారు. మంచిర్యాల జిల్లా తాండూరులోని మహాత్మా జ్యోతిబా పూలె గురుకుల పాఠశాలకు యజమాని తాళాలు వేశారు. కాగా, మంచిర్యాల జిల్లా తాండూరు బీసీ గురుకుల భవనానికి తాళం వేసిన యజమాని శరత్ కుమార్‌పై వివిధ సెక్షన్ల కింది పోలీసులు కేసు నమోదు చేశారు.

### అద్దె భవనాల్లో 625 పాఠశాలలు

రాష్ట్ర వ్యాప్తంగా ఐదు గురుకుల సొసైటీలున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీలు సంబంధిత సంక్షేమ శాఖల పరిధిలో కొనసాగుతుండగా.. పాఠశాల విద్యాశాఖ పరిధిలో జనరల్ గురుకుల సొసైటీ కొనసాగుతోంది. వీటి పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 1,033 విద్యాసంస్థలున్నాయి. ఇందులో 967 పాఠశాలలు కాగా మిగిలినవి డిగ్రీ కాలేజీలు. అయితే 625 పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆయా భవనాలున్న ప్రాంతాల ఆధారంగా అద్దె నిర్ణయించిన కలెక్టర్లు ఆ మేరకు చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని భవనాలకు ఒక విధమైన అద్దె ఖరారు చేయగా, జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీల్లో మరో విధంగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకో విధంగా చదరపు అడుగు చొప్పున ప్రభుత్వం అద్దె ఖరారు చేసింది. ఆ మేరకు ప్రతి త్రైమాసికంలో యజమానులకు నేరుగా చెల్లింపులు చేసేలా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అయితే కొంత కాలంగా ఆయా భవనాలకు అద్దె చెల్లింపుల్లో జాప్యం జరుగుతూ వస్తోంది.

#### మైనార్టీ స్కూళ్లకు ఏడాదికి పైగా నిలిచిన చెల్లింపులు



ఎస్సీ, ఎస్టీ సొసైటీల పరిధిలో నాలుగైదు నెలలుగా చెల్లింపులు నిలిచిపోయాయి. అదేవిధంగా బీసీ గురుకుల సొసైటీ పరిధిలో 2024–25 వార్షిక సంవత్సరం నుంచి నిధులు విడుదల కాలేదు. ఇక మైనార్టీ గురుకుల సొసైటీ పరిధిలో మాత్రం దాదాపు ఏడాదికి పైగా చెల్లింపుల ప్రక్రియ గాడి తప్పింది. దీంతో బకాయిలు పెద్దమొత్తంలో పేరుకుపోయాయి. గురుకుల అద్దె భవనాలకు సంబంధించి మొత్తం రూ.150 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం. కాగా దసరా సెలవులకు గురుకులాలు ఖాళీ కావడంతో, ఇదే అదనుగా కొందరు యజమానులు భవనాలకు తాళాలు వేశారు.

రాష్ట్రవ్యాప్తంగా సొసైటీల వారీగా ఉన్న పాఠశాలలు

| గురుకుల సొసైటీ | మొత్తం పాఠశాలలు | అద్దె భవనాలు |
|---|---|---|
| ఎస్సీ గురుకులాలు | 268 | 95 |
| ఎస్టీ గురుకులాలు | 165 | 80 |
| బీసీ గురుకులాలు | 295 | 250 |
| మైనార్టీ గురుకులాలు | 204 | 200 |
| జనరల్ గురుకులాలు | 35 | 0 |

# అద్దె బిల్లులు వేగంగా క్లియర్ చేస్తాం

గురుకుల సొసైటీల కార్యదర్శులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మెస్ చార్జీలు, కాస్మొటిక్ బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తాం

అధికారులు ప్రతిరోజూ ఒక పాఠశాలను సందర్శించాలి



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థలకు సంబంధించిన మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీల బిల్లులను క్రమం తప్పకుండా చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, కాస్మొటిక్స్, ట్యూటర్ల చార్జీల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రైవేటు భవనాల అద్దె బిల్లులు వేగంగా క్లియర్ చేస్తామని అన్నారు. మంగళవారం సచివాలయంలో గురుకుల సొసైటీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గురుకుల విద్యా సంస్థల్లో బోధన తీరుపై నిపుణులతో పరిశీలన జరిపించాలని, పరిస్థితిని మెరుగుపర్చుకునేందుకు అవసరమైన సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. అధికారులు కేవలం మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీల చెల్లింపులకే పరిమితం కాకుండా బోధనలో నాణ్యతను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. టీఎల్ఎం (టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్) వినియోగం పెంచాలని, కంప్యూటర్లు, సైన్స్ ఇతర ల్యాబ్‌ల వినియోగాన్ని విస్తృతం చేయాలని అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని, ప్రతిరోజూ ఒక పాఠశాలను సందర్శించాలని ఆదేశించారు. ప్రతినెలా ఎన్ని విద్యాసంస్థలను సందర్శించారు, ఏ ఏ అంశాలను గమనించారు, ఎలాంటి చర్యలు తీసుకున్నారో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని చెప్పారు. అద్దె భవనాల్లో ఉన్న పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, భవనాల యజమానులతో మాట్లాడి ఒప్పందం మేరకు విద్యాసంస్థ ఉన్న భవనంలో అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భవనాల అద్దె బకాయిలకు సంబంధించిన నిధుల విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, గురుకుల సొసైటీల కార్యదర్శులు బి.సైదులు, తఫ్సీర్ ఇక్బాల్, అలగు వర్షిణి, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### క్రిమినల్ కేసులు పెడతాం: మంత్రి పొన్నం

ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలల అద్దె బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. గత ప్రభుత్వం పెద్ద మొత్తంలో అద్దె బిల్లులు పెండింగ్ పెట్టిందని, వాటిని ప్రజా ప్రభుత్వం దశలవారీగా క్లియర్ చేస్తూ వస్తోందని తెలిపారు. కొందరు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతల మాటలు నమ్ముతున్నారని, అలాంటి చర్యలు ఉపేక్షించబోమని చెప్పారు. అవసరమైతే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. భవనాలకు ఏర్పాటు చేసిన బ్యానర్లు తొలగించాలని, విద్యా బోధనకు ఆటంకం కలిగించొద్దని కోరారు.

# అద్దెలు లేవు.. అన్నం కూడా లేదా?

- కాంగ్రెస్ పాలనలో పూర్తిగా భ్రష్టుపట్టిన విద్యారంగం
- విద్యార్థులు, యాజమాన్యాలు ధర్నాలు చేసే దుస్థితి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని, విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఆ శాఖలో నెలకొన్న సమస్యలు తెలుసుకునే ఓపిక లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గురుకుల పాఠశాలల భవనాల అద్దె చెల్లించలేని స్థితిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం..విద్యార్థులకు కనీసం అన్నం కూడా పెట్టలేని స్థితికి దిగజారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేటీఆర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు నిరవధికంగా మూసివేశారన్నారు. దీంతో ఆ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. మూసీనది ప్రక్షాళనకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి గురుకుల విద్యా సంస్థల భవనాల అద్దె, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల డబ్బు ఇచ్చేందుకు చేతకావడం లేదని కేటీఆర్ మండిపడ్డారు.

**చదువుకు దూరం చేసే కుట్ర**

కాంగ్రెస్ ప్రభుత్వం ఓ వైపు ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తూ, మరోవైపు ప్రైవేట్ విద్య పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందకుండా చేసే కుట్రలకు పాల్పడుతోందని కేటీఆర్ అన్నారు. నాసిరకం భోజనం, భద్రత లోపాలతో ఇప్పటికే గురుకుల విద్యార్థుల్లో భయాందోళన నెలకొందని చెప్పారు. ఫీజు బకాయిలను సాకుగా చూపుతూ కాలేజీ యాజమాన్యాలు మెమో, టీసీలు ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులు పైచదువులు, ఉద్యోగాలకు వెళ్లడంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో అంతకుముందు ఉన్న ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ. 2 వేల కోట్ల ఫీజు బకాయిలను బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. సీఎం రేవంత్‌కు పాలన అనుభవం లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని, ఢిల్లీకి మూటలు పంపడంలో తీరిక లేకుండా ఉన్న ఆయనకు విద్యార్థులు, కాలేజీల సమస్యలు పట్టడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే విద్యార్థులతో కలిసి బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

## వీధి కుక్కల స్వైర విహారం..

పలువురికి గాయాలు

మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో వరుస ఘటనలు

తొర్రూరు/చిల్పూరు: వీధి కుక్కల దాడిలో పలువురు గాయాలపాలయ్యారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన చరిష్మా(3), ఫయిదా, హర్షిత్(2), మోతెం ఉప్పమ్మ, మంగళపల్లి అనిల్, రుద్రదీప్ వీధిలో ఉండగా.. మంగళవారం కుక్కలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. రెండు మేకలను సైతం కరిచాయి. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు. అయితే గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అక్కడ్నుంచి వీరిని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా నియంత్రించడంలో మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

**జనగామ జిల్లాలో...:** జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బాలిక ఫలక్ వీధికుక్కల దాడిలో తీవ్రంగా గాయపడింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్ కొన్నేళ్లుగా గ్రామంలో పానీపూరి బండి పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఉదయం రాహుల్ కూతురు ఫలక్ కిరాణా షాపునకు వెళ్తుండగా ఒక్కసారిగా వీధికుక్కలు దాడి చేయడంతో గాయపడింది. చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రికి తరలించారు.

# పత్తి కొనుగోలు కేంద్రాలు తక్షణమే ప్రారంభించండి

మార్కెటింగ్ శాఖకు మంత్రి తుమ్మల ఆదేశం

సాక్షి ఎఫెక్ట్



సాక్షి, హైదరాబాద్: కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవ సాయ అధికారులను ఆదేశించారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ మేరకు 'సాక్షి' దినపత్రికలో మంగళవారం 'పత్తి రేటుకు విపత్తు!' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ సంచాలకులు వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లో పత్తి గింజలు, బేళ్లకు డిమాండ్ తగ్గిన కారణంగానే రాష్ట్రంలో పత్తి ధరలపై ప్రతికూల ప్రభావం చూపు తోందన్నారు. మద్దతు ధర కన్నా మార్కెట్లో తక్కువ ఉంటే, సీసీఐ ఆధ్వర్యంలో రైతుల నుంచి పత్తి కొనుగోలుకు సిద్ధంగా ఉందన్నారు. అయితే సీసీఐ నిబంధనల ప్రకారం తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉంటేనే పత్తిని మద్దతు ధర కింద కొనుగోలు చేస్తారని స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఏర్పాటైన కమిటీల ఆధ్వర్యంలో పర్యవేక్షణ జరుగుతుందని చెప్పారు. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న పత్తికి మద్దతు ధర కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయశాఖ ద్వారా 21,46,263 మంది పత్తి రైతుల వివరాలను పత్తి కొనుగోలు సాఫ్ట్‌వేర్‌లో వేసి రైతులను సులువుగా గుర్తించే ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సాఫ్ట్‌వేర్‌తో ఈ సంవత్సరం రైతులకు సులువుగా పత్తి అమ్మేందుకు అదనపు వివరాలు వాట్సాప్ ద్వారా తెలియజేస్తామన్నారు.

# విధులకు గైర్హాజరైతే తొలగింపే

సింగరేణి కార్మికులకు సీఎండీ బలరామ్ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ప్రతీ ఉద్యోగి పాత్ర కీలకమని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ హెచ్చరించారు. విధులను సరిగా నిర్వహించకపోవడం, సమయపాలన పాటించకపోవడం, గైర్హాజరు వంటి విషయాలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. సింగరేణిభవన్ నుంచి మంగళవారం ఆయన అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉండటం పట్ల పలు ఏరియాల జీఎంలపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. 72 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యానికి భారీ వర్షాలతో 10% లోటు ఏర్పడిందని, దానిని పూడ్చడానికి ఇకపై రోజుకు 2.4 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని స్పష్టం చేశారు. యువ కార్మికులు గైర్హాజరీ పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరీల వల్ల ఇతర ఉద్యోగులపై పనిభారం పెరగడంతోపాటు ఉత్పత్తి లక్ష్యాలపైనా ప్రభావం చూపుతోందన్నారు. పని సంస్కృతిని మెరుగుపరిచేందుకు వీలుగా కొత్త ఉద్యోగులందరినీ విధిగా ఐదేళ్ల పాటు భూగర్భ గనుల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.





# 'బ్రిజేష్'కు 5 డీపీఆర్‌లు

- కృష్ణా ట్రిబ్యునల్–2కు దాఖలు చేసిన తెలంగాణ
- నిర్మాణంలోని ప్రాజెక్టులకు 238 టీఎంసీలు
- ఇప్పటికే వినియోగంలో ఉన్న ప్రాజెక్టులకు 299 టీఎంసీలు
- భవిష్యత్‌లో వచ్చే ప్రాజెక్టులు కలిపి మొత్తం 555 టీఎంసీలు కేటాయించాలి
- ట్రిబ్యునల్‌ను కోరిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల్లో 75 శాతం నీటిలభ్యత ఆధారంగా 555 టీఎంసీలను కేటాయించాలని జస్టిస్ బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్– 2కు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అందులో 238 టీఎంసీల నీటి అవసరాలు కలి గిన ఐదు ప్రాజెక్టుల డీపీఆర్‌లను మంగళ వారం ట్రిబ్యునల్‌కు సమర్పించింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీకి అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం–1956లోని సెక్షన్–3 కింద బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్రం అదనపు విధివిధానాలు(టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్)ను గతంలో జారీ చేసింది. దీని ఆధారంగా కృష్ణా జలాల పంపిణీ విధానంపై ట్రిబ్యునల్‌కు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు తమ వాదనలతో స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్‌లను ఇప్పటికే దాఖలు చేశాయి. నవంబర్ 6 నుంచి 8 వరకు ట్రిబ్యునల్‌లో తదుపరి విచారణ జరగాల్సి ఉంది. ఈ క్రమంలో తెలంగాణ.. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు 90 టీఎంసీలు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 53 టీఎంసీలు, నెట్టెంపాడు ప్రాజెక్టుకు 25.4 టీఎంసీలు, డిండి ఎత్తిపోతలకు 30 టీఎంసీలు, ఎస్ఎల్‌బీసీకి 40 టీఎంసీలు కలుపుకొని మొత్తం 238 టీఎంసీలను ఆయా ప్రాజెక్టులకు కేటాయించాలని కోరుతూ వాటి డీపీఆర్‌లను తాజాగా ట్రిబ్యునల్‌కు అందజేసింది. వీటితో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు మరో20 టీఎంసీలు, కొడంగల్– నారాయణపేట ఎత్తిపోతలకు 7టీఎంసీలతో పాటు ఇప్పటికే ఉన్న పాత ప్రాజెక్టుల అవసరాలకు 299 టీఎంసీలు అవసరమని ట్రిబ్యునల్‌కు తెలిపింది. ఇక భవిష్యత్‌లో నిర్మించనున్న జూరాల వరద కాల్వ, కోయిల్‌కొండ ప్రాజెక్టు, జూరాల–శ్రీశైలం మధ్యలో కొత్త బరాజ్, భీమాపై మరో బరాజ్ అవసరాలు కలుపుకొని మొత్తం 555 టీఎంసీలను రాష్ట్రానికి కేటాయించాలని కోరింది.

**పాత ప్రాజెక్టులకు 299 టీఎంసీలు**

చిన్న నీటిపారుదలకు 89.15, నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు 105.7, భీమా ఎత్తిపోతలకు 20, జూరాలకు 17.8, తాగునీటి సరఫరాకు 5.7, పాకాల చెరువుకు 2.6, వైరా చెరువుకు 3.7, పాలేరు ప్రాజెక్టుకు 4 , డిండి ప్రాజెక్టుకు 3.5, కోయిల్‌సాగర్‌కు 3.9, ఆర్డీఎస్‌కు 15.9, మూసీకి 9.4, లంకసాగర్‌కు 1, కోటిపల్లివాగుకు 2, ఓకచెట్టివాగుకు 1.9 టీఎంసీలు కలిపి మొత్తం 299 టీఎంసీలను ఇప్పటికే వినియోగంలో ఉన్న ప్రాజెక్టుల అవసరాలకు కేటాయించాలని ట్రిబ్యునల్‌కు తెలంగాణ కోరింది.

# సిక్కుల ఓట్ల కోసమే చిచ్చు!

## కెనడా పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ నెగ్గడానికి జస్టిన్ ట్రూడో ఎత్తుగడ

- ఉగ్రవాది నిజ్జర్ హత్య విషయంలో భారత్‌పై పదేపదే ఆరోపణలు
- ఖలిస్తానీ శక్తుల పట్ల మెతక వైఖరితో సిక్కులను ప్రసన్నం చేసుకొనే ప్రయత్నం
- ప్రజా వ్యతిరేక, సొంత పార్టీలో తిరుగుబాటును అధిగమించడానికి కుయుక్తులు




ప్రజా వ్యతిరేకతను, సొంత పార్టీలో తిరుగుబాటును అధిగమించి వచ్చే ఏడాది జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో నెగ్గడానికి కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతున్నారా? కెనడాలో గణనీయ సంఖ్యలో ఉన్న సిక్కు ఓటర్లను ప్రసన్నం చేసుకొని, ఎన్నికల్లో లబ్ధి పొందడానికి తహతహలాడుతున్నారా? కేవలం అధికారం కోసం ఓటు బ్యాంకు రాజకీయాలతో భారత్– కెనడా సంబంధాలను బలి పెట్టడానికి సైతం వెనుకాడడం లేదా? రాజకీయ విశ్లేషకులు, నిపుణులు అవుననే చెబుతున్నారు. ఖలిస్తాన్ ఉగ్రవాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత ఏజెంట్ల హస్తం ఉందని జస్టిన్ ట్రూడో పదేపదే ఆరోపిస్తున్నారు. అంతేకాదు ఈ హత్యలో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మను ట్రూడో ప్రభుత్వం అనుమానితుడిగా చేర్చింది. ఈ పరిణామంతో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలహీనపడ్డాయి. ట్రూడో పదవీ కాంక్ష వల్ల భారత్, కెనడా ప్రజలు నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది. వచ్చే ఏడాది నవంబర్‌లో కెనడా పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి. మరో ఏడాది సమయమే మిగిలి ఉంది. మరోవైపు జస్టిన్ ట్రూడో పాలనలపై ప్రజా వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. సొంత పార్టీలో సైతం నిరసన గళాలు బలం పుంజుకుంటున్నాయి. ట్రూడో నాయకత్వాన్ని, పరిపాలనా సామర్థ్యాన్ని అధికార 'లిబరల్ పార్టీ ఆఫ్ కెనడా' నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల దృష్టిని మళ్లించడానికి నిజ్జర్ హత్యను ట్రూడో తెలివిగా తనకు అనుకూలంగా వాడుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజ్జర్ వ్యవహారంలో భారత్‌ను ఇరుకునపెట్టడం ద్వారా సిక్కుల ఓట్లపై ఆయన వల విసురుతున్నట్లు ప్రచారం సాగుతోంది. 2021 నాటి గణాంకాల ప్రకారం కెనడాలో 7.70 లక్షల మంది సిక్కులున్నారు. అంటే జనాభాలో 2.1 శాతం మంది సిక్కులే. భారత్‌కు వెలుపల అత్యధిక సంఖ్యలో సిక్కులు ఉన్న దేశం కెనడా. ఆర్థికంగా బలమైన స్థితిలో ఉండి రాజకీయ ప్రాబల్యం కలిగిన సిక్కులను మచ్చిక చేసుకోవడానికి కెనడా రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తుంటాయి. భారత వ్యతిరేక ఖలిస్తానీ శక్తులను ప్రోత్సహిస్తుంటాయి. భారత్‌లో సిక్కుల కోసం ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలన్న నినాదంతో పుట్టుకొచ్చిన ఖలిస్తాన్ ఉగ్రవాద సంస్థలకు కెనడా అడ్డాగా మారిపోయింది. వరల్డ్ సిక్కు ఆర్గనైజేషన్, ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్, సిక్స్ ఫర్ జస్టిస్, బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ తదితర సంస్థలు కెనడా నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. రాజకీయ పార్టీలు వీటికి మద్దతిస్తున్న సంగతి బహిరంగ రహస్యమే. కనీసం 9 ఖలిస్తానీ టెర్రర్ గ్రూప్‌లకు కెనడాయే ప్రధాన స్థావరం. ఇవన్నీ భారత సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతపై ప్రత్యక్ష యుద్ధమే చేస్తున్నాయి. తమ దేశంలో నేరాలకు పాల్పడిన ఖలిస్తాన్ ఉగ్రవాదులను తమకు అప్పగించాలని భారత ప్రభుత్వం కోరుతున్నప్పటికీ కెనడా లెక్కచేయడం లేదు. కనీసం చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నా తిరస్కరిస్తోంది. భారత వ్యతిరేక శక్తులకు కెనడా స్వర్గధామం అనడంలో అతిశయోక్తి లేదు. మరోవైపు ఖలిస్తానీలకు పాకిస్తాన్ నిఘా సంస్థ 'ఐఎస్ఐ' పూర్తిస్థాయిలో అండదండలు అందిస్తోంది. ట్రూడో పాలనలో కెనడా దేశం భారత్‌కు మరో పాకిస్తాన్‌గా మారిందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

### విద్యార్థి వీసాలపై పిడుగు!

కెనడా–భారత్ మధ్య విభేదాలు ముదురుతుండడంతో ఇరు దేశాల ప్రజలు నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రధానంగా వీసా సేవలు నిలిచిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం కెనడాలో 1.78 లక్షల మంది ప్రవాస భారతీయులు(ఎన్ఆర్ఐలు), 15.10 లక్షల మంది భారత సంతతి ప్రజలు నివసిస్తున్నారు. 2.80 లక్షల మందికిపైగా భారత విద్యార్థులు ఉన్నారు. కెనడాలోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో 41 శాతం మంది భారతీయులే. ఈ ఏడాది ప్రారంభంలో ఇంటర్నేషనల్ స్టూడెంట్ వీసాలను ప్రభుత్వం 3.60 లక్షలకే పరిమితం చేసింది. 2022 నాటితో పోలిస్తే విద్యార్థి వీసాల సంఖ్యను 35 శాతం తగ్గించింది. దీనివల్ల భారతీయ విద్యార్థులు నష్టపోయారు. ప్రస్తుతం భారత ప్రభుత్వంతో విభేదిస్తున్న నేపథ్యంలో విద్యార్థి వీసాలను మరింత తగ్గించే అవకాశం కనిపిస్తోంది. భారతీయ ఉద్యోగులను ఇప్పటికిప్పుడు వెనక్కి పంపించే పరిస్థితి లేకున్నా, సమీప భవిష్యత్తులో ఏదైనా జరగొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**- సాక్షి, నేషనల్ డెస్క్**

# మోగిన ఎన్నికల నగారా

- మహారాష్ట్రలో ఒకే విడతలో నవంబర్ 20న పోలింగ్
- జార్ఖండ్‌లో నవంబర్ 13, 20న రెండు విడతల్లో పోలింగ్
- రెండు లోక్‌సభ సహా 48 అసెంబ్లీ స్థానాలకూ ఉప ఎన్నికలు
- ఎన్నికల షెడ్యూళ్లను ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం

**సాక్షి, న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్, హరియాణా ఎన్నికల కోలాహలం ముగిసిన కొద్దిరోజులకే మరో రెండు రాష్ట్రాల్లో మళ్లీ ఎన్నికల హడావిడి మొదలు కానుంది. మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించి కేంద్ర ఎన్నికల సంఘం మళ్లీ ఎన్నికల వేడిని పెంచింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధూలు మీడియా సమావేశంలో రెండు రాష్ట్రాల ఎన్నికలతోపాటు వయనాడ్, నాందేడ్ లోక్‌సభ స్థానాలు, 15 రాష్ట్రాల్లోని 48 అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికల షెడ్యూళ్లను విడుదలచేశారు. వారాంతాల్లో పోలింగ్ నిర్వహిస్తే పట్టణప్రాంత ఓటర్లు సెలవుదినంగా దుర్వినియోగం చేస్తున్నారన్న భావనతో పోలింగ్‌ను కేవలం బుధవారాల్లోనే రెండు రాష్ట్రాల్లో చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. మహారాష్ట్రలో ఒకే విడతలో నవంబర్ 20న, జార్ఖండ్‌లో నవంబర్ 13, 20న రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. జార్ఖండ్ తొలి విడతలో 43 స్థానాలకు, రెండో విడతలో 38 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

పశ్చిమబెంగాల్‌లోని బసిర్హాట్ ఎంపీ, ఉత్తరప్రదేశ్‌లోని మిల్కీపూర్ ఎమ్మెల్యే స్థానాల్లో ఎన్నికలపై పిటిషన్లు పెండింగ్‌లో ఉండటంతో ఈ రెండు స్థానాల్లో ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదలచేయలేదు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన పార్టీతో బీజేపీ అధికారాన్ని పంచుకున్న విషయం తెల్సిందే. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో 48 సీట్లకుగాను 31 సీట్లు గెల్చుకున్న కాంగ్రెస్–ఎన్సీపీ(ఎస్పీ)–శివసేన(యూబీటీ) కూటమి నుంచి అధికార మహాయుతి కూటమికి గట్టిసవాల్ ఎదురవుతోంది. జార్ఖండ్‌లో జార్ఖండ్ ముక్తిమోర్చా(జేఎంఎం), కాంగ్రెస్ కూటమి అధికారంలో ఉండగా ఈసారి ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ ఆరాటపడుతోంది.

**మహారాష్ట్రలో 288, జార్ఖండ్‌లో 81**

మహారాష్ట్రకు సంబంధించి మొత్తం 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 29 ఎస్సీ, 25 ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలున్నాయి. రాష్ట్రంలో 9.64 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం ఓటర్లలో 4.97 కోట్ల మంది పురుషులుకాగా 4.66 కోట్ల మంది మహిళలు ఉన్నారు. రాష్ట్రంలో 1,00,186 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేస్తున్నారు. జార్ఖండ్‌లో మొత్తం 81 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా వాటిలో 9 ఎస్సీ, 28 ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలున్నాయి. రాష్ట్రంలో 2.60 కోట్ల మంది ఈసారి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 1.31 కోట్ల మంది పురుషులు, 1.29 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఎన్నికల కోసం 29,562 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేస్తున్నారు.

**మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్**

| | |
|---|---|
| గెజిట్ నోటిఫికేషన్ జారీ | అక్టోబర్ 22 |
| నామినేషన్ల స్వీకరణకు తుది గడువు | అక్టోబర్ 29 |
| నామినేషన్ల పరిశీలన | అక్టోబర్ 30 |
| నామినేషన్ల ఉపసంహరణ గడువు | నవంబర్ 4 |
| పోలింగ్ తేదీ | నవంబర్ 20 |
| ఓట్ల లెక్కింపు | నవంబర్ 23 |

**జార్ఖండ్ ఎన్నికల షెడ్యూల్**

| | ఒకటో విడత | రెండో విడత |
|---|---|---|
| గెజిట్ నోటిఫికేషన్ జారీ | అక్టోబర్ 18 | అక్టోబర్ 22 |
| నామినేషన్ల స్వీకరణకు తుది గడువు | అక్టోబర్ 25 | అక్టోబర్ 29 |
| నామినేషన్ల పరిశీలన | అక్టోబర్ 28 | అక్టోబర్ 30 |
| నామినేషన్ల ఉపసంహరణ గడువు | అక్టోబర్ 30 | నవంబర్ 1 |
| పోలింగ్ తేదీ | నవంబర్ 13 | నవంబర్ 20 |
| ఓట్ల లెక్కింపు | నవంబర్ 23 | |

# వయనాడ్ అభ్యర్థి ప్రియాంక

**అధికారికంగా ప్రకటించిన కాంగ్రెస్**



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా బ్యాలెట్ పోరులో అరంగేట్రం చేయనున్నారు. కేరళలోని వయనాడ్ నియోజకవర్గ ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీని తమ అభ్యర్థిగా కాంగ్రెస్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఐదేళ్లకు ప్రియాంక ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ రాయ్‌బరేలి (యూపీ), వయనాడ్‌లలో పోటీచేసి.. రెండుచోట్లా నెగ్గిన విషయం తెలిసిందే. నిబంధన ప్రకారం ఒక స్థానాన్ని వదులుకోవాలి కాబట్టి రాహుల్ వయనాడ్‌కు రాజీనామా చేశారు. అప్పుడే ప్రియాంక వయనాడ్ నుంచి బరిలోకి దిగుతారని కాంగ్రెస్ తెలిపింది. వయనాడ్‌కు నవంబరు 13న ఉప ఎన్నిక జరగనుంది. అక్కడ రాహుల్ తరఫున సార్వత్రిక ఎన్నికల్లో ప్రియాంక విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వయనాడ్‌లో నెగ్గితే ప్రియాంక ఎంపీగా పార్లమెంటులో తొలిసారిగా అడుగుపెడతారు. అలాగే గాంధీ కుటుంబం నుంచి ఒకేసారి ముగ్గురు ఎంపీలుగా ఉంటారు. ప్రియాంక గెలిస్తే.. రాహుల్‌తో కలిసి లోక్‌సభలో ఉంటారు. సోనియా గాంధీ రాజ్యసభ ఎంపీగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.




# ఎగ్జిట్ పోల్స్ అశాస్త్రీయం

**సీఈసీ రాజీవ్ కుమార్ వ్యాఖ్య**

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వేళ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎగ్జిట్‌పోల్స్‌పై అసహనం వ్యక్తంచేశారు. ఎగ్జిట్స్ పోల్స్ అశాస్త్రీయమైనవని వ్యాఖ్యానించారు. ''ఎగ్జిట్ పోల్స్‌ను మేం ఆపలేం. అందుకే వాటిని నిర్వహించే సంస్థలే ఆత్మపరిశీలన చేసుకోవాలి. శాంపిల్ సైజు, ఏఏ ప్రాంతాల్లో సర్వే చేశారు?. ఎగ్జిట్‌పోల్స్‌తో ఫలితాలు సరిపోలకపోతే అందుకు బాధ్యత వహించేందుకు ముందుకొస్తున్నారా?. ఈ విషయంలో న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ డిజిటల్ స్టాండర్డ్స్ అథారిటీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. పోలింగ్ పూర్తయిన దాదాపు మూడోరోజు ఓట్ల లెక్కింపు ఉంటుంది. కానీ పోలింగ్ పూర్తయిన వెంటనే సాయంత్రం ఆరు గంటలకే ఎగ్జిట్ పోల్స్ తతంగం మొదలవుతుంది. ఇలాంటి ఎగ్జిట్ పోల్స్‌కు ఎలాంటి శాస్త్రీయత లేదు. కౌంటింగ్ రోజు ఉదయం 8.30గంటలకు అధికారికంగా ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. కానీ ఆలోపే ఉదయం 8.05, 8.10 గంటలకే ఫలితాలు వెల్లడిస్తూ మీడియాలో కథనాలు వెల్లువెత్తుతాయి. ఇదంతా నాన్‌సెన్స్. ఎగ్జిట్ పోల్స్‌లో చెప్పిన లెక్కలను సమర్థించుకునేందుకు మీడియా చేసే జిమ్మిక్కు ఇదంతా''అని టీవీ చానెళ్లకు సీఈసీ చురక అంటించారు. ''ప్రతి రెండు గంటల విరామాలతో ఫలితాల సరళిని ఈసీ వెబ్‌సైట్‌లో 9.30 గంటల తర్వాతే ఇస్తాం. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉన్న మీడియా ప్రతినిధులు కొన్ని నిమిషాల ముందే ఫలితాల సరళిని వెల్లడించే వీలుంది. ఎందుకంటే మేం మొదటగా అక్కడి స్క్రీన్ మీద ఫలితాలను చూపించాలి. తర్వాత సంబంధిత పత్రాలపై పోలింగ్ ఏజెంట్లతో సంతకాలు చేయించాలి. తర్వాత వాటిని అక్కడి పరిశీలకులకు అందివ్వాలి. తర్వాత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇదంతా చేసేసరికి అరగంట ఆలస్యమవుతుంది. ఈ పని వాళ్లకు ఉండదుకాబట్టి మీడియావాళ్లు కొన్ని నిమిషాలముందుగా ఫలితాలను వెల్లడించగల్గుతున్నారు. ఈ కొద్దినిమిషాల తేడా వల్ల మీడియా చూపిస్తున్న లెక్కలకు, మా లెక్కలకు పొంతన కుదరదు. అనవసరమైన ఈ విషయం వాస్తవరూపంలో ఎంతో గందరగోళాన్ని సృష్టిస్తోంది''అని సీఈసీ అసహనం వ్యక్తంచేశారు. హరియాణా ఎన్నికల ఫలితాల రోజున ఈసీ వెబ్‌సైట్ ఆలస్యంగా అప్‌డేట్ అయిందన్న కాంగ్రెస్ ఆరోపణల వేళ సీఈసీ ఈ అంశాన్ని ప్రస్తావించారు.

**ఏదో ఒకటి అనడం వాళ్ల పని**

హరియాణా ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఆయన స్పందించారు. ''గతంలో పోలిస్తే ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెరిగింది. హింసాత్మక ఘటనలు తగ్గాయి. నగదు, మద్యం, ఉచిత తాయిలాల స్వాధీనం ఘటనలు పెరిగాయి. ఎన్నికల ప్రక్రియపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు. అయితే కొందరు ఎప్పుడూ ఏదో ఒక ఆరోపణ చేస్తూ ఉంటారు. ఏదో ఒకటి అనడమే వాళ్ల పని. వేలాది మంది ఎన్నికల సిబ్బందిలో ఎవరో ఒకరిద్దరు సరిగా విధులు నిర్వర్తించనంత మాత్రాన ఏకంగా కేంద్ర ఎన్నికల సంఘాన్నే తప్పుబట్టడం సరికాదు''అని రాజీవ్ అన్నారు.

**ఇంకెన్ని కొత్త ఆరోపణలొస్తాయో?**

''బ్యాటరీ సామర్థ్యానికి, గెలుపునకు లంకె పెడుతూ చేసిన ఆరోపణ కొత్త రకంగా ఉంది. ఇంకెన్ని కొత్త రకం ఆరోపణలు వస్తాయో. ఇలాంటి వాటి కోసం మేం కూడా ఎదురుచూస్తున్నాం'అని రాజీవ్ సరదాగా మాట్లాడారు. లెబనాన్‌లో హెజ్‌బొల్లా వాడిన పేజర్లను ఇజ్రాయెల్ హ్యాక్‌చేసినట్లు ఈవీఎంలను హ్యాక్‌చేయొచ్చని కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ ఆరోపించడం తెల్సిందే. హరియాణా ఎన్నికల్లో ఈవీఎంలలో 99 శాతం బ్యాటరీ ఉన్నట్లు చూపిన స్థానాల్లో బీజేపీ గెలిచిందని, 60–70 శాతం బ్యాటరీ ఉన్న స్థానాల్లో కాంగ్రెస్ గెలిచిందని కాంగ్రెస్ ఇచ్చిన ఫిర్యాదులపై రాజీవ్ సవివరణ ఇచ్చారు. ''మన మొబైల్ ఫోన్లలో ఉండే రకం బ్యాటరీని ఈవీఎంలో వాడరు. కాలిక్యులేటర్‌లో ఒక్కసారి వాడి పడేసే రకం బ్యాటరీనే వాడతాం. పోలింగ్ రోజు మాత్రమే బ్యాటరీని వేస్తాం. అది 7.4 నుంచి 8 ఓల్ట్‌ల శ్రేణిలో ఉన్నంతసేపూ '99 శాతం'అనే చూపిస్తుంది. వాడుతుండగా 7.4 ఓల్ట్‌ల కిందికి పడిపోయిన తర్వాతే దాని వాస్తవ చార్జింగ్ సామర్థ్యాన్ని చూపిస్తుంది. 5.8 ఓల్ట్‌లకు పడిపోయినా, కేవలం 10 శాతం చార్జింగ్ ఉన్నా కొత్త బ్యాటరీవేయాలని ఇండికేషన్ చూపిస్తుంది''అని రాజీవ్ చెప్పారు.

# కెనడా అడ్డగోలు ఆరోపణలు

**ఖలిస్తాన్ నేతలను భారతీయ ఏజెంట్లు లక్ష్యంగా చేసుకున్నారు**

- బిష్ణోయ్ గ్యాంగ్‌తో కలిసి పనిచేస్తున్నారు: కెనడా పోలీసులు
- భారత్ హత్యలకు తెగిస్తోందన్న కెనడా ప్రధాని ట్రూడో
- అసంబద్ధ ఆరోపణలంటూ కొట్టిపారేసిన భారత్

**ఒట్టావా/వాషింగ్టన్/న్యూఢిల్లీ:** భారత్, కెనడా దౌత్యబంధానికి హఠాత్తుగా బీటలు పడుతున్నాయి. సిక్కు వేర్పాటువాది, ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారతీయ హైకమిషన్ పేరును చేర్చిన కెనడా తాజాగా వ్యవస్థీకృత నేరగ్యాంగ్‌తో భారతీయ ఏజెంట్లకు సంబంధం అంటగట్టి భారత్‌తో దౌత్యబంధంలో ఆగ్రహజ్వాలలను రగలించింది. భారత్‌పై కెనడా నోటికొచ్చినట్లు ఆరోపణలు గుప్పించింది. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మొదలు రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులదాకా అందరూ మూకుమ్మడిగా భారత్‌పై అభాండాలు మోపారు. కెనడాలోని ఖలిస్తానీ నేతలను భారతీయ ఏజెంట్లు లక్ష్యంగా చేసుకున్నారని, ఇందుకోసం కెనడాలోని బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఏజెంట్లు చేతులు కలిపారని తీవ్రమైన ఆరోపణలు చేశారు. కెనడియన్లపై దాడులకు భారత్ తన ఏజెంట్లతోపాటు వ్యవస్థీకృత నేరగాళ్లను ఆశ్రయించిందని కెనడా ప్రధాని ట్రూడో మంగళవారం దారుణ విమర్శలు చేశారు. తప్పని పరిస్థితుల్లో భారత్‌పై ఆంక్షలు విధించేందుకు సిద్ధమని కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ ప్రకటించారు. కెనడా అధికారులు, నేతల మూకుమ్మడి విమర్శలను భారత్ ఏకపక్షంగా తోసిపుచ్చింది. నిజ్జర్ హత్య కేసులో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మ పేరును చేర్చడంతో తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసిన భారత్ అందుకు ప్రతిగా ఢిల్లీలోని ఆరుగురు దౌత్యాధికారులను బహిష్కరించడం, దానికి ప్రతీకారంగా కెనడా సైతం ఆరుగురు భారతీయ దౌత్యాధికారులను బహిష్కరించిన నేపథ్యంలో మంగళవారం కెనడా ఆరోపణల పర్వం మొదలెట్టింది.

**ఖలిస్తాన్ ఉద్యమకారులపై దాడులు**

కెనడాలో ఖలిస్తాన్ ఉద్యమకారులు, నేతలపై దాడులను ప్రస్తావిస్తూ రాయల్ కెనడా మౌంటెడ్ పోలీస్ కమిషనర్ మైక్ డ్యూహెమ్, డిప్యూటీ కమిషనర్ బ్రిగిట్ గౌవిన్‌లు మంగళవారం ఒట్టావాలో మీడియాతో మాట్లాడారు. ''దక్షిణాసియా వాసులను, ముఖ్యంగా ఖలిస్తాన్ ఉద్యమంలో భాగస్వాములైన వారిని భారతీయ ఏజెంట్లు లక్ష్యంగా చేసుకున్నారు. ఇందుకోసం ఏజెంట్లు బిష్ణోయ్ గ్యాంగ్‌తో చేతులు కలిపారు. హత్య, దజునుకుపైగా బెదిరింపులు, హింసాత్మక ఘటనలతో భారత్‌కు సంబంధం ఉంది. హత్యల కేసులో 8 మందిని, భారతప్రభుత్వంతో సంబంధం ఉండి బెదిరింపులకు పాల్పడిన కేసుల్లో 22 మందిని అరెస్ట్‌చేశాం''అని చెప్పారు. ముంబైలో ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్యకేసులో బిష్ణోయ్ గ్యాంగ్ పేరు మళ్లీ తెరపైకి వచ్చిన వేళ ఆ నేరముఠా పేరును కెనడా పోలీసులు ప్రస్తావించడం గమనార్హం.

**భారత్ పెద్ద తప్పిదం చేసింది: ట్రూడో**

కెనడా రాయల్ పోలీసులు ఆరోపణలు చేసిన కొద్దిసేపటికే ట్రూడో మీడియాతో మాట్లాడారు. ''కెనడియన్లపై దాడి చేసేందుకు భారత్ తన దౌత్యవేత్తలు, ఏజెంట్లతోపాటు వ్యవస్థీకృత నేరగాళ్లను వినియోగించి భారీ తప్పిదం చేసింది. కెనడాలో హింస పెరగడంలో భారత పాత్ర దాగి ఉంది. భారత వైఖరితో మా పౌరుల భద్రతకు ముప్పు వాటిల్లుతోంది. హింసకు పాల్పడుతోంది. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. గత వేసవికాలం నుంచి మా పంచ నేత్ర నిఘా కూటమి(ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, బ్రిటన్, అమెరికా)తో భారత వైఖరిని పంచుకుంటున్నాం. చట్టాలకు అతీతంగా భారత్ హత్యలకు ప్రయత్నించింది. భారత్‌తో ఇలాంటి ఘర్షణాత్మక సంబంధాలను మేం కోరుకోవట్లేము. కానీ మాతో కలిసి పనిచేసేందుకు భారత్ విముఖత చూపుతోంది''అని ట్రూడో వ్యాఖ్యానించారు.

**ఆరోపణలను తోసిపుచ్చిన భారత్**

''నిజ్జర్ కేసులో సాక్ష్యాలను ఇచ్చామని కెనడా చెబుతున్న దాంట్లో నిజం లేదు. ట్రూడో మళ్లీ అదే పాత కారణాలను, పాత విషయాలను వల్లెవేశారు. నిజ్జర్ హత్య ఘటనకు ఎవరు బాధ్యులో, ఎందుకు బాధ్యులో కెనడా ఇంతవరకు స్పష్టంగా చెప్పలేదు. ఆ ఉదంతంలో గత ఏడాదికాలంగా భారత హైకమిషర్‌ను వేధించి ఇప్పుడు కేసులో ఇరికించి లక్ష్యంగా చేసుకోవడం అసంబద్ధం''అని భారత్ ఆగ్రహం వ్యక్తంచేసింది.

**కెనడా, భారత్ జాతీయ భద్రతా సలహాదారుల రహస్య భేటీ!**

భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కెనడా జాతీయ భద్రతా మహిళా సలహాదారు నాథలీన్ డ్రౌలీ, ఉన్నతాధికారులతో వారం రోజుల క్రితం సింగపూర్‌లో రహస్యంగా సమావేశమయ్యారని అమెరికా వార్తాసంస్థ వాషింగ్టన్ పోస్ట్ కొత్త కథనం ప్రచురించింది. నిజ్జర్ హత్యలో బిష్ణోయ్ గ్యాంగ్ ప్రమేయముందని కెనడా రాయల్ పోలీసులు ఆరోపించిన వేళ ఈ వార్త చర్చనీయాంశమైంది. కెనడాలో సిక్కు వేర్పాటువాదులపై దాడులకు, నిజ్జర్‌ను హత్యచేసేందుకు బిష్ణోయ్ గ్యాంగ్ నెట్‌వర్క్‌ను భారత్ వాడుకుందని, ఇందుకు సంబంధించిన సాక్ష్యాలను కెనడా అధికారులు దోవల్‌కు సమర్పించారని కథనం సారాంశం.

# నేడు ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం

**కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ తొలి సీఎం కానున్న ఎన్సీ ఉపాధ్యక్షుడు**

**శ్రీనగర్:** కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ తొలి ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా నేడు ప్రమాణం చేయనున్నారు. ఆర్టికల్ 370 ఆర్టికల్ రద్దు అనంతరం మొదటిసారిగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్సీ, కాంగ్రెస్ కూటమి విజయం సాధించడం తెలిసిందే. బుధవారం శ్రీనగర్‌లోని షేర్–ఇ–కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(ఎస్‌కేఐసీసీ)లో జరిగే కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సీఎంగా ఒమర్‌తో ప్రమాణం చేయించనున్నారు. పలువురు మంత్రులుగా ప్రమాణం చేస్తార ని భావిస్తున్నారు. ఇందుకోసం ఎస్‌కేఐసీసీలో భారీగా బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమానికి ఇండియా కూటమి పార్టీల నేతలు ఈ కార్యక్రమానికి హాజరవుతారని భావిస్తున్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ నామినేట్ చేసిన ఐదుగురితో కలుపుకుంటే జమ్మూకశ్మీర్ అసెంబ్లీ సభ్యుల సంఖ్య 95కు చేరుకుంది. ఇటీవలి ఎన్నికల్లో ఎన్సీ 40, భాగస్వామ్య కాంగ్రెస్ ఆరు, సీపీఎం ఒక సీటు గెలుచుకున్నాయి. ఇవికాకుండా, ఒమర్ అబ్దుల్లాకు ఆప్ ఏకైక సభ్యుడు, ఐదుగురు ఇండిపెండెంట్లు మద్దతు పలికారు.

# అమెరికా నుంచి ప్రిడేటర్ డ్రోన్లు

- సంతకాలు చేసిన భారత్
- దాదాపు రూ.33,624 కోట్ల విలువైన ఎంక్యూ9బీ రకం 31 సాయుధ డ్రోన్ల కొనుగోలు

**న్యూఢిల్లీ:** త్రివిధ దళాల అమ్ములపొదిలోకి నూతన అస్త్రాలను అగ్రరాజ్యం నుంచి భారత్ అందుకోనుంది. పొరుగుదేశం చైనాతో శత్రుత్వం మరింత పెరిగిన నేపథ్యంలో సరిహద్దు భద్రతను మరింత పటిష్ఠంచేసే చర్యల్లో భాగంగా అత్యాధునిక నిఘా, దాడి డ్రోన్ల కొనుగోలుకు భారత్ సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఒప్పందంపై భారత్ మంగళవారం సంతకాలు చేసింది. ఢిల్లీలో రక్షణ శాఖ ఉన్నతాధికారులు, జనరల్ ఆటమిక్స్ గ్లోబల్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వివేక్ లాల్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీంతో అమెరికా, భారత్ సాయుధబంధం మరింత బలోపేతమైంది. ఒప్పందంలో భాగంగా అమెరికాలో రక్షణ రంగ ఉత్పత్తుల దిగ్గజం జనరల్ ఆటమిక్స్ సంస్థ నుంచి సుమారు రూ.33,624 కోట్ల విలువైన ఎంక్యూ9బీ రకం 31 సాయుధ డ్రోన్‌లను భారత్ కొనుగోలుచేయనుంది. ఎంక్యూ9 రీపర్ డ్రోన్‌లో ఇది మరో వేరియంట్. కొద్దిరోజుల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇంతటి భారీ డీల్ ఓకే కావడం విశేషం. హంటర్ కిల్లర్ డ్రోన్‌లుగా పేరొందిన ఎంక్యూ9బీ డ్రోన్ ఆకాశంలో ఏకబిగిన 35 గంటలకుపైగా అత్యంత ఎత్తుల్లో చక్కర్లు కొట్టగలదు. హెల్‌ఫైర్ క్షిపణులతో దాడిచేయగలదు. 450 కేజీలకుపైగా బరువున్న బాంబులను మోసుకెళ్లగలదు. నిర్వహణ, మరమత్తు తదితర పనుల నిమిత్తం విడిగా మరో ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు భారత రక్షణ మంత్రిత్వ శాఖ, జనరల్ ఆటమిక్స్ గ్లోబల్ ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. గత వారమే హంటర్ కిల్లర్ డ్రోన్ల సమీకరణకు తుది ఆమోదం ఆమోదం తెలుపుతూ ప్రధాని మోదీ నేతృత్వంలోని రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీలో నిర్ణయం తీసుకోవడం తెల్సిందే.

**నేవీకి 15, ఆర్మీ, నావికాదళాలకు చెరో 8**

31 డ్రోన్లలో భారత నేవీకి 15 సీ గార్డియన్ రకం డ్రోన్లను కేటాయించనున్నారు. భారత వాయుసేనకు ఎనిమిది, ఆర్మీకి ఎనిమిది స్కై గార్డియన్ రకం డ్రోన్లను కేటాయించనున్నారు. తీర ప్రాంతాల్లో గస్తీకాసే సీ గార్డియన్ డ్రోన్లు జలాంతర్గాములపైనా దాడి చేయగలవు. భారత్–అమెరికా రక్షణ సహకారం ఇటీవలికాలంలో మరింత పెరిగింది. కీలకమైన రక్షణ ఉత్పత్తులు, సాంకేతికతలను విక్రయించేందుకు వీలుగా భారత్‌కు అమెరికా 2016 జూన్‌లో 'కీలక రక్షణ భాగస్వామి'హోదాను కట్టబెట్టడం తెల్సిందే.

# గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ కావాలి

**'ఇండియా మొబైల్ కాంగ్రెస్'లో ప్రధాని మోదీ సూచన**


మొబైల్ కాంగ్రెస్‌లో ఎగ్జిబిషన్ వద్ద మోదీ

**న్యూఢిల్లీ:** ఆధునిక యుగంలో ప్రపంచ మొత్తం పరస్పరం అనుసంధానమైన నేపథ్యంలో డిజిటల్ టెక్నాలజీ, కృత్రి మేధ(ఏఐ)ని ఉపయోగించుకొనే విషయంలో స్పష్టమైన విధివిధానాలు అవసరమని ప్రధాని మోదీ చెప్పారు. గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొనే అంశంపై అన్ని దేశాలు దృష్టి పెట్టాలని సూచించారు. డిజిటల్ టెక్నాలజీని వాడుకొనే పౌరుల వ్యక్తిగత వివరాల భద్రత, గోప్యతను తప్పనిసరిగా కాపాడాలని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో 'ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్–డబ్ల్యూటీఎస్ఏ, ఇండియా మొబైల్ కాంగ్రెస్'ను మోదీ ప్రారంభించారు. డిజిటల్ సాంకేతికత విషయంలో నిబంధనల ఆధారిత ఫ్రేమ్‌వర్క్ ప్రాధాన్యతను ప్రపంచస్థాయి సంస్థలు గుర్తించాల్సిన సమయం వచ్చిందని స్పష్టంచేశారు. ఈ నిబంధనలు కేవలం వ్యక్తిగత భద్రత, టెక్నాలజీ సంస్థల పారదర్శకతకే కాదు, అంతర్జాతీయ డేటా ప్రవాహంపై ఆధారపడి ఉన్న వాణిజ్యం, వస్తు సేవలకు సైతం కీలకమేనని ఉద్ఘాటించారు. సైబర్ మోసాల నుంచి ఏ ఒక్క దేశమూ ఒంటరిగా తమ ప్రజలకు రక్షణ కల్పించలేదని అభిప్రాయపడ్డారు. అందుకే అంతర్జాతీయ స్థాయిలో నిబంధనలు ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు అంతర్జాతీయ సంస్థలు బాధ్యత తీసుకోవాలన్నారు. డిజిటల్ టెక్నాలజీ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలో మొబైల్ ఫోన్ల వినియోగదారుల సంఖ్య 120 కోట్లకు చేరిందని గుర్తుచేశారు. 95 కోట్ల మంది ఇంటర్నెట్ ఉపయోగిస్తున్నారని తెలిపారు. ప్రపంచంలోని మొత్తం డిజిటల్ లావాదేవీల్లో ఏకంగా 40 శాతం భారత్‌లోనే జరుగుతున్నాయని వివరించారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల విషయంలో తమ అనుభవాన్ని ఇతర దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

# నిమిషాల ముందు దీపావళి బోనస్

- షెడ్యూల్ విడుదలకు కొద్ది నిమిషాల ముందు
- బీఎంసీ ఉద్యోగులకు మహారాష్ట్ర సర్కారు నజరానా

**ముంబై:** ఎన్నికల షెడ్యూల్ వెలువడటానికి కొద్ది నిమిషాల ముందు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఉద్యోగులకు మహారాష్ట్ర సర్కారు దీపావళి బోనస్‌ను ప్రకటించింది. బీఎంసీ ఉద్యోగులకు, కిండర్‌గార్టెన్ టీచర్లకు, ఆశావర్కర్లకు రూ. 28,000 చొప్పున దీపావళి బోనస్ ఇవ్వనున్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మంగళవారం ప్రకటించారు. గత ఏడాది కంటే ఈ బోనస్ రూ. 3,000 ఎక్కువ. అలాగే లడ్కీ బహిన్ యోజన పథకం లబ్ధిదారులకు 4, 5వ విడత ఇన్‌స్టాల్‌మెంట్లను (రూ.3,000) అడ్వాన్సుగా చెల్లించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. షిండే బోనస్ ప్రకటించిన కొద్ది నిమిషాలకే ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మహాయుతి సర్కారు (శివసేన– షిండే, ఎన్సీపీ– అజిత్‌పవార్, బీజేపీ కూటమి) ఎనిమిది ప్రజాకర్షక పథకాలను ఇంతకుముందే ప్రకటించిన సంగతి తెలిసిందే.

## క్లుప్తంగా...

### పరిహారం మార్కెట్ ధర కంటే తగ్గరాదు

**ఆర్ఆర్ఆర్ భూ సేకరణపై కేంద్ర మంత్రి గడ్కరీకి ఈటల విజ్ఞప్తి**



సాక్షి, న్యూఢిల్లీ: రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూసేకరణలో భూమి కోల్పోతున్న వారికి మార్కెట్ ధర కంటే తగ్గకుండా పరిహారం ఇవ్వాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. చౌటుప్పల్, రాయిగిరి, గజ్వేల్ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న 28 కిలోమీటర్ల ఆర్ఆర్ఆర్ పరిధిని 40 కిలోమీటర్లకు పెంచాలని కోరారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, జిల్లాకు చెందిన 20 మంది రైతులతో కలిసి మంగళవారం కేంద్ర మంత్రి గడ్కరీని ఈటల రాజేందర్ కలిశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఈటల తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి ఎక్కువ ఇళ్లు కేటాయించాలని కేంద్రమంత్రి మనోహర్‌లాల్‌ను కలిసి ఈటల రాజేందర్ వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో మురికికూపాలుగా మారిన చెరువులను శుభ్రపరిచేందుకు నిధులు కేటాయించాలని కోరారు. హైదరాబాద్ పరిశ్రమల నుంచి ఎక్కువ మొత్తంలో సీఎస్ఆర్ నిధులు తన నియోజకవర్గానికి కేటాయించాలని కూడా విజ్ఞప్తి చేశారు.

### వచ్చే నెల మొదటి వారంలో డీఆర్ఎఫ్ శిక్షణ

**సీఎస్ శాంతికుమారి వెల్లడి**



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) మొదటి బ్యాచ్‌కు నవంబర్ మొదటివారంలో శిక్షణ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. సీఎం ఆదేశాల మేరకు అగ్నిమాపక శాఖకు చెందిన 10 బృందాలు, తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌లోని 10 కంపెనీలను వినియోగించి మొత్తం 2వేల మందితో కూడా ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు అవసరమైన బడ్జెట్‌ను కూడా మంజూరు చేశామని ఆమె వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో డీజీపీ జితేందర్, విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులతో సీఎస్ సమావేశమై డీఆర్ఎఫ్ ఏర్పాటు ప్రతిపాదనలపై చర్చించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండేలా ఈ ఫోర్స్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. అగ్నిమాపకశాఖ డీజీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ...ఈ ఫోర్స్‌కు అవసరమైన పరికరాలు, శిక్షణ అందించడం ద్వారా అగ్నిమాపక శాఖలోని 10 బృందాలను ఎస్‌డీఆర్ఎఫ్ స్టేషన్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపారు.

### మంత్రిపై అసభ్యకర పోస్టులు.. ఇద్దరి అరెస్టు

సాక్షి, హైదరాబాద్/జగిత్యాల క్రైం: మంత్రి కొండా సురేఖ, మెదక్ ఎంపీ రఘునందన్ రావుల ఫొటోలను అసభ్యకరంగా చిత్రీకరించిన కేసులో ఇద్దరు నిందితులను సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఇటీవల ఒక ప్రభుత్వ కార్యక్రమంలో కొండా సురేఖ, తాను పాల్గొన్న ఫొటోలను సేకరించి, అసభ్యకరంగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ చానళ్లలో ప్రసారం చేశారని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేసిన పోలీసులు.. సాంకేతిక ఆధారాలను సేకరించి, నిజామాబాద్ జిల్లా కోనాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ దేవయ్య, జగిత్యాల జిల్లా అల్లీపూర్ గ్రామానికి చెందిన అనుమల్ల మహేశ్ అనే బీఆర్ఎస్ కార్యకర్తను హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఎస్ఐ చంద్రశేఖర్ అరెస్ట్ చేశారు.



### అక్కడ టౌన్.. ఇక్కడ టైగర్..

కనుచూపు మేరలో ఊరు..
ఊరుకు దగ్గర్లో సేదతీరుతున్న పులి..
ఫొటో చూస్తుంటే అద్భుతం అని అనిపించడంతోపాటు ఆందోళన కూడా కలిగిస్తోంది కదూ.. ఊరోళ్లు ఇటు వస్తే ఏమవుతుందో అని.. జర్మనీకి చెందిన రాబిన్ డారియస్ అనే ఫొటోగ్రాఫర్ ఒక డాక్యుమెంటరీ కోసం తమిళనాడులోని పశ్చిమ కనుమల ప్రాంతంలో ఈ పులిని డ్రోన్ కెమెరాతో చిత్రీకరిస్తున్నారు. ఆ సందర్భంగా తీసినదే ఈ చిత్రం. తాజాగా ఈ ఫొటో ప్రఖ్యాత 'వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్' పోటీలో అర్బన్ వైల్డ్ లైఫ్ కేటగిరీలో విజేతగా నిలిచింది.


# ఈవీ బ్యాటరీల స్వాపింగ్

**ఖాళీ బ్యాటరీకి బదులుగా ఫుల్ చార్జింగ్ ఉన్న బ్యాటరీని పొందొచ్చు**

- ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల స్వాపింగ్‌కు మార్గదర్శకాలను ప్రకటించిన కేంద్రం
- సమయం ఆధారంగా యూనిట్‌కు రూ.3 నుంచి రూ.13 వరకు సర్వీసు చార్జీలు

ఇప్పటికే విదేశాల్లో చాలా ప్రాచుర్యం పొందిన స్వాపింగ్ విధానం

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) చార్జింగ్‌కు ప్రత్యామ్నాయంగా బ్యాటరీలను స్వాపింగ్(మార్పిడి) చేసే విధానం మనదేశంలోనూ అందుబాటులోకి రానుంది. ఇకపై బ్యాటరీ పూర్తిగా చార్జింగ్ అయ్యే వరకు గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండదు. చార్జింగ్ పూర్తిగా లేకపోయినా, తక్కువ చార్జింగ్ ఉన్నా.. ఆ బ్యాటరీల స్థానంలో పూర్తి చార్జింగ్ ఉన్న బ్యాటరీలను చార్జింగ్ స్టేషన్లలో క్షణాల్లో స్వాపింగ్ చేసుకోవడానికి వీలు కల్పించింది. బ్యాటరీల స్వాపింగ్, చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ కోసం తాజాగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను ప్రకటించింది. విదేశాల్లో ఈ విధానాన్ని ప్రస్తుతం అనుసరిస్తున్నారు. మనదేశంలో ఇప్పటికే బ్యాటరీ చార్జింగ్ స్టేషన్లను నిర్వహిస్తున్న వారు సైతం స్వాపింగ్ సేవలను ప్రారంభించుకోవచ్చు. ప్రస్తుత విద్యుత్ కనెక్షన్ ద్వారానే స్వాపింగ్ సేవలను అందించడానికి కేంద్రం వీరికి అవకాశం కల్పించింది.



### సర్వీసు చార్జీలపై సీలింగ్

ఈవీ చార్జింగ్ కేంద్రాల్లో ఏసీ/డీసీ చార్జింగ్‌కు వసూలు చేయాల్సిన సర్వీసు చార్జీలపై గరిష్ఠ పరిమితిని కేంద్రం ప్రకటించింది. జీఎస్టీ, భూమి ధరకు సంబంధించిన చార్జీలు వీటికి అదనం కానున్నాయి. యూనిట్ విద్యుత్ సరఫరా చేసేందుకు డిస్కంలు చేసే సగటు వ్యయంతో పోల్చితే చార్జింగ్ కేంద్రాలకు సరఫరా చేసే విద్యుత్ టారిఫ్ అధికంగా ఉండరాదని కేంద్రం స్పష్టం చేసింది. 2028 మార్చి 31 వరకు దేశ వ్యాప్తంగా ఇవే సర్వీస్ చార్జీలు, టారిఫ్‌ను అమలు చేయాలని స్పష్టం చేసింది. సగటు సరఫరా వ్యయంతో పోల్చితే ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 0.7 రేట్లు, సాయంత్రం 4 నుంచి ఉదయం 9 గంటల వరకు 1.3 రేట్ల అధిక వ్యయంతో చార్జింగ్ కేంద్రాలకు డిస్కంలు విద్యుత్ సరఫరా చేయాలని సూచించింది. ఈవీ చార్జర్ల కోసం సబ్ మీటర్లను సరఫరా చేయాలని డిస్కంలను కోరింది.

చార్జింగ్ కేంద్రాల్లో వాహనదారుల నుంచి వసూలు చేసే సర్వీసు చార్జీలను కింది పట్టికలో చూడవచ్చు.

| చార్జింగ్ విధానం | ఉదయం 9–సాయంత్రం 4 వరకు | సాయంత్రం 4––ఉదయం 9 వరకు |
|---|---|---|
| ఏసీ(స్లో) | యూనిట్‌కు రూ.3 | యూనిట్‌కు రూ.4 |
| డీసీ(ఫాస్ట్) | యూనిట్‌కు రూ.11 | యూనిట్‌కు రూ.13 |

### 3 రోజుల్లోనే కరెంట్ కనెక్షన్

ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే మెట్రోపాలిటన్ నగరాల్లో కేవలం 3 రోజుల్లోనే కొత్త విద్యుత్ కనెక్షన్ జారీ చేయాలని కేంద్రం ఆదేశించింది. ఇతర మున్సిపాలిటీల్లో 7 రోజుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజుల్లో, కొండలున్న గ్రామీణ ప్రాంతాల్లో 30 రోజుల్లో, సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లు వంటి సదుపాయాలు కల్పించాల్సి ఉంటే 90 రోజుల్లో విద్యుత్ కనెక్షన్ జారీ చేయాలని స్పష్టం చేసింది. ఒకవేళ జాప్యం చేస్తే ఎలక్ట్రిసిటీ రైట్స్ ఆఫ్ కన్జ్యూమర్స్ రూల్స్–2020 ప్రకారం దరఖాస్తుదారులకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్ పంపిణీ సంస్థకు స్పష్టం చేసింది.

### ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు తమ స్థలాలను ప్రభుత్వ/ప్రైవేటు సంస్థలకు చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం రెవెన్యూ షేరింగ్ మోడల్ కింద అందించాలని కేంద్రం సూచించింది. స్థలం ఇచ్చినందుకుగాను ప్రతి యూనిట్ విద్యుత్ చార్జింగ్ ద్వారా వచ్చే ఆదాయంలో రూపాయిని వాటాగా తీసుకోవాలని చెప్పింది. తొలుత 10 ఏళ్ల లీజుకు స్థలాలను కేటాయించాలని కోరింది. చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుదారులకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలను అందించాలని సూచించింది.

## ఫైబర్‌నెట్‌కు నిధులివ్వండి

**ఐటీయూడబ్ల్యూటీఎస్‌ఏ సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు**



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన టీ–ఫైబర్ నెట్‌కు నిధులు ఇచ్చి పూర్తి చేసేందుకు సహకరించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నేషనల్ సెమీ కండక్టర్ మిషన్‌లో హైదరాబాద్‌కు చోటు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో మంగళవారం 'ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ యూనియన్- వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ (ఐటీయూ డబ్ల్యూటీఎస్‌ఏ) ఎనిమిదో ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టీ–ఫైబర్ నెట్ పూర్తికి కేంద్రం సహకరించాలని మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. అటవీ ప్రాంతాల్లో టీ–ఫైబర్ విస్తరణ సమస్యగా మారుతోందని వివరించారు. కేంద్ర అటవీ శాఖ అనుమతుల్లో జాప్యం వల్ల పనుల్లో పురోగతి కుంటుపడుతోందని చెప్పారు. ఈ విషయంలో చొరవ తీసుకుని సత్వరమే అనుమతులు ఇచ్చేలా చూడాలని కోరారు. నేషనల్ సెమీ కండక్టర్ మిషన్‌లో హైదరాబాద్‌కు చోటు కల్పించాలని కోరారు. భౌగోళికంగా, వాతావరణపరంగా హైదరాబాద్ ఎంతో అనువైన ప్రాంతమని వివరించారు. హైదరాబాద్‌లో ఇండియన్ టెలికం కాన్ఫరెన్స్ జాతీయ సదస్సు నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**తెలంగాణ స్టాల్‌ను సందర్శించిన శ్రీధర్‌బాబు**

తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఐటీ శాఖ భారత్ మండపంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను మంత్రి శ్రీధర్‌బాబు సందర్శించారు. స్టాల్‌లో తెలంగాణ ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), ఫైబర్ నెట్ తదితర అంశాలను ఆయా శాఖల ప్రతినిధులు వివరిస్తున్నారు.

### అతి ఉత్కృష్ట పతకానికి జగిత్యాల డీఎస్పీ




జగిత్యాల క్రైం: పోలీసు శాఖలో విశేష సేవలందించినందుకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మకమైన అతి ఉత్కృష్ట పతకానికి జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. ప్రతి పోలీస్ అధికారి చట్టపరిధిలో నీతినిజాయితీతో విధులు నిర్వర్తించినప్పుడు ప్రజలు, ప్రభుత్వ గుర్తింపు లభిస్తాయని ఎస్పీ వ్యాఖ్యానించారు.

## హైడ్రా ఏర్పాటులో తప్పు ఏముంది?

**పిటిషనర్లను ప్రశ్నించిన హైకోర్టు**

సాక్షి, హైదరాబాద్

చెరువులు, కుంటలు ఇతర జలాశయాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను రక్షించేందుకు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేస్తే తప్పే మిటని హైకోర్టు పిటిషనర్లను ప్రశ్నించింది. తెలంగాణలో నిజాం పాలనలో ఏర్పాటైన రెవెన్యూ యాక్ట్ ప్రకారం వాటిని కాపాడేందుకు ప్రభుత్వానికి అధికా రాలు ఉన్నాయని వ్యాఖ్యానించింది. మూసీ ప్రాంతంలోని తమ ఇళ్లను ఎర్ర అక్షరాలతో ఆర్‌బీ–ఎక్స్ అని మార్కింగ్ చేశారని, కూల్చివేత చర్యలు తీసుకునే అవకాశం ఉందంటూ హైదరాబాద్‌లోని పేట్లబుర్జు ప్రాంతానికి చెందిన ఎస్.మహేందర్‌సింగ్‌దాస్ మరో 14 మంది పిటిషన్లు దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ఏర్పాటుకు జారీ చేసిన జీవో 99కి చట్టబద్ధత లేదంటూ హైదరాబాద్ నానక్‌రాంగూడకు చెందిన డి.లక్ష్మి, మల్కాజిగిరికి చెందిన ఎండీ అహ్మద్ అజీమ్ విడిగా మరో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ సీవీ భాస్కరరెడ్డి మంగళవారం విచా రణ చేపట్టారు. ఈ సందర్భంగా పైవిధంగా పిటిషనర్లను ప్రశ్నించారు. పిటిషనర్ల న్యాయ వాదులు స్పందిస్తూ, ప్రైవేటు పట్టా భూముల్లోకి హైడ్రా అధికారులు చొరబడి తమకు చెందిన నిర్మాణాలను కూల్చేశారన్నారు. చట్ట వ్యతిరేకంగా హైడ్రా అధికారుల చర్యలు ఉంటే నష్టపరిహారం కోరవచ్చునని న్యాయమూర్తి వారికి సూచించారు. హైడ్రా ఏ చర్యలు తీసుకున్నా అవి చట్ట నిబంధనలకు అనుగుణంగా ఉండాలని మరోసారి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. అలాగే మూసీ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలకు చెందిన కేసులో కూడా అధికారులు కఠిన చర్యలు తీసుకోరాదని, చట్ట ప్రకారమే నడుచుకోవాలని ఆదేశించారు. ఈ పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్లు తెలిపారు.

సదనంలోని ఆర్చరీ సెంటర్‌లో విల్లు ఎక్కుపెట్టిన మంత్రి సీతక్క




### బాలలతో గడిపి.. భరోసా ఇచ్చి

సైదాబాద్ (హైదరాబాద్): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క మంగళవారం సైదాబాద్ జైల్‌గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనాన్ని సందర్శించారు. అక్కడి బాలలతో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం అక్కడి ఆర్చరీ సెంటర్‌లో బాలల ప్రదర్శన చూసి మంత్రి అబ్బురప డ్డారు. బాలలు జాతీయస్థాయిలో రాణిస్తున్న విషయాన్ని అధికారుల ద్వారా తెలుసుకొని అభినందించారు. బాలల కోరిక మేరకు మంత్రి విల్లంబులు ఎక్కుపెట్టారు. బాణాలను లక్ష్యానికి గురి పెట్టి వదిలారు. బాణాలు వేస్తుంటే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి ప్రభుత్వ బాలల పరిశీలన గృహాన్ని సందర్శించి బాలలతో ముచ్చటించారు. తెలిసో తెలియకో చేసిన తప్పులతో ఇక్కడికి వచ్చినవారు చింతించవద్దని బాలలకు ఉద్బోధించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ క్రాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

### టుడేస్ గ్రాఫిక్

**వివిధ దేశాల్లో రాజకీయాలపై ప్రజలకు పెద్దగా ఆసక్తి లేదని స్టాటిస్టా కన్జూమర్ ఇన్‌సైట్స్ అనే సంస్థ చేపట్టిన అధ్యయనంలో వెల్లడైంది. వ్యక్తిగత అభిరుచుల్లో రాజకీయాలకు అతితక్కువ ప్రాధాన్యత ఇస్తామని సర్వేలో పాల్గొన్న 18 దేశాల ప్రజలు పేర్కొన్నారు. ఈ జాబితాలో భారత్ 15వ స్థానంలో నిలిచింది. భారత్‌లో 27 శాతం మంది మాత్రమే రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు. సర్వేలో పాల్గొన్న వారిలో ఫిన్లాండ్, డెన్మార్క్ దేశాల ప్రజలు మాత్రమే అత్యధికంగా రాజకీయాలు, ప్రపంచ పరిణామాలపై ఆసక్తి కనబరుస్తామన్నారు. 18 ఏళ్ల నుంచి 64 ఏళ్ల మధ్య ఉన్న ప్రజల అభిప్రాయాలను స్టాటిస్టా సేకరించింది.**




### నైరుతి నిష్క్రమణం పూర్తి



సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల నిష్క్రమణ పూర్తయినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇదే సమయంలో మంగళవారం ఉదయానికి ఆగ్నేయ ద్వీపకల్ప ప్రాంతంలోకి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయని, ఇవి ప్రస్తుతం చురుకుగా కదులుతున్నట్లు వివరించింది. రానున్న వారం రోజుల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు ఈ రుతుపవనాల విస్తరణ వేగవంతమవుతుందని వెల్లడించింది. ప్రస్తుతం దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది క్రమంగా బలపడనుందని, పశ్చిమ, వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు వివరించింది. రానున్న రెండు రోజులలో ఈ వాయుగుండం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దాని పరిసర ప్రాంతాల్లోని దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం వైపునకు కదిలే అవకాశం ఉన్నట్లు సూచించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉత్తర ప్రాంత జిల్లాల్లోని ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు విశ్లేషిస్తున్నారు.

నీటిలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకు వస్తున్న రిమోట్ మెషీన్



### ఇలా రక్షించాలి

కరీంనగర్ క్రైం: రాష్ట్రస్థాయి ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ సిబ్బందికి మంగళవారం మానేరు డ్యాంలో శిక్షణ ఇచ్చారు. కరీంనగర్ డివిజన్ ఫైర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఫైర్ స్టేషన్లకు చెందిన 69 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, వరదలు, విపత్తులు సంభవించినప్పుడు ఎలా రక్షించాలో మెళకువలు నేర్పించామని పేర్కొన్నారు. మరికొందరికి బుధవారం శిక్షణ ఉంటుందని వెల్లడించారు.



### 24 గంటలు.. 20 ప్రసవాలు

కోల్‌సిటీ (రామగుండం): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని ప్రసూతి విభాగం సిబ్బంది 24 గంటల్లో 20 ప్రసవాలు నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు జరిగిన 20 ప్రసవాల్లో 6 సాధారణ ప్రసవాలు చేయగా, మిగతావి సి-సెక్షన్ చేయాల్సి వచ్చిందని ప్రసూతి విభాగం హెచ్‌వోడీ, ఆర్ఎంఓ అరుణ తెలిపారు. పుట్టిన శిశువులు, వారి తల్లులు అందరూ ఆరోగ్యంగా ఉన్నారని పేర్కొన్నారు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రసూతి తేదీలను వాయిదా వేసుకున్న గర్భిణులు.. ఒకేసారి ఆస్పత్రిలో అడ్మిట్ కావడంతో అందరికీ వరుసగా డెలివరీలు చేయాల్సి వచ్చిందని డాక్టర్ అరుణ వివరించారు.

## పల్లెల్లో సర్కారీ కొలువులపై అనాసక్తి

- సర్టిఫికెట్ల పరిశీలనకు దూరమై ఉద్యోగాన్ని వదులుకున్న మరో 13 మంది
- 674 మంది ఏఈఈలకు విధుల్లో చేరింది 310 మందే
- హైదరాబాద్‌లో పోస్టింగ్ పొందిన 10 మందిలో విధుల్లో చేరింది 9 మంది

సాక్షి, హైదరాబాద్: సర్కారీ ఉద్యోగం వచ్చినా గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగం చేయడానికి కొందరు అభ్యర్థులు అనాసక్తి ప్రదర్శిస్తున్నారు. టీజీపీఎస్సీ ద్వారా రాష్ట్ర నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)గా 687 మంది ఎంపిక కాగా, 674 మంది మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరై నియామక పత్రాలు అందుకున్నారు. మిగిలిన 13 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు దూరంగా ఉండటం ద్వారా ఉద్యోగావకాశాన్ని వదులుకున్నారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు ఈ నెల 25 నాటికి పోస్టింగ్ పొందిన చోట రిపోర్టింగ్ చేయాల్సి ఉండగా, మంగళవారం నాటికి కేవలం 310 మంది మాత్రమే రిపోర్టు చేశారు. గత నెల 26న నియామక పత్రాలు అందజేయగా, రిపోర్టు చేయడానికి మరో 8 రోజులు మాత్రమే మిగిలున్నాయి. యువ ఇంజనీర్లకు తొలి పోస్టింగ్‌ను గ్రామీణ ప్రాంతాల్లోనే ఇస్తామని, ఎలాంటి ఒత్తిళ్లను తీసుకురావద్దని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వారికి పోస్టింగ్ ఇచ్చే సమయంలో స్పష్టం చేశారు. హైదరాబాద్ చీఫ్ ఇంజనీర్ పరిధిలో 10 మంది ఏఈఈలకు పోస్టింగ్ ఇస్తే ఇప్పటికి 9 మంది రిపోర్టు చేశారు. మహబూబ్‌నగర్ సీఈకి 48 మందిని కేటాయిస్తే కేవలం 8 మంది, నల్లగొండ సీఈకి 76 మందిని కేటాయిస్తే 49 మంది, సూర్యాపేట సీఈకి 32 మందిని కేటాయిస్తే కేవలం ఇద్దరు, ఆదిలాబాద్ సీఈకి 24 మందిని కేటాయిస్తే 15 మంది, వనపర్తి సీఈకి 53 మందిని కేటాయిస్తే 16 మంది, వరంగల్ సీఈకి 30 మందిని కేటాయిస్తే ఏడుగురు, గజ్వేల్ సీఈకి 72 మందిని కేటాయిస్తే 12 మంది, కరీంనగర్ సీఈకి 45 మందిని కేటాయిస్తే 14 మంది మాత్రమే ఇప్పటి వరకు విధుల్లో చేరారు. నియామక పత్రాలు పొందిన 674 మందిలో 10 మంది ఐఐటీ డిగ్రీ, 21 మంది ఐఐటీ పీజీ, 50 మంది ఎన్ఐటీ డిగ్రీ, 33 మంది ఎన్ఐటీ పీజీ చేసిన వారున్నారు. మొత్తం 114 మంది ఐఐటీ, ఎన్ఐటీ ఇంజనీర్లు ఉండగా, వీరిలో అధిక శాతం సర్కారీ కొలువుల్లో చేరేందుకు ఆసక్తి చూపకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## గ్రూప్-1 మెయిన్స్‌కు లైన్‌క్లియర్

**అభ్యంతరాలపై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు**

- నిపుణుల కమిటీ నిర్ణయం మేరకే ప్రిలిమ్స్ తుది 'కీ'
- పిటిషనర్ల అభ్యంతరాలను పరిశీలించింది
- ఈ అంశంలో న్యాయస్థానం జోక్యం అవసరం లేదు
- 'గ్రూప్–1'పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం తీర్పు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు హైకోర్టు లైన్‌క్లియర్ చేసింది. అక్టోబర్ 21 నుంచి అక్టోబర్ 28వ తేదీ వరకు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు ఉన్న చట్టపరమైన అడ్డంకులను తొలగించింది. రీనోటిఫికేషన్, 'కీ'ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను మంగళవారం కొట్టివేసింది. రీనోటిఫికేషన్‌పై పిటిషన్ దాఖలు చేసిన అభ్యర్థుల్లో ఒక్కరే కమిషన్‌కు అభ్యంతరం తెలుపుతూ వినతిపత్రం సమర్పించారని పేర్కొంది. పిటిషన్లపై టీజీపీఎస్సీ వినిపించిన వాదనలతో సంతృప్తి చెందినట్టు స్పష్టం చేసింది. కొన్ని అంశాల్లో నిపుణుల అభిప్రాయం తప్పనిసరిగా ఉండాలని..వారి విజ్ఞతను న్యాయస్థానాలు భర్తీ చేయలేవని వ్యాఖ్యానించింది. సాంకేతిక స్వభావమున్న విషయాల్లో నిర్ణయాన్ని నిపుణుల సంస్థలకే వదిలివేయాలని చెప్పింది. గ్రూప్–1 'కీ'పై టీజీపీఎస్సీ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ నిర్ణయం తీసుకున్న తర్వాత న్యాయస్థానం కలుగజేసుకోవడం అవసరం లేదని అభిప్రాయపడింది. '1,721 మంది అభ్యర్థులు లేవనెత్తిన 6,417 అభ్యంతరాలను సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ కమిటీ పరిశీలించింది. ఇందులో కొందరు పిటిషనర్లు కూడా ఉన్నారు. సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదిక ఆధారంగానే తుది కీ ప్రచురించాం. జూలై 7న తుది కీ విడుదల చేసి.. ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు వెలువరించాం. మొత్తం ఖాళీల సంఖ్యకు 1:50 నిష్పత్తిలో 31,382 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించారు'అన్న టీజీపీఎస్సీ వాదనలను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు తీర్పునిచ్చింది.

– 'ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల జాబితాను ప్రచురించే ముందు ప్రాథమిక కీపై వచ్చిన అభ్యంతరాలను నిష్పాక్షికంగా పరిగణించాలి. ఆ అభ్యంతరాలపై పూర్తి పరిశీలన జరిగిన తర్వాతే మెరిట్ జాబితా ప్రకటించాలి. కానీ టీజీపీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్‌పై ఆ మేరకు చర్యలు తీసుకోలేదు. తప్పుగా వచ్చిన ప్రశ్నలను తొలగించి మళ్లీ మెరిట్ జాబితా ప్రకటించేలా ఆదేశించాలి'అని వికారాబాద్‌కు చెందిన దామోదర్‌రెడ్డితోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రీ నోటిఫికేషన్, ఎస్టీ రిజర్వేషన్‌ను సవాల్ చేస్తూ మరికొందరు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్ విచారణ చేపట్టి ఈ నెల 4న తీర్పు రిజర్వు చేశారు. మంగళవారం.. పిటిషన్లు కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

## డాక్టర్ ఉషాలక్ష్మి కన్నుమూత

**బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్‌ను స్థాపించి విశేష సేవలందించిన ఉషాలక్ష్మి**



**సాక్షి, హైదరాబాద్:** ప్రముఖ గైనకాలజీ వైద్య నిపుణురాలు, ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్త ఉషాలక్ష్మి (91) మంగళవారం గుండెపోటుతో హైదరాబాద్‌లో కన్నుమూశారు. తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ స్త్రీల వైద్యనిపుణురాలిగా పేరొందిన ఆమె మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఉషాలక్ష్మి మరణం వైద్య రంగానికి తీరని లోటని పలువురు వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉషాలక్ష్మి 1933లో గుంటూరులో జన్మించారు. స్థానిక కళాశాలలో వైద్యవిద్యను పూర్తి చేశారు. అక్కడే గైనకాలజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. అనంతరం హైదరాబాద్‌లో ప్రాక్టీస్ ప్రారంభించారు. చాలాకాలం పాటు నిలోఫర్ ఆసుపత్రిలో సేవలందించారు.

**బ్రెస్ట్ కేన్సర్‌ను గెలిచి.. ఫౌండేషన్ ఏర్పాటు చేసి**

ఉషాలక్ష్మి 69వ ఏట బ్రెస్ట్ కేన్సర్ బారినపడ్డారు. మానసిక స్థైర్యం కోల్పోకుండా జబ్బుపై పోరాటం చేసి గెలిచారు. ఎంతోమంది మహిళలు తమకు తెలియకుండానే ఆ వ్యాధి బారినపడి ప్రాణాలు కోల్పోతున్నట్లు ఉషాలక్ష్మి గమనించారు. ప్రాథమిక స్థాయిలోనే బ్రెస్ట్ కేన్సర్‌ను గుర్తించి సకాలంలో చికిత్స అందజేస్తే దానినుంచి బయటపడవచ్చునని గ్రహించారు. ఈ క్రమంలోనే 2007లో ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్‌ను స్థాపించి, ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవలందించడం ప్రారంభించారు. వైద్యవృత్తిలో, సామాజిక సేవారంగంలో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. దేశంలో మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపైన ప్రత్యేక అధ్యయనం చేశారు. ఉషాలక్ష్మి తనయుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ రఘురామ కూడా ఆమె చూపిన మార్గంలోనే నడిచారు. గత 17 ఏళ్లుగా తల్లి ఆశయ సాధనలో ముందుకు సాగుతున్నారు. కిమ్స్‌–ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఉన్నారు. అలాగే ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ఉషాలక్ష్మి అంత్యక్రియలు బుధవారం ఉదయం 10 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో జరుగుతాయని రఘురామ తెలిపారు.

## జార్ఖండ్ సీనియర్ పరిశీలకుడిగా భట్టి

**మహారాష్ట్ర సీనియర్ పరిశీలకులుగా ఉత్తమ్, సీతక్క**

**సాక్షి, న్యూఢిల్లీ:** మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్టానం పార్టీ పరిశీలకులను నియమించింది. జార్ఖండ్ వ్యవహారాల కోసం తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఏఐసీసీ సీనియర్ పరిశీలకుడిగా నియమించారు. ఆయనతో పాటు తారిఖ్ అన్వర్, అధిర్ రంజన్ చౌదరిలను కూడా ఏఐసీసీ సీనియర్ పరిశీలకులుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాక మహారాష్ట్రకు సంబంధించి 5 డివిజన్లకు 11 మంది సీనియర్ పరిశీలకులను నియమించారు. తెలంగాణ నుంచి మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్కలకు సీనియర్ పరిశీలకులుగా అవకాశం ఇచ్చారు. మరాఠ్వాడా డివిజన్‌కు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సచిన్ పైలట్.. ఉత్తర మహారాష్ట్ర డివిజన్‌కు సీతక్క, డా.సయ్యద్ నసీర్ హుస్సేన్.. ముంబై–కొంకణ్ డివిజన్‌కు అశోక్ గెహ్లాట్, డా.జి.పరమేశ్వర.. విదర్భ డివిజన్‌కు భూపేష్ భగేల్, చరణ్‌జీత్ సింగ్ ఛన్నీ, ఉమంగ్ సింగర్.. పశ్చిమ మహారాష్ట్ర డివిజన్‌కు టి.ఎస్.సింగ్ దేవ్, ఎం.బి.పాటిల్‌లను సీనియర్ పరిశీలకులుగా నియమించారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో ఓపీ స్పెషాలిటీ సేవలు

**సాక్షి, హైదరాబాద్:** ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో ఓపీ స్పెషాలిటీ వైద్య సేవలందించాలని సర్కారు నిర్ణయించింది. వారంలో ఐదు రోజుల పాటు ఈ సేవలను అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఈ మేరకు మంగళవారం అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలతో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి కేంద్రాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఎంపిక చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో ఈ స్పెషాలిటీ ఓపీ వైద్య సేవలను అందించనున్నారు. హైదరాబాద్ మినహాయించి మిగిలిన జిల్లాల్లో ఉన్న అన్ని బస్తీ దవాఖానాలతో పాటు మరికొన్ని యూపీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇందుకు సమీపంలోని జిల్లా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల నుంచి స్పెషలిస్టు వైద్యులను ఎంపిక చేయనున్నారు. వైద్యవిధాన పరిషత్, మెడికల్ కాలేజీల్లోని స్పెషాలిటీ వైద్యుల వివరాలివ్వాలని వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆ విభాగాధిపతులను కోరారు. డీఎంహెచ్‌వో ఆ ఆరోగ్యమందిరానికి ప్రతీరోజు ఒక స్పెషలిస్టు వైద్యుడిని పంపుతారు. ఇలా రొటేషన్ పద్ధతిలో స్పెషలిస్టు వైద్యుడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఓపీ చూస్తారని ఉన్నతాధికారులు వెల్లడించారు.



రాడార్ కేంద్రం వివరాలను కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం రేవంత్‌కు తెలియజేస్తున్న అధికారి. చిత్రంలో నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి, గడ్డం ప్రసాద్‌కుమార్, కొండా విశ్వేశ్వర‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, బండి సంజయ్ తదితరులు

# దేశ రక్షణలో రాజీలేదు

▶ మొదటి పేజీ తరువాయి

సభలో ఆయన మాట్లాడారు.

**సమాచారం, సాంకేతికత కీలకం**

'దేశ భద్రతలో అత్యంత కీలకమైన వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రం తెలంగాణలో ఏర్పాటు కానుండటంతో సంతోషంగా ఉంది. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం జరగడం కూడా ఆనందించాల్సిన విషయం. భారత రక్షణ రంగంలో డాక్టర్ కలాం అందించిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయి. భారత్‌కు కొత్త సైనిక సాంకేతికతను అందించడంతో పాటు, ఒక తరం శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ఆయన స్ఫూర్తినిచ్చారు. కొత్తగా నిర్మించనున్న రాడార్ స్టేషన్‌తో భారత నౌకాదళ సమాచార వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు సుదూర ప్రాంతాలకు విశ్వసనీయమైన, సురక్షితమైన సమాచారాన్ని అందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. విద్య, వైద్య రంగాల్లో సాంకేతికత కీలక భూమిక పోషిస్తుంది. కరోనా సమయంలోనూ అత్యవసర సేవలు సాఫీగా నడవడంలో సమాచారం, సాంకేతికత ఎంతో కీలకంగా వ్యవహరించాయి. భారతదేశం తన వాణిజ్య, భద్రతా ప్రయోజనాలను కాపాడుకోవాలంటే, బలమైన సముద్ర దళంగా ఉండాలంటే పటిష్టమైన సమాచార వ్యవస్థను కలిగి ఉండటం అవసరం..' అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు.

**భవిష్యత్తు కోసం నిర్ణయాలు ఉండాలి**

'పర్యావరణంపై ప్రాజెక్ట్ ప్రభావం లేకుండా చూస్తాం. పర్యావరణానికి హాని కలుగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తాం. దేశ రక్షణ, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావు ఉండొద్దు. దేశ భద్రతే ప్రధానం. ఏ పార్టీ ప్రభుత్వమైనా, ఐదేళ్లే అధికారంలో ఉన్నా..భవిష్యత్తు కోసమే నిర్ణయాలు తీసుకోవాలి. వీఎల్ఎఫ్ సెంటర్ ఏర్పాటులో సంపూర్ణ సహకారం అందించిన సీఎం రేవంత్‌రెడ్డికి, తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు. దేశ రక్షణ విషయానికి వస్తే అంతా ఏకమవుతామని ఈ రాడార్ కేంద్ర శంకుస్థాపనతో నిరూపితమైంది..' అని రక్షణ మంత్రి అన్నారు.



రాడార్ కేంద్రానికి భూమి పూజ చేస్తున్న రాజ్‌నాథ్‌సింగ్, రేవంత్. చిత్రంలో మంత్రి కొండా సురేఖ, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎంపీ విశ్వేశ్వర‌రెడ్డి

**దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకం**

'తెలంగాణకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, అభివృద్ధితో దేశంలో తెలంగాణ కీలక భూమిక పోషిస్తోంది. దేశ రక్షణ వ్యవస్థకు సంబంధించిన కీలక సంస్థలతోపాటు రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుంది. వీఎల్ఎఫ్ స్టేషన్ ప్రారంభమైతే స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడుతుంది..' అని రాజ్‌నాథ్ వివరించారు.

**అభివృద్ధి తప్ప ప్రకృతి అనర్థాలు లేవు: సీఎం**

దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయవద్దని ప్రతిపక్షాలకు సీఎం రేవంత్‌రెడ్డి హితవు పలికారు. వీఎల్ఎఫ్ సెంటర్ ఏర్పాటును కొందరు వివాదంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఈ రాడార్ కేంద్రం ఏర్పాటుతో దేశ రక్షణలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోందని చెప్పారు. ఇప్పటికే అనేక రక్షణ రంగ సంస్థలతో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రదేశంగా ఉందని గుర్తు చేశారు. తమిళనాడులోనూ 1990లో ఇలాంటిదే ప్రారంభించారు. అక్కడి ప్రజలకు ఎలాంటి నష్టం జరగలేదు. రెండో వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రం మన ప్రాంతంలో రావడం గర్వకారణం. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను తెలంగాణ సమాజం గుర్తించాలి. వివాదాలకు తెరలేపుతున్నవారు దేశ రక్షణ గురించి ఆలోచన చేయాలి. దీనికి భూ బదలాయింపు, నిధుల కేటాయింపు లాంటి నిర్ణయాలన్నీ 2017లో గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయి. దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్టును వివాదాస్పదం చేయడం సమంజసం కాదు. ఇక్కడ రామలింగేశ్వర స్వామి దర్శనానికి దారి వదలండి. విద్యా సంస్థల్లో స్థానికులకు అవకాశం కల్పించండి. వీఎల్ఎఫ్ కేంద్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని రక్షణశాఖ మంత్రికి నేను మాట ఇస్తున్నా..' అని సీఎం చెప్పారు. నౌకాదళ ముఖ్య అధికారి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి మాట్లాడుతూ.. భారత నావికాదళ కమ్యూనికేషన్ సామర్థ్యాలలో కొత్త అధ్యాయానికి ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటు నాంది పలుకుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి బండి సంజయ్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీలు కొండా విశ్వేశ్వర‌రెడ్డి, డీకే అరుణ, మండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రాజ్‌నాథ్‌కు సీఎం, కేంద్రమంత్రుల స్వాగతం

వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి బేగంపేటకు వచ్చిన రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎంపీ కొండా విశ్వేశ్వర‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి శంకుస్థాపనకు హెలికాప్టర్‌లో వెళ్లాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించకపోవడంతో అంతా రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత రాజ్‌నాథ్ సాయంత్రం 4.01 గంటలకు హెలికాప్టర్‌లో బేగంపేటకు చేరుకుని 4.18 గంటలకు విమానంలో ఢిల్లీ బయలుదేరివెళ్లారు.

## నేతల ముందస్తు అరెస్టులు



వికారాబాద్ ఠాణాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

- రాడార్ స్టేషన్ శంకుస్థాపనకు పోలీసుల బందోబస్తు
- అదుపులో ప్రజా సంఘాలు, జేఏసీ నాయకులు

**అనంతగిరి:** నేవీ రాడార్ కేంద్రం శంకుస్థాపన కార్యక్రమానికి వస్తున్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అడ్డుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పలువురు ప్రజా సంఘాలు, జేఏసీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. జేఏసీ నాయకులు గీత, మహేందర్, మహిపాల్, అశోక్ తదితరులను మంగళవారం ఉదయాన్నే వికారాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. దోమ మండలానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులను అరెస్టు చేశారు. పూడూరుకు చెందిన నాయకులను కూడా అదుపులోకి తీసుకున్నారు. కొడంగల్‌కు చెందిన బీసీ సేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కన్నోజు వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ కుల్కచర్ల మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, పరిగికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డితో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేశారు. వీరందర్నీ వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు అక్కడే ఉంచి తర్వాత వదిలిపెట్టారు.

### దామగుండం కాదు.. అది అగ్నిగుండం: ఎమ్మెల్సీ వాణీదేవి

దామగుండం ప్రాజెక్టుకు మూడు వేల ఎకరాల అటవీ స్థలం సేకరించాల్సి రావడం వల్ల పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి, మొత్తంగా మానవాళికి ఎంతో హాని కలుగుతుందని ఎమ్మెల్సీ వాణీదేవి మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని కాలరాస్తే ఎలా?అని ఆమె ప్రశ్నించారు.

## కానరాని కాన్వాయ్.. సీఎం అసహనం

**రాజ్‌నాథ్‌సింగ్ కారులోనే హెలిపాడ్ వద్దకు**

**వికారాబాద్:** నేవీ రాడార్ పనులకు శంకుస్థాపన అనంతరం తిరిగి వెళ్లేటప్పుడు కాన్వాయ్ రాకపోవడంపై సీఎం రేవంత్ భద్రత సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. నేవీ రాడార్ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ఒకే కాన్వాయ్‌లోని వేర్వేరు వాహనాల్లో దామగుండం వచ్చారు. కార్యక్రమం అనంతరం తిరుగు ప్రయాణంలో కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకోవాలి. ఈ క్రమంలో రాజ్‌నాథ్‌సింగ్ తన కాన్వాయ్‌లో ఎక్కారు. కానీ సీఎం కాన్వాయ్ అక్కడికి చేరు కోలేదు. ఈ విషయమై రేవంత్ తన భద్రత సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. చివరికి రక్షణమంత్రి కారులోనే హెలిపాడ్ వద్దకు చేరుకుని, వేర్వేరు హెలికాప్టర్లలో హైదరాబాద్ వెళ్లారు.


## బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా ఇబ్రాం శేఖర్

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నూతన స్టేట్ కో–ఆర్డినేటర్‌గా ఇబ్రాంశేఖర్ నియమితుల య్యారు. గతంలో తెలంగాణకు ఒక కో – ఆర్డినేటర్ మాత్రమే ఉండేవారు. ఈసారి బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఆధ్వర్యంలో ఇద్దరు కో–ఆర్డినేటర్లుగా ఇబ్రాం శేఖర్, ఈశ్వర్‌లను నియమించిందని బీఎస్పీ సెంట్రల్ కో–ఆర్డినేటర్ రాంజీ గౌతమ్ వెల్లడించారు.

## దామగుండం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ తీరు బాధ్యతారాహిత్యం

**దేశ భద్రత, రక్షణ విషయంలోనూ ఇదే తీరు**

- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజం



**సాక్షి, హైదరాబాద్:** దామగుండం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీతో పాటు, కేసీఆర్ కుటుంబం బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. దేశ భద్రత, రక్షణ విషయంలో బీఆర్ఎస్ మొదటి నుంచీ బాధ్యతారాహిత్యంతో ప్రవర్తించడం ఆ పార్టీ దివాలాకోరుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నపుడు ఒకమాట.. ప్రతిపక్షంలో ఉన్నపుడు మరోమాట మాట్లాడటం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందన్నారు. రాడార్ సెంటర్‌పై గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా మాజీమంత్రి కేటీఆర్ ఆందోళన చేస్తారని భావించాలా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో జీవోలు విడుదల చేసి, ఈ ప్రాజెక్టు పనులు మొదలు పెట్టగానే సికింద్రాబాద్‌లోని బైసన్‌పోల్‌లో ల్యాండ్ సెక్రటేరియట్ కోసం ఇవ్వాలని, అప్పుడే పంచనామా చేసి భూమి కేటాయిస్తామని మెలిక పెట్టారని గుర్తు చేశారు. పద్నాలుగేళ్ల తర్వాత అనేక చర్చల తర్వాత, అన్ని అనుమతులు పొందాక కొందరు ఆందోళనలు చేయడం సరికాదని హితవు పలికారు.

**రాష్ట్రానికి ఈ ప్రాజెక్టు రావడం శుభసూచకం**

దేశ భద్రత, రక్షణ శాఖకు సంబంధించి మరో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు తెలంగాణకు రావడం శుభసూచకమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భారత నౌకాదళ వెరీలో ఫ్రీక్వెన్సీ (వీఎల్ఎఫ్) కమ్యూనికేషన్ ట్రాన్స్ మిషన్ స్టేషన్ వికారాబాద్‌లో ఏర్పాటు కావడం సరైనదేనని చెప్పారు. ఈ అటవీ ప్రాంతంలో చెట్లు, రక్షణ కోసం రూ.130 కోట్లు అటవీ శాఖకు రక్షణశాఖ కేటాయించిందని తెలిపారు. 209 ఎకరాల్లో కొంత ప్రాంతంలో రాడార్ వ్యవస్థలో పనిచేసే నేవీ సిబ్బందికి వసతి ఏర్పాటు చేస్తారని వెల్లడించారు. అక్కడి రామలింగేశ్వరస్వామి ఆలయానికి మరిన్ని సౌకర్యాలు కల్పించేలా రక్షణ శాఖతో సంప్రదిస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో లక్షా 95 వేల చెట్లు ఉన్నాయని, ఇందులో 1,500 చెట్లను మాత్రమే రీలొకేట్ చేస్తారని వివరించారు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్?

**కార్పొరేషన్ చైర్మన్‌లకు అధిష్టానం పచ్చజెండా!**

- ఇప్పటికే 26 మందితో జాబితా
- రెండ్రోజుల్లో ఉత్తర్వులకు అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం ఢిల్లీ వెళ్లే అవకాశాలున్నాయి. పర్యటన ఖరారు కానప్పటికీ.. బుధవారం సాయంత్రం ఆయన హస్తిన వెళ్లవచ్చని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో.. పార్టీ అధిష్టానంతో పలు అంశాలపై చర్చించేందుకు ఆయన ఢిల్లీ వెళ్తారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. అయితే, దసరా ముందే రెండో విడత కార్పొరేషన్ చైర్మన్ల జాబితా విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ హరియాణా, కశ్మీర్ ఎన్నికల ఫలితాలతో ఆలస్యం జరిగిందని, ఈసారి సీఎం ఢిల్లీ పర్యటన జరిగితే కార్పొరేషన్ చైర్మన్ పదవులకు ఆమోదం వచ్చినట్టేనన్న చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. మొత్తం 26 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ జాబితా సిద్ధంగా ఉందని సమాచారం. ఇందులో ఎమ్మెల్యేలతో పాటు పలువురు సీనియర్ నాయకులున్నారని, రెండు రోజుల్లో ఈ కార్పొరేషన్ చైర్మన్ల జాబితాను అధికారికంగా ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది.

## మనం ఇప్పుడు కూడా మేలుకోకపోతే ఎలా?



గాంధీభవన్‌లో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశంలో రోహిత్‌రావు, దామోదర రాజనర్సింహ, దీపాదాస్ మున్షీ, మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్ తదితరులు

- బీఆర్ఎస్ ఓటుబ్యాంకు పార్లమెంట్ ఎన్నికల్లోనే బీజేపీ వైపు వెళ్లింది
- ఇన్‌చార్జ్‌లపై ఫిర్యాదులొస్తున్నాయి.. ఓ మెట్టు దిగండి.. కార్యకర్తలతో కలిసిపొండి
- మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ నేతలకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ నిర్దేశం

**సాక్షి, హైదరాబాద్:** 'గత పార్లమెంట్ ఎన్నికల సమయంలోనే బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీ వైపు మళ్లింది. మనం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఆ ఓటు బ్యాంకును మనవైపు ఆకర్షించుకునే పని చేయలేకపోతున్నాం. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలోనైనా మనం కళ్లు తెరవాలి. పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసుకోవాలి. ఆ దిశలో ఆయా జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి.' అని ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన పార్టీ నేతలకు టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ దిశానిర్దేశం చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఒక మెట్టు దిగి పనిచేయాలని, కార్యకర్తలను కలుపుకొని పోవాలని సూచించారు. మంగళవారం గాంధీభవన్‌లో మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల సమీక్ష సమావేశాలు విడివిడిగా జరిగాయి. ఈ సమావేశాల్లో భాగంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆలోచనలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అన్ని కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలోని పార్టీ కేడర్‌ను కలుపుకొని పనిచేయడంలో కొందరు ఇన్‌చార్జ్‌లు విఫలమవుతున్నారని, ఈ మేరకు తమకు ఫిర్యాదులు కూడా వస్తున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని, ఇందుకోసం గ్రామస్థాయి నుంచి పార్టీ కేడర్‌ను కదిలించాలని చెప్పారు. ఇందిరమ్మ కమిటీల్లో గ్రామస్థాయి నేతలకు స్థానం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. మెదక్ లాంటి జిల్లాల్లో కేసీఆర్, హరీశ్‌రావు లాంటి పెద్ద నేతలున్నారని, అలాంటి జిల్లాల్లో ఫలితం చూపెట్టినప్పుడే నాయకులుగా ఎదుగుతారని చెప్పారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేసినా తమకు నష్టమేమీ లేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో చూపాలని కోరారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ నిజమైన పార్టీ కార్యకర్తలకు పదవులు దక్కేలా పీసీసీ నుంచి మండల స్థాయి వరకు నేతలందరూ పనిచేయాలని కోరారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలతోపాటు ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, రోహిత్‌రావు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మాజీ మంత్రులు ఎ.చంద్రశేఖర్, ఇంద్రకరణ్‌రెడ్డి, పార్టీ నేతలు బండారి శ్రీకాంత్, దండె విఠల్‌లతో పాటు డీసీసీ అధ్యక్షులు, ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## భూములు లాక్కున్నారు.. కబ్జాలు చేశారు

- మంత్రితో ముఖాముఖిలో సీతక్కకు ఫిర్యాదుల వెల్లువ
- వినతులు తీసుకుని భరోసా కల్పించిన మంత్రి



ముఖాముఖిలో ప్రజాసమస్యలను వింటున్న మంత్రి సీతక్క


**సాక్షి, హైదరాబాద్:** తమ భూములు లాక్కున్నారని.. కబ్జా చేశారని, వాటిని తిరిగి తమకు ఇప్పించాలని కోరుతూ పలువురు ప్రజలు మంగళవారం గాంధీభవన్‌కు వచ్చారు. మంత్రితో ముఖాముఖిలో భాగంగా గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలు తమ వినతులను మంత్రి సీతక్కకు సమర్పించారు. గ్రామంలో కొత్త అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, 98 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలని, అవినీతి ఆరోపణలున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ కార్యకర్తలకే అవకాశం కల్పించాలని, బీఆర్ఎస్ హయాంలో తమపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ పలువురు సీతక్కకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ అర్జీలను స్వీకరించిన సీతక్క నిబంధనల మేరకు పరిష్కారానికి అనువుగా ఉన్న దరఖాస్తులపై ఆయా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. మంగళవారం జరిగిన మంత్రితో ముఖాముఖిలో మొత్తం 160 దరఖాస్తులు రాగా, అందులో ఆయా జిల్లాల కలెక్టర్లకు 34, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన దరఖాస్తులు 41, ఇందిరమ్మ ఇళ్ల కోసం 29, కాంగ్రెస్ కార్యకర్తల పక్షాన ఏడు, పలువురు మంత్రులకు 48 దరఖాస్తులు వచ్చినట్టు టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి.

**భూమి, పింఛన్ల కోసం వచ్చారు: సీతక్క**

భూమికి సంబంధించిన సమస్యలు, పింఛన్ల కోసం వికలాంగులు వచ్చారని మంత్రి సీతక్క చెప్పారు. మంత్రితో ముఖాముఖి కార్యక్రమం సందర్భంగా గాంధీభవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, అన్ని వినతులను తీసుకున్నామని, త్వరలోనే పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు. దామగుండం ప్రాజెక్టుకు అనుమతిస్తూ జీవో వచ్చింది బీఆర్ఎస్ హయాంలోనేనని, ఇప్పుడు కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో బీజేపీ మొసలి కన్నీరు కారుస్తోందని చెప్పారు. బీజేపీది గాడ్సే సిద్ధాంతమైతే కాంగ్రెస్ పార్టీది గాంధీ సిద్ధాంతమని, ఆ రెండు పార్టీలు ఎప్పటికీ ఒక్కటి కావని సీతక్క పేర్కొన్నారు.

## సంస్థాగత ఎన్నికలకు బీజేపీ సన్నాహాలు

- జాతీయ రిటర్నింగ్ అధికారిగా లక్ష్మణ్
- జనవరిలో బీజేపీ అధ్యక్ష ఎన్నిక



**సాక్షి, న్యూఢిల్లీ:** భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో నలుగురు రిటర్నింగ్ ఆఫీసర్లను అధిష్టానం నియమించింది. జాతీయ రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటు బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఉత్తర్వులు జారీ చేశారు. కో–రిటర్నింగ్ ఆఫీసర్లుగా ఎంపీలు నరేష్ బన్సల్, డాక్టర్ సంబిత్ పాత్ర, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు రేఖా వర్మలను నియమించారు. వీరి ఆధ్వర్యంలోనే సంస్థాగత ఎన్నికలు జరుగుతాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

**జనవరిలో బీజేపీకి కొత్త అధ్యక్షుడు?**

దేశవ్యాప్తంగా చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తయింది. క్రియాశీల సభ్యత్వాల తర్వాత.. మండల, జిల్లా స్థాయి పార్టీ అధ్యక్షుల నియామకాలు చేపడతారు. తర్వాత.. రాష్ట్రాల్లో పార్టీకి కొత్త అధ్యక్షుల నియామకం, ప్రస్తుతం ఉన్న వారి కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తికి రెండు నెలలు పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాత.. జాతీయ అధ్యక్షుడి ఎంపిక ఉంటుంది. జాతీయ అధ్యక్షుడి ఎంపికకు దేశంలోని సగం రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు పూర్తి కావలసి ఉంటుంది. అయితే.. ప్రస్తుత బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీ కాలం పూర్త యినా ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో.. ఆయన పదవీ కాలాన్ని గత జూన్ నెల వరకు పొడిగించారు. ఆ తర్వాత కూడా ఆయన కొన సాగుతున్నారు. సంస్థాగత ఎన్నికల తర్వాత జనవరిలో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సాక్షి
# హైదరాబాద్

బుధవారం । 16 । అక్టోబర్ । 2024






## బెట్టింగ్‌లతో అప్పులు...

బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పుల పాలై వాటి నుంచి గట్టెక్కేందుకు చోరీకి పాల్పడిన ఇద్దరు యువకులను గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు అరెస్ట్ చేశారు. -10లో



## ఓల్డే.. గోల్డు..

ఆభరణాలు ధరించడంలో అతివలు ఇప్పుడు రూటు మారుస్తున్నారు. 'పాతే వింత' అంటూ.. మోటుగా ఉంటాయంటూ తీసి పారేసిన నగల్నే మోజుగా ఆదరిస్తున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0/24.0

## వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది.



# ఆమ్రపాలి.. ఆంధ్రాకే !

### క్యాట్‌లో దక్కని ఊరట

- నేడు ఏపీలో రిపోర్టు చేయాల్సిందే..

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర విభజన సందర్భంగా ఎవరికి కేటాయించిన రాష్ట్రాలకు వారు వెళ్లాల్సిందేనని ఇటీవల డీవోపీటీ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ మరికొందరు ఐఏఎస్ అధికారులతోపాటు ఆమ్రపాలి కూడా క్యాట్‌ను ఆశ్రయించగా, బుధవారంలోగా ఏపీలో రిపోర్టు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో ఆమె ఏపీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్యాట్ ఈ నిర్ణయంతో ఏపీకి వెళ్లాల్సిన వారు బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. డీవోపీటీ ఆదేశాల కనుగుణంగా యథావిధిగా ఏపీలో రిపోర్టు చేయాలని క్యాట్ ఆదేశించడంతో, హైకోర్టు ఎలాంటి ఆదేశాలిస్తుందో తెలియనందున ముందైతే ఏపీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల వరకు వేచి చూడనున్నారు. ఏపీకి వెళ్లినా, రెండు రాష్ట్రాల పరస్పర అవసరాలు, ఒప్పందాలతో తిరిగి తెలంగాణకు రప్పించే అవకాశాలూ ఉంటాయనే ప్రచారం మొదలైంది.

**బల్దియా బాస్ ఎవరో..**

మరోవైపు, ఆమ్రపాలి స్థానంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఎవరిని నియమించనున్నారనేది జీహెచ్ఎంసీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. సీనియర్ ఐఏఎస్‌ను నియమిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జీహెచ్ఎంసీ గురించి, నగర నైసర్గిక స్వరూపం గురించి పూర్తిస్థాయి అవగాహన ఉన్నవారిని నియమించగలరనే ఊహాగానాలు సాగుతున్నాయి. ప్రస్తుతమున్న జీహెచ్ఎంసీని మూడు లేదా నాలుగు కార్పొరేషన్లుగా మారుస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, ఆ ప్రక్రియ జరిగేంతదాకా సీనియర్ ఐఏఎస్ అధికారి అవసరమని అర్బన్‌ప్లానింగ్ నిపుణులు అంటున్నారు. ఎక్కువ కార్పొరేషన్లుగా విభజన జరిగాక ఎవరున్నప్పటికీ, కొత్త కార్పొరేషన్లు ఏర్పాటయ్యేంత వరకు తగిన అనుభవమున్న సీనియర్ ఉండాలంటున్నారు. 2025 చివర్లో, లేదా 2026 ఆరంభంలో జీహెచ్ఎంసీ పాలకమండలి ఎన్నిక లోగా కొత్త కార్పొరేషన్లు ఏర్పాటయ్యే అవకాశమున్నందున, అప్పటి వరకు సీనియర్ అధికారి అవసరమంటున్నారు. ప్రస్తుతానికి..కొంత కాలం వరకు ఎవరైనా సీనియర్ అధికారికి జీహెచ్ఎంసీ ఇన్‌ఛార్జిగా కూడా బాధ్యత లప్పగించవచ్చుననే అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

## హిమాయత్‌సాగర్‌కు కొనసాగుతున్న వరద



బండ్లగూడ: ఎగువ ప్రాంత్రాలలో కురుస్తున్న వర్షాలకుగాను హిమాయత్‌సాగర్ జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో మంగళవారం ఉదయం మరోమారు ఒక గేటు ఫీటు మేర ఎత్తి దిగువ ప్రాంతంలోకి నీటిని వదిలారు. జలాశయం పూరి స్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు కాగా సాయంత్రం వరకు జలాశయం నీటిమట్టం కూడా అంతే ఉంది. ఇన్‌ఫ్లో 348 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 350 క్యూసెక్కులు ఉందని జలమండలి డీజీఎం గోవింద్ గౌడ తెలిపారు.

## 31లోగా ప్రభుత్వ భూములపై సర్వే నివేదిక సమర్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటాచారి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ నెల 31లోగా నివేదికలు సమర్పించాలని హైదరాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో మండలాల సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల వారీగా సర్వే పనులు, నివేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ మండలంలో కూడా సర్వే పనులు పెండింగ్‌లో ఉండకూడదని, అర్జీదారుల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సర్వే విధులు నిర్వహించాలని సూచించారు. అన్ని మండలాలలోని ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత స్థలంలో కొలతలు వేయాలని, వివరంగా మ్యాపులు తయారుచేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్లు రాజేశం, బుచ్చయ్య మహేందర్ రెడ్డి, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి చెత్త తొలగింపునకు స్పెషల్ డ్రైవ్



లక్డీకాపూల్: హైదరాబాద్‌ను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడానికి జీహెచ్ఎంసీ విశేష కృషి చేస్తోంది. ఈ మేరకు నగరంలో గుట్టలుగా పడిఉన్న లెగసీ వేస్ట్ (పేరుకుపోయిన చెత్త) తొలగింపునకు 21 రోజుల కార్యాచరణను జీహెచ్ఎంసీ రూపొందించింది. తొలిగా బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం నవంబర్ 8వ తేదీ వరకు కొనసాగుతుంది. నగరంలో చెత్త రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, జీహెచ్ఎంసీ వినూత్న ఆలోచనలతో పరిశుభ్రమైన నగరాన్ని తయారు చేసేందుకు చర్యలు చేపడుతోంది. ప్రస్తుత ప్రణాళికల్లో లెగసీ వేస్ట్ తొలగింపుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నగరంలోని రహదారులు, డ్రైన్లు, పార్కులు, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ పనుల కారణంగా పేరుకుపోయిన చెత్తను సక్రమంగా తొలగించేందుకు సర్కిల్ స్థాయిలో ఈ డ్రైవ్‌ను చేపడుతున్నారు. ఈ క్రమంలో లేగసీ వేస్ట్‌తో పాటు భవన నిర్మాణ వ్యర్థాలను కూడా తొలగించేందుకు సర్కిల్ స్థాయిలో జేసీబీలు, తరలింపు వాహనాలు, మానవ వనరులను వినియోగిస్తారు. ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు ట్రాక్ చేసేందుకు అధికారులు జీపీఎస్ సిస్టంను ఉపయోగించాలని నిర్ణయించారు.

## కొలువుల్లో

# కొత్త సార్లు

### డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్‌లు



డీఎస్సీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

- నేడు విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులు
- గ్రేటర్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో తీరనున్న కొరత

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో కొత్తగా ఎంపికైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు పోస్టింగ్ లభించింది. డీఎస్సీ-2024లో ఎంపికై నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా విద్యాశాఖ పోస్టింగ్‌లను కేటాయించింది. హైదరాబాద్ జిల్లాలో 584 మంది అభ్యర్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరంతా బుధవారం నుంచి విధుల్లో చేరనున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇక ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

- హైదరాబాద్ జిల్లాలో మొత్తం 878 పోస్టులకుగాను కోర్టు కేసులు, రిజర్వేషన్ కేటగిరీలో అభ్యర్థుల కొరత, ఇన్ సర్వీస్ తదితర కారణాలతో సుమారు 262 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో పడింది. మిగతా 616 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ ధ్రువీకరణ పత్రాల రీ వెరిఫికేషన్‌తో 32 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు నిలిపివేశారు. మొత్తం మీద 584 మంది అభ్యర్థులకు మాత్రమే నియామక పత్రాలను అందజేశారు. అందులో 386 ఎస్జీటీ, 107 ఎస్ఏ, 91 ఎల్‌పీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు లభించాయి.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 109 ఖాళీలకు పరీక్ష నిర్వహించగా 82 మంది టీచర్లుగా ఎంపికయ్యారు. వీరందరికి మంగళవారం కౌన్సెలింగ్ ద్వారా అధికారులు పాఠశాలలను కేటాయించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. విద్యార్థులు ఉండి ఉపాధ్యాయుల కొరత ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఆ సమస్య తీరే అవకాశముంది. డీఎస్సీ-2024లో టీచర్లుగా ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలను కేటాయించామని, వీరంతా బుధవారం నుంచి వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరుతారని డీఈఓ వెల్లడించారు.
- రంగారెడ్డి జిల్లాలో మొత్తం 334 మంది అభ్యర్థులకు అధికారులు పోస్టింగ్‌లు ఇచ్చారు. కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు హాజరై నియామక పత్రాలు అందుకున్నారు. వీరంతా కేటాయించిన పాఠశాలల్లో బుధవారం చేరుతారు.

# వాణిజ్య భవనాలకు సిల్ట్ చాంబర్లు తప్పనిసరి..!

### సీవరేజీ ఔట్‌లెట్ లేనందునే మురుగు సమస్యలు

- పురాతన మ్యాన్‌హోల్స్ లోపల ప్లాస్టరింగ్
- ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల పునరుద్ధరణ
- జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: వాణిజ్య భవన సముదాయాల సీవరేజీ కనెక్షన్లకు సిల్ట్ చాంబర్లు తప్పనిసరని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. హాస్పిటళ్లు, హాస్టళ్లు తదితర వాణిజ్య భవనాలు కూడా సిల్ట్ ఛాంబర్స్ నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన సీవరేజీ ఓవర్ ఫ్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎల్బీనగర్, నాగోల్ ప్రాంతాల్లో కొనసాగుతున్న డీ-సిల్టింగ్, సీవరేజీ, మ్యాన్‌హోళ్ల పునరుద్ధరణ పనులను పరిశీలించారు. గతంలో జీహెచ్ఎంసీ ఓల్డ్ నాగోల్‌లో నిర్మించిన సీవరేజీ లైన్లను రెయిన్ వాటర్ డ్రైన్లకు అనుసంధానం చేయడంతో సమస్య ఎదురైనట్లు గుర్తించారు. వర్షాకాలంలో రెయిన్ వాటర్ డ్రైన్లకు డీ-సిల్టింగ్ పనులు చేపట్టకపోవడంతో మురుగు పొంగి రోడ్లపైకి వస్తుందన్నారు. సమస్య పరిష్కారానికి కొత్త సీవరేజీ పైపులైన్ నిర్మించి మూసీలో ఉన్న సీవరేజీ ట్రంక్ మెయిన్‌కు అనుసంధానించాలని అధికారులకు సూచించారు. పైపులైన్ నిర్మాణానికి సర్వే నిర్వహించి అంచనాలు రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

**కాలనీల్లో సీవరేజీ ఔట్‌లెట్లు**

కాలనీలో సీవరేజీ సమస్య పరిష్కారానికి ఔట్‌లేట్లు నిర్మించాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. ఎల్బీనగర్ లోని వాస్తు కాలనీ, హోటల్ స్వాగత్ గ్రాండ్ పరిసర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పరిస్థితులను పరిశీలించారు. సుమారు 15 కాలనీల్లో చాలా కాలంగా సీవరెజీ ఔట్ లెట్ లేక మురుగు సమస్యలు తలెత్తుతున్నట్లు గుర్తించారు. సమస్య పరిష్కారానికి ఔట్ లెట్ నిర్మించాలని సూచించారు. తక్షణ చర్యగా మ్యాన్ హోళ్లలో పూడికతీత, సిల్ట్ తొలగింపు, ధ్వంసమైన వాటిని పునర్మించే పనులు చేపట్టాలని ఆదేశించారు.

**పాత మ్యాన్‌హోళ్లకు ప్లాస్టరింగ్**

పాత మ్యాన్‌హోళ్లలో ప్లాస్టరింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శివారు ప్రాంతాల్లో సీవరేజీ నిర్వహణ జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నప్పుడు కొన్ని ప్రాంతాల్లో నిర్మించిన మ్యాన్ హోళ్లలో లోపలి వైపున ప్లాస్టరింగ్ చేయకుండా వదిలిపెట్టడంతో అందులో పూడిక పెరిగిపోతున్న తెలిపారు. ఇది క్రమంగా పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా పాత మ్యాన్ హోల్స్‌ను గుర్తించి వాటికి లోపలి వైపున ప్లాస్టరింగ్ పూర్తి చేయాలని సూచించారు.

**సీవరేజీ పైప్‌లైన్ల అప్‌గ్రేడ్‌కు నోటీసులు**

పాత ఇళ్ల స్థానంలో నిర్మించుకున్న బహుళ అంతస్తుల భవనాల సీవరేజీ కనెక్షన్ల అప్‌గ్రేడ్ తప్పనిసరి అని జలమండలి ఎండీ స్పష్టం చేశారు. కొన్ని భవన సముదాయాల కొత్త సీవరెజీ పైపులైన్ నిర్మించుకోకుండా పాతవాటినే ఉపయోగిస్తున్నారన్నారు. దీనివల్ల కూడా మురుగు సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. పాత సీవరెజీ పైప్ లైన్లలను అప్ గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. ఇలాంటి గుర్తించి అవసరమైన మేరకు సీవరెజీ పైప్‌లైన్‌లను అప్ గ్రేడ్ చేసుకోవాలని నోటీసులు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, సీజీఎం నాగేందర్, జీఎంలు, డీజీఎంలు తదితరులు పాల్గొన్నారు.



స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

## యువతిపై ఆటోడ్రైవర్

# లైంగిక దాడి

### అర్ధరాత్రి రోడ్డు పక్కన ఆటో ఆపి అఘాయిత్యం

- గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు. కేసు నమోదు
- నిందితుడిని అరెస్టు చేసిన ఎస్‌వోటీ పోలీసులు

గచ్చిబౌలి: హెచ్‌సీయూ రోడ్డులో అర్ధరాత్రి చెన్నైకి చెందిన యువతిపై ఓ ఆటో డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి (32) ఫిర్యాదు ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు చెన్నైలోని సీఎంబీటీ బస్ టెర్మినల్ నుంచి బస్సులో యువతి హైదరాబాద్‌కు బయలుదేరింది. ఆర్సీపురం బస్టాప్‌లో దిగి బీహెచ్ఈఎల్ వద్ద నానక్‌రాంగూడ వెళ్లాలని చెప్పి ఓ ఆటోలో ఎక్కింది. అర్ధరాత్రి 1.30 గంటలకు అక్కడి నుంచి ఆటో బయలుదేరింది. కొద్ది నిమిషాలకు హెచ్‌సీయూ రోడ్డులో మసీద్‌బండ ఆర్చ్ దాటగానే డ్రైవర్ ఆటోను పక్కకు ఆపాడు. అనుమానం రావడంతో యువతి దిగేందుకు ప్రయత్నించగా గొంతు పట్టుకొని దాడి చేసి బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆటో నుంచి శబ్దం రావడంతో బైక్‌పై వెళ్తున్న జొమాటో డెలివరీ బాయ్, మరికొంత మంది వాహనదారులు ఆగడంతో నిందితుడు ఆటోతో పరారయ్యాడు. వారు డయల్ 100కు కాల్ చేసి యువతిని గచ్చిబౌలి పీఎస్‌కు చేర్చారు. తలకు, గొంతుకు గాయాలు కావడంతో పోలీసులు కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. ప్రత్యేక బృందాలు నిందితుడి కోసం గాలిస్తున్నాయి. ఆటోను గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అయితే తాను నానక్‌రాంగూడలో ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నానని యువతి చెప్పిన వివరాల ఆధారంగా ప్రాథమిక దర్యాప్తు చేసిన పోలీసులకు ఎలాంటి వివరాలు లభించలేదని సమాచారం. అంతేకాకుండా బాధితురాలు ఇచ్చిన తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు కూడా పనిచేయడం లేదని పోలీసులు తెలిపారు. యువతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే బాధితురాలు వైద్య పరీక్షలకు సహకరించకపోవడంతో కౌన్సెలింగ్ నిర్వహించి ఒప్పించినట్లు సమాచారం.

**నిందితుడి అరెస్టు**

కాగా మంగళవారం రాత్రి నిందితుడిని ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. బోరబండకు చెందిన ఆటోడ్రైవర్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు గుర్తించి వేట ప్రారంభించారు. పక్కా సమాచారంతో అరెస్టు చేసి విచారిస్తున్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి. కాగా లైంగిక దాడి ఘటనను మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



హెచ్‌సీయూ రోడ్డులో ఘటన జరిగిన ప్రాంతం

# బాలిక కిడ్నాప్..హత్య

### సూరారంలో కిడ్నాప్ చేసి బాసిరేగడిలో శవాన్ని పడేసిన వైనం..

- తెలిసిన వ్యక్తే కిడ్నాపర్‌గా గుర్తింపు



జోత్స్న (ఫైల్)

సుభాష్‌నగర్/మేడ్చల్‌రూరల్: సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన ఏడేళ్ల బాలిక మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాసిరేగడిలో శవమై తేలింది. బాలికను అపహరించుకు వెళ్లిన దుండగుడు బాలికను హతమార్చిన ప్రాంతాన్ని పోలీసులకు చూపడంతో మృతదేహం లభ్యమైంది. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ జిల్లా కొంకణి చెందిన ప్రభాకర్, సుమ దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి సూరారంలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 12న రాత్రి వీరి పెద్ద కుమార్తె జోత్స్న(7) అదృశ్యమవడంతో సూరారం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని 4 బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. పలు ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు పరిశీలించగా..ప్రభాకర్ కుటుంబంతో పరిచయం ఉన్న తిరుపతి అనే వ్యక్తి బాలికను ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు అతని కోసం గాలింపు చేపట్టి మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకుని విచారించగా..బాలికను బాసిరేగడి గ్రామ శివార్లలో హత్య చేసి గోనె సంచిలో కుక్కి ముళ్ల పొదల్లో పడేసినట్లు తెలిపాడు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సూరారం, మేడ్చల్ పోలీసులు నిందితుడిని వెంట తీసుకువచ్చి అతడు చూపిన ప్రదేశంలో పరిశీలించగా బాలిక మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పరిశీలించి అదృశ్యమైన చిన్నారేనని నిర్ధారించుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా నిందితుడు తిరుపతిది కూడా ఆదిలాబాద్ జిల్లా కొంకణి గ్రామమని, ఇతను తరచుగా ఇక్కడికి వస్తూ పోతుండే వాడని స్థానికులు తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.



బాసిరేగడి సమీపంలో సంఘటన స్థలాన్ని పోలీసులకు చూపుతున్న నిందితుడు

# 'లైట్‌హౌస్'కు మరో మోడల్ మార్కెట్

### మల్లేపల్లి మోడల్ మార్కెట్‌ను లీజుకివ్వనున్న జీహెచ్ఎంసీ

- యువత, మహిళల ఉపాధి శిక్షణ కోసం వినియోగం





సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఖాళీగా ఉన్న మరో మోడల్ మార్కెట్‌ను ప్రైవేట్ ఫౌండేషన్‌కు లీజుకిచ్చేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. నిరుద్యోగ యువతకు, ఆసరా లేని మహిళలకు తగిన నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి కల్పించేందుకు ఇప్పటికే శేరిలింగంపల్లి జోన్ చందానగర్‌లో ఒక మోడల్ మార్కెట్‌ను లీజుకు పొంది శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న లైట్‌హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్‌కే ఖైరతాబాద్ జోన్‌లోని మల్లేపల్లిలో ఉన్న మరో మోడల్‌హౌస్‌ను లీజుకిచ్చేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. మల్లేపల్లి ప్రాంతంలో స్లమ్స్ ఎక్కువగా ఉన్నందున అక్కడి పేద కుటుంబాల్లోని యువత, మహిళలకు ఆయా రంగాల్లో తగిన నైపుణ్యశిక్షణనందించడం ద్వారా ఉపాధి కల్పిస్తామనే హామీతో లైట్‌హౌస్ ఫౌండేషన్ ముందుకు రాగా, జీహెచ్ఎంసీ అందుకు సుముఖత వ్యక్తం చేసింది. ఈ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుతో పరిసరాల్లోని దాదాపు 8,400 కుటుంబాలకు ఇది సదుపాయంగా ఉంటుందని జీహెచ్ఎంసీ చెబుతోంది. శిక్షణకయ్యే వ్యయాన్ని లైట్‌హౌస్ ఫౌండేషన్ సీఎస్సార్ కార్యక్రమం కింద భరించనుంది. జీహెచ్ఎంసీతో కలిసి పీపీపీ విధానంలో అర్హులైన నిపుణుల ద్వారా నిరుద్యోగులకు తగిన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనుంది.

కంప్యూటర్‌కు సంబంధించిన శిక్షణతో పాటు మహిళలకు ఉపకరించే బ్యూటీషియన్, టైలరింగ్ తదితర అంశాల్లో శిక్షణనిస్తారు. యువత ఉద్యోగాలు పొందేందుకు వారిని మానసికంగా తగిన విధంగా సిద్ధం చేయడంతో పాటు, దరఖాస్తు చేసే విధానం నుంచి ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాల్లోనూ తగిన గైడెన్స్ ఇస్తారని అధికారులు పేర్కొన్నారు. తొలుత ఏడాది వరకు మాత్రం ఒప్పందం కుదుర్చుకుంటారు. పనితీరు, ఫలితాల్ని బట్టి పొడిగింపులుంటాయి. మొదటి సంవత్సరం శిక్షణ పొందిన వారందరికీ నూరుశాతం ఉపాధి, ఉద్యోగాలు లభిస్తేనే తదుపరి పొడిగింపు లుండేలా జీహెచ్ఎంసీ షరతు విధించనుంది. ఒప్పందం కుదిరాక తొలి ఏడాది దాదాపు 600 మందికి శిక్షణ ఇవ్వాలనేది నిబంధన. వీరిలో 50 శాతం మంది మహిళలకు అవకాశం కల్పించాలి. ఈ ప్రతిపాదనలకు జీహెచ్ఎంసీ స్టాండింగ్‌కమిటీ ఆమోదం లాంఛనప్రాయమే. ఇటీవలే బొల్లారం మార్కెట్‌లోని మోడల్ మార్కెట్‌ను పీపీపీ కిందే, ఇవే నిబంధనలతో డాక్టర్ విజయ్‌కుమార్ దాట్ల ఫౌండేషన్‌కు ఇచ్చేందుకు జీహెచ్ఎంసీ ఆమోదం తెలిపింది. దాదాపు 40 మోడల్‌మార్కెట్ల నిర్మాణమైతే పూర్తిచేసిన జీహెచ్ఎంసీ,వాటిని వినియోగంలోకి తేవడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో ఒక్కటొక్కటిగా మోడల్ మార్కెట్లను శిక్షణ కార్యక్రమాల పేరిట ప్రైవేటుకు లీజుల కిస్తుండటం ఏ పరిణామాలకు దారి తీస్తుందోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# దక్షిణమధ్య రైల్వేలో ముగిసిన స్వచ్ఛత పఖ్వాడ్

- 15 రోజుల్లో 5,191 కిలోమీటర్ల రైల్వే ట్రాక్ శుభ్రం
- 73,536 మొక్కలు నాటిన అధికారులు, ఉద్యోగులు..



**సాక్షి, సిటీబ్యూరో:** దక్షిణమధ్య రైల్వేలో స్వచ్ఛత పఖ్వాడ్ విజయవంతంగా ముగిసింది.స్వచ్ఛ భారత్ మిషన్ 10 వ వార్షికోత్సవం సందర్భంగా స్వచ్ఛతను సంస్థాగతీకరించడం , కార్యాలయ పరిశుభ్రతను పెంపొందించడం, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. పెండింగ్ సమస్యల పరిష్కారాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఇందులో భాగంగానే దక్షిణ మధ్య రైల్వే ఈ నెల 1 నుంచి 15 వరకు 'స్వభావ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛత' అనే నేపథ్యంతో స్వచ్ఛత పఖ్వాడ్ నిర్వహించింది. అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబాలు, పిల్లలు, పెద్దలు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. పక్షం రోజుల పాటు పరిశుభ్రత ప్రచారం చేపట్టారు. 636 రైల్వేస్టేషన్లలో పరిశుభ్రతను మెరుగుపరచడానికి, ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు.జోన్‌వ్యాప్తంగా మొత్తం 5,196 కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌ను శుభ్రం చేశారు. వివిధ రైల్వే ప్రాంగణాల్లో అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, తదితరులు సుమారు 36,183 మంది శ్రమదాన్‌లో పాల్గొన్నారు. 183 రైళ్లలో అధికారులు క్రమం తప్పకుండా పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించారు. యాంటీ లిటరింగ్ డ్రైవ్‌లో భాగంగా, రైల్వే స్టేషన్‌లు, రైళ్లలో చెత్త వేయకుండా చర్యలు చేపట్టారు. 5,010 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే చెత్త వేసిన 283 మందికి జరిమానా విధించి రూ . 56,600 వసూలు చేశారు.దక్షిణ మధ్య రైల్వేలోని అన్ని డివిజన్‌లు, వర్క్‌షాప్‌లలో 73,836 చెట్లను నాటినట్లు అధికారులు తెలిపారు.రైల్వే ట్రాక్‌లు, వివిధ రైల్వే ప్రాంగణాల నుంచి మొత్తం 27.44 టన్నుల ప్లాస్టిక్‌ను తొలగించారు.వర్క్‌షాప్‌ల నుంచి 430 టన్నుల స్క్రాప్‌ను సేకరించారు. స్వచ్ఛ పరిసర కార్యక్రమంలో భాగంగా జోన్ వ్యాప్తంగా 1,522 కార్యాలయాల్లో స్వచ్ఛతను పాటించి 443 టన్నుల వ్యర్థాలను సేకరించినట్లు సీపీఆర్వో శ్రీధర్ చెప్పారు.అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత అవగాహన కల్పించారు. యువతను భాగస్వాములను చేశారు. స్వచ్ఛత పఖ్వాడ్‌లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, యువతీ యువకులు, విద్యార్థులకు దక్షిణమధ్య రైల్వే జనరల్‌మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అభినందనలు తెలిపారు.

# హత్య కేసులో ముగ్గురు నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి

**అబిడ్స్:** ధూల్‌పేట్ టక్కరివాడి ప్రాంతంలో జరిగిన హత్యకేసును మంగళ్‌హాట్ పోలీసులు ఛేదించారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌లతో కలిసి గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి మంగళవారం వివరాలు వెల్లడించారు. లోయర్ ధూల్‌పేట బడీగల్లీ లాలా తాలీమ్ ప్రాంతానికి చెందిన దుర్గేష్‌సింగ్‌కు అతని సమీప బంధువులైన ఠాకూర్, భజరంగ్‌సింగ్, తుల్జారామ్‌సింగ్, సత్యనారాయణసింగ్ మధ్య భూ వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో దుర్గేష్‌సింగ్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్న వారు ఈ నెల 13న రాత్రి అతని ఇంటిపై దాడి చేసి హత్య చేశారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు నమోదు చేసిన మంగళ్‌హాట్ పోలీసులు మంగళవారం నిందితులు ఠాకూర్ భజరంగ్‌సింగ్, సత్యనారాయణసింగ్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్‌కు ఆదేశిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

# పది ఔషధాలు.. పలు విధానాలు!

## ఆద్యంతం సవాల్‌గా అనస్తీషియన్ విధులు

- ఒక్క సిట్టింగ్‌లోనే రోగి నమ్మకం పొందటం కీలకం
- పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు వేర్వేరు మోతాదులు
- నేడు ప్రపంచ అనస్తీషియా దినోత్సవం



**సాక్షి, సిటీబ్యూరో:** వైద్య రంగంలోనూ కంటికి కనిపించని నాలుగో సింహం ఒకటి ఉంది. అదే శస్త్ర చికిత్సలతో పాటు కీలక సమయాల్లో సేవలు అందించే, మత్తు డాక్టర్‌గా పిలిచే అనస్తీషియన్. ఇతర వైద్యులకు భిన్నంగా విధులు నిర్వర్తించే వీరి పని అనునిత్యం సవాలే. ఏ ఇద్దరు రోగులను ఒకే విధంగా ట్రీట్ చేయడానికి ఆస్కారం లేని అంశం అనస్తీషియా. వైద్యరంగ చరిత్రను మారుస్తూ, నొప్పి లేని శస్త్రచికిత్సలకు నాంది పలికిన ఈ రంగానికి సంబంధించి ప్రతి ఏడాదీ అక్టోబర్ 16ను ప్రపంచ అనస్తీషియా డేగా జరుపుకుంటారు. ప్రధానంగా పది ఔషధాలను మత్తు ఇవ్వడానికి వినియోగిస్తుండగా... పాటించే విధానాలు మాత్రం అనేకం ఉన్నాయి.

**ఒక్కొక్కరికీ ఒక్కో విధంగా..**

శస్త్ర చికిత్స చేసే వైద్యుడు ఆపరేషన్ టేబుల్‌పై రోగి సిద్ధంగా ఉన్న తర్వాతే థియేటర్‌లోకి రావచ్చు. ప్రొసీజర్‌గా పిలిచే శస్త్ర చికిత్స పూర్తికావడంతోనే బయటకు వచ్చేయవచ్చు. అయితే అనస్తీయాలజిస్ట్‌ల పరిస్థితి అలా కాదు. శస్త్ర చికిత్సకు ముందు, జరిగే సమయంతో పాటు పూర్తయిన తర్వాత రోగి సాధారణ స్థితికి వచ్చే వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉండాల్సిందే. ప్రస్తుతం అనస్తీషియా కోసం పది రకాలైన ఔషధాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. అయితే రోగి వయస్సు, ఇతర రుగ్మతలు, శరీర స్థితి తదితరాల ఆధారంగా ఔషధంతో పాటు మత్తు ఇచ్చే విధానాలు మారిపోవాల్సిందే. అనస్తీషియన్‌లు ఒక్కో ఔషధానికి, ఒక్కో పేషెంట్‌కు ఒక్కో డోసు నిర్ధారిస్తుంటారు. చిన్నారులు, వృద్ధులు, తీవ్రమైన ఇతర వ్యాధులు ఉన్న వారి విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిందే.

### ఒకే సందర్భంలో సంతృప్తి చెందేలా..



సాధారణంగా ఓ రోగి శస్త్ర చికిత్స వరకు రావాలంటే దానికి ముందు పలుమార్లు సంబంధిత వైద్యుడితో సంప్రదింపులు జరుపుతారు. అనారోగ్యం, దాని లక్షణాలు, శస్త్రచికిత్స ఆవశ్యకత, ప్రీ-పోస్టు సర్జికల్ అంశాలను క్షుణ్ణంగా చర్చిస్తారు. ఇవన్నీ పూర్తయిన తర్వాతే శస్త్ర చికిత్సకు రోగితో పాటు వారి కుటుంబీకులు అంగీకారం తెలుపుతుంటారు. అయితే అప్పటి వరకు కంటికి కనిపించని అనస్తీషియన్ తీరు దీనికి భిన్నం. ఆపరేషన్ సమయం సమీపించే వరకు ఈయన రోగికి కనిపించరు. అప్పుడు కనిపించినా.. కేవలం ఒకే ఒక్క సిట్టింగ్‌తో రోగి నమ్మకాన్ని చూరగొనాల్సిందే. మత్తు మందు, విధానాల పూర్వాపరాలను వివరిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తల్నీ సూచించడం తప్పనిసరి.

### శస్త్ర చికిత్సల్లో మాత్రమే కాదు..



అమెరికాకు చెందిన డెంటిస్ట్, ఫిజీషియన్ టీజీ విలియం మోర్టన్ 1846 అక్టోబర్ 16న తొలిసారిగా ఈథర్‌ను శస్త్ర చికిత్సలో మత్తు మందుగా వినియోగించారు. అందుకే ప్రపంచ అనస్తీషియా డేను ఈథర్ డేగానూ పిలుస్తుంటారు. అనస్తీషియన్‌ల సేవలు శస్త్ర చికిత్సల సమయంలో మాత్రమే కీలకం కాదు. వైద్య రంగంలోకి ప్రతి అంశంలోనూ చొచ్చుకుపోయారు. క్రిటికల్ కేర్ మెడిసిన్, ఎమెర్జెన్సీ, పెయిన్ రిలీఫ్ తదితర విభాగాల్లోనూ అనుభవం, అర్హత ఉన్న అనస్తీషియన్‌ల ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ రంగంలోనూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగానికి సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రయోగాలు జరుగుతున్నాయి.

– డాక్టర్ జ్యోతి రాణి శావ్లా, లీడ్ కన్సల్టెంట్ అనస్తీషియన్, క్రైడెన్స్ హెల్త్ సర్వీసెస్

## భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్య

**కాచిగూడ:** అనారోగ్య సమస్యలతో మనస్తాపానికిలోనైన ఓ మహిళ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫాజియాబేగం (37) అనే మహిళ కొన్నాళ్లుగా పక్షవాతంతో బాధపడుతోంది. మూడు నెలల క్రితం నెహ్రూనగర్‌లోని సోదరుడి ఇంటికి వచ్చిన ఆమె అక్కడే ఉంటోంది. అనారోగ్య సమస్యలతో మనస్తాపానికిలోనైన ఫాజియా బేగం మంగళవారం భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సమష్టి కృషితోనే డ్రగ్స్ నియంత్రణ

- నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై కఠినంగా వ్యవహరించాలి..
- రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్

**సాక్షి, సిటీబ్యూరో:** సమష్టి కృషితోనే డ్రగ్స్ నియంత్రణ సాధ్యమని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ పి.దశరథ్ అన్నారు. ఇందుకుగాను ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు పటిష్టమైన నిఘా కొనసాగించాలన్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పైన ఉక్కు పాదం మోపాలని ఆదేశించారు. మంగళవారం అబ్కారీ భవన్‌లో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెలలో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి 56 కేసులు నమోదు చేశామని, 53 మందిని అరెస్టు చేసి 111 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. టు సారాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 81 లీటర్ల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.పలు ప్రాంతాల్లో ఖాళీ సీసాల్లో కల్తీ మద్యం నింపి అమ్మకాలు జరుపుతున్నారు. వీటికి తోడు కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చే ఎన్‌డీపీఎల్ మద్యం సరఫరాను అరికట్టాలన్నారు. ఎయిర్‌పోర్ట్ ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టాలని ఆయన ఆదేశించారు. ఇప్పటివరకు 210 కిలోల గంజాయి, నాలుగు కిలోల గంజాయి చాక్లెట్లు, 3 కిలోల హషీష్ ఆయిల్, 6.4 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్, శంషాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి,సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటిండెంట్లు కృష్ణప్రియ, ఎస్‌కె ఫయాజొద్దీన్, కె. నవీన్‌కుమార్, ఎస్. ఉజ్వలరెడ్డి, కె. విజయ భాస్కర్‌తో పాటు ఏఈఎస్‌లు, డిటిఎఫ్ టీమ్, 20 ఎక్సైజ్ స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు.

# డెస్క్‌ల తయారీలో నాణ్యత పాటించాలి



డెస్క్‌ల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్

**చంచల్‌గూడ:** ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేయాల్సిన డ్యుయల్ డెస్క్ తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ అన్నారు. మంగళవారం ఆయన చంచల్‌గూడ జైలులోని తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. డ్యూయల్ డెస్క్ తయారీలో నాణ్యత పాటించాలని జైలు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్‌గౌడ్‌కు సూచించారు. త్వరగతిన డెస్క్‌లు తయారు చేసి పాఠశాలలకు సరఫరా చేయాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు డెస్క్‌లను పరిశీలించిన తర్వాతే పాఠశాల హెచ్‌ఎంలు డెస్క్‌లు తీసుకెళ్లాలన్నారు. ప్రతి రోజూ డెస్క్‌ల తయారీ వివరాలను గూగుల్ షీట్‌లో పొందుపరచాలని జైలు అధికారులను ఆదేశించారు. ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తూ త్వరగా సరఫరా చేయాలని కలెక్టర్ కోరారు.

**డిగ్రీ కాలేజీలో పనుల పరిశీలన..**

అనంతరం కలెక్టర్ అనుదీప్ సమీపంలోని నూతన డిగ్రీ కాలేజీని స్థానిక మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్ బలాలాతో కలిసి సందర్శించారు. రూ. 5 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ పనులను పరిశీలించారు. నిర్మాణం వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. డిగ్రీ కాలేజీలో ఫ్లోరింగ్, కిటికీలు తదితర ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలన్నారు.

## చిట్టీల పేరుతో టోకరా

- రూ. 30 కోట్లు వసూలు ● పరారీలో నిందితుడు

**చింతల్:** చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ గత కొన్నేళ్లుగా నమ్మకంగా ఉంటూ కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన సంఘటన చింతల్ డివిజన్ శ్రీ సాయి కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సీతారామయ్య అనే వ్యక్తి 30 ఏళ్లుగా చింతల్ డివిజన్ రంగానగర్‌లో ఉంటూ చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. నమ్మకంగా ఉండడంతో పేద మధ్య తరగతి కుటుంబాలతో పాటు పలువురు వ్యాపారులు అతడి వద్ద చిట్టీలు వేస్తున్నారు. అయితే గత కొన్ని నెలలుగా అతను చిట్టీలు పాడిన వారికి డబ్బులు చెల్లించకుండా కాలం వెళ్లదీస్తున్నాడు. దీంతో చిట్టీలు వేసిన వారు ఒత్తిడి చేస్తుండటంతో రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. దీంతో మంగళవారం బాధితులు సీతారామయ్య ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. దాదాపు రూ. 30 కోట్లకు పైగా వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## నిధులు విడుదల చేసే వరకు తాళాలు తీయం

**ఉస్మానియా యూనివర్సిటీ:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసే వరకు కాలేజీలకు వేసిన తాళాలు తీసేది లేదని ప్రైవేటు డిగ్రీ, పీజీ యజమానుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడుతూ కాలేజీల నిరవధిక బంద్ సంపూర్ణంగా కొనసాగుతుందన్నారు. నిధులు విడుదల చేసే వరకు సంఘటితంగా ఉండాలని, విద్యార్థులకు బోధన, ఇతర సేవలను అందించకూడదని నిర్ణయించారు. విద్యార్థుల ఫీజులు చెల్లించనందున ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న ప్రైవేటు కాలేజీల నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు ప్రభుత్వం స్పందించి తక్షణమే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు సీతారామి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరబోయిన నరసింహయాదవ్, వర్కింగ్ ప్రసిడెంట్ పరమేష్, సలహాదారులు సిద్దార్థ నాగయ్య, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# బెట్టింగ్‌లతో అప్పులు.. తీర్చేందుకు చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు

వృద్ధురాలి ఒంటిపై ఉన్న నగలను దొంగిలించిన కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

**ఇబ్రహీంపట్నం:** బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పుల పాలై వాటి నుంచి గట్టెక్కేందుకు చోరీకి పాల్పడిన ఇద్దరు యువకులను గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్ఐ తేజంరెడ్డిలతో కలిసి మంగళవారం ఏసీపీ కేపీవీ రాజు కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా, రామన్నగూడెం గ్రామానికి చెందిన వూటుకూరి ప్రభాస్ ఇంజినీరింగ్ చదువుతూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్ద అంబర్‌పేట పరిధిలోని మైత్రిలహరి కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతడికి నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలానికి చెందిన గుండ్లపల్లి శివతో ఇన్‌స్టాగామ్‌లో ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. జల్సాలు, బెట్టింగ్‌లకు అలవాటు పడిన వీరు అప్పులు చేశారు. అప్పులను తీర్చేందుకు చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 10న రాత్రి కోహెడ గ్రామంలో కారు అద్దెకు తీసుకుని కందుకూర్ మండలం, ఆకులమైలారం గ్రామానికి వచ్చి రెక్కీ నిర్వహించారు. దేవరశెట్టి సుమతమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా ఉన్నట్లు గుర్తించిన వారు ఇంట్లోకి ప్రవేశించారు. నిందితుల్లో ఒకరు ఆమె నోరు మూసి, చేతులను గోడకు గట్టిగా నెట్టిపట్టుకోగా, మరొకరు కత్తెరతో ఆమె మెడలోని పుస్తెల తాడు, చేతులకు ఉన్న బంగారు గాజులు కత్తిరించుకుని అక్కడినుంచి పరారయ్యారు. బాధితురాలు 100కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో అప్రమత్తమైన పోలీసులు మహేశ్వరం డీసీపీ సునీతరెడ్డి ఆదేశాలతో ఏసీపీ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టిన పోలీసులు కారు నంబర్ ఆధారంగా సదరు వాహనం కోహెడ గ్రామానికి చెందిన వ్యక్తికి చెందినది గుర్తించి ఆ దిశగా విచారణ చేపట్టారు. కారు యజమాని చెప్పిన వివరాల ఆధారంగా మంగళవారం ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6 తులాల పుస్తెల తాడు, 4 బంగారు గాజులు, కారు, కత్తెర, ఐ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ప్రభాస్, శివలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐలతోపాటు కానిస్టేబుళ్లకు రివార్డులు అందజేశారు.

## జలమండలిలో మరో ఆరు నెలల పాటు సమ్మె నిషేధం

**సాక్షి,సిటీబ్యూరో:** జలమండలి మరో ఆరునెలల పాటు సమ్మెలను నిషేధిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వుల జారీ చేసింది. నీటి సరఫరా, పారిశుద్ధ్యం అత్యంత అవసరమైన సర్వీసులు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ 21న ఆరు నెలల పాటు సమ్మెలపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు ఈ నెల 20తో గడువు ముగియనుండటంతో మరో ఆరు నెలల పాటు నిషేధాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈనెల 21నుంచి ఆరు నెలల పాటు సమ్మె నిషేధం అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## సైబర్ బాధితుడికి నగదు అప్పగింత

**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల చొరవతో ఓ సైబర్ నేరం బారిన పడిన వ్యక్తికి ఊరట లభించింది. బాధితుడి నుంచి నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లిన మొత్తం నుంచి రూ.39 లక్షలు వెనక్కు రప్పించి, తిరిగి ఇప్పించగలిగినట్లు డీసీపీ దార కవిత మంగళవారం తెలిపారు. నగరానికి చెందిన యువకుడిని సంప్రదించిన సైబర్ నేరగాళ్లు స్టాక్ ట్రేడింగ్‌లో భారీ లాభాలంటూ ఎర వేశారు. అతడిని పూర్తిగా నమ్మించిన నేరగాళ్లు రూ.78,70,500 వివిధ బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేయించారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఆశ్రయించారు. ఇన్‌స్పెక్టర్ కె.మధుసూదన్‌రావు, కానిస్టేబుళ్లు వెంకటేష్, సంపత్ తక్షణం స్పందించి ఆయా బ్యాంకు అధికారులను లేఖలు రాశారు. దుండగుల ఖాతాల్లోని నగదు ఫ్రీజ్ చేయాల్సిందిగా కోరడంతో పాటు వారిని సంప్రదించి విషయం వివరించారు. దీంతో అప్పటికే సైబర్ నేరగాళ్లకు కొంత మొత్తం చేరగా.. రూ.39 లక్షలు ఫ్రీజ్ అయ్యాయి. ఈ మొత్తాన్ని కోర్టు ద్వారా బాధితుడికి అందించారు.

## మెట్రో స్టేషన్‌లో ప్రయాణికుల నగలు, నగదు మాయం

**బంజారాహిల్స్:** మెట్రో స్టేషన్‌లో ప్రయాణికుల నగదు, నగలు మాయైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హన్మకొండకు చెందిన శోభలత, హేమలత అనే ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఈ నెల 10న ఎల్వీప్రసాద్ ఆస్పత్రికి కంటి పరీక్షలకు వచ్చి మధ్యాహ్నం రోడ్డునెంబర్-5లోని మెట్రోస్టేషన్‌లో రైలు ఎక్కే క్రమంలో బ్యాగ్‌లను స్కాన్ చేయించారు. అదే రోజు రాత్రి 8 గంటలకు హన్మకొండకు చేరుకున్న తర్వాత బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో రూ.12 వేల నగదుతో పాటు ఐదు గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. తమ లగేజీ మెట్రో స్టేషన్‌లో సెక్యూరిటీ చెకప్‌లో స్కానింగ్ చేసే క్రమంలో హ్యాండ్‌బ్యాగ్ నుంచి మాయమై ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మెట్రో స్టేషన్ సెక్యూరిటీ స్కానింగ్ సిబ్బందిని విచారించాలని కోరారు. క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 'సీఎం రేవంత్ రెడ్డి కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు'

**కాచిగూడ:** ఓటుకు నోటు కేసులో ఏ–1 గా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఓటుకు నోటు కేసులో ఏ–4 నిందితుడు జెరుసలేం మత్తయ్య ఆరోపించారు. కేసుకు సంబంధించి హార్డ్ డిస్కులు, దస్తావేజులతో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. విచారణకు హాజరు కాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పించుకుంటున్నారన్నారు. గత ఆరేళ్లుగా రేవంత్‌రెడ్డి ఈడీ న్యాయస్థానంలో ఐడెంటిఫికేషన్‌కు హాజరు కావడం లేదన్నారు. తాను కొన్నేళ్లుగా కోర్టుల చుట్టు తిరగలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రయల్ స్టార్ట్ అయితే కేసులో జరిగిన వాస్తవాలు జడ్జికి వివరించి అన్ని ఆధారాలు ఈడీ కోర్టుకు సమర్పించి, తన బాధ్యత నెరవేర్చుకుంటానని వెల్లడించారు. 2015లో మొదలైన కేసు అనేక మలుపులు తిరిగిందని, అన్ని కేసుల్లో తన పేరు కొట్టివేశారని, నాంపల్లి ఈడీ కోర్టులో మాత్రమే పెండింగ్‌లో ఉందని ఆయన పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి హాజరు కాకపోవడం వల్ల కేసు ముందుకు సాగడం లేదని, ఈనెల 16న జరగనున్న వాయిదా కైనా సీఎం హాజరు కావాలని కోరారు. లేని పక్షంలో కోర్టు ఎదుట నిరాహార దీక్ష చేపడతానన్నారు.

## 27న ఐఎంఏ రాష్ట్ర శాఖ ఎన్నికలు

**సుల్తాన్‌బజార్:** ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర శాఖకు ఈ నెల 27న ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోఠిలోని అసోసియేషన్ రాష్ట్ర శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే ఐఎంఏ 4 లక్షల సభ్యత్వం కలిగిన అతిపెద్ద ఎన్జీఓ సంస్థ అని అన్నారు. రాష్ట్ర శాఖలో 20 వేల మంది సభ్యులతో 76 శాఖలతో అల్లోపతి వైద్యుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. ఈ నెల 27న ఎన్నికలను నిర్వహిస్తున్న తరుణంలో అక్టోబర్ 15వ తేదీన ఎన్నికల బరిలో నిలిచే పోటీదారుల ఫైనల్ లిస్ట్‌ను ఆయన విడుదల చేశారు. నేటి నుండి 26వ తేదీ వరకు అభ్యర్థులు ప్రచారం నిర్వహించుకునేందుకు 11 రోజుల సమయాన్ని కేటాయించినట్లు చెప్పారు. అక్టోబర్ 27న కోఠిలోని రాష్ట్ర శాఖ కార్యాలయం ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు కొనసాగుతాయన్నారు. 17 పోస్టులకుగాను 92 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా అందులో ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని చెప్పారు. ఇప్పటికే 3వ జోన్ నుంచి రాష్ట్ర శాఖకు ప్రెసిడెంట్ డాక్టర్ వి.విజయ్‌కుమార్ ఎన్నిక ఏకగ్రీవమైందన్నారు. స్టేట్ వర్కింగ్ కమిటీకి 29 మంది, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు 19 మందితోపాటు మరో 30 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. కాగా ఈ ఎన్నికలలో సుమారు 89 మందిలో 49 మంది ఏకగ్రీవంగా ఎన్నికవడంతో మిగిలిన 40 మంది సభ్యుల ఎన్నికకు పోటీ నెలకొంది.

# రూ. 86 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 ఎమ్మెల్యే కాలనీ చర్చి రోడ్డులో ప్రారంభమైన సీసీ రోడ్డు పనులు

**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ప్రధాన రహదారి నుంచి క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ, చర్చి, ఏసీబీ కార్యాలయం మీదుగా ఎమ్మెల్యే కాలనీ రమేష్ సెలూన్ చౌరస్తా వరకు నిర్మించ తలపెట్టిన వీడీసీసీ రోడ్డు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. రూ.86 లక్షల వ్యయంతో ఈ రోడ్డు పనులు చేపట్టనున్నారు. ప్రధాన రోడ్డు నుంచి రమేష్ సెలూన్ చౌరస్తా వరకు 550 మీటర్ల మేరకు ఈ రోడ్డు వేయనున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఇక్కడి నుంచి రాకపోకలు మరింత సులువుగా మారనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ బీటీ రోడ్డు ఉండగా వర్షం వచ్చిందంటే గుంతలమయమై స్థానికంగా రాకపోకలకు తీవ్ర అవాంతరాలు ఏర్పడుతున్నాయి. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఎగుడుదిగుడు సమస్యలకు, గుంతలకు తెరపడనుంది. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేసే దిశలో జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 ఇంజినీర్లు ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడ రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల ఎన్బీటీనగర్ వాసులు, ఎమ్మెల్యే కాలనీ నివాసితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# జలమండలి అధికారుల పర్యటన



అధికారులకు సమస్యలు వివరిస్తున్న సీఎన్ రెడ్డి

**రహమత్‌నగర్:** స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఫిర్యాదు మేరకు డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ అధికారి విజయ్‌రావు, జలమండలి జీఎం హరిశంకర్‌లు మంగళవారం రహమత్‌నగర్‌లో పర్యటించి కలుషిత నీటి సరఫరా, లోప్రెషర్ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా మంచినీరు కలుషితమయ్యే అవకాశం ఉందని వెంటనే ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే నీటి సరఫరా నిర్దిష్ట వేళల్లో మాత్రమే సరఫరా చేయాలని అధికారులను కోరారు. పాత పైప్‌లైన్ మార్చి కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు నివేదికలు రూపొందించాలని పేర్కొన్నారు. సమస్యలపై స్పందించిన జలమండలి అధికారులు త్వరలోనే నివేదికలు రూపొందిచడం జరుగుతుందని చెప్పారు. అంతేగాక పైప్‌లైన్లు లీకేజీలు జరుగకుండా వాటిని వెంటనే మరమ్మతులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సూరప్రకాష్, కాంగ్రెస్ నాయకులు మన్సూర్, ఎక్బాల్ తదితరులు ఉన్నారు.

# బంచ్ కేబుల్ ఏర్పాటు చేయండి



**వెంకటేశ్వరకాలనీ:** డివిజన్ పరిధిలోని బంచ్ కేబుల్ ఏర్పాటుతో పాటు కాంక్రీట్ స్తంభాలు నిర్మించాలని కోరుతూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూకీని మంగళవారం కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పలు సమస్యల గురించి ఆయనకు వివరించారు.

# ట్రాన్స్‌లొకేట్ పేరుతో ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత..!

- ఆ తర్వాత చెట్టును పూర్తిగా కనిపించకుండా చేస్తున్న వైనం
- లొసుగులు అడ్డం పెట్టుకొని అనుమతులు
- ఇంత జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- చెట్లను తొలగించే క్రమంలో సిబ్బంది చేతివాటం
- తనిఖీ చేయటానికి వెళ్లిన అటవీశాఖ అధికారిపై యూబీడీ సూపర్‌వైజర్ దురుసు ప్రవర్తన



కేబీఆర్ పార్కు ఎదురుగా ట్రాన్స్‌లొకేట్ పేరుతో కొట్టేసిన చెట్టు



కొట్టేసిన చెట్టుపై ఓ కుండీని ఏర్పాటు చేసిన దృశ్యం

**బంజారాహిల్స్:** ప్రభుత్వం ఒక వైపు పచ్చదనాన్ని పెంచేందుకు ఎక్కడికక్కడ వివిధ సందర్భాల్లో మొక్కలు నాటుతూ వాటిని సంరక్షించే బాధ్యతలు చేపడుతోంది. కానీ కొంతమంది మాత్రం ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ భారీ చెట్లను రాత్రికి రాత్రే నేలమట్టం చేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగంలోని లొసుగులను ఆసరాగా తీసుకొని కొందరు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ 20–30 సంవత్సరాల వయసున్న చెట్లను అవలీలగా కొట్టేస్తున్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో గడిచిన మూడు నెలల్లో పదుల సంఖ్యలో ప్రధాన రోడ్లకు, కాలనీల్లో ఉన్న చెట్లను ఓ యూబీడీ సూపర్‌వైజర్ మరి కొంత మంది సిబ్బందితో కలిసి యథేచ్ఛగా చెట్లను కొట్టేస్తున్నారు. 20 రోజుల క్రితం బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు ఎదురుగా ఉన్న 30 ఏళ్ళ నాటి భారీ చెట్టను ట్రాన్స్‌లొకేట్ పేరుతో కొట్టేయడంతో పాటు పక్కనే ఉన్న మరో రెండు చెట్లను చాలా వరకు కొట్టివేశారు. ఈ భవనంలో ఏర్పాటు చేసిన కమర్షియల్ సంస్థ కనిపించడం లేదనే సాకుతో జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకొని చెట్టును కొట్టేశారు. కానీ ఈ చెట్టు వల్ల ఆ ఇంటికి కానీ, ఆ భవనానికి కానీ ఎటువంటి ప్రమాదం లేదు కేవలం తమ భవనం కనిపించడం లేదనే సాకుతో మాత్రమే మూడు చెట్లకు అనుమతులు తీసుకొని రెండు చెట్లను ట్రిమ్మింగ్ చేసి మరో చెట్టును మొండం వరకు మిగిల్చారు. మరో వైపు ఇదే భవనం పక్కన ఉన్న మరో భవనం ముందు ఓ చెట్టును పూర్తిగా తొలగించి ఎవరికి అనుమానం రాకుండా ఓ కుండీని దానిపై పెట్టారు. ఈ వ్యవహారంలో రూ. 2 లక్షల వరకు చేతులు మారినట్లు సమాచారం.

### అటవీ శాఖ అధికారిపై దురుసు ప్రవర్తన

కేబీఆర్ పార్కు ఎదురుగా ఉన్న భారీ చెట్టును సరైన అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా కొట్టివేసిన తీరుపై పత్రికల్లో కథనాల వచ్చిన నేపథ్యంలో అక్కడికి విచారణకు వెళ్ళిన కేబీఆర్ పార్కు అధికారి మహ్మద్ యూసుఫ్‌కు చేదు అనుభవం ఎదురైంది. అక్కడికి వెళ్ళి చెట్టు గురించి సంబంధిత దుకాణ యజమానితో మాట్లాడుతున్న సమయంలోనే అక్కడికి మద్యం సేవించి వచ్చిన యూబీడీ సిబ్బంది సదరు అధికారిని దుర్భాషలాడటంతో పాటు దాడి చేసేందుకు యత్నించినట్లు సమాచారం. అన్ని అనుమతులు తీసుకొని చెట్టు కొట్టేశారని మీరెందుకు ఫైన్ వేసేందుకు వచ్చారంటూ సదరు సిబ్బంది దబాయించి ఫారెస్ట్ అధికారిని అక్కడి నుంచి పంపించి వేయడం గమనార్హం.

### ప్లాన్ వేసి...

సాధారణంగా ఓ చెట్టు కొట్టేయాలంటూ ఎన్నో అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇంటి ఆవరణలో ఉన్న చెట్ట వల్ల కానీ, ఇంటి ముందున్న చెట్టు వల్ల కానీ ఇంటికి కానీ, ఇంటి ప్రహరీకి కానీ ప్రమాదకరంగా ఉన్నట్లయితే లేదంటే చెట్టు వంగిపోయి కూలిపోయే విధంగా ఉన్నట్లయితే మాత్రమే చెట్టు కొట్టేందుకు అనుమతి ఉంటుంది. ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లు కొట్టేసేవారికి అటవీ శాఖాధికారులు లక్షలాది రూపాయల జరిమానాలు విధిస్తారు. కొన్ని రోజుల క్రితం వినాయక చవితి ఉందని ఓ కేబీఆర్ పార్కు వాకర్ పార్కు నుంచి కొన్ని ఉత్తరేణి కొమ్మలను అనుమతి లేకుండా కోశాడని అతనికి రూ.10 వేల జరిమానా విధించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2 లుంబిని మాల్ ఎదురుగా అనుమతి లేకుండా చెట్టు కొట్టేసిన వ్యక్తికి రూ. 3.60 వేలు జరిమానా విధించారు. ఇవన్నీ చూస్తున్న సదరు ఇంటి యజమానులు యూబీడీలో ఉన్న కొంత మంది సిబ్బందితో కుమ్మక్కై కేవలం చలానా మాత్రమే చెల్లించి అడ్డదారుల్లో అనుమతులు ట్రాన్స్‌లొకేట్ పేరుతో అనుమతులు పొందుతూ భారీ చెట్లను కొట్టివేస్తున్నారు. ఈ వ్యవహారంలో కొంత మంది రాజకీయ నేతల వద్ద పని చేస్తున్న కార్యాలయ సిబ్బందితో పాటు వ్యక్తిగత సిబ్బంది ప్రమేయం కూడా ఉన్నట్లు తెలుస్తున్నది. సదరు యజమానిదారులు చెట్టు కొట్టేసేందుకు దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆ ఫైల్ అటవీ శాఖకు వెళ్తుంది. వారు ఈ చెట్టు కొట్టేయాలంటే జీహెచ్ఎంసీ నుంచి ఎన్ఓసీ రావాలని చెప్తారు. దీంతో వెంటనే సదరు యూబీడీ సిబ్బంది మేయర్, ఎమ్మెల్యే కార్యాలయాల్లో తమకు అనువుగా ఉన్న నేతలు, కార్యాలయ సిబ్బందితో కలిసి వారి కార్యాలయాల నుంచి యూబీడీ అధికారులు, అటవీ శాఖ అధికారులపై ఒత్తిడి పెంచి చెట్టు కొట్టేసేందుకు కావాల్సిన అనుమతులను పొందుతున్నారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నట్లు తెలుస్తున్నది. ఈ తతంగం వల్ల ఎన్నో ఏళ్ల ఉన్న భారీ వృక్షాలు కనుమరుగై పోతున్నాయి. ట్రాన్స్‌లొకేట్ పేరుతో అనుమతులు పొందుతున్న వారు మళ్ళీ ఆ చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేసి చూపించిన దాఖలాలు కూడా లేకపోవడం గమనార్హం.

# నగర సంప్రదాయం, కళల పునర్జీవం కోసమే ప్రజా సంబరాలు

**ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి**

**బంజారాహిల్స్:** జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న ప్రజా సంబరాలు పేరిట అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. కేబీఆర్ ప్రొమెనేడ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20న ఆదివారం కేబీఆర్ పార్కు వద్ద మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ప్రజా సంబరాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరా బాద్ నగర సంప్రదాయ, వారసత్వ సంపద సంరక్షణ, మరుగున పడిపోతున్న కళలకు పునర్జీవం పోయడం, ప్రాంతీయ కళాకారులు, ఔత్సాహికులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వివిధ రకాలైన ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సంబరాలకు ఉచిత ప్రవేశం ఉందని, ఆర్ట్స్, పెయింటింగ్ పోటీల్లో పాల్గొనేవారు మాత్రం తప్పనిసరిగా తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. చిత్రకళ పోటీలకు సంబంధించి థీమ్ స్పాట్‌లో అక్కడే ఇవ్వబడుతుందని, చార్ట్ పేపర్, బోర్డు స్కెచ్‌లు ఏర్పాటు చేస్తారని, ఈ పోటీలకు ఎలాంటి రుసుము లేదని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

# డిసెంబర్ 5న ప్రముఖ దేవాలయాల దర్శనానికి ప్రత్యేక రైలు



మాట్లాడుతున్న విగ్నేష్ తదితరులు

**కాచిగూడ:** ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ రైలు పథకం కింద మొట్టమొదటి ఏకైక ప్రైవేట్ సెక్టార్ సర్వీస్ ప్రొవైడర్ సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ కర్ణాటకకు ప్రత్యేక రైలును ప్రకటించింది. ఈ సందర్భంగా మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ స్టార్ రైల్ ప్రొడక్ట్ డైరెక్టర్ విగ్నేష్, టూర్ టైమ్స్ రీజినల్ డైరెక్టర్ రమేష్ అయ్యంగార్‌లు మాట్లాడుతూ కర్ణాటకలోని ప్రముఖ ఆలయాలను సందర్శించడానికి ఈ ప్రత్యేక రైలు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. డిసెంబర్ 5న రైలు ప్రారంభమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రయాణికులు రైలు ఎక్కవచ్చునని తెలిపారు. 9 రోజుల వ్యవధిలో కర్ణాటకలోని అత్యంత ప్రముఖ దేవాలయాలైన నవ బృందావనం, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, శృంగేరి, హొరనాడు, ధర్మస్థల, మైసూర్, శ్రీరంగపట్నం, మేల్కోటేలను సందర్శించవచ్చునని తెలిపారు. ఈ యాత్రలో డిసెంబర్ 9న సోమవారం ధర్మస్థల మంజునాథ స్వామి దర్శనం, డిసెంబర్ 10న మంగళవారం కుక్కే సుబ్రమణ్యస్వామి దర్శనం, సర్పదోషం, కుజ దోషం పూజచేసే అవకాశం ఈ యాత్రలో పాల్గొన్న వారికి ఉంటుందన్నారు. గోకర్ణలోని నక్షత్రం, తిథీతో సంబంధం లేకుండా పిండ తర్పణం చేసి మన పూర్వీకుల ఆశీస్సులు పొందే అవకాశం ఉంటుందన్నారు. లగేజీకి రక్షణ కల్పించేందుకు ప్రతి కోచ్‌కు సెక్యూరిటీ గార్డులను నియమించడం జరుగుతుందన్నారు. గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, నల్గొండ, మిర్యాలగూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లలో రైలు ఎక్కేందుకు యాత్రికులకు అవకాశం ఉందన్నారు. సీనియర్ సిటిజన్లకు ఇది ఒక చక్కటి అవకాశమన్నారు. యాత్రకు సంబంధించి టికెట్ బుకింగ్ ప్రారంభమైందని తెలిపారు. వివరాలకు సెల్: 9335021516 నెంబర్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు.

# అధునాతన 'ఆర్‌డీఎన్' విధానంతో వృద్ధునికి ప్రాణదానం

**విజయవంతంగా చికిత్స అందించిన కేర్ ఆస్పత్రి వైద్యులు**



శస్త్ర చికిత్స అనంతరం వృద్ధుడితో వైద్యులు

**బంజారాహిల్స్:** బహుళ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వృద్ధునికి బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి వైద్యులు అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలను నిలబెట్టారు. అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్), మధుమేహం, తీవ్రమైన హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న 74 ఏళ్ల వృద్ధుడికి అధునాతన ఆర్‌డీఎన్ (రేనల్ డినర్వేషన్ ట్రీట్‌మెంట్) వైద్య విధానంలో చికిత్స అందించి స్వాంతన చేకూర్చడం ద్వారా ఈ విభాగంలో కేర్ ఆస్పత్రి పురోగతి సాధించింది. బంజారా హిల్స్ కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అజిత్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం... అధిక రక్తపోటు, మధుమేహం, కరోనరీ ఆర్టరీ డిసీజస్ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధ రోగి గతంలోనే కరోనరీ యాంజియోప్లాస్టీ చేయించుకున్నారు. అయినప్పటికీ ప్రమాదకర రక్తపోటు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతుతూ ప్రాణాపాయ స్థితి లో ఇటీవల బంజారాహిల్స్‌లోని కేర్ ఆ స్పత్రిలో చేరారు. అతని ఆరోగ్య ప్రమాణాలు ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యుల పరిశీలనలో తేలింది. అధిక మోతాదులో ఔషధాలను వినియోగించడం సైతం ఇందుకు దోహదం చేసింది. ఈ క్రమంలో రోగి నాన్-ఇస్కీమిక్ హైపర్టెన్సివ్ లెఫ్ట్ వెంట్రిక్యులర్ వైఫల్యాన్ని పొందే ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో కేర్ ఆస్పత్రి వైద్యులు క్యాథ్‌ల్యాబ్ క్లినికల్ డైరెక్టర్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీఎల్ఎస్ కపర్ది రోగికి మూత్రపిండ ధమనులపై అధునాతన ఆర్‌డీఎన్ వైద్య విధానం ద్వారా 11 మార్లు చికిత్సను అందించారు. చికిత్స అనంతరం వారం రోజుల్లో రోగి రక్తపోటు మెరుగుపడి. రోగి ఆరోగ్యం సాధారణ స్థితికి చేరుకుంది.

# దివ్యాంగులకు ఉచితంగా హెయిర్ కటింగ్



హెయిర్ కటింగ్ చేస్తున్న రమేష్

**బంజారాహిల్స్:** మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళిగా ప్రముఖ సామాజిక సేవకుడు ఇందిరానగర్ బస్తీకి చెందిన రమేష్ కొడిచెర్ల మంగళవారం మానసిక స్థితి బాగాలేని దివ్యాంగులకు ఉచితంగా హెయిర్ కటింగ్ చేసి కలాంపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కలాంకు నివాళిగా సమాజంలో తనవంతు బాధ్యతగా తన వృత్తిని ఈ రకంగా వినియోగించుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సుమారు 30 మంది దివ్యాంగులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు హెయిర్ కటింగ్ చేసి మరోసారి తన గొప్ప మనస్సును చాటుకున్నారు.

# పశ్చిమ బెంగాల్ ఘటనపై న్యాయం చేయాలి

**వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్**





నిమ్స్‌లో నిరసన చేపట్టిన రెసిడెంట్ డాక్టర్లు

**లక్డీకాపూల్:** పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్ అభయ ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకుని వైద్యలోకానికి భరోసా కల్పించాలని నిమ్స్ రెసిడెంట్ డాక్టర్స్ అసోయేషన్ (ఆర్‌డీఏ) డిమాండ్ చేసింది. మంగళవారం రెసిడెంట్లు ఒక రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్‌డీఏ అధ్యక్షుడు డాక్టర్ రాజీకిరణ్ ఇమ్మడి నేతృత్వంలో నిమ్స్ మెయిన్ బిల్డింగ్ వద్ద న్యాయం కోరుతూ శాంతియుతంగా నిరసన తెలిపారు. ఇప్పటికే ఈ అంశంలో 66 రోజులపాటు ఆందోళనా కార్యక్రమాలతో పాటు మరో ఏడు రోజులు సమ్మె చేపట్టినప్పటికీ తమకు తగిన న్యాయం జరగలేదన్నారు. వైద్యుల భద్రతా విషయంలో తమ ఆందోళన కొనసాగుతుందన్నారు. డాక్టర్. అభయ ఘటన తర్వాత ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో భద్రత, ఆ భద్రతకు సంబంధించిన న్యాయం, క్లిష్టమైన సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాన్ని జరుపుతామన్నారు.

# పెద్దమ్మ గుడిలో సెల్‌ఫోన్ చోరీ

**బంజారాహిల్స్:** అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలి సెల్‌ఫోన్ చోరీకి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బోడుప్పల్ తారాపురికాలనీకి చెందిన దాసరి చాందిని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జూబ్లీహిల్స్‌లోని శ్రీపెద్దమ్మ దేవాలయానికి దర్శనం కోసం వచ్చింది. దర్శనం ముగించుకుని హ్యాండ్ బ్యాగ్‌లో సెల్‌ఫోన్ కోసం చూడగా కనిపించలేదు. వెంటనే అన్ని ప్రాంతాలు వెతికినా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఆమె జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### నవరాత్రుల్లో 17 సెల్‌ఫోన్లు చోరీ

నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన మహిళా భక్తులను లక్ష్యంగా చేసుకుని దొంగల ముఠా వారి సెల్‌ఫోన్లను తస్కరించారు. దీంతో తొమ్మిది రోజుల్లో మొత్తం 17 సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. సుమారుగా 10–15 మంది దొంగల ముఠా తొమ్మిది రోజులపాటు ఇక్కడ తిష్టవేసి పోలీసులకు దొరక్కకుండా చాకచక్యంగా హ్యాండ్‌బ్యాగ్‌లకు చిల్లులు పెట్టి వాటిలోని ఫోన్లను చోరీ చేశారు. ఇదిలా ఉండగా రోజూ వేలాది మంది భక్తులు వస్తారని తెలిసినా పెద్దమ్మ గుడి యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోలేదు. ఇక్కడ భక్తుల తాకిడికి సుమారుగా 60 నుంచి 70 సీసీ కెమెరాలు ఉండాల్సి ఉండగా కేవలం 15 మాత్రమే ఏర్పాటు చేశారు. అందులోనూ నాలుగైదు పనిచేయడం లేదు. ఆలయంలో గొలుసులు, సెల్‌ఫోన్లు చోరీలకు గురవుతున్నాయని గత కొన్నేళ్లుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా గుడి యాజమాన్యం లెక్కచేయడం లేదు. సెల్‌ఫోన్లు దొంగతనం జరిగినప్పుడు సీసీ ఫుటేజీలు పరిశీలించడానికి వెళ్లిన పోలీసులకు కూడా స్పష్టత లేకుండా పోతుంది. దీంతో దొంగల ముఠా ఎప్పటికప్పుడు తప్పించుకుంటూ ఆదివారం వచ్చిందంటే తమ చేతులకు పనిచెబుతున్నారు.

# మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



**పంజగుట్ట:** ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు అనే కథనం 'సాక్షి'లో మంగళవారం ప్రచురితం కాగా అధికారులు స్పందించి సదరు మ్యాన్‌హోళ్లను పూర్తిగా మరమ్మతులు చేశారు. వెంకటరమణ కాలనీ నుంచి పద్మావతి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై ఒక మ్యాన్‌హోల్ మూ త లోపలికి కుంగిపోయి ఎంతో ప్రమాదకరంగా ఉంది. రాత్రి వేళల్లో వాహనదారులకు సరిగ్గా కనిపించక మ్యాన్‌హోల్స్‌లో పడే అవ కాశం ఉందని, స్కూల్ బస్సులు, ఆటోలు ఎక్కువగా తిరిగే ప్రాంతం కావడంతో త్వరగా మరమ్మతులు చెయ్యాలని కథనంలో పేర్కొనడంతో వెంటనే స్పందించిన అధికారులు దాన్ని మరమ్మతులు చేయించారు.

# ఉచిత శిక్షణలతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి



అవగాహన కల్పిస్తున్న బాలచంద్ర, కార్పొరేటర్ విజయారెడ్డి

**ఖైరతాబాద్:** ఉచిత శిక్షణ లతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని అభయ ఫౌండేషన్ చైర్మన్ బాలచంద్ర అన్నారు. మంగళవారం మహిళలకు ఉ చిత శిక్షణా కార్యక్రమాలపై పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా అభయ ఫౌండేషన్ చైర్మన్ బాలచంద్ర ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్, పేపర్ ప్లేట్స్ తయారు చేయడం, ట్రైనింగ్ తరువాత మిషినరీ కొనుగోలుకై 70 శాతం ఫౌండేషన్ డబ్బులు అందజేస్తుందని 30 శాతం శిక్షణ తీసుకున్న వారు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉత్సాహవంతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్, కార్పొరేటర్ విజయారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా తరగతులను స్థానికులు వినియోగించుకొని తమ కుటుంబాలకు ఆర్థికంగా బలోపేతం చేసుకోసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# వివాహిత పట్ల అసభ్య ప్రవర్తన

**యువకుడిపై కేసు నమోదు**

**ఫిలింనగర్:** వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు నమోదైన సంఘటన మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... నవోదయ కాలనీలో నివసించే వివాహిత (36) గృహిణి కాగా, సమీపంలోని ఓ టైలర్ షాపు యజమాని కొడుకు రిషి ఆమెను కొంతకాలంగా అక్కా అని పిలుస్తూ మాట్లాడుతుండేవాడు. ఈ క్రమంలో ఆమెకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపించాడు. దీంతో ఆమె శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు రిషిపై పెట్టీ కేసు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అయితే మంగళవారం తెల్లవారుజామున రిషి మరోసారి ఆమె ఇంటి వద్దకు వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దూషించాడు. యువకుడి వేధింపులు భరించలేకపోతున్నానని, తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో యువకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బోరబండలో వెల్లివిరిసిన మతసామరస్యం

- దుర్గామాత శోభాయాత్రకు స్వాగతం పలికిన ముస్లిం పెద్దలు
- అభినందించిన ఏసీపీ. మాజీ డిప్యూటీ మేయర్





శోభాయాత్ర నిర్వాహకులకు సన్మానం చేస్తున్న బాబాఫసియుద్దీన్, ఏసీపీ, మసీదు కమిటీ పెద్దలు

**రహమత్‌నగర్ (బోరబండ):** తమ మతాన్ని ప్రేమిస్తూనే, ఇతరుల మతాన్ని గౌరవించారు ఆ మసీదు కమిటీ ప్రతినిధులు. హిందూ ముస్లిం భాయిభాయి అంటు చాటి చెప్పారు. స్వయంగా దుర్గామాత శోభా యాత్రకు స్వాగతం పలికి నిర్వాహకులను సన్మానించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ ఎస్‌హెచ్ఓ వీరశేఖర్‌లు పాల్గొని మసీదు కమిటీ నిర్వాహకులను అభినందించారు. వివరాలు ఇలా ఉన్నాయి... బోరబండ డివిజన్ ఎస్ఆర్ఆర్‌పురం సైట్-1 బస్తీలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి అమ్మవారిని నిమజ్జనానికి తరలించారు. ఈ క్రమంలోనే స్థానికంగా ఉన్న గౌసెఆజాం మసీదు కమిటీ నిర్వాహకులు, ఇమామ్‌లు, మోహజ్జంలు అమ్మవారి శోభాయాత్రకు సాదరంగా స్వాగతం పలికి నిర్వాహకులకు ఘనంగా సన్మానించారు. అనంతరం మసీదు కమిటీ ప్రతినిధులు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. దీంతో హిందూ, ముస్లింలు సంతోషం వ్యక్తం చేశారు.

### ఇస్లాంలో హింసకు తావులేదు



ఇస్లాం మతంలో హింసకు ఏ మాత్రం తావులేదు. బోరబండలో గంగా జమున తహజీబ్ సంస్కృతి మరోసారి రుజువైంది. డివిజన్ వాసులు మతసామరస్యాన్ని ప్రశంసిస్తున్నాను. ఇకపై కూడా ఇలాగే కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.

– బాబా ఫసియుద్దీన్ (మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్)

### మత సామరస్యాన్ని ప్రతీకగా నిలిచారు



బోరబండ డివిజన్ వాసులు మత సామరస్యానికి ప్రతీకగా నిలవడం ఆనందంగా ఉంది. ఎల్లప్పుడు ఇలాగే కలిసిమెలిసి ఉండాలి. ప్రతి ఉత్సవాల్లో, పండుగల్లో మత సామరస్యంతో ఇలాగే మెలగాలి. కులమతాలకు అతీతంగా కలిసి ఉండటం ఆనందంగా ఉంది.

– వీరశేఖర్ (ఎస్‌హెచ్ఓ బోరబండ)

# ఫిలింనగర్‌లో పాత నేరస్తుడి అరెస్టు

**బంగారు నెక్లెస్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ రికవరీ**



నిందితుడు మహ్మద్ ఆమేర్

**బంజారాహిల్స్:** మసీదులో ప్రార్థనలు చేస్తున్న వారి దృష్టిమరల్చి బ్యాగ్‌లు తస్కరించి పరారైన పాత నేరస్తున్ని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి బాధితుడు పోగొట్టుకున్న బంగారు నెక్లెస్, ల్యాప్‌ట్యాప్, సె ల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... గత జూన్ 24వ తేదీన షేక్‌పేట సెవన్‌టూంబ్స్ రోడ్డులో ఉన్న ఓ మసీదులో ప్రార్థనలు జరుగుతుండగా పక్కా పథకం ప్రకారం మెహిదీపట్నం జీర్రాకు చెందిన మహ్మద్ ఆమేర్ (19) ఓ వ్యక్తికి చెందిన బ్యాగ్‌తో ఉడాయించాడు. అందులో నెక్లెస్‌తో పాటు ల్యాప్‌ట్యాప్, ఫోన్ కూడా ఉండడంతో బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైమ్ ఎస్ఐ జె. శ్రీకాంత్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఆర్.సీతారాంనాయక్, ఇంతియాజ్ హుస్సేన్‌లు రంగంలోకి దిగారు. అక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. పక్కా సమాచారంతో ఆమేర్‌ను అరెస్టు చేసి నగలు, ల్యాప్‌ట్యాప్‌ను రికవరీ చేశారు. పోలీసుల విచారణలో నిందితుడు గతంలో చందానగర్, హుమాయున్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లుగా తేలింది. నిందితుడిని పట్టుకొని పోగొట్టుకున్న వస్తువులను రికవరీ చేసిన డీఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, కానిస్టేబుళ్లు సీతారాంనాయక్, ఇంతియాజ్ హుస్సేన్‌లను వెస్ట్‌జోన్ డీసీపీ ఎస్ఎం విజయ్‌కుమార్ అభినందించారు.

## నగరంలో నేడు

1. డాక్టర్ సూరి భగవంతం 115 జయంతి వేడుకలను మధ్యాహ్నం 3 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీలోని సీడీఈలో నిర్వహిస్తారు.
2. టిల్‌టాస్క్ సమావేశం బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని టిల్‌టాస్క్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగుతుంది.
3. కళ్ల మార్పిడి ఆపరేషన్లు చేసిన సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో సాయంత్రం 5.45 గంటలకు బంజారా హిల్స్ రోడ్ నెం.2లోని కేఏఆర్ క్యాంపస్‌లో ప్రత్యేక సమావేశం ఉంటుంది.
4. జూబ్లీహిల్స్ వెంకటగిరి ఆదిత్య ఎన్‌క్లేవ్‌లోని టర్కీ కాన్సులేట్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఇండో టర్కీ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ సమావేశం కొనసాగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

# స్క్రాప్ గందరగోళం

## లెక్కలోకి రాకుండానే లక్షల్లో వాహనాలు గల్లంతు

- చోరీకి గురైన వాటిపైనా స్పష్టతనివ్వని స్క్రాప్ పాలసీ
- ఆర్టీఏ రికార్డుల్లో వాహనం ఉన్నా వినియోగంలో లేనివే ఎక్కువ
- అలాంటి వాటిపైన 2 శాతం అదనపు పన్ను వసూళ్లు
- మొక్కుబడిగా స్క్రాప్ పాలసీ



సాక్షి, సిటీబ్యూరో: రవాణాశాఖ కొత్తగా రూపొందించిన వాహనాల స్క్రాప్ పాలసీ గందరగోళంగా ఉంది. వాహనాల తుక్కు ప్రక్రియలో స్పష్టత కొరవడింది. ఆర్టీఏ అంచనాల మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 18 లక్షల వరకు కాలపరిమితి ముగిసిన వాహనాలు ఉన్నాయి. వీటిలో కొన్నింటిని వాటి యజమానులు రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించుకొని వినియోగిస్తున్నారు. మరికొన్ని వాహనాలు వినియోగానికి పనికి రాకుండా మూలనపడ్డాయి. ఆర్టీఏ ప్రమేయం లేకుండానే తుక్కు కింద మారాయి. మరోవైపు లక్షలాది వాహనాలు గల్లంతయ్యాయి. చోరీకి గురైన వాహనాల జాడ లేదు. ఇలా వివిధ రకాలుగా వినియోగంలో లేని వాహనాలపైన తాజా స్క్రాప్ పాలసీలో ఎలాంటి స్పష్టత లేదని వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### కొత్త పాలసీ వల్ల కనిపించని ప్రయోజనం

రవాణాశాఖ లెక్కల్లో మాత్రమే కనిపించే ఈ వినియోగంలో లేని వాహనాలపైన వాహనదారులు పెద్దమొత్తంలో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. కొత్త బండి కొనుగోలు చేసే సమయంలో రెండో వాహనంగా పరిగణించి 2 శాతం పన్నును అదనంగా విధిస్తున్నారు. దీంతో కార్లు, తదితర నాలుగు చక్రాల వాహనాలను కొనుగోలు చేసే వారు రూ.వేలల్లో పన్నులు చెల్లించాల్సి వస్తుంది. మరోవైపు రెండో బండి కింద ద్విచక్ర వాహనాల కొనుగోలుపై కూడా భారం మోపుతున్నట్లు ఆందోళన వ్యక్తమవుతోంది. వినియోగంలో లేని వాహనాలను తుక్కుగా పరిగణించకుండానే రూపొందించిన కొత్త పాలసీ వల్ల వాహనదారులకు ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు.

### అపహరణకు గురైనప్పటికీ..

పోగొట్టుకున్న వాహనాలు లభించకపోవడంతో కొత్తవి కొనుగోలు చేసే సమయంలో 2 శాతం అదనపు పన్ను చెల్లించాల్సి వస్తుంది. అపహరణకు గురైనప్పటికీ ఆ వాహనం సదరు యజమాని పేరిట నమోదై ఉందనే సాకుతో రవాణా అధికారులు అదనపు భారం మోపుతున్నారు. వినియోగంలో లేకపోయినా పన్ను చెల్లించాల్సి రావడం అన్యాయమని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగా రూపొందించిన స్క్రాప్ పాలసీలో తమకు ఊరట లభించవచ్చని చాలామంది భావించారు. కానీ వాటిపైన ఎలాంటి స్పష్టతను ఇవ్వలేదు. వాహనదారులు స్వచ్ఛందంగా స్క్రాప్ చేయవచ్చని మాత్రం వెల్లడించారు.

### పాత వాహనాలపై ఫిర్యాదుల వెల్లువ..

మోటారు వాహన చట్టంలోని నిబంధనల ప్రకారం 15 ఏళ్లు దాటిన రవాణా వాహనాలను కాలపరిమితి ముగిసినవిగా పరిగణిస్తారు. తాజా నిబంధనల మేరకు వాటిని తుక్కు చేయాల్సి ఉంటుంది. ఇక వ్యక్తగత వాహనాల కేటగిరీలోకి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాల కాలపరిమితిని పొడిగించుకోవచ్చు. వద్దనుకుంటే స్వచ్ఛందంగా తుక్కు చేసి కొత్త వాహనం కొనుగోలు చేసుకోవచ్చు. పాతబండి స్క్రాప్ చేయడం వల్ల 2 శాతం అదనపు పన్ను నుంచి ఊరట లభిస్తుంది. అలాగే కొత్త వాహనం జీవితకాల పన్నులోనూ రాయితీ ఇస్తారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ వినియోగంలో లేని వాహనాల సంగతేంటనేది ప్రశ్నార్థకంగా మారింది. కాలపరిమితి ముగిసి వినియోగానికి పనికి రాకుండా ఉన్నవి ఆటోమేటిక్‌గానే తుక్కుగా మారాయి. పెద్ద సంఖ్యలో చోరీకి గురయ్యాయి. అలాంటి వాటిపైన పోలీస్‌స్టేషన్‌లలో, ఆర్టీఏ కార్యాలయాల్లో వేల సంఖ్యలో ఫిర్యాదులు నమోదై ఉన్నాయి. దశాబ్దాలుగా ఈ ఫిర్యాదులు పరిష్కారానికి నోచడం లేదు.

### ఊరించి ఉస్సూరుమనిపించారు..

కాలపరిమితి ముగిసిన వాటిలో ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, లారీలు, డీసీఎంలు, లారీలు, టాటాఏస్‌లు వంటి వివిధ కేటగిరీలకు చెందిన రవాణా వాహనాల కంటే వ్యక్తిగత వాహనాలే ఎక్కువగా ఉన్నాయి. రవాణా వాహనాలకు 15 ఏళ్ల కాలపరిమితి కాగా, వ్యక్తిగత వాహనాలకు నిర్దిష్టమైన పరిమితి లేదు. 15 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి ఐదేళ్లకు ఒకసారి పునరుద్ధరించుకోవచ్చు. దీంతో ఈ కేటరికీ చెందినవి ఎక్కువ. అదే సమయంలో వినియోగంలో లేనివి కూడా వ్యక్తిగత వాహనాల కేటగిరీలోనే అత్యధికంగా ఉన్నాయి. అలాంటి వాటిపైన ఈ పాలసీ ఊరించి ఉస్సూరుమనిపించింది.

## వెన్నెముక సంబంధ సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

– డాక్టర్ ఏవీ గురువారెడ్డి



వరల్డ్ స్పైన్ డే కార్యక్రమంలో డాక్టర్ ఏవీ గురువారెడ్డి తదితరులు

సనత్‌నగర్: వెన్నెముక సంబంధ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోవాలని కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ ఏవీ గురువారెడ్డి అన్నారు. వరల్డ్ స్పైన్ డేను పురస్కరించుకుని బేగంపేటలోని కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్‌లో మంగళవారం స్పైన్ స్క్రీనింగ్ హెల్త్ ప్యాకేజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ వెన్నెముక సంబంధ సమస్యలు తొలి దశలోనే గుర్తించి చికిత్స తీసుకోకపోతే శస్త్ర చికిత్స ఒక్కటే పరిష్కార మార్గమన్నారు. లైఫ్‌స్టైల్ పోచర్స్(శరీర భంగిమలు), సెడంటరీ జాబ్స్, అధిక ఒత్తిడి వంటి జీవనశైలి కారణాల వల్ల వెన్నెముక సంబంధ సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో స్పైన్ సర్జరీ విభాగం అత్యాధునిక సౌకర్యాలు, మినిమల్లీ ఇన్వేజ్ సర్జికల్ టెక్నిక్స్‌తో చికిత్సలు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ ఆధునిక శస్త్ర చికిత్స పద్ధతులతో రోగి త్వరగా కోలుకోవడంతో పాటు జీవన ప్రమాణాలను మెరుగు పర్చుకోవచ్చన్నారు. ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానటరింగ్, కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీ, 3డీ ప్రింటింగ్ సర్జికల్ ప్లానింగ్ వంటి అత్యాధునిక సాంకేతికతతో చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్పైన్ సర్జన్ల బృందం దినకర్, సత్యనారాయణమూర్తి, హిమాన్షు ప్రసాద్, ఆంజనేయులురెడ్డి, మురహరి, జయప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పుల్లినం ఏరో స్పేస్ సంస్థతో ఎంఎల్‌ఆర్‌ఐటీ ఒప్పందం



పుల్లినం ఏరోస్పేస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల

దుండిగల్: చెన్నైకి చెందిన పుల్లినం ఏరో స్పేస్ సంస్థతో దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాలకు చెందిన ఏరోనాటికల్ ఇంజినీరింగ్ విభాగం, పుల్లినం సంస్థ ఒప్పంద పత్రాలపై పరస్పరం సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తమ కళాశాలల్లో విద్యార్థులను ఎల్లవేళలా ప్రోత్సహిస్తామన్నారు. పది సీట్ల విమానాలను తయారు చేయడానికి పుల్లినం ఏరోస్పేస్ సంస్థ తమ కళాశాలతో ఒప్పందం కుదుర్చుకోవడం శుభ పరిణామమని, ఈ ఒప్పందాన్ని కుదిర్చిన తమ కళాశాల ఏరోనాటికల్ విభాగాధిపతి డాక్టర్ ఎం.సత్యనారాయణగుప్తా, అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కే.శ్రీనివాసరావు, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరోనాటికల్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## 20 నుంచి ఫిడే రేటెడ్ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: వారస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు అంతర్జాతీయ ఫిడే రేటెడ్ చెస్ టోర్నీలను నిర్వహించనున్నారు. క్లాసికల్ ఫార్మాట్ టోర్నీ మంగళవారం మొదలుకాగా.. ర్యాపిడ్ ఫార్మాట్ టోర్నీ ఈ నెల 20 నుంచి బిలో 1800 టోర్నీ నవంబర్ 2 నుంచి జరుగుతాయి. ఆదర్శనగర్‌లోని జీపీ బిర్లా సెంటర్‌లో ఈ టోర్నీలను నిర్వహిస్తున్నామని వారస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ రాఘవ్ శ్రీవత్సవ్ తెలిపాడు. ఈ టోర్నీలలో పాల్గొనాలనుకునే వారు ఇతర వివరాలకు ఫోన్: 73968 47937.

## జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుడికి కాంస్యం



సాక్షి, సిటీబ్యూరో: జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తెలంగాణ మరోసారి మెరిసింది. హిమాచల్‌ప్రదేశ్ వేదికగా జరిగిన పోటీల్లో రాష్ట్రానికి చెందిన వెయిట్ లిఫ్టర్ జె.సాయివర్ధన్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. 81 కేజీల యూత్ విభాగంలో అతడు మూడో స్థానంలో నిలిచాడు. స్నాచ్‌లో 111, క్లీన్ అండ్ జర్క్‌లో 142 కేజీలతో కలిపి మొత్తంగా 253 కేజీలు ఎత్తి కాంస్య పతకం సాధించాడు. కోచ్‌లు నాగరాజు, చైతన్య దగ్గర శిక్షణ తీసుకుంటున్న సాయివర్ధన్ రానున్న రోజుల్లో మరిన్ని మెడల్స్ గెలవాలని తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శృతి, సెక్రటరీ వెంకటరమణ ఆకాంక్షించారు. శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, వీసీ ఎండీ సోనీ బాలదేవి అతడిని అభినందించారు. రాబోయే టోర్నీల్లోనూ క్రీడాకారులు రాష్ట్రానికి మరిన్ని పతకాలు అందించాలని వారు ఆకాంక్షించారు.

## లోతుకుంటలో షవర్మ తిని పలువురికి అస్వస్థత

ఇదే హోటల్‌లో కల్తీ ఆహారం తిన్న పలువురు ఆస్పత్రి పాలు




అల్వాల్: ఆహార పదార్థాల విక్రయాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వినియోగదారుల పాలిట శాపంగా మారుతోంది. అల్వాల్ సర్కిల్ పరిధిలోని లోతుకుంటలో గ్రిల్‌హౌస్ షవర్మ విక్రయ కేంద్రంలో ఆహార పదార్థాలు కొనుగోలు చేసిన నలుగురు వినియోగదారులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అల్వాల్ సర్కిల్ ఆహార భద్రత అధికారి లక్ష్మీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. లోతుకుంట గ్రిల్‌హౌస్‌లో ఆదివారం షవర్మ కొనుగోలు చేసిన నలుగురు వినియోగదారులు లోకేష్, గోవర్ధన్, వర్ధిని, శరత్ తీవ్ర అస్వస్థతకు గురై కంటోన్మెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా గ్రిల్ హౌస్‌లో గతంలో సైతం ఇలాంటి ఘటన జరగడంతో అప్పట్లో జీహెచ్ఎంసీ అధికారులు లైసెన్స్ రద్దు చేయడంతో పాటు దుకాణం సీజ్ చేశారు. కొంతకాలం తర్వాత ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణం తెరిచి వ్యాపారం నిర్వహిస్తున్నారు. మళ్లీ అలాంటి ఘటన పునరావృతం కావడంతో అధికారులు శాశ్వతంగా దుకాణాన్ని మూసివేసినట్లు ప్రకటించారు. సేకరించిన శాంపిల్స్‌ను తనిఖీ నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ తెలిపారు.

## ప్రజావాణికి పెరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల అర్జీలు



వీఆర్ఏల సమస్యలు తెలుసుకుంటున్న డా.చిన్నారెడ్డి, దివ్య

- మొత్తం వచ్చినవి 906 అర్జీలు.. 306 'డబుల్' ఇళ్ల కోసమే..
- సమస్యల పరిష్కారానికి తరలివచ్చిన వీఆర్ఏలు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు పోటెత్తాయి. గ్రేటర్ పరిధిలోని వారు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు పెద్దఎత్తున ప్రజావాణికి తరలివచ్చారు. యూరోపియన్ దేశాల్లో తమకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని నమ్మబలికి బంజారాహిల్స్‌కు చెందిన ఓ కన్సల్టెన్సీ తమ వద్ద నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి ముఖం చాటేసిందని బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు ప్రత్యేకంగా లేఖ రాసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. అదేవిధంగా వీఆర్ఏ జేఏసీ కన్వీనర్లు వంగూరు రాములు, బీసం ఆంజనేయులు నేతృత్వంలో రాష్ట్రం నలుమూలల నుంచి భారీ ఎత్తున విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్(వీఆర్ఏ)లు తరలివచ్చారు. 61 సంవత్సరాలు పైబడిన 3,797 మంది వీఆర్ఏ వారసులకు కారుణ్య నియామకం కోసం జారీ చేసిన జీవో నంబర్లు 81, 85లను వెంటనే అమలు చేయాలని ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, స్టేట్ మోడల్ అధికారి దివ్యను కోరారు. విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు సబ్ కమిటీ దృష్టికి తీసుకెళ్తామని, సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కాగా ప్రజావాణిలో మొత్తం 906 దరఖాస్తులు అందాయి. అందులో గృహనిర్మాణ శాఖకు 306, రెవెన్యూ సమస్యలపై 138, విద్యుత్ శాఖకు 138 దరఖాస్తులు వచ్చాయి. అంతేగాకుండా మైనారిటీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 134, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 130, ఇతర శాఖలకు 192 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కో ఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి తెలిపారు.

## విగ్రహాల ధ్వంసం కుట్రపై నిఘా సంస్థలు స్పందించాలి

సాక్షి, హైదరాబాద్: నగరంలో గుళ్లపై దాడులు, దేవతా విగ్రహాల ధ్వంసం వెనకున్న కుట్రపై నిఘా సంస్థలు స్పందించాలని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) అధికార ప్రతినిధి పగుడాకుల బాలస్వామి కోరారు. భాగ్యనగర్‌లో మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు కొందరు మత ఛాందసవాదులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. దుండగులను గుర్తించి భాగ్యనగర్ ప్రతిష్టను కాపాడి శాంతిభద్రతలు అదుపులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నగరంలో దేవాలయాలకు రక్షణ కరువైందని, విగ్రహాలు ధ్వంసం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేవాలయాల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. సంతోష్‌నగర్‌లో అమ్మవారి దేవాలయాన్ని, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దుర్గామాత విగ్రహం ధ్వంసం చేస్తే మతిస్థిమితం లేని వ్యక్తులు చేశారనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

## ప్రొ.సాయిబాబా ఆశయాలను నెరవేరుద్దాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి



ప్రొ.సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చాడా వెంకట్‌రెడ్డి

మల్కాజిగిరి: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తిగా ప్రొఫెసర్ సాయిబాబా చరిత్రలో నిలిచి పోయారని ఆయన ఆశయసాధనలో ముందుకు సాగుదామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. కుటుంబసభ్యులను మంగళవారం ఆయన పరామర్శించి ప్రొ.సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దివ్యాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబా అంచెలంచెలుగా ప్రొఫెసర్ స్థాయికి ఎదిగి ఎందరికో మార్గదర్శకులయ్యారన్నారు. పేద బడుగు బలహీన వర్గాల తరఫున ముఖ్యంగా ఆదివాసుల హక్కుల కోసం పోరాటం చేయడాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీర్ణించుకోలేక తప్పుడు కేసులు పెట్టారన్నారు. ప్రజాస్వామ్యంలో చివరకు న్యాయం గెలిచినప్పటికీ ఆయనను దక్కించుకోలేకపోయామన్నారు. వామపక్షాలు వేరైనప్పటికీ వారి సిద్ధాంతం, గమ్యం ఒక్కటేనన్నారు. నాయకులు అనిల్‌కుమార్, ధర్మేంద్ర, సత్యప్రసాద్, శ్రీమాన్ పాల్గొన్నారు.

### పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

ప్రొ.సాయిబాబా కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమైన ప్రొ.సాయిబాబా అకాలమరణం అందరికీ తీరనిలోటన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, వారికి ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నాయకులు పిట్టల శ్రీనివాస్, జీఎస్వీ సతీష్‌కుమార్, గుండా నిరంజన్, వినోద్‌యాదవ్, ఉమేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక వృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకం

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి




రాయదుర్గం: భారతదేశ ఆర్థిక వృద్ధిలో రాష్ట్రం కీలకపాత్ర పోషిస్తోందని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ ఈ.విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీ) ఆధ్వర్యంలో 'ఐసీసీ తెలంగాణ బిజినెస్ మీట్–2024' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం వేగంగా ఒక ఆర్థిక శక్తిగా రూపాంతరం చెందుతోందన్నారు. రాష్ట్రంలో వ్యూహాత్మక భౌగోళిక ప్రయోజనాల కలయిక, చురుకైన ప్రభుత్వ విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, శక్తివంతమైన వ్యాపార వాతావరణం ఉందన్నారు. ఐటీ రంగం నుంచి వచ్చే పెట్టుబడులు రాష్ట్రంలో కీలకపాత్ర పోషిస్తాయనడంలో సందేహం లేదన్నారు. దేశంలోనే ఔషధాల తయారీకి రాష్ట్రం ప్రముఖ తయారీ కేంద్రంగా మారిందని చెప్పారు. వ్యాపార, వాణిజ్యరంగాలకు చెందిన వారు రాష్ట్రంలో తమ వ్యాపారాలు, పరిశ్రమలను నెలకొల్పితే ప్రభుత్వపరంగా అన్ని రకాలుగా తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందన్నారు. ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అమేయ ప్రభు మాట్లాడుతూ దేశంలో అత్యుత్తమ పెట్టుబడి అవకాశాలు, దేశవ్యాప్తంగా వ్యాపార ఔత్సాహికులను కనెక్ట్ చేయడానికి ఐసీసీ ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఫారిన్ ట్రేడ్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ వి.భరణి, ఎఫ్ఎస్ఎంఈ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఏపీకే రెడ్డి, ఐసీసీ తెలంగాణ, ఏపీ స్టేట్ కౌన్సిల్ చైర్ రఘునాథన్‌కన్నన్, కో చైర్ వినీత్ తవ్రేవాల్, ఐసీసీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్‌సింగ్ పలువురు వ్యాపార, వాణిజ్య రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కమిటీలపై కసరత్తు

- ప్రతి పంచాయతీ, పురపాలికల్లోని ప్రతివార్డు/డివిజన్‌లో వేయాలని ఉత్తర్వులు
- సత్వరమే పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు
- ఏడుగురితో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కమిటీల రూపకల్పనకు సర్కారు ఆదేశం
- గృహ నిర్మాణ లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలదే కీలకపాత్ర
- నగర శివారుల్లో ప్రజాపాలనలో ఇళ్ల నిర్మాణానికి 4.02 లక్షల దరఖాస్తులు
- నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తంగా 45,500 ఇందిరమ్మ ఇళ్లు



సాక్షి, సిటీబ్యూరో: ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో క్రియాశీలకపాత్ర పోషించిన ఇందిరమ్మ కమిటీలు మళ్లీ తెరపైకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ప్రతి పంచాయతీలో, పురపాలక సంఘాల్లోని ప్రతి/డివిజన్‌లో ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. గత శనివారమే కమిటీలను పూర్తిచేసి పంపాల్సి ఉండగా, దసరా పండుగ, ఆదివారం సెలవులు ఉండటంతో సాధ్యపడలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, పురపాలక సంఘాల్లో కమిషనర్ వెంటనే కమిటీలు పూర్తిచేసి పంపాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కమిటీల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. అయితే క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా ఉండే కార్యకర్తలకే ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పించాలని కాంగ్రెస్ నేతల నుంచి అంతర్గతంగా సందేశాలు వెళ్లినట్లు తెలుస్తోంది.

### సత్వరమే కమిటీల ఏర్పాటుపై చర్యలు

ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో అధికార యంత్రాంగం సత్వరమే కమిటీలను పూర్తిచేసి పంపాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించింది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కమిటీకి బాధ్యత ఉండటంతో కమిటీలను పారదర్శకంగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

### నగర శివారుల్లో 4.02 లక్షల దరఖాస్తులు

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.6 లక్షల ఆర్థిక సాయాన్ని మూడు విడతలుగా అందజేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక గత డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులను స్వీకరించింది. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 13 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మున్సిపల్ సర్కిళ్ల(జీహెచ్ఎంసీ), 29 పురపాలక సంఘాలు, 619 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రజాపాలన కార్యక్రమంలో 4.02 లక్షల మందిపైగా దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లను నిర్మిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 45,500 ఇళ్లను కేటాయించింది. ఇందులో మేడ్చల్ జిల్లాలో 5 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,500, రంగారెడ్డి జిల్లాలో 8 నియోజకవర్గాల్లో 28 వేల ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయి.

### ఇందిరమ్మ కమిటీలే కీలకం

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మొత్తం ఆరుగురు సభ్యులతో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కానున్నాయి. గ్రామస్థాయిలో గ్రామ సర్పంచ్/ప్రత్యేక అధికారి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. స్వయం సహాయక సభ్యుల నుంచి ఇద్దరు మహిళలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించే ముగ్గురు సభ్యులు(అందులో తప్పనిసరిగా బీసీ సామాజిక వర్గం ఒకరు, ఎస్సీ/ఎస్టీ సామాజికవర్గం నుంచి మరొకరు)గా నిర్ణయించారు. పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అదే పురపాలక సంఘాల్లో వార్డు/డివిజన్ కౌన్సిలర్ లేదా కార్పొరేటర్/ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, ఇద్దరు స్వయం సహాయక సభ్యులు, అభివృద్ధి పనుల్లో క్రియాశీలకంగా ఉండే ముగ్గురు సభ్యులు(అందులో బీసీ నుంచి ఒకరు, ఎస్సీ/ఎస్టీ నుంచి మరొకరు), వార్డు ప్రత్యేక అధికారి కన్వీనర్‌గా ఉంటారు. లబ్ధిదారుల ఎంపికలో ఈ కమిటీలే క్రియాశీలక పాత్ర పోషించనున్నాయి.

## స్వదేశీ మేళా వెబ్‌సైట్ ప్రారంభం



స్వదేశీ మేళా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ఆధ్వర్యంలో నగరంలోని పీపుల్స్ ప్లాజాలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు స్వదేశీ మేళా జరుగుతుందని స్వదేశీ జాగరణమంచ్ తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి రచ్చ శ్రీనివాస్, మేళా కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, ప్రచార ప్రముఖ్ కేశవ్ సోని తెలిపారు. స్వదేశీ మేళాకు సంబంధించిన వెబ్‌సైట్, బ్రోచర్‌ను మంగళవారం బర్కత్‌పురలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ స్వదేశీ ఉత్పత్తులు, స్థానిక వ్యాపారస్తులను ప్రోత్సహిస్తూ స్వదేశీ భావజాల విస్తరణ లక్ష్యంగా ఈ స్వదేశీ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జాగరణ మంచ్ ప్రతినిధులను అభినందించారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, బుధవారం, 16, అక్టోబర్, 2024

వడ్డాణం, బంగారపు జడ.. ఓస్ ఈ పేర్లు నిన్నా, మొన్నటివే కదా అంటారా? అయితే కంకణాలు, కంటెలు? 'ఇవెక్కడో విన్న పేర్లలాగే ఉందే' అనుకుంటున్నారా? కాసుల మాలలు, గుట్ట పూసలు? బాబోయ్ ఇవెక్కడి పేర్లు అంటూ ఆశ్చర్యపోతున్నారా? మీరు చాలా పాతకాలం నాటి మోడ్రన్ జ్యువెలరీ ట్రెండ్స్‌కి ఇంకా దూరంగానే ఉన్నారని అర్థం.. 'పాత ఒక వింత.. కొత్త ఒక రోత' అన్నట్టు.. ఆభరణాల ట్రెండ్ కనిపిస్తోంది. మరోవైపు బరువైనా వెరపులేదంటున్న మహిళలు.. వంటి నిండా దిగేసుకుంటున్న నగలన్నీ కలిపితే.. సగటు బంగారం బరువు రెండు కిలోలుగా చెప్పొచ్చు. - సాక్షి, సిటీబ్యూరో



# ఓల్డ్.. గోల్డు..

## పాత మోడళ్లకు కొత్త హంగులు

- జ్యువెలరీలో ఓల్డెస్ట్ డిజైన్స్‌కు పునర్వైభవం
- తిరిగొస్తున్న గుట్ట పూస.. కాసుల మాల
- పాత స్టైల్స్‌కే సై అంటున్న నగరవనితలు
- వేడుకల్లో అలనాటి ఆభరణాలదే హవా

'ఏమిటలా వంటినిండా ఆభరణాలు దిగేసుకున్నావ్? గుళ్లో అమ్మవారిలా?' అంటూ ఆభరణ ప్రియులైన మహిళల్ని ఆటపట్టించే రోజులు గతించనున్నాయి. నడుముకు వడ్డాణాలు, బంగారపు పూలజడలు, కంఠాన్ని కప్పేసే నెక్లెస్‌లు.. వగైరాలన్నీ ఒకనాటి ఫ్యాషన్లే కావచ్చు.. అయితే పాతే వింత అంటున్న ఆధునికులు మోటుగా ఉంటాయంటూ తీసి పారేసిన నగల్ని మోజుగా ఆదరిస్తున్నారు. అంతేకాదు.. మరింతగా వెనక్కు వెళ్లి శోధించి.. మరీ పురాతన ఆభరణశైలుల్ని అందుకుంటున్నారు. మన అమ్మమ్మలు, అవ్వల కాలం నాటి స్టైల్స్‌కు ప్రాణం పోస్తున్నారు.



### కాసుల గలగల..

కాసుల పేర అంటూ తాతల కాలం నాటి సంప్రదాయం మరోసారి కొత్తగా చేస్తున్న సవ్వడి.. ఆధునిక మహిళల మెడలో గలగలమంటోంది. మెడలో వేసుకునే లక్ష్మీ కాసుల మాలలు ఇప్పుడు ట్రెండీ. మామిడి పిందెల రూపంలో ఉండే కాసులను కూడా తయారు చేస్తున్నారు. వీటిని మ్యాంగో మాలలని పిలుస్తున్నారు. కనీసం 25 పైసలంత సైజ్‌లో ఉండే కాసులతో తయారయ్యే మాల కనీసం 30 నుంచి 300 గ్రాముల దాకా బరువు ఉండేవి ధరిస్తున్నారు. వీటి ఖరీదు రూ.2లక్షల నుంచి రూ.10లక్షల దాకా ఉంటుంది.

### గుట్టలు గుట్టలుగా..

ఒకనాటి తెలంగాణ సనాతన సంప్రదాయ ఆభరణం గుట్ట పూసలు. ఇవి ఇప్పుడు బాగా ట్రెండ్ అయ్యాయి. వీటిని షేప్‌లెస్ ముత్యాలతో చేస్తారు. ఏ వయసు వారైనా ధరించవచ్చు. రూ.3లక్షల నుంచి రూ.15లక్షల దాకా వివిధ ధరల్లో లభిస్తున్నాయి.

### కంకణం కట్టుకుంటున్నారు..

మోచేతి అందాన్ని పెంచే గాజులను.. దానికి ముందుగా బంగారు కంకణం ధరించడం అనేది చాలా పాత కాలం నాటి ఆభరణాల శైలి. అయితే ఆధునికులు కూడా ఈ తరహా ట్రెండ్‌ని అనుసరిస్తున్నారు. రెండు చేతులకూ గాజులతో పాటుగా ఒక్కో కంకణం తొడుగుతున్నారు. ఇవి చూసేందుకు లావుగా ఉంటాయి. ఒక్కోటి 30 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకూ బరువులో ఇవి రూ.1లక్ష నుంచి రూ.5లక్షల ధరల్లో లభిస్తున్నాయి.

### కొత్తవాటి 'కంటె' మిన్న..

ఒకప్పటి పూర్తి సంప్రదాయ ఆభరణం అయిన కంటెలు మళ్లీ ట్రెండ్‌లోకి వచ్చాయి. రాజుల కాలంలో ధరించేవారట.. ఇటీవల మహానటి సినిమాలో సావిత్రి పాత్రధారిణి కీర్తి సురేష్ సైతం ధరించి కనిపిస్తుంది. కాళ్లకి పట్టీ టైప్‌లో ఉంటూ, మెడకి ధరించే ఈ కంటె చూడడానికి థిక్‌గా ఒక రాడ్డులా ఉంటుంది. దీనికే పెండెంట్స్, పెరల్ డ్రాప్స్ జోడించడం, అలాగే స్టోన్స్‌తో కార్వింగ్ చేయడం ద్వారా మరింత ఫ్యాషనబుల్‌గా మారుస్తున్నారు. రూ.2లక్షల నుంచి రూ.10లక్షల దాకా వీటి ధరలు ఉంటున్నాయి.



### 'పాత'నగల.. జాతరలా..

మోటుగా ఉండే ఆభరణాలు అంటూ ఇప్పుడు ఎవరూ అభ్యంతరం పెట్టడం లేదు. ఓల్డ్ ట్రెండ్స్‌ని అడిగి మరీ చేయించుకుంటున్నారు. ఇక పెళ్లి వేడుకల్లో అయితే పాత కాలం నాటి ఆభరణాలు తప్పనిసరిగా మారాయి. ఇవి కాస్త ఖర్చుతో కూడుకున్నవే అయితే.. గతంలో ఉన్నత స్థాయి వాళ్లు మాత్రమే ధరించేవారు. ఇప్పుడు మిడిల్‌క్లాస్ కూడా వీటినే ఎంచుకుంటున్నారు.

- శ్వేతారెడ్డి, ఆభరణాల డిజైనర్

---

కూచిపూడిలో నృత్యంలో అవార్డు

ఎనిమిదేళ్ల వయసులో అసామాన్య ప్రతిభ

# ప్రనీల్

## ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్




కూకట్‌పల్లి: కూచిపూడి నృత్యంతో ఏక కాలంలో అత్యధిక సంఖ్యలో హులా హూప్ స్పిన్‌లను ప్రదర్శించినందుకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డును కూకట్‌పల్లికి చెందిన కొమ్మినేని సతీష్, వరలక్ష్మీ దంపతుల కుమారుడు ప్రనీల్ సత్య కొమ్మినేని నెలకొల్పాడు. ఎనిమిది సంవత్సరాల వయసులో 2 నిమిషాల 32 సెకన్ల పాటు కూచిపూడి నృత్యంతో ఏకకాలంలో 303 హులా హూప్ స్పిన్‌లను అతని మెడ, నడుము చుట్టూ ప్రదర్శించాడు.

---

ఖగోళాన్ని ప్రతిబింబించే

# స్టెల్లార్ 2.0

ముయోనియోనలుస్టా ఉల్కతో తయారీ

కాస్మోస్ ప్రేరణతో టైటాన్ నూతన కలెక్షన్



సాక్షి, సిటీబ్యూరో: కాల గమనానికి కళాత్మకతను జోడిస్తూ, ఖగోళ వైభవాల నుంచి ప్రేరణతో రూపొందించిన స్టెల్లార్ 2.0 వాచ్ కలెక్షన్‌ను టైటాన్ మార్కెట్‌లోకి విడుదల చేసింది. ప్రస్తుత దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో విశ్వాంతరాలను ప్రతిబింబించే కాస్మోస్ నేపథ్య కలెక్షన్ నగరవాసులను అలరిస్తుంది. భూమిపై అరుదైన పదార్థాలు కంబాబా జాస్పర్, అవెంచురిన్, టైగర్ ఐ (వైడూర్యము), పురాతన ముయోనియోనలుస్టా ఉల్కల సమ్మిళితంతో సన్–మూన్, మూన్–ఫేజ్, ఓపెన్ హార్ట్, మల్టీ–ఫంక్షన్ వంటి వైవిధ్యాలు ఆకర్షణీయంగా ఉన్నాయని టైటాన్ కంపెనీ ఎండి సికె.వెంకటరామన్ తెలిపారు. ఇందులో చంద్రుని అర్ధరాత్రి వెలుగుల దశలు, గెలాక్సీ నిర్మాణాల ఖగోళ కళాత్మకత విశేషంగా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. ఈ కలెక్షన్ ఆస్ట్రా.. లక్ష సంవత్సరాల పురాతన ముయోనియోనలుస్టా ఉల్కతో రూపొందించింది. ఇది ఉల్కలు, నక్షత్రాల విశ్వ జీవితచక్రాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.



# తరుణ్ తహిల్యానీ.. వెడ్డింగ్ కలెక్షన్స్..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బొటిక్ నిర్వహిస్తున్న ప్రముఖ బాలీవుడ్ డిజైనర్ తరుణ్ తహిల్యానీ.. వెడ్డింగ్ కలెక్షన్స్ సిటీ మార్కెట్లోకి విడుదల చేశారు. ప్రముఖ బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ ఈ కలెక్షన్‌ను విడుదల చేశారని తరుణ్ బ్రాండ్ ప్రతినిధులు తెలిపారు. రానున్న పెళ్లిళ్ల సీజన్ పురస్కరించుకుని రూపొందిన ఈ కలెక్షన్‌లో ఆరి వర్క్, మిర్రర్ వర్క్, జర్దోసీ ఎంబ్రాయిడరీ, ముత్యాల అలంకరణ.. ప్రత్యేకమని, అంగ్రాఖా షెర్వానీ, టైలర్డ్ డిన్నర్ జాకెట్స్ ఆకట్టుకుంటాయని వివరించారు. కాక్‌టైల్, మెహెందీ ఈవెంట్లకు ప్రత్యేకించిన కలెక్షన్ కూడా అందిస్తున్నామన్నారు.

---

# విజ్ఞాన వీచికలు..

## పుస్తక పఠనానికి కేరాఫ్‌గా సనత్‌నగర్, ఎస్‌ఆర్ నగర్ లైబ్రరీలు

సాహిత్యం, ఆధ్యాత్మికం, చరిత్ర గ్రంథాల వేదిక

వివిధ భాషల్లో 30వేల పైచిలుకు పుస్తకాలు

లక్ష్యంపై గురి ఉండాలే కానీ, అక్కడ దొరికే పుస్తక పరిజ్ఞానంతో పోటీ పరీక్షలను సైతం అలవోకగా ఎదుర్కోవచ్చు. సాహిత్యంపై అభిలాష ఉండాలే కానీ, జ్ఞాన సముపార్జనకు అక్కడ కొదవ లేదు.. అంతేనా.. ప్రశాంతత కోరుకునే మనసులకు ఆధ్యాత్మికతత్వాన్ని నూరిపోసే గ్రంథాలకు కేరాఫ్ అది. 'చరిత్ర' పుటల్లో దాగి ఉన్న విశేషాల గుట్టు విప్పే విజ్ఞాన గని. ఒక్కమాటలో చెప్పాలంటే సమస్త విజ్ఞాన వేదిక. వీటి కోసం వేలకు వేలు పోయాలేమో అనుకుంటున్నారా? అదేం లేదు. కేవలం రూ.100ల రిఫండబుల్ ఫీజును చెల్లిస్తే సరి. జీవిత కాలం కావలసిన విజ్ఞానదాయినిని వారు పొందవచ్చు. అదే సనత్‌నగర్, ఎస్‌ఆర్‌నగర్‌లోని హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థలు. తాజా సమాచారాన్ని మోసుకొచ్చే దినపత్రికలతో పాటు వేలాది పుస్తకాల సమాహారంతో ఎంతోమందిని విజ్ఞానవతులుగా తీర్చిదిద్దుతోంది. - సనత్‌నగర్



### అదనపు షెడ్డు అవసరం



ఎస్‌ఆర్‌నగర్ ప్రాంతంలో హాస్టళ్లలో ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారు అధికంగా ఉంటారు. ఈ క్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివేందుకు వస్తుంటారు. ప్రస్తుతం ఉన్న రీడింగ్ హాల్ సరిపోవడం లేదు. భవనంపై షెడ్డు నిర్మాణం జరిపితే మరింత మంది చదువుకునే వెసులుబాటు ఉంటుంది. దాతలు ముందుకొస్తే బాగుంటుంది.

- హరిబాబు, లైబ్రేరియన్




గ్రంథాలయాలు కాలంతో పోటీపడుతూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ సమాచారాన్ని పాఠకుల ముందు ఉంచుతోంది. ఈ రెండు గ్రంథాలయాల్లో వివిధ భాషల్లో 30 వేల పైచిలుకు పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచారు. సాహిత్యం, నవలలు, పురాణగాథలు, ఇతిహాసం, చరిత్ర, చిన్న పిల్లల నీతి కథల పుస్తకాలు, రామాయణ, మహాభారత, భాగవతం వంటి ఆధ్యాత్మిక పుస్తకాలే కాకుండా కాలానికి అనుగుణంగా అధునాతన పరిజ్ఞానాన్ని జోడించిన పుస్తకాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నారు. గ్రూప్ ఎగ్జామ్స్, ఎస్ఐ, కానిస్టేబుల్స్, బీఈడీ, డీఎస్సీ, బ్యాంక్ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ ఇక్కడ లభ్యమవుతోంది. ఉద్యోగ సోపానం, విజేత కాంపిటీషన్స్, ప్రతియోగిత్‌దర్పన్, కాంపిటీటివ్ న్యూస్ మ్యాగజైన్ వంటి పలు రకాల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ప్రధానంగా పేద విద్యార్థుల కెరీర్‌కు దోహదపడేవిధంగా స్టడీ మెటీరియల్ లభిస్తోంది. దీనికి తోడు లేటెస్ట్ సమాచారాన్ని చేరవేసేలా ఒక్కో గ్రంథాలయంలో వివిధ భాషల్లో 12 రకాల దినపత్రికలు, 12 వార పత్రికలు, 2 పక్ష పత్రికలు, 14 మాస పత్రికలు నిత్యం అందుబాటులో ఉంటాయి.

### విద్యార్థులకు వరప్రదాయినిగా

నగరంలోని చిక్కడపల్లి లైబ్రరీ తరువాత స్థానం ఎస్ఆర్‌నగర్‌కే దక్కుతుందంటే అతిశయోక్తి కాదు. దాదాపు 300 మంది వరకూ ప్రతిరోజూ ఈ లైబ్రరీలకు వచ్చి ఎవరి స్థాయిలో వారు విజ్ఞానాన్ని పొందుతారు. ఇక్కడికి వచ్చేవారిలో 80 శాతం మంది విద్యార్థులే కావడం గమనార్హం. చుట్టుపక్కల హాస్టళ్లలో ఉంటూ ఇక్కడికి వచ్చి వివిధ రకాల పుస్తకాలు తిరగేస్తుంటారు. కొందరు జాబ్ ఇంటర్వ్యూల మెళకువల కోసం.. మరికొందరు పోటీ పరీక్షల ప్రిపరేషన్ కోసం వస్తుంటారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకూ లైబ్రరీ పాఠకులతో సందడిగా ఉంటుంది.

---



# 'ఇనార్బిట్'

## వార్షికోత్సవ సందడి

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్‌లోని షాపింగ్, వినోదాల కేంద్రం.. ఇనార్బిట్ మాల్ తమ 15వ వార్షికోత్సవ వేడుకలు యువత నృత్యాలు, ఫ్లాష్ మాబ్‌తో సందడిగా ప్రారంభమయ్యాయి. వైవిధ్యమైన ఈవెంట్లతో సాగే ఈ ఉత్సవాలలో భాగంగా ఫుడ్ కోర్ట్, లైవ్ బ్యాండ్ ప్రదర్శన, కొవ్వొత్తుల తయారీ వర్క్‌షాప్, లాంతర్ మేకింగ్ వర్క్‌షాప్ వంటివి సందర్శకుల కోసం అందిస్తున్నామని మాల్ ప్రతినిధులు తెలిపారు.

# మీట్ అండ్ గ్రీట్..

## నగరంలో ప్రో కబడ్డీ లీగ్ క్రీడాకారుల సందడి



సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మక ప్రో కబడ్డీ లీగ్ మరి కొద్ది రోజుల్లో నగరం వేదికగా ప్రారంభం కానున్న నేపథ్యంలో గుజరాత్ జెయింట్స్, దబాంగ్ ఢిల్లీ, బెంగళూరు బుల్స్ జట్లకు చెందిన క్రీడాకారులు నగరంలో సందడి చేశారు. నగరంలోని తాజ్ డెక్కన్‌లో పరిమ్యాచ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో 'మీట్ అండ్ గ్రీట్' లో కబడ్డీకి సంబంధించి తమ అనుభవాలను పంచుకున్నారు. ఇందులో ప్రో కబడ్డీ లీగ్ స్టార్ ప్లేయర్లు గుమాన్ సింగ్, అషు మాలిక్, పర్దీప్ నర్వాల్ పాల్గొన్నారు. క్రీడాభిమానులతో కొద్దిసేపు ఈ ముగ్గురూ ముచ్చటించారు. కబడ్డీకి సంబంధించిన ప్రశ్నలను అభిమానులకు సంధించి, సరైన సమాధానం చెప్పిన వారికి బహుమతులను అందించారు. అనంతరం ప్లేయర్లతో సెల్ఫీలు దిగుతూ అభిమానులు సందడి చేశారు.

### నమ్మకాన్ని వమ్ము చేయను..

నగరంలో జరగనున్న తొలి దశ పోరులో గుజరాత్ జెయింట్స్ తరపున రైడర్‌గా పలు వ్యూహాత్మక ప్రణాళికలను సిద్ధం చేసుకున్నా. అభిమానులు నా పైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయను. భవిష్యత్‌లో కబడ్డీ క్రీడ మరింత గుర్తింపు రానుంది.

- గుమాన్ సింగ్, గుజరాత్ జెయింట్స్

### కుస్తీలాంటి పోరు..

ఈ సీజన్‌లో ఒక్కో జట్టు ఒక్కో సవాలును విసరడానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో అన్ని కోణాల్లో మెరుగైన ప్రాక్టీస్ చేశాను. కబడ్డీలో రాణించాక జీవితంలో వచ్చిన మార్పు, గుర్తింపు మాటల్లో చెప్పలేను. ఈ గౌరవాన్ని కాపాడుకోడానికి కృషి చేస్తాను.

- అషు మాలిక్, దబాంగ్ ఢిల్లీ

### ప్రత్యర్థిని పోటీగానే భావిస్తా..

ప్రత్యర్థికి చిక్కకుండా పాయింట్లు రాబడుతూ డబ్కీ కింగ్ అనే గుర్తింపును సుస్థిరం చేసుకోవాలి. హైదరాబాద్ నగరంలో ఈ సారి పోటీలు హోరాహోరీగా జరగనున్నాయి. దీనిని ఆస్వాదించడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను.

-పర్దీప్ నర్వాల్, బెంగళూరు బుల్స్

# ఎక్కడి వారక్కడికి వెళ్లాల్సిందే!

## ఏడుగురు ఐఏఎస్‌లకు క్యాట్‌లో ఎదురుదెబ్బ

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో తలెత్తిన ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్)ల కేటాయింపు వివాదంపై సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించిన రాష్ట్ర అధికారులకు ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం (డీవోపీటీ) గత వారం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం ఏ రాష్ట్రానికి కేటాయించిన వారు ఆ రాష్ట్రానికి వెళ్లాల్సిందే అని క్యాట్ తేల్చిచెప్పింది. కేటాయించిన రాష్ట్రంలో బుధవారం రిపోర్టు చేయాలని, ఆ మేరకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆ అధికారులను రిలీవ్ చేయాలని ఆదేశించింది. ఈ నెల 9న డీవోపీటీ ఇచ్చిన ఉత్తర్వులు, దీపక్ ఖండేకర్‌కమిటీ నివేదిక సస్పెన్షన్‌కు నిరాకరించింది. ఎలాంటి మధ్యంతర నిలుపుదల ఉత్తర్వులు కూడా ఇవ్వలేమని స్పష్టం చేస్తూ తదుపరి విచారణ నవంబర్ 1కి వాయిదా వేసింది. ఆలోగా ఖండేకర్ కమిటీ నివేదికతో పాటు కేడర్ కేటాయింపుల్లో డొమిసైల్ (పుట్టిన ప్రదేశం), స్వాపింగ్ (మార్పిడి), రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు సంబంధించి పూర్తి వివరాలను తమ ముందు ఉంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తుది కేటాయింపులు తమ ధర్మాసనం ఇచ్చే తీర్పునకు లోబడి ఉంటాయని తెలిపింది.

### విభజన నాటి నుంచి వివాదం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లకు సంబంధించి కేడర్ వివాదం సాగుతోంది. కొందరు క్యాట్‌ను ఆశ్రయించి ఉపశమనం పొందారు. క్యాట్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేంద్రం తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. ఈ వివాదంలో నిర్ణయం తీసుకునే బాధ్యతను డీవోపీటీకి అప్పగించింది. అధికారుల అభ్యంతరాలను, వినతులను పరిశీలించాలని సూచించింది. దీంతో కేంద్రం ఏర్పాటు చేసిన దీపక్ ఖండేకర్‌కమిటీ అధికారుల విజ్ఞప్తులను తోసిపుచ్చుతూ ఎక్కడి వారు అక్కడికే వెళ్లాలంటూ నివేదిక ఇచ్చింది. కేంద్రం ఆ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే తమను ఏపీ కేడర్‌కు బదులుగా తెలంగాణ కేడర్‌కు కేటాయించాలంటూ ఏడుగురు ఐఏఎస్‌లు, ఇద్దరు ఐపీఎస్‌లు చేసిన విజ్ఞప్తులను డీవోపీటీ తిరస్కరించింది. ఈనెల 16లోగా కేటాయించిన రాష్ట్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. తక్షణమే ఈ ఉత్తర్వులను అమలు చేయాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది.

### సౌకర్యాలున్న చోటే పనిచేస్తాం అంటే ఎలా?

డీవోపీటీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి కాట, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రొనాల్డ్ రోస్, జి.సృజన, శివశంకర్, హరికిరణ్ క్యాట్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. వేర్వేరుగా దాఖలు చేసిన ఈ పిటిషన్లపై మంగళవారం లతా బస్వరాజ్ పట్నే (జ్యుడీషియల్), షాలినీ మిశ్రా (అడ్మినిస్ట్రేషన్)తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. 'అన్ని సౌకర్యాలున్న చోటే మేం పనిచేస్తాం.. వసతులు లేని ప్రాంతాల్లో పని చేయం అంటే ఎలా? సరిహద్దుల్లో విధులు నిర్వహించే వారి పరిస్థితి ఏంటి? విజయవాడలో ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి ప్రాంతానికి వెళ్లి విధులు నిర్వహించాలని మీకు లేదా? కేడర్ కేటాయింపుల వివాదంపై డీవోపీటీ ఏర్పాటు చేసిన ఖండేకర్ కమిటీ చట్టవిరుద్ధమైనప్పుడు ఆ కమిటీకి వినతిపత్రాలు ఎలా ఇచ్చారు? హైకోర్టు చెప్పిన ప్రకారం యూనియన్ ఆఫ్ ఇండియా అంటే ఎవరు వినతిపత్రాలు స్వీకరించాలి? ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలను హైకోర్టులో సవాల్ చేశారా? డొమిసైల్ సర్టిఫికెట్ లేకుంటే ఉద్యోగాల్లో స్థానికులకు అన్యాయం జరుగుతుంది కదా?..' అంటూ ధర్మాసనం పలు ప్రశ్నలు సంధించింది.

### కమిటీ ఏర్పాటు చట్టవిరుద్ధం

వాకాటి కరుణ తరఫు న్యాయవాది లక్ష్మీనరసింహ వాదనలు వినిపిస్తూ.. 'వినతిపత్రాలను తిరస్కరించే అధికారం డీవోపీటీ ఏర్పాటు చేసిన వన్ మ్యాన్ కమిటీ(దీపక్ ఖండేకర్)కి లేదు. కమిటీ ఏర్పాటు చట్టవిరుద్ధం. నేరుగా డీవోపీటీనే వాదనలు వినాలని హైకోర్టు చెప్పింది. వినతిపత్రాలు ఎందుకు తిరస్కరించారో కారణాలు చెప్పలేదు. కరుణ ఏళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నారు. డొమిసైల్ కూడా హైదరాబాదే..' అని తెలిపారు. ఆమ్రపాలి తరఫు న్యాయవాది వాదిస్తూ.. 'స్వాపింగ్‌కు అవకాశం ఇవ్వాలి. ఐఏఎస్ రామ్‌ప్రసాద్ సిసోడియా, బుద్ధప్రసాద్ ఇలా గతంలో స్వాపింగ్ ద్వారా రాష్ట్రాలు మారారు..' అని చెప్పారు. సృజన తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'సృజన సొంత జిల్లా ఏపీలోని చిత్తూరు. డొమిసైల్ ప్రకారం ఏపీకి కేటాయించాలి. కానీ, తెలంగాణకు కేటాయించారు' అని తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన శివశంకర్‌ను ఏపీకి కాకుండా తెలంగాణకు కేటాయించారని ఆయన తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. సివిల్స్ ర్యాంక్ వచ్చినా తెలంగాణ కేడర్ రాకపోవడంతో సొంత రాష్ట్రంలో పని చేయడం కోసం వాణీప్రసాద్ గ్రూప్‌-1 పోస్టింగ్ తీసుకున్నారని ఆమె తరఫు న్యాయవాది చెప్పారు. హైకోర్టు తమ వాదనలు వినలేదని, అభ్యర్థనను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పిందని రొనాల్డ్ రోస్ తరఫు న్యాయవాది వెల్లడించారు. ఎస్టీకి చెందిన హరికిరణ్‌ను జనరల్ కేడర్‌లో కేటాయించడం చట్టవిరుద్ధమని ఆయన తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

### హైకోర్టు స్టే విధించకపోతే నేడు రిలీవ్

ఏపీ కేడర్‌కు డీఓపీటీ కేటాయించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బుధవారం ఏపీలో రిపోర్టు చేయాల్సి ఉండగా, మంగళవారం రాత్రి వరకు వారిని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ కేడర్ నుంచి రిలీవ్ చేయలేదు. క్యాట్ తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో ఆయా అధికారులు దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌పై బుధవారం జరగనున్న విచారణలో వచ్చే నిర్ణయం ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. క్యాట్ తీర్పుపై హైకోర్టు తక్షణమే స్టే విధించడానికి నిరాకరిస్తే అప్పటికప్పుడు సంబంధిత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలున్నాయి. వాస్తవానికి తెలంగాణ కేడర్ నుంచి ఆయా అధికారులను తక్షణమే రిలీవ్ చేస్తూ వారిని ఏపీకి కేటాయిస్తున్నట్టు డీఓపీటీ ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేసింది. టెక్నికల్‌గా మాత్రమే తెలంగాణ ప్రభుత్వం వారిని రిలీవ్ చేస్తూ జీవో ఇవ్వాల్సి ఉంది.

# దోచుకోవడంలో 'స్కిల్' నిజమే

## చంద్రబాబు గత ప్రభుత్వ అవినీతిని నిర్ధారించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

సాక్షి, అమరావతి: ప్రజాధనాన్ని కొల్లగొట్టి అరెస్ట్ అయిన చంద్రబాబుకు సంబంధించిన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా మరోసారి కొరడా ఝుళిపించింది. ఈ కేసులో ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు చంద్రబాబు ముఠాకు సహకరించిన షెల్ కంపెనీ డిజైన్ టెక్ ఎండీ వికాస్ వినాయక్ కన్విల్కర్, సీమెన్స్ కంపెనీ అప్పటి ఎండీ సుమన్ బోస్‌కు చెందిన రూ.23.54 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేసింది. ఢిల్లీ, ముంబై, పుణేల్లోని స్థిరాస్తులతోపాటు వారి పేరిట ఉన్న షేర్లు, బ్యాంకు ఖాతాల్లోని నిధులను అటాచ్ చేసినట్టు ఈడీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇదే కేసులో గతంలో డిజైన్ టెక్‌కు చెందిన రూ.31.20 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో మొత్తంగా రూ.54.74 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లయింది. తద్వారా 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం బరితెగించి సాగించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం మరోసారి చర్చనీయాంశంగా మారింది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అవినీతికి పాల్పడినట్టు మరోసారి జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సిట్ చంద్రబాబును అరెస్ట్ చేయడం రాజకీయ కక్ష సాధింపు చర్య కాదన్నది స్పష్టమైంది. ఎందుకంటే కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ కూడా టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగినట్టు.. షెల్ కంపెనీల ద్వారా నిధులు అక్రమంగా తరలించినట్టు ఆధారాలతో సహా నిర్ధారించి కఠిన చర్యలను వేగవంతం చేయడమే అందుకు నిదర్శనమని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు ఈ కేసు దర్యాప్తులో ఈడీ దూకుడు పెంచడంతో 'స్కిల్' క్రిమినల్స్‌లో గుబులు మొదలైంది.



**పరికరాలు సరఫరా చేయకుండానే చేసినట్టుగా..**

- యువతకు ఉపాధి నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తామనే ప్రాజెక్ట్ పేరిట నిధులు కొల్లగొట్టినట్టు తమ దర్యాప్తులో వెల్లడైందని ఈడీ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంగా వెల్లడించింది. ఈడీ తెలిపిన వివరాల ప్రకారం.. సీమెన్స్ కంపెనీకి అప్పటి ఎండీ సుమన్ బోస్, డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ కన్విల్కర్ తమ సన్నిహితులు ముకుల్ చంద్ర అగర్వాల్ (స్కిల్లర్ కంపెనీ ప్రతినిధి), సురేశ్ గోయల్ (చార్టెడ్ అకౌంటెంట్) ద్వారా ప్రజాధనాన్ని అక్రమంగా దారి మళ్లించారు. ఏపీ ప్రభుత్వానికి ఎటువంటి పరికరాలు సరఫరా చేయకుండానే చేసినట్టుగా బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి నిధులు విడుదల చేశారు.
- ఆ నిధులను షెల్ కంపెనీల బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించి, ఏయే బ్యాంకు ఖాతాల నుంచి సింగపూర్‌కు తరలించారు.. తిరిగి ఆ నిధులు దేశంలోని ఏయే ఖాతాలకు వచ్చాయన్న విషయాన్ని ఈడీ గుర్తించింది. ఇప్పటికే రూ.70 కోట్లు హవాలా మార్గంలో తరలించినట్టు నిర్ధారించింది. చంద్రబాబుకు సన్నిహితులు, ఆ కుంభకోణంతో ప్రమేయమున్న షెల్ కంపెనీల ప్రతినిధులు మొత్తం 26 మందికి నోటీసులు జారీ చేసి పలువురిని విచారించింది. ఈ కేసులో నిందితులు సుమన్ బోస్, వికాస్ ఖన్విల్కర్, ముకుల్‌చంద్ర అగర్వాల్, సురేశ్ గోయల్‌లను అరెస్టు చేయడంతోపాటు విశాఖపట్నంలోని పీఎంఎల్‌ఏ న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేసింది.

**ప్రజాధనం కొల్లగొట్టడమే లక్ష్యంగా అడుగులు**

- 2014లో అధికారంలోకి రాగానే ప్రజాధనాన్ని కొల్లగొట్టడమే చంద్రబాబు లక్ష్యంగా చేసుకున్నారు. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఆ కంపెనీ పేరిట ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌ను తెరపైకి తెచ్చారు. భారత్‌లో ఆ కంపెనీ ఎండీగా ఉన్న సుమన్ బోస్, డిజైన్ టెక్ ఎండీ వికాస్ వినాయక్ కన్విల్కర్ సహకారంతో చంద్రబాబు అక్రమాలకు తెర తీశారు.
- కేబినెట్ ఆమోదం లేకుండానే చంద్రబాబు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్‌ఎస్‌డీసీ) ఏర్పాటు చేసి, అనంతరం ఏపీఎస్‌ఎస్‌డీసీతో సీమెన్స్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకున్నట్టు మభ్యపుచ్చారు. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇతర అంశాలకు సంబంధించిన ఇన్వాయిస్‌లు, ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.370 కోట్లు మాత్రమే ఉన్న ప్రాజెక్ట్ విలువను అమాంతం రూ.3,300 కోట్లకు పెంచేశారు.
- ప్రభుత్వం పది శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్ టెక్ 90 శాతం నిధులు పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు 2015 జూన్ 30న ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం సీమెన్స్–డిజైన్ టెక్ కంపెనీలు ప్రాజెక్ట్ వ్యయంలో 90 శాతాన్ని గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా సమకూరుస్తాయంటూ త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నారు.
- ప్రాజెక్టు వ్యయంగా చెప్పుకున్న రూ.3,300 కోట్లలో 90 శాతం కాదు కదా కనీసం ఒక్క రూపాయి విలువైన ఆర్థిక సహకారంగానీ, వస్తు సహాయాన్ని గానీ అందించ లేదు. కానీ ఏపీఎస్‌ఎస్‌డీసీ తన 10 శాతం వాటాను జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లు డిజైన్ టెక్ కంపెనీకి చెల్లించేసింది. దీనిపై అప్పటి ఆర్థిక శాఖ అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ మరీ నిధులు విడుదల చేయాలని సీఎం హోదాలో చంద్రబాబు ఆదేశించారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఏపీఎస్‌ఎస్‌డీసీ ద్వారా డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు మంజూరు చేశారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రాజెక్ట్ నిధులు కొల్లగొట్టేందుకుగాను చంద్రబాబు ఏకంగా మొత్తం 13 నోట్ ఫైళ్లలో సంతకాలు చేశారు.
- డిజైన్ టెక్‌కు చెల్లించిన రూ.371 కోట్లలో సాఫ్ట్‌వేర్ కొనుగోలు కోసం రూ.56 కోట్లు చెల్లించారు. మిగతా రూ.315 కోట్లను షెల్ కంపెనీల ద్వారా బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి వివిధ దశల్లో అక్రమంగా తరలించారు. షెల్ కంపెనీల సృష్టికర్తలు, దళారుల కమీషన్లు పోనూ రూ.241 కోట్లు హవాలా మార్గంలో హైదరాబాద్‌లోని చంద్రబాబు బంగ్లాకు తరలించారు.

**ఏ–1గా తేలడంతో చంద్రబాబు అరెస్ట్**

- 2018లోనే కేంద్ర జీఎస్టీ అధికారులు షెల్ కంపెనీల్లో నిర్వహించిన తనిఖీల్లో ఈ వ్యవహారం బయట పడింది. దీనిపై అప్పట్లోనే జీఎస్టీ అధికారులు రాష్ట్ర ఏసీబీకి సమాచారం ఇచ్చారు. కానీ చంద్రబాబు ఒత్తిడితో ఆ అంశాన్ని తొక్కిపెట్టారు. ఆ వెంటనే ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆఫీసులో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫైళ్లను మాయం చేశారు.
- 2019లో పుణేకు చెందిన ఓ సామాజిక కార్యకర్త ఈ కుంభకోణం గురించి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్కిల్ స్కామ్‌పై విచారణకు సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. సిట్ దర్యాప్తులో చంద్రబాబు అవినీతి బాగోతం అంతా బట్టబయలైంది. ఈ కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ అంతా చంద్రబాబే అన్నది నిర్ధారణ అయింది. ఈ కేసు విచారణ కోసం చంద్రబాబు మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షెల్ కంపెనీల ప్రతినిధి మనోజ్ పార్థసానిలకు సిట్ నోటీసులు జారీ చేయగానే వారిద్దరూ విదేశాలకు పరారయ్యారు. దాంతో ఈ కేసులో సాక్షులను ప్రభావితం చేస్తున్నారని భావించి ఆయన్ను గత ఏడాది సెప్టెంబర్ 9న అరెస్ట్ చేసింది. ఈ కేసులో చంద్రబాబును ఏ–1గా పేర్కొంటూ ఆయనతోపాటు 9 మంది నిందితులను అరెస్ట్ చేసినట్టైంది.
- సిట్ రిమాండ్ రిపోర్ట్‌తో ఏకీభవించిన విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం చంద్రబాబుకు రిమాండ్ విధించింది. దాంతో చంద్రబాబు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 52 రోజులపాటు రిమాండ్ ఖైదీగా ఉన్న అనంతరం బెయిల్‌పై విడుదల అయ్యారు.

### కడిగిపారేసిన కాగ్

రాజ్యాంగబద్ధ సంస్థ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కూడా చంద్రబాబు హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని నిర్ధారించింది. ఆ ప్రాజెక్టులో రూ.355 కోట్ల మేర ఖజానాకు గండి పడిందని నిగ్గు తేల్చింది. వాస్తవ లెక్కల ప్రకారం ప్రాజెక్ట్ విలువను రూ.370 కోట్లుగా చూపించి ఉంటే ప్రభుత్వం తన వాటాగా రూ.33 కోట్లు మాత్రమే విడుదల చేయాలి. అయితే అంచనాలను అమాంతం పెంచేసి రూ.3,300 కోట్లుగా చూపించి ప్రభుత్వ వాటా 10 శాతంతోపాటు జీఎస్టీ, ఇతర అంశాలను కలిపి ఏకంగా రూ.371 కోట్లు విడుదల చేశారు. రూ.333 కోట్లు కొల్లగొట్టారు. ప్రాజెక్టు మొదలు కాకుండానే నిధులను విడుదల చేయడంతో ప్రభుత్వం రూ.22 కోట్లు వడ్డీ రూపంలో రావాల్సిన ఆదాయాన్ని కోల్పోయింది. వెరసి ప్రభుత్వ ఖజానాకు రూ.355 కోట్ల నష్టం వాటిల్లిందని కాగ్ తెలిపింది.

### సీబీఐకి అప్పగించాలి

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో గతంలో చంద్రబాబుపై సిట్ నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న కేసులను సీబీఐకి అప్పగించాలని కోరుతూ సామాజిక కార్యకర్త తిలక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసుల్లో ప్రధాన నిందితుడు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉండటంతో సిట్ దర్యాప్తు పారదర్శకంగా సాగదని ఆ పిటిషన్లో పేర్కొన్నారు. కాబట్టి సీబీఐకి అప్పగించాలని కోరారు. ఈ పిటిషన్ న్యాయస్థానంలో విచారణలో ఉంది.

### ఇక టీడీపీ ప్రభుత్వ పెద్దల పాత్రపై ఈడీ కన్ను

స్కిల్ స్కాం కేసులో ప్రధాన నిందితుడి (ఏ1)గా చంద్రబాబును పేర్కొంటూ న్యాయస్థానంలో దాఖలు చేసిన చార్జ్‌షీట్ కాపీని సిట్ ఈ ఏడాది మార్చిలోనే ఈడీకి పంపింది. ఈ కుంభకోణంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ పెద్దల పాత్రపై ఈడీ ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉంది. ఇప్పటికే షెల్ కంపెనీ అక్రమాలను వెలికి తీసి, కఠిన చర్యలు చేపట్టిన ఈడీ.. ఈ కుంభకోణం సూత్రధారులు, అంతిమ లబ్ధిదారులు అయిన టీడీపీ ప్రభుత్వ పెద్దల పాత్రపై దర్యాప్తు వేగవంతం చేస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ కేసులో ఈడీ దూకుడు పెంచేసరికి టీడీపీ పెద్దలు బెంబేలెత్తిపోతున్నారు. దాంతో తమకు అలవాటైన రీతిలోనే ఫేక్ న్యూస్ (తప్పుడు సమాచారం)ను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. స్కిల్ స్కాం కేసులో చంద్రబాబుకు ఈడీ క్లీన్ చిట్ ఇచ్చినట్టు ప్రచారం చేస్తున్నారు. అయితే ఈడీ మంగళవారం జారీ చేసిన అధికారిక ప్రకటనలో చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇచ్చినట్టు ప్రకటించ లేదు. షెల్ కంపెనీల ప్రతినిధులపై తీసుకున్న చర్యలను తెలిపింది. చంద్రబాబుతో పాటు అప్పటి టీడీపీ ప్రభుత్వ పెద్దల పాత్రపై ఈడీ ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉంది.

# ఏపీలో సాక్షి టీవీ, ఎన్‌టీవీ, టీవీ9 ప్రసారాల నిలిపివేత

కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి తెచ్చిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఏపీలో సాక్షి టీవీతోపాటు టీవీ9, ఎన్‌టీవీ ప్రసారాలను నిలిపేయాలంటూ కేబుల్ ఆపరేటర్లపై ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి తెచ్చింది. తక్షణమే ఆ టీవీల ప్రసారాలను నిలిపేయకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని కేబుల్ ఆపరేటర్లకు ఒక మంత్రి అల్టిమేటం జారీచేశారు. ఆ ఒత్తిళ్లకు తలొగ్గిన కేబుల్ ఆపరేటర్లు విజయవాడ, గుంటూరు, కర్నూలు నగరాల్లో మంగళవారం సాక్షి టీవీ, ఎన్‌టీవీ, టీవీ9 ప్రసారాలను నిలిపేశారు. మిగతా ప్రాంతాల్లోను ప్రసారాలను నిలిపేయాలంటూ కేబుల్ ఆపరేటర్లపై ప్రభుత్వం తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తోంది. టీవీ ప్రసారాలను నిలిపేయరాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేస్తూ.. టెలికమ్ రెగ్యులేటర్ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నిబంధనలను తుంగలో తొక్కుతూ మీడియా స్వేచ్ఛను ప్రభుత్వం కాలరాస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడి.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొలువుదీరక ముందే పచ్చమూకలు అరాచకాలు, ఆకృత్యాలకు తెరలేపాయి. ఎల్లో మీడియా మినహా మిగతా జాతీయ మీడియాతోపాటు మిగతా మీడియా సంస్థలు ఉన్నది ఉన్నట్లుగా.. కూటమి ప్రభుత్వ అరాచకాలను కళ్లకు కట్టినట్లు అప్పట్లో చూపాయి. తమ అరాచకాలు, ఆకృత్యాలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లిన మీడియా సంస్థలపై చంద్రబాబు కన్నెర్ర చేశారు. దీంతో చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయకముందే సాక్షి టీవీతోపాటు మరికొన్ని టీవీల ప్రసారాలను నిలిపేయాలని కేబుల్ ఆపరేటర్లను పచ్చమూకలు బెదిరించాయి. దీంతో అప్పట్లో సాక్షి టీవీతోపాటు మరికొన్ని టీవీ చానళ్ల ప్రసారాలను కేబుల్ ఆపరేటర్లు నిలిపేశారు. సుప్రీంకోర్టు తీర్పును తుంగలో తొక్కుతూ, మీడియా స్వేచ్ఛను హరిస్తూ టీవీల ప్రసారాలను ఆపేయడంపై వైఎస్సార్‌సీపీ ట్రాయ్‌కి ఫిర్యాదు చేసింది. ట్రాయ్ కన్నెర్ర చేయడంతో సాక్షి టీవీతోపాటు మరికొన్ని చానళ్ల ప్రసారాలను కేబుల్ ఆపరేటర్లు పునరుద్ధరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం.. ఇసుక, మద్యం స్కామ్‌లకు తెరతీయడంతో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో అప్పుడే వ్యతిరేకత పెల్లుబుకుతోంది. తమ కుంభకోణాలు, అరాచకాలు బహిర్గతమైతే ప్రజావ్యతిరేకత మరింత పెరుగుతుందని ప్రభుత్వ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. భజన చేసే ఎల్లో మీడియా మినహా మిగతా మీడియా సంస్థల ప్రసారాలను నిలిపేయడం ద్వారా తమ తప్పులను కప్పెట్టుకోవాలన్న పన్నాగంతో కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి తెచ్చి సాక్షి టీవీతోపాటు మరికొన్ని టీవీ చానళ్ల ప్రసారాలను ఆపేయించారనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.

# విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వం

- సుప్రీంకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- నీట్ స్థానికత వ్యవహారంపై విచారణ
- స్థానికతపై సుదీర్ఘ విచారణ అవసరమన్న విద్యార్థి తరఫు న్యాయవాదులు
- నవంబర్ 11 తర్వాత విచారిస్తామన్న ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: నీట్ స్థానికత విషయంలో ఇప్పటికే కోర్టు ఆదేశాలతో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది రానివ్వబోమని దేశ సర్వోన్నత న్యాయస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని హైకోర్టును ఆశ్రయించిన 135 మందికి కౌన్సెలింగ్‌కు అవకాశం ఇచ్చామని, వారంతా అడ్మిషన్లు కూడా పొందినట్టు ధర్మాసనానికి తెలిపింది. వైద్యవిద్య సీట్ల భర్తీలో భాగంగా స్థానికత వ్యవహారంపై మరోసారి మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో 33ని తీసుకొచ్చింది. నీట్‌కు ముందు నాలుగు సంవత్సరాలు స్థానికంగా చదవాలని జీవో 33లోని నిబంధన 3 (ఏ)లో స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్‌తోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలేవీ రూపొందించలేదని సెప్టెంబర్ 5న హైకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది.

**స్థానికత అంశంలో మరింత స్పష్టత అవసరం**

తొలుత విద్యార్థుల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఈ కేసుపై అత్యవసర విచారణ జరగాల్సిన అవసరం ఉందని, కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసిందని, ఇంకా ఆలస్యం జరిగితే విద్యార్థులకు నష్టం జరిగే ప్రమాదం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే ముగిసిందని, న్యాయస్థానం ఆదేశాల మేరకు కోర్టును ఆశ్రయించిన విద్యార్థులను కౌన్సెలింగ్‌కు అనుమతించామని, వారు అడ్మిషన్లు కూడా పొందారని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటుందా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అవును అనే సమాధానం ప్రభుత్వం చెబుతుండగా.. విద్యార్థుల తరఫు న్యాయవాది స్థానికత వ్యవహారం ఇంకా తేలలేదని, అది ఇంకా పెండింగ్‌లోనే ఉందని దీనిపై సుదీర్ఘ వాదనలు జరగాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టుకు తెలి పారు. ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందని, విద్యార్థుల ను ఇబ్బంది పెట్టబోమని మరోసారి ధర్మాసనానికి ప్రభు త్వం స్పష్టత ఇచ్చింది. దీనిపై మరింత సుదీర్ఘ విచారణ అవసరం అని భావించిన ధర్మాసనం నవంబర్ 11 తర్వాత వాదనలను వింటామంటూ కేసు వాయిదా వేసింది.

# ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా ముగ్గురు న్యాయవాదుల పేర్లు

- కుంచం మహేశ్వరరావు, తూట చంద్ర ధనశేఖర్, చల్లా గుణ రంజన్ పేర్లు సిఫారసు
- సుప్రీంకోర్టు సీజే జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం తీర్మానం


కుంచం మహేశ్వర రావు


చల్లా గుణ రంజన్


తూట చంద్ర ధనశేఖర్

సాక్షి, అమరావతి /సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తుల పోస్టులకు ముగ్గురు న్యాయవాదుల పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల కొలీజియం మంగళవారం తీర్మానం చేసింది. హైకోర్టులో న్యాయవాదులుగా వ్యవహరిస్తున్న మహేశ్వరరావు కుంచం, తూట చంద్ర ధనశేఖర్, చల్లా గుణరంజన్ కొలీజియం సిఫారసు చేసిన వారిలో ఉన్నారు. ఈ ముగ్గురి పేర్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసిన తరువాత ప్రధాని కార్యాలయం ద్వారా రాష్ట్రపతికి చేరతాయి. రాష్ట్రపతి ఆమోదముద్ర అనంతరం వారి పేర్లను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. ఈ ఏడాది మే 15వతేదీన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని కొలీజియం మొత్తం ఆరుగురు న్యాయవాదుల పేర్లను హైకోర్టు న్యాయమూర్తుల పోస్టులకు సిఫారసు చేసింది. మహేశ్వరరావు, ధనశేఖర్, చల్లా గుణరంజన్, ఇడంకంటి కోటిరెడ్డి, గోద రాజాబాబు, గేదెల తుహిన్ కుమార్ పేర్లను సుప్రీంకోర్టుకు పంపింది. కేంద్ర హోంశాఖ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ద్వారా వారి వివరాలు సేకరించింది. మే నెల నుంచి అవి కేంద్రం వద్దే పెండింగ్‌లో ఉండిపోయాయి. కేంద్ర న్యాయశాఖ ఇటీవల వారి పేర్లను సుప్రీంకోర్టుకు పంపింది. దీనిపై చర్చించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడిన కొలీజియం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైంది. గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా పని చేసి ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కొనసాగుతున్న నలుగురి అభిప్రాయాలు కూడా అంతకు ముందే తీసుకుంది. వారందరూ కూడా న్యాయమూర్తుల పోస్టులకు ముగ్గురు తగిన వారని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన కొలీజియం సమావేశంలో మహేశ్వరరావు, ధనశేఖర్, గుణ రంజన్ పేర్లకు ఆమోదం తెలిపింది. న్యాయమూర్తులుగా ఈ ముగ్గురిని నియమించే విషయంలో వీరి నైతిక నిష్ఠకు సంబంధించి కేంద్రం నుంచి ఎలాంటి ప్రతికూల నివేదికలు లేవని కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఆ ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులయ్యేందుకు అన్ని రకాలుగా అర్హులని స్పష్టం చేసింది.

# ఏఐఐబీతో రుణాల పునర్వ్యవస్థీకరణ

- ఆసక్తి వ్యక్తం చేసిన బ్యాంకు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి తదితర ప్రాజెక్టుల నిర్మాణం కోసం.. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ పేరుతో తీసుకున్న రుణాల పునర్వ్యవస్థీకరణకు సహకరించడానికి ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ముందుకు వచ్చింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం జలసౌధలో ఏఐఐబీ ప్రతినిధులతో సమావేశమై ఈ అంశంపై చర్చించారు. కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా సుమారు 11 శాతం అధిక వడ్డీలతో తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపులకు ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ.11వేల కోట్లను ఖర్చు చేయాల్సి వస్తోంది. అధిక వడ్డీల భారాన్ని తగ్గించుకోవడానికి రుణాలను పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయం తీసుకుంది. తక్కువ శాతం వడ్డీలు, తిరిగి చెల్లింపులకు అధిక గడువులతో కొత్త రుణాలను తీసుకుని కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలను పునర్వ్యవస్థీకరించడానికి ప్రయత్నాలు చేస్తోంది. దీనికి సహకరించాలని మంత్రి ఉత్తమ్ ఏఐఐబీ ప్రతినిధులను కోరగా, వారు సానుకూలంగా స్పందించారు. రుణాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన విధివిధానాలను రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి ఖరారు చేయాలని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను మంత్రి ఆదేశించారు. వెనకబడిన ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు గిరిజన జనాభా అధికంగా ఉన్న ములుగు జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు రుణ సహాయం అందించాలని బ్యాంకు ప్రతినిధులను కోరారు. రుణాల పునర్వ్యవస్థీకరణతో వడ్డీల భారం తగ్గితే మిగిలే నిధులను ఎస్ఎల్‌బీసీ, పాలమూరు–రంగారెడ్డి, డిండి వంటి పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి వినియోగిస్తామని ఉత్తమ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ అనిల్‌కుమార్, డిప్యూటీ ఈఎన్‌సీ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చేతికందే ఎత్తులో తీగలు

- విద్యుదాఘాతంతో రైతు మృతి
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తుల ఆగ్రహం
- సిద్దిపేట జిల్లాలో ఘటన




తక్కువ ఎత్తులో కరెంట్ తీగలు (ఇన్‌సెట్‌లో) గోరిట గురువారెడ్డి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో చేతికి అందే ఎత్తులోనే వేలాడదీసిన కరెంటు తీగలు తగిలి రైతు మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని తొగుట మండలంలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గుడికందుల గ్రామానికి చెందిన గోరిట గురువారెడ్డి (48) తనకున్న ఎనిమిది ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ భార్య రమ, కుమారుడు లోకేశ్‌రెడ్డి, కూతురు ఆకాంక్షలను పోషిస్తున్నాడు. పొలంలో సాగు చేసిన మక్క పంటను కోసిన అనంతరం ఆరుతడి సాగు కోసం స్ప్రింకర్ పైపులను ఏర్పాటు చేస్తున్నాడు. ఈ క్రమంలో పొలంలో చేతికి అందే ఎత్తులో ఉన్న కరెంటు తీగలకు స్ప్రింకర్ ఇనుప పైపు తగిలి కరెంటు షాక్‌తో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి సిద్దిపేట జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే...**

వ్యవసాయ పొలాల్లో కరెంటు తీగలు చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నాయని, సరిచేయాలని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని గుడికందుల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సకాలంలో సరిచేస్తే రైతు గురువారెడ్డి కరెంటు షాక్‌కు బలయ్యేవాడు కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు ప్రపంచ ఆహార దినోత్సవం



రేవంత్ హిమత్‌సింగ్‌కా

# లేబుల్.. డేంజర్ బెల్

## చదివితే ఉన్న మతి పోతుంది!

**ప్యాకెట్ మీద సగం కోసిన ఆరెంజ్ పెద్ద అక్షరాలతో 'సి విటమిన్ సమృద్ధితో' అని ఉంటుంది. 'మీరు ప్యాకెట్ వెనుక ఉన్న లేబుల్ చదవండి' అంటాడు రేవంత్ హిమత్‌సింగ్‌కా. లేబుల్ మీద 0.9 పర్సెంట్ ఆరెంజ్ ఫ్రూట్ పౌడర్ అని ఉంటుంది. అంటే ఒక శాతం ఆరెంజ్, మిగిలిన 99 శాతం కెమికల్. 'లేబుల్ చదివితే మీరు ఆ విషాన్ని ఇంటికి తేరు' అంటాడు ఈ హెల్త్ చాంపియన్. ప్రపంచ ఆహార దినోత్సవం సురక్షితమైన ఆహారాన్ని కల్పించుకోమంటోంది. 'దేశమా... లేబుల్ చదువు' ఉద్యమం ఒక అవసరమైన చైతన్యం.**

'గుర్తు పెట్టుకోండి. ఏది ఎక్కువ రోజులు ప్యాకెట్‌లో నిల్వ ఉంటుందో అది మనకు ఎక్కువ అపాయం కలిగిస్తుంది' అంటాడు రేవంత్ హిమత్ సింగ్‌కా.

అమెరికాలో చదువుకుని, మల్టీ నేషనల్ కంపెనీలో పనిచేస్తూ అవన్నీ వదులుకొని ఇండియాలో ఫుడ్ రెవల్యూషన్ తేవాలని వచ్చేసిన ఈ కోల్‌కతా కుర్రాడు బడాబడా కంపెనీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాడు. రావడం రావడమే ముందు బోర్నవిటా హెల్త్‌డ్రింక్ కాదని చేసిన వీడియో సంచలనం సృష్టించింది. కేంద్రప్రభుత్వం బోర్నవిటా యజమాని అయిన క్యాడ్‌బరీకి నోటీసు ఇచ్చి ఇక మీదట లేబుల్ మీద హెల్త్ డ్రింక్ అని వేయకూడదని చెప్పింది. ఆ మాట చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు... లేబుల్ చదివి ఉంటే మనకే తెలిసేది అంటాడు హిమత్ సింగ్‌కా. ఎందుకంటే 400 గ్రాముల బోర్నవిటాలో 50 గ్రాముల చక్కెర ఉంది. లిక్విడ్ గ్లూకోజ్ ఉంది. కృత్రిమ రంగులు ఉన్నాయి. నిల్వకారకాలైన రసాయనాలు ఉన్నాయి. ఇవన్నీ చూపి అతడు సంధించిన ప్రశ్నలకు గొప్ప స్పందన వచ్చింది. ప్రస్తుతం అతడు ప్యాకేజ్డ్ ఫుడ్ మీద చేస్తున్న వీడియోలు అతణ్ణి ఫుడ్ క్రూసేడర్ అని పిలిచేలా చేస్తున్నాయి.

### పదార్థం గుట్టు ప్యాకెట్ వెనుక

కాలం చాలా మారింది. మన తాత, తండ్రులు అంగడికి వెళ్లి సరుకులు తెచ్చుకునే వారు. అవి కొన్నాళ్లకు పాడైపోయేవి. కాబట్టి అవసరమైనంత వరకే తెచ్చుకునేవారు. ఇప్పుడు మాల్, మార్ట్‌ల కల్చర్ వచ్చింది. ప్యాకేజ్డ్ ఫుడ్ అందుబాటులోకి వచ్చింది. వెళ్లి కొనుక్కొస్తే రెండు మూడు నెలలకు కూడా పాడుకావు. ఈ ప్యాకేజ్డ్ ఫుడ్‌ను 'ఎఫ్ఎంసిజి' (ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) అంటారు. వీటిలో కొన్ని 'ఆరోగ్యకరమైనవి'గా, 'ఆరోగ్యానికి మేలు చేసేవిగా' చెప్పుకుని అమ్మకాలు పెంచుకోవాలని చూస్తాయి. 'లేబుల్ మీద చూస్తే అవి మీకు హాని చేసేవిగా తెలుస్తుంది' అంటాడు హిమత్ సింగ్‌కా.

ఇవాళ దేశానికి 'కాన్షియస్ కాపిటలిజమ్' కావాలనేది హిమత్ నినాదం. అంటే బాధ్యతాయుతమైన పెట్టుబడి దారీ వ్యవస్థ. ముఖ్యంగా ఆహార రంగంలో ఈ బాధ్యత మరింత ఎక్కువ ఉండాలంటాడు అతను. ఇవాళ మన దేశం ఏటా 50 వేల కోట్ల రూపాయల పామాయిల్‌ను దిగుమతి చేసుకుంటోంది. దీన్ని ప్యాకేజ్డ్ ఫుడ్‌లో విస్తారంగా ఉపయోగిస్తారు. 'హార్ట్ ఎటాక్‌లకు పామాయిల్ కూడా ఒక కారణం' అంటాడు హిమత్.

### కోర్టు కేసులు ఎదుర్కొంటూ

ప్యాకేజ్డ్ ఫుడ్‌లోని మోసాలను బయట పెడుతున్నందుకు పెద్ద పెద్ద సంస్థలు హిమత్ మీద కత్తి కట్టాయి. కోర్టుకు ఈడ్చాయి. మొదట్లో భయపడినా ఇప్పుడు లెక్క చేయడం లేదు. 'నన్ను కోర్టుకు లాగితే మిమ్మల్ని బజారుకు లాగుతా' అంటున్నాడు హిమత్. కొన్ని కంపెనీలు రకరకాల చోట్ల కేసులు వేసి ఇబ్బంది పెడుతున్నాయి. అంటే తన ఊరి నుంచి కాకుండా వేరే ఊళ్లకు అతడు వాయిదాకు హాజరు కావాలి.

### ఇంగ్లిష్‌లో చిన్న అక్షరాల్లో

మ్యాంగో జ్యూస్‌ల పేరుతో ఇవాళ ఫేమస్ అయిన రెండు మూడు బ్రాండ్‌ల లేబుల్స్ చదివితే వాటిలో 20 శాతానికి మించిన మ్యాంగో పల్ప్ లేదని ఆ కంపెనీలే చెప్పడం కనిపిస్తుంది. వైట్ బ్రెడ్ కాదని బ్రౌన్ బ్రెడ్ తీసుకుంటున్నవాళ్లు లేబుల్ మీద చూస్తే కలర్ వల్ల మాత్రమే అది బ్రౌన్ కాని, వాస్తవానికి అది మైదాపిండి అని తెలుసుకుంటారు. కంపెనీ ఆ మాట చెప్పిందికానీ చిన్న అక్షరాల్లో, ఇంగ్లిష్‌లో చెబుతుంది. పీనట్ బటర్‌లో ప్రొటీన్ సమృద్ధిగా ఉంటుందని యాడ్స్ చెబుతాయి. కాని పీనట్ బటర్‌లో క్యాలరీలు తప్ప ప్రొటీన్ 3 శాతానికి మించి ఉండదు.

### మన దేశంలో ఒకలా విదేశాల్లో ఒకలా

ఒకే వ్యాపార సంస్థ మన దేశంలో చిప్స్‌కు నాసిరకం నూనె, యూరప్‌లో నాణ్యతగల నూనె వాడుతుంది. ఎందుకంటే యూరప్‌లో నియమాలు కఠినంగా ఉంటాయి. అలాగే రెండేళ్ల లోపు పిల్లలకు అమ్మే సెరియల్స్‌లో మనదేశంలో యాడెడ్ సుగర్స్ ఉంటాయి. యూరప్‌లో ఉండవు. రెండేళ్లలోపు పిల్లలకు యాడెడ్ సుగర్స్ ఉన్న ఆహారం అంత మంచిది కాదు. తీపికి అడిక్ట్ అయిన పిల్లలు ఇంట్లో ఆరోగ్యకరమైనది పెట్టినా తినరు. అదీ కంపెనీల ఎత్తుగడ. డబ్బా ఆహారం తినే పసికందులు తర్వాతి కాలంలో స్థూలకాయం, డయబెటిస్‌తో బాధ పడే అవకాశం ఉంటుంది. 'మా డ్రింక్ రోజూ తాగితే పొడవు పెరుగుతారు', 'మా నూనె వాడితే గుండెకు మంచిది'... ఇలాంటివి ఏవీ నమ్మొద్దు అంటాడు హిమత్.

### దేశమా.. లేబుల్ చదువు...

'మీరు ఏ వస్తువు కొన్నా దాని వెనుక ఉన్న లేబుల్ చదవండి. చెడ్డ పదార్థాలు ఉంటే నాణ్యంగా తయారు చేయమని గొంతు విప్పండి. మనం ఏకమైతే సంస్థలు మారి మంచి ఉత్పత్తులు అందిస్తాయి. మన ఆరోగ్యాలు మెరుగు పడతాయి. అలాగే ప్రకటనలతో సంబంధం లేకుండా కొన్ని కంపెనీలు నాణ్యమైన పదార్థాలు అందిస్తున్నాయి. వాటిని గుర్తించి కొనడం కూడా మన పనే' అంటాడతను.

ఇవాళ 'వరల్డ్ ఫుడ్ డే'. 'బలవర్ధకమైన, సురక్షితమైన ఆహారం ప్రతి ఒక్కరి హక్కు'. కాని మోసాన్ని గుర్తించడంలో మనమే వెనుక ఉంటే నష్టం మనకే కదా. 'లేబుల్ పఢేగా ఇండియా'. ఇండియా.. లేబుల్ చదువు.

---

భారతీయ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ రాయబారి రష్మికా మందన్నా



'దేవదాస్' చిత్రంలో రష్మికా మందన్నా

# అప్రమత్తంగా ఉందాం... కాపాడుకుందాం

''సైబర్ నేరస్తులు మనల్ని టార్గెట్ చేయడానికి ఎప్పుడూ రెడీగా ఉంటారు. మనం అప్రమత్తంగా ఉండి, మనల్ని మనం కాపాడుకోవాలి'' అంటున్నారు రష్మికా మందన్నా. గత నవంబరులో రష్మికా మందన్నా డీప్‌ఫేక్ వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం గుర్తుండే ఉంటుంది. బ్రిటిష్-ఇండియన్ ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ జరా పటేల్ శరీరానికి రష్మికా ముఖాన్ని పెట్టినట్లు ప్రచారం జరిగింది. ఆ వీడియో రష్మికతో పాటు చాలామందిని షాక్‌కి గురి చేసింది. ఆ తర్వాత కూడా పలువురు తారల ఫేక్ వీడియోలు వైరల్ అయ్యాయి. కాగా, తన గురించి వచ్చిన డీప్‌ఫేక్ వీడియో గురించి స్పందిస్తూ... ''నేను స్కూల్లో, లేదా కాలేజీలో ఉన్నప్పుడు ఇలా జరిగి ఉంటే ఆ పరిస్థితిని ఎదుర్కొని ఉండగలనా? అని ఊహించుకుంటేనే భయంగా ఉంది'' అని రష్మిక అప్పట్లో ట్వీట్ చేశారు. అలాగే ''అందరం కలిసి ఈ ధోరణికొక విరుగుడు కనిపెడదాం'' అని మహిళలకు పిలుపునిచ్చారు కూడా. ఇప్పుడా పిలుపునకు ఒక సాధికారత లభించింది. ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (14సి)కు బ్రాండ్ అంబాసిడర్‌గా కేంద్ర ప్రభుత్వం రష్మికా మందన్నాని నియమించింది. కేంద్ర హోమ్ మంత్రి ఆధ్వర్యంలో ఈ కో ఆర్డినేషన్ సెంటర్ పని చేస్తుంది. రష్మికా మందన్నాని రాయబారిగా ఎంపిక చేసినట్లు మంగళవారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సైబర్ సేఫ్టీ జాతీయ ప్రచారోద్యమ రాయబారిగా తాను నియమితమైన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పేర్కొని, ఓ వీడియో విడుదల చేశారు రష్మిక. ఆ వీడియోలో ''మనం డిజిటల్ యుగంలో బతుకుతున్నాం. సైబర్ క్రైమ్ అనేది చాలా భారీ స్థాయిలో ఉంది. దాని ప్రభావం ఎంత ఉంటుందో స్వయంగా అనుభవించిన వ్యక్తిగా మన ఆన్‌లైన్ ప్రపంచాన్ని కాపాడుకోవడానికి కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాను. మనందరం కలిసి మన కోసం, భవిష్యత్తు తరాల కోసం సురక్షితమైన సైబర్ స్పేస్‌ని రూపొందించుకుందాం. సైబర్ క్రైమ్స్ గురించి వీలైనంత ఎక్కువమందికి అవగాహన కల్పించి, రక్షించాలని అనుకుంటున్నాను. సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఈ నేరాలపై అవగాహన పెంచుతాను. మన దేశాన్ని సైబర్ నేరాల నుంచి కాపాడడానికి నా వంతు కృషి చేస్తాను'' అని పేర్కొన్నారు రష్మికా మందన్నా. ఇక దాదాపు ఏడాది క్రితం (నవంబరు 6) రష్మిక సైబర్ క్రైమ్ బాధితురాలు... ఏడాది తిరక్క ముందే ప్రజల్ని బాధితులు కానివ్వకుండా జాగృతం చేయనున్న సైబర్ యోధురాలు. ఇదిలా ఉంటే... కెరీర్ పరంగా 'దేవదాస్' (2018) చిత్రంలో ఇన్‌స్పెక్టర్ పూజగా నటించారు రష్మిక. తెరపై తన బాధ్యతను నిర్వర్తించడానికి కృషి చేశారు. ఇప్పుడు నిజ జీవితంలో సైబర్ సెక్యూరిటీ అంబాసిడర్‌గా తన బాధ్యతను చాలా సిన్సియర్‌గా నిర్వర్తించాలని బలంగా నిర్ణయించుకున్నారు.

---

లీగల్

## వీలునామాను ఎన్నిసార్లయినా మార్చవచ్చు

**నేను ఇదివరకే వీలునామా రాసి ఉంచాను. అలా వీలునామా రాసిన విషయం నా కుటుంబ సభ్యులకు, స్నేహితులకి చెప్పి ఉంచాను. ఇప్పుడు ఆ వీలునామాను మార్చాలనుకుంటున్నాను. వీలవుతుందా?**

**– వి. కోటేశ్వరరావు, విజయవాడ**

మీరు సంపాదించిన ఆస్తులపై, మీకు సంక్రమించిన ఆస్తులపై వీలునామా రాయడం అనేది మీ హక్కు. మీ జీవిత కాలంలో మీ వీలునామాని మీరు కావాలి అంటే మార్చుకోవచ్చు. అయితే అలా మార్చుకోవాలి అనుకున్నప్పుడు గతంలోనే మీరు వీలునామా రాసిన విషయాన్ని, అందులోని అంశాలను, వివరాలను ప్రస్తావిస్తూ, పాత వీలునామా ఇక చెల్లదు అని మీరు రాయబోయే వీలునామాలో పేర్కొనాల్సి ఉంటుంది. మీ వీలునామాలో మీరు కావాలి అంటే 'మరలా ఒకసారి కూడా వీలునామా మార్చవచ్చును' అని, అలా మార్చకపోతే ఇదే ఆఖరి వీలునామా అవుతుంది అని కూడా రాయించవచ్చు.

మీరు వీలునామా రాసిన విషయాన్ని ఇప్పటికే మీ బంధుమిత్రులకు, స్నేహితులకు చెప్పాను అని అన్నారు. అలాంటి వీలునామాలు చట్టరీత్యా చెల్లినప్పటికీ మీ తదనంతరం మీ ఆస్తిలో భాగం కోరుకునే వారు ఎవరైనా ఆ వీలునామా సరైనది కాదు అని లేదా మరొక కారణం చూపి లేనిపోని కేసులు వేయవచ్చు. సొంతంగా రాసుకున్న వీలునామాలలో కచ్చితంగా పొందుపరచవలసిన కొన్ని అంశాలను విస్మరించడం తరచుగా చూస్తుంటాం. అలాంటి వీలునామాలు కోర్టు కేసులలో బలమైన అంశాలుగా పరిగణించబడవు. వీలునామాలో మీరు పేర్కొనే వారసులు ఒకవేళ మైనర్ అయితే, వారికి గార్డియన్ను నియమించటం, శానిటీ ఓత్ (చిత్తశుద్ధి ప్రమాణం/ధ్రువీకరణ) చేయటం, అచ్చుతప్పులు లేకుండా రాయటం, ఆస్తి వివరాలను క్షుణ్ణంగా వివరించటం వంటి అంశాలు వీలునామా చెల్లుబాటుకు అవసరం. అలా లీగల్ గా చెల్లుబడి అయేలా మెరుగైన వీలునామాను మీ దగ్గరలోని లాయర్‌తో రాయించుకుని, వీలునామాలో మీరు పొందుపరచాలి అనుకున్న నిబంధనలు ఏవైనా ఉంటే అవి చట్టరీత్యా చెల్లుతాయా లేదా అనే అంశాలను కూడా అడిగి తెలుసుకోవడం మంచిది. మరో ముఖ్య విషయం ఏమిటంటే, మీరు రాసిన వీలునామాను రిజిస్టర్ చేయించుకోవడం ఉత్తమం. అలా రిజిస్ట్రేషన్ చేయించిన వీలునామా అయితే మీ తదనంతరం కూడా అందరికీ అన్ని విధాలా మేలు చేస్తుంది. మీరు అనుకున్న విధంగా మీ వీలునామా అమలుకు నోచుకుంటుంది.



**– శ్రీకాంత్ చింతల**
**హైకోర్టు న్యాయవాది**

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.com కు మెయిల్ చేయవచ్చు.

---

# చదువులమ్మకు జీనియస్ గ్రాంట్



శైలజా పయిూక్

శైలజా పయిూక్ ఎలా పెరిగారన్నది విన్న తర్వాత మాత్రమే, ఆమె 'ఇంతలా' ఎలా ఎదిగారన్నది ప్రాముఖ్యం గల విషయంలా అనిపిస్తుంది. 'ఇంతలా' అంటే? ఆరున్నర కోట్ల రూపాయల విలువైన 'జీనియస్ గ్రాంట్'ను పొందేంతలా!!

పయిూక్ మహారాష్ట్రలోని పోటెగావ్‌లో మరాఠీ మాట్లాడే దళిత కుటుంబంలో జన్మించారు. నలుగురు అక్కచెల్లెళ్లలో ఆమె ఒకరు. పిల్లల చదువుల కోసం ఆ కుటుంబం పోటెగావ్ నుంచి పుణెకు మారి, యరవాడలోని మురికివాడలో ఒక గది మాత్రమే ఉన్న ఇంట్లో తలదాచుకుంది. పిల్లలు ఎంత చదివితే అంతా చదివించగలిగాడు ఆ తండ్రి.

పయిూక్ పుణెలోని సావిత్రీబాయి పూలే యూనివర్శిటీలో బి.ఎ. చేశారు. అక్కడే ఎం.ఎ. ఆ తర్వాత ఇంగ్లండ్‌లోని వారిక్ యూనివర్శిటీ నుండి పీహెచ్.డీ! అంతకు రెండేళ్ల ముందే శైలజా పయిూక్‌కి యూఎస్‌లోని 'ఎవరీ' యూనివర్శిటీ ఫెలోషిప్ వచ్చింది. వారిక్‌లో పీహెచ్.డీ. అయ్యాక యూఎస్‌లోని 'యూనియన్' కాలేజ్‌లో చరిత్ర విభాగానికి విజిటింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, తర్వాత యేల్ యూనివర్శిటీలో పోస్ట్‌డాక్టొరల్ అసోసియేట్‌గా; సౌత్ ఏషియన్ హిస్టరీలో విజిటింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పాఠ్యాంశాలను బోధించారు. ప్రస్తుతం సిన్సినాటీ యూనివర్శిటీలో రీసెర్చ్ హిస్టరీ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

దళితుల అనుభవాలు, దళిత దృక్కోణం, లింగ వివక్ష, సామాజిక న్యాయం.. ఆమె అనుబంధ బోధనాంశాలు. పయిూక్ 2014లో 'దళిత్ ఉమెన్స్ ఎడ్యుకేషన్ ఇన్ మోడర్న్ ఇండియా: డబుల్ డిస్క్రిమినేషన్', 2022లో 'ది వల్గారిటీ ఆఫ్ క్యాస్ట్ : దళిత్స్, సెక్సువాలిటీ, అండ్ హ్యూమానిటీ ఇన్ మోడర్న్ ఇండియా' అనే పుస్తకాలు రాశారు. తాజాగా 2024 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'జీనియస్ గ్రాంట్'ను పొందారు! (వాడుకలో 'మెక్‌ఆర్థర్ ఫెలోషిప్'). ఈ ఘనతను సాధించిన తొలి దళిత వ్యక్తి పయిూక్ కావటం విశేషం.

1981లో ప్రారంభం అయిన జీనియస్ గ్రాంట్ ఫెలోషిప్‌ను ఇప్పటి వరకు పొందిన వారిలో సాహిత్య విమర్శకుడు హెన్రీ లూయిస్ గేట్స్ జూనియర్, నోబెల్ గ్రహీత డెరెక్ వాల్కాట్, కవులు ఎ.కె.రామానుజన్, అడ్రియన్ రిచ్, జాన్ యాష్‌బెరీ, క్లాడియా రాంకన్, నవలాకారిణి చిమమండ న్గోజీ అడీచే, జాజ్ వయోలిన్ విద్వాంసుడు రెజినీ కార్టర్, పురావస్తు శాస్త్రవేత్త స్టీఫన్ జే వంటి వారు ఉన్నారు. యునైటెడ్ స్టేట్స్‌లో వివిధ రంగాలలోని అత్యున్నత ప్రతిభాశీలుర జాబితా ఇది. ఆ జాబితాకు ఇప్పుడు మన శైలజా పయిూక్ వన్నె తెచ్చారు.

---

సోషల్ మీడియా



# గంజీ చుడైల్ సందేశం

పంచతంత్ర, అక్బర్ బీర్బల్....మొదలైన క్లాసిక్ పిల్లల కథల యానిమేటెడ్ అడాప్షన్‌లను షేర్ చేయడం ద్వారా 'మజిందర్ కహాని' సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయింది. ప్రేక్షకుల ఆదరణను దృష్టిలో పెట్టుకొని ఒరిజినల్ క్యారెక్టర్స్‌ను కూడా క్రియేట్ చేయడం ప్రారంభించారు. అలా సృష్టించిందే... గంజీ చుడైల్.

'గంజీ చుడైల్' ఊహించని రీతిలో బాగా పాపులర్ అయింది. ఇప్పుడు ఈ క్యారెక్టర్‌ను ఉపయోగించుకొని హెల్మెట్ ధరించడంపై ప్రచారం నిర్వహిస్తున్నారు దిల్లీ పోలీసులు. 'గంజీ చుడైల్' ఇన్‌స్టాగ్రామ్ మీమ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. దీనికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది.

'నన్ను చూసి భయపడకండి. హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయడానికి భయపడండి' అంటుంది హెల్మెట్ ధరించి వెలిగిపోతున్న గంజీ చుడైల్.

---

# మన సైన్యం చేసిన మేలు



ప్రపంచం 21వ శతాబ్దంలో ఉంది. విశ్వమంతా అరచేతిలో ఇమిడిపోయినంత టెక్నాలజీతో స్మార్ట్‌గా జీవిస్తోంది ప్రపంచం. మదిలో మెదిలిన సందేహానికి సమాధానాన్ని నిమిషంలో తెలుసుకోగలిగినంత టెక్నాలజీ అందుబాటులో ఉంది. అయినప్పటికీ గర్భిణి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియని జీవితాలు ఇంకా ఉన్నాయి. భారతీయ సైన్యంలో మహిళల బృందం ఇటీవల వారిని సమావేశపరిచి ప్రెగ్నెన్సీ అవేర్‌నెస్ సెషన్ నిర్వహించింది. అత్యంత ఆసక్తిగా వినడంతోపాటు ఇంత వరకు తమకు ఈ సంగతులు చెప్పిన వాళ్లు లేరని, మొదటిసారి వింటున్నామని ఆనందం వ్యక్తం చేశారా మహిళలు. ఇంతకీ ఇంతటి వెనుకబాటులో మగ్గిపోతున్న వాళ్లెవరంటే ఆఫ్రికా ఖండంలోని అబేయీా వాసులు.


### ఆల్ ఉమెన్ ప్లాటూన్ చొరవ

సూడాన్, సౌత్ సూడాన్‌ల మధ్య తలెత్తిన వివాదంలో అబేయీా నలిగిపోతోంది. అబేయీాలో శాంతి స్థాపన కోసం యునైటెడ్ నేషన్స్ చేస్తున్న ప్రయత్నంలో భాగంగా మనదేశం నుంచి గత ఏడాది ఆల్ ఉమెన్ ప్లాటూన్ అబేయీాలో అడుగుపెట్టింది. ఆ బృందం పేరు 'యునైటెడ్ నేషన్స్ ఇంటిరిమ్ సెక్యూరిటీ ఫోర్స్ ఫర్ అబేయీా (యూనిస్ఫా)'. మన మహిళా సైనికులు అబేయీాలో శాంతి స్థాపనతోపాటు ప్రజారోగ్యం కోసం కూడా పని చేస్తోంది. అందులో భాగంగా కెప్టెన్ జస్‌ప్రీత్ కౌర్, ఇండియన్ బెటాలియన్ మెడికల్ ఆఫీసర్ మేజర్ అభిజిత్ ఎస్‌లు అబేయీాలోని రుమాజిక్ గ్రామంలో స్థానిక మహిళలను సమావేశపరిచి వారికి గర్భధారణ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణి తీసుకోవాల్సిన పోషకాహారం, ఈ సమయంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, క్రమం తప్పకుండా చేయించుకోవాల్సిన హెల్త్ చెకప్‌లు, ప్రసవం తర్వాత బిడ్డ సంరక్షణలో తీసుకోవాల్సిన శ్రద్ధ మొదలైన విషయాలను వివరించారు. సేఫ్ అండ్ హెల్దీ ప్రెగ్నెన్సీ గురించి బొమ్మలతో వివరిస్తూ ప్రచురించిన చిన్న పుస్తకాలను కూడా పంచారు. భారతీయ సైనిక మహిళల బృందం చొరవను, స్థానిక మహిళల ఆనందాన్ని యూఎన్ మిషన్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

---

# నట్టింట్లో నీలాకాశం!

అందమైన రంగులు ఇంటికి అందాన్నిస్తాయనుకుంటాం. కానీ ఒకే ఒక రంగుతో ఇంటిని అద్భుతంగా అలంకరించవచ్చని 'నీల్' కాన్సెప్ట్ రుజువు చేస్తోంది. స్వచ్ఛమైన తెలుపుకి లేత నీలంరంగు థీమ్‌తో డిజైన్‌ని చూస్తుంటే నీలి మేఘం నట్టింట్లోకి వచ్చినట్లుంది. ఆకాశంలో మబ్బుల్లో రూపాలను వెతుక్కుంటాం. ఇది నట్టింట్లో ఆవిష్కరించిన కళారూపం. ఇందులో ప్రతి ఒక్కటీ చేత్తో చేసినవే. అచ్చమైన హ్యాండ్ క్రాఫ్టెడ్ హోమ్ డెకరేషన్ అన్నమాట. బెడ్ స్ప్రెడ్, పిల్లో కవర్, రన్నర్, కార్పెట్, డోర్ మ్యాట్, ల్యాంప్ షేడ్, సోఫా కుషన్‌లు, కవర్‌లతో పాటు డిన్నర్ సెట్ కూడా గౌరంగ్ షా డిజైన్ చేసిన నీల్ థీమ్‌లో ఒదిగి పోయింది. ఇండియన్ టెక్స్‌టైల్స్ అండ్ ఫ్యాషన్ డిజైనర్‌గా జాతీయ అవార్డు గ్రహీత గౌరంగ్ షా ఇంటీరియర్ డెకరేషన్‌లో చేసిన ప్రయోగం ఇది. తన ప్రయోగాన్ని ఇటీవల హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఇది 'గౌరంగ్ హోమ్' అంటూ సగర్వంగా ప్రదర్శించాడు షా. ఇంటి నుంచి మనం ఏం కోరుకుంటున్నామో అది మన ఇంటి డెకరేషన్‌లో ప్రతిబింబిస్తుంది.



గౌరంగ్ షా

### వారసత్వ కళల సమ్మేళనం!

లేత నీలం రంగులో అలరిస్తున్న పూలు, ఆకుల్లో కొన్ని జామ్‌దానీ నేతకు ప్రతిరూపాలు. కొన్ని కసౌటీ, చికన్‌కారీలతో సూదిమొన చెక్కిన రూపాలు. మరికొన్ని అచ్చు అద్దిన పూలు. తెల్లటి పింగాణీ మీద విరిసిన నీలాలు ఫ్యాషన్‌తో పోటీ పడుతున్నట్లున్నాయి. జామ్‌దానీ, అజ్రక్, కలంకారీ, చికన్‌కారీ, హ్యాండ్ ప్రింట్‌లతో ఇంటిని అలంకరిస్తే భారతీయ వారసత్వ హస్తకళకు ఇంతకంటే గొప్ప గౌరవం ఇంకేముంటుంది? కళాకారులకు ఇవ్వగలిగిన ప్రోత్సాహం మరేముంటుంది? ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్, నాచురల్ రంగులతో పర్యావరణ హితమైన జీవనశైలికి మరో నిర్వచనం ఇంకెక్కడ దొరుకుతుంది.







## మహిళల హాకీ ఇండియా లీగ్ వేలం... ఉదిత దుహాన్‌కు రూ. 32 లక్షలు

హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్) మహిళల టోర్నమెంట్‌కు సంబంధించి మంగళవారం వేలం కార్యక్రమం జరిగింది. భారత జట్టు డిఫెండర్ ఉదిత దుహాన్‌కు అత్యధికంగా రూ. 32 లక్షలు లభించాయి. శ్రాచి రార్ బెంగాల్ టైగర్స్ జట్టు ఉదితను కొనుగోలు చేసింది. ఉదిత తర్వాత రెండో అత్యధిక మొత్తం నెదర్లాండ్స్ డ్రాగ్ ఫ్లికర్ యిబ్బీ జాన్సన్‌కు దక్కింది. ఒడిశా వారియర్స్ జట్టు రూ. 29 లక్షలకు యిబ్బీ జాన్సన్‌ను సొంతం చేసుకుంది. భారత జట్టు సభ్యులు లాల్‌రెమ్‌సియామి (రూ. 25 లక్షలు; శ్రాచి రార్ బెంగాల్ టైగర్స్), సునెలితా టొప్పో (రూ. 24 లక్షలు; ఢిల్లీ ఎస్‌జీ పైపర్స్), సంగీత కుమారి (రూ. 22 లక్షలు; ఢిల్లీ ఎస్‌జీ పైపర్స్)లకు కూడా పెద్ద మొత్తమే లభించింది. భారత సీనియర్ జట్టు కెప్టెన్ సలీమా టెటెను ఒడిశా వారియర్స్ రూ. 20 లక్షలకు సొంతం చేసుకుంది. ఇషిక (రూ. 16 లక్షలు), నేహా గోయల్ (రూ. 10 లక్షలు)లను కూడా ఒడిశా వారియర్స్ కొనుగోలు చేసింది. సూర్మా హాకీ క్లబ్ భారత మాజీ కెప్టెన్ సవితా పూనియా (రూ. 20 లక్షలు), షర్మిలా దేవి (రూ. 10 లక్షలు), నిక్కీ ప్రధాన్ (రూ. 12 లక్షలు)లను దక్కించుకుంది. హెచ్‌ఐఎల్ టోర్నీ డిసెంబర్ 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు రాంచీ, రౌర్కెలాలలో జరుగుతుంది.

# కివీస్ సవాల్!



కొన్నేళ్లుగా స్వదేశంలో తిరుగులేని ఆధిపత్యం కనబరుస్తున్న భారత క్రికెట్ జట్టు మరో టెస్టు సిరీస్ సమరానికి సిద్ధమైంది. సొంతగడ్డపై ఇటీవల బంగ్లాదేశ్‌ను క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా మరో సిరీస్ విజయం లక్ష్యంగా నేటి నుంచి న్యూజిలాండ్‌తో తలపడనుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో తొలి టెస్టు ప్రారంభం కానుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరడమే లక్ష్యంగా సాగుతున్న రోహిత్ శర్మ బృందం ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించడం లాంఛనమే! ఈ నేపథ్యంలో తొలి మ్యాచ్‌లో ఘనవిజయం సాధించడమే లక్ష్యంగా భారత జట్టు వ్యూహాలకు పదును పెడుతోంది.


రోహిత్

**నేటి నుంచి న్యూజిలాండ్‌తో భారత్ తొలి టెస్టు**
- జోరు మీదున్న టీమిండియా
- మ్యాచ్‌కు వర్షం ముప్పు
- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం


లాథమ్

**బెంగళూరు:** వచ్చే నెలలో ఆస్ట్రేలియాతో జరిగే మెగా టెస్టు సిరీస్‌కు ముందు స్వదేశంలో భారత జట్టు సత్తాకు పరీక్ష ఎదురుకానుంది. బంగ్లాదేశ్ గట్టి జట్టు కాకపోవడంతో టీమిండియాకు ఇటీవల ఆ జట్టుతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో పెద్దగా ప్రతిఘటన ఎదురుకాలేదు. కానీ పోరాటపటిమకు మారుపేరైన న్యూజిలాండ్‌ను తక్కువ అంచనా వేయలేము. ఐపీఎల్ రూపంలో భారత గడ్డపై ఎన్నో మ్యాచ్‌లు ఆడిన అనుభవమున్న ఆటగాళ్లు న్యూజిలాండ్‌లో ఉన్నారు. ఫలితంగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ పోటాపోటీగా సాగే అవకాశముంది. అయితే ఈ సిరీస్‌కు శుభారంభం లభించాలంటే వరుణుడు కూడా కరుణించాలి. నేటి నుంచి మూడు రోజుల పాటు బెంగళూరులో భారీ వర్షాలు కురిసే అవకాశ ముందని స్థానిక వాతావరణ శాఖ తెలిపింది. చివరి రెండు రోజులు ఎండ కాయనుంది. అయితే చిన్న స్వామి స్టేడియంలో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఉండటంతో వరుణుడు కాస్త తెరిపినిచ్చినా మ్యాచ్ సాగడం ఖాయమే. భారత యువ ఆటగాళ్లకు ఈ సిరీస్ చక్కటి అవకాశం కానుంది. ముఖ్యంగా శుబ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్‌పై అందరి దృష్టి నిలవనుంది. ఇప్పటికే జట్టులో కుదురుకున్న ఈ ఇద్దరూ భవిష్యత్తుపై భరోసా కల్పిస్తున్నారు. మరోవైపు న్యూజిలాండ్ జట్టు గాయాలతో సతమతమవుతోంది. మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ తొలి టెస్టుకు అందుబాటులో లేకుండా పోగా... తాజాగా పేస్ బౌలర్ బెన్ సియర్స్ గాయం కారణంగా ఈ సిరీస్‌కే దూరమయ్యాడు.

**సమతూకంగా...**

బ్యాటింగ్‌లో టీమిండియాకు పెద్దగా సమస్యలు లేవు. గిల్, జైస్వాల్, పంత్, కేఎల్ రాహుల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. రోహిత్, కోహ్లి స్థాయి ప్లేయర్లు లయ అందుకునేందుకు ఎక్కువ సమయం అవసరం లేదు. మరో 53 పరుగులు చేస్తే కోహ్లి భారత్ నుంచి 9 వేల టెస్టు పరుగులు చేసిన నాలుగో ప్లేయర్‌గా ఘనత వహిస్తాడు. బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో అటు బ్యాట్‌తో ఇటు బంతితో అదరగొట్టిన అశ్విన్, రవీంద్ర జడేజాలతో భారత బ్యాటింగ్ లైనప్ మరింత బలంగా మారింది. అస్వస్థతతో గిల్ మ్యాచ్‌కు దూరమైతే అతడి స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ తుది జట్టులోకి వస్తాడు. బోర్డర్-గవాస్కర్ సిరీస్‌కు ముందు స్వదేశంలోనూ పేస్ పిచ్‌లపైనే ఆడాలని భావించిన టీమిండియా... అందుకు తగ్గట్లే పిచ్‌లను సిద్ధం చేసుకుంది. బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో భారత్ ఇద్దరు స్పిన్నర్లు, ముగ్గురు పేసర్ల వ్యూహంతో బరిలోకి దిగి ఫలితం సాధించింది. ఇక్కడ కూడా అదే కొనసాగించవచ్చు. అదనపు స్పిన్నర్‌ను ఆడించాలనుకుంటే ఆకాశ్‌దీప్ స్థానంలో కుల్దీప్ యాదవ్ జట్టులోకి రానున్నాడు.

**కివీస్‌కు గాయాల బెడద**

ఇటీవలి కాలంలో న్యూజిలాండ్ జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చలేకపోతోంది. శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 0–2తో కోల్పోయిన న్యూజిలాండ్‌ను గాయాలు వెంటాడుతున్నాయి. భారత్‌తో పర్యటనకు ముందే టిమ్ సౌతీ టెస్టు కెప్టెన్సీ నుంచి తప్పుకోగా... విలియమ్సన్ తొలి టెస్టుకు దూరమయ్యాడు. మరోవైపు యువ పేసర్ బెన్ సియర్స్ కూడా మోకాలి గాయంతో ఈ పర్యటనకు దూరమయ్యాడు. ఈ సిరీస్‌లో టామ్ లాథమ్ కివీస్ పూర్తి స్థాయి కెప్టెన్‌గా వ్యవహరించనుండగా... అతడితో పాటు కాన్వే, విల్ యంగ్, రచిన్ రవీంద్ర, మిషెల్, బ్లండెల్, ఫిలిప్స్‌తో న్యూజిలాండ్ బ్యాటింగ్ లైనప్ మెరుగ్గానే ఉంది. అయితే భారత స్పిన్నర్లను వీరు ఎలా ఎదుర్కొంటారనేది కీలకం. ఇక ఎజాజ్ పటేల్, సాన్‌ట్నర్, రచిన్‌ల రూపంలో ఆ జట్టులో ముగ్గురు స్పిన్నర్లు ఉన్నారు. గత భారత పర్యటనలో ఎజాజ్ ఒకే ఇన్నింగ్స్‌లో పదికి పది వికెట్లు తీసి... టెస్టు క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. ఇక సీనియర్ సౌతీ, విల్ రూర్కె, ఫిలిప్స్ పేస్ భారం మోయనున్నారు.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** రోహిత్ శర్మ (కెప్టెన్), జైస్వాల్, గిల్/సర్ఫరాజ్, కోహ్లి, పంత్, రాహుల్, జడేజా, అశ్విన్, ఆకాశ్‌దీప్/కుల్దీప్, బుమ్రా, సిరాజ్. **న్యూజిలాండ్:** లాథమ్ (కెప్టెన్), కాన్వే, విల్ యంగ్, రచిన్ రవీంద్ర, మిషెల్, బ్లండెల్, ఫిలిప్స్, సాన్‌ట్నర్/బ్రేస్‌వెల్, సౌతీ, ఎజాజ్ పటేల్, విల్ ఓ రూర్కె.

**పిచ్, వాతావరణం**

బెంగళూరు పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. వర్షాల కారణంగా పిచ్‌ను కవర్స్‌తో కప్పి ఉంచారు. ఆటకు వరుణుడు ఆటంకం కలిగించవచ్చు. ముఖ్యంగా తొలి మూడు రోజులు బెంగళూరులో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. చిన్నస్వామి స్టేడియంలో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఉండటం అభిమానులకు ఊరటనిచ్చే అంశం.


**62** ఇప్పటి వరకు భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన టెస్టులు. ఇందులో 22 మ్యాచ్‌ల్లో భారత్... 13 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ గెలుపొందాయి. 27 మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి.

**36** స్వదేశంలో న్యూజిలాండ్‌తో భారత్ ఆడిన టెస్టులు. ఇందులో 17 మ్యాచ్‌ల్లో భారత్ నెగ్గగా... 2 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ (1969లో, 1988లో) గెలిచింది. మిగతా 17 మ్యాచ్‌లు 'డ్రా' అయ్యాయి.

# ఇంగ్లండ్ ఇంటికి... సెమీఫైనల్లో వెస్టిండీస్

**హేలీ, క్వియానా ధనాధన్ షో ● మహిళల టి20 ప్రపంచకప్**


క్వియానా, హేలీ మాథ్యూస్


నిరాశలో ఇంగ్లండ్ బౌలర్ సోఫీ

**దుబాయ్:** ఈ ప్రపంచకప్‌లో ఇదే ఆఖరి లీగ్ మ్యాచ్. గ్రూప్ 'బి'లో ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌లు గెలిచి అగ్రస్థానంలో ఇంగ్లండ్, రెండు విజయాలతో వెస్టిండీస్ మూడో స్థానంలో ఉన్నాయి. మంగళవారం జరిగిన మ్యాచ్ ఈ స్థానాల్ని తారుమారు చేసింది. ఇంగ్లండ్ మహిళల జట్టు అనూహ్యంగా ఒక్క ఆఖరి పోరుతో ఇంటి బాట పట్టింది. వెస్టిండీస్ 6 వికెట్ల తేడాతో గెలిచి 'టాప్'లోకి వచ్చి నిలిచింది. మూడు జట్లు 6 పాయింట్లతో సమంగా ఉన్నప్పటికీ మెరుగైన నెట్ రన్‌రేట్ విండీస్ (1.536) జట్టును సెమీఫైనల్స్‌కు పంపింది. ఈ గ్రూప్ నుంచి దక్షిణాఫ్రికా (1.382) రెండో జట్టుగా ముందంజ వేసింది. ఇంగ్లండ్ (1.091) మూడో స్థానంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

టాస్ నెగ్గిన విండీస్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్ చేపట్టిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. టాపార్డర్‌లో బౌచిర్ (14), డ్యానీ వ్యాట్ (16), అలైస్ క్యాప్సీ (1) నిరాశ పరచడంతో 34 పరుగులకే 3 కీలక వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నట్ సీవర్ బ్రంట్ (50 బంతుల్లో 57 నాటౌట్; 5 ఫోర్లు) ఒంటరి పోరాటం చేసింది. కెప్టెన్ హీథెర్ నైట్ (13 బంతుల్లో 21; 3 ఫోర్లు)తో చకచకా 46 పరుగులు జోడించింది. అయితే 80 పరుగుల జట్టు స్కోరు వద్ద హీథెర్ రిటైర్డ్‌హర్ట్ కావడంతో ఇంగ్లండ్ ఆటతీరు మారింది. తర్వాత వచ్చిన వారిలో ఏ ఒక్కరూ కనీసం 8 పరుగులైనా చేయలేకపోవడంతో ఇంగ్లండ్ 150 మార్క్‌ను కూడా అందుకోలేకపోయింది. అఫీ ఫ్లెచర్ 3, హేలీ మాథ్యూస్ 2 వికెట్లు తీశారు. తర్వాత వెస్టిండీస్ ఇంకో 2 ఓవర్లు మిగిలుండగానే 18 ఓవర్లలో నాలుగే వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు హేలీ మాథ్యూస్ (38 బంతుల్లో 50; 7 ఫోర్లు, 1 సిక్స్), క్వియానా జోసెఫ్ (38 బంతుల్లో 52; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ఆరంభమిచ్చారు. మెరుపు వేగంతో ఆడిన ఇద్దరు అర్ధ సెంచరీలు పూర్తిచేసుకున్నారు. తొలి వికెట్‌కు 12.2 ఓవర్లలో 102 పరుగులు జోడించాక క్వియానా, తర్వాత ఓవర్లో కెప్టెన్ హేలీ నిష్క్రమించారు. అప్పటికి 41 బంతుల్లో 38 పరుగులు కావాల్సి ఉండగా, డాటిన్ (19 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు ) ధాటిగా ఆడింది. గెలుపు వాకిట ఆమె బౌల్డ్ కాగా, మిగతా లాంఛనాన్ని ఆలియా అలెన్ (4 బంతుల్లో 6 నాటౌట్; 1 ఫోర్) పూర్తి చేసింది. **గురువారం జరిగే తొలి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా; శుక్రవారం జరిగే రెండో సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో వెస్టిండీస్ తలపడతాయి.**

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

# సినిమా


● వరుణ్ ధావన్, సమంత

## ఓ సీక్రెట్ చెప్పనా..!

వరుణ్ ధావన్, సమంత లీడ్ రోల్స్‌లో నటించిన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీబన్నీ'. 'ది ఫ్యామిలీమేన్' సిరీస్ ఫేమ్ రాజ్ అండ్ డీకే ఈ సిరీస్‌ను రూపొందించారు. అమెరికన్ సిరీస్ 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్‌గా 'సిటాడెల్: హనీ బన్నీ' రానుంది. ఈ సిరీస్ ట్రైలర్ విడుదలైంది. 'ప్రతి రోజూ ఓ ప్రమాదం ముంచుకొస్తుంది. ఒకదాని వెంట మరొకటి వస్తూనే ఉంటుంది. సవాల్ ఏంటంటే... ఈ ప్రమాదాలను మనం అంతం చేస్తామా? లేక అవి మనల్ని అంతం చేస్తాయా? అన్నది, నాడియా... నీకొక సీక్రెట్ చెప్పనా.. నేనొక ఏజెంట్' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సిరీస్‌లో సినీ నటి హనీగా సమంత, స్టంట్ కొరియోగ్రాఫర్ బన్నీగా వరుణ్ ధావన్ కనిపిస్తారు. కానీ ఈ ఇద్దరూ ఏజెంట్స్. ఈ ఇద్దరూ ఓ మిషన్ కోసం ఎలాంటి పోరాటాలు చేశారన్నది సిరీస్‌లో ఆసక్తికరమైన అంశం. అమెజాన్ ఓటీటీలో నవంబరు 7 నుంచి ఈ సిరీస్ స్ట్రీమ్ కానుంది.


● కమల్‌హాసన్

## మిషన్ మేకోవర్

ఇప్పుడు కమల్‌హాసన్ మిషన్ ఏంటంటే... 'మేకోవర్' అన్నమాట. కొత్త సినిమా కోసం సరికొత్తగా మేకోవర్ అవుతున్నారు కమల్‌హాసన్. ఆయన హీరోగా 'కేజీఎఫ్' ఫైట్ మాస్టర్స్ అన్బు–అరివుల దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరిలో ఈ సినిమాను ప్రకటించారు. అయితే 'ఇండియన్' సీక్వెల్స్ 'ఇండియన్ 2, ఇండియన్ 3' సినిమాలతో పాటు 'థగ్ లైఫ్' చిత్రంతో కమల్‌హాసన్ బిజీగా ఉన్నారు. ఈ కారణంగా అన్బు–అరివులతో కమల్‌హాసన్ సినిమా సెట్స్‌పైకి వెళ్లలేదు. 'ఇండియన్ 2' విడుదల కాగా, 'ఇండియన్ 3, థగ్ లైఫ్' చిత్రాలను కమల్ పూర్తి చేశారు. దీంతో అన్బు–అరివులతో చేయాల్సిన సినిమాను వచ్చే జనవరి నుంచి సెట్స్‌పైకి తీసుకువెళ్లాలనుకుంటున్నారు. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. అలాగే ఈ సినిమా కోసం కమల్‌హాసన్ స్పెషల్ మేకోవర్ అవుతున్నారు. ఆయన తాజా లుక్ సోషల్ మీడియా మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. మరోవైపు 'ఇండియన్ 3, థగ్ లైఫ్' రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి.

## ప్రేక్షక దేవుళ్లకు ధన్యవాదాలు

- ఎన్టీఆర్



'దేవర: పార్ట్ 1' బ్లాక్‌బస్టర్ కావడంతో హీరో ఎన్టీఆర్ చాలా హ్యాపీగా ఉన్నారు. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటించిన చిత్రం 'దేవర: పార్ట్ 1'. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మించిన ఈ సినిమా గత నెల 27న విడుదలైంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా ఇప్పటివరకు రూ. 500 కోట్లు వసూళ్లు రాబట్టినట్లు మేకర్స్ పోస్టర్స్ విడుదల చేశారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో ఎన్టీఆర్ ఓ థ్యాంక్స్ నోట్ షేర్ చేశారు.

**ఆ నోట్ సారాంశం ఏంటంటే....**

''దేవర పార్ట్ 1'కి అందుతున్న అద్భుతమైన స్పందనకు హృదయపూర్వక కృతజ్ఞతలు. నా దర్శకుడు కొరటాల శివగారికి ధన్యవాదాలు. ఈ కథను సృష్టించిన ఆయన దిశా నిర్దేశంతోనే ఈ ప్రాజెక్ట్ విజయవంతమైంది. తమ పాత్రలకు జీవం పోసిన నా సహ నటీ నటులు జాన్వీ, సైఫ్ అలీఖాన్ సార్, ప్రకాశ్‌రాజ్‌గారు, శ్రీకాంత్‌గార్లకు, ఈ చిత్రాన్ని అద్భుతంగా మలిచినందుకు సంగీతదర్శకుడు అనిరుద్, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు సార్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు సార్, వీఎఫ్ఎక్స్ యుగంధర్‌గారు, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్‌గార్లకు ధన్యవాదాలు. మా సినిమాను విజయవంతంగా ప్రదర్శించిన పంపిణీదారులు, థియేటర్ ప్రదర్శకులకు ధన్యవాదాలు. నా సినీ పరిశ్రమ మిత్రులకు, వారు అందించిన ప్రేమకు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా రూపొందించినందుకు మా నిర్మాతలకు ధన్యవాదాలు. ప్రపంచవ్యాప్తంగా ఇంతటి ఆదరణ చూపిస్తున్న ప్రేక్షక దేవుళ్లకు, నా కుటుంబ సభ్యులైన నా అభిమానులందరికీ, గత నెల రోజులుగా 'దేవర పార్ట్ 1' చిత్రాన్ని ఒక పండగలా జరుపుకుంటున్నందుకు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. మీరు ఎల్లప్పుడూ గర్వపడే చిత్రాలు చేస్తూనే ఉండడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను'' అని ఆ నోట్‌లో ఎన్టీఆర్ పేర్కొన్నారు.

## లవ్ నుంచి థ్రిల్


● రామ్ కార్తీక్

''నేను గతంలో థ్రిల్లర్ సినిమాలు చేశాను. కానీ 'వీక్షణం' లాంటి మిస్టరీ థ్రిల్లర్ చిత్రంలో నటించడం ఇదే తొలిసారి. సరదాగా ఉండే కుర్రాడికి పక్కవాడి జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే కుతూహలం ఉంటుంది. తనకున్న ఈ మనస్తత్వం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు? ఆ యువకుడి జీవితంలోకి ఓ అమ్మాయి రావడంతో అతని కథ ఎలాంటి మలుపులు తిరుగుతుంది?'' అన్నది 'వీక్షణం'లో ఆసక్తిగా ఉంటుంది'' అని హీరో రామ్ కార్తీక్ అన్నారు. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో రామ్ కార్తీక్, కశ్వి జంటగా నటించిన సినిమా 'వీక్షణం'. పి. పద్మనాభ రెడ్డి, అశోక్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రామ్ కార్తీక్ విలేకరులతో మాట్లాడుతూ– ''ఈ సినిమా లవ్ స్టోరీతో ప్రారంభమై మిస్టరీ థ్రిల్లర్‌గా మారుతుంది. ప్రీ క్లైమాక్స్‌ని ఎవరూ ఊహించలేరు. ఫస్ట్ కాపీ చూసినవారు నా గత సినిమాలతో పోలిస్తే ఇందులో మెచ్యూర్డ్‌గా, సెటిల్డ్‌గా నటించానని అనడం సంతోషంగా ఉంది. ఇప్పటివరకూ నేను చేసిన వాటిలో 'తెలిసిన వాళ్లు, గ్రేట్ ఇండియన్ సూసైడ్' వంటి సినిమాలు మంచి పేరు తెచ్చాయి. 'వీక్షణం' చిత్రం హీరోగా నన్ను మరో మెట్టుపైకి తీసుకెళుతుందని ఆశిస్తున్నాను. వాసుగారి దర్శకత్వంలో నేను చేసిన సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది'' అన్నారు.


● ప్రియాంకా ఉపేంద్ర

''హైదరాబాద్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. నా భర్త ఉపేంద్రగారిని తొలిసారి ఇక్కడే కలిశాను. అందుకే హైదరాబాద్ నాకు చాలా లక్కీ సిటీ. నా కెరీర్‌లో తొలి యాక్షన్ ఫిల్మ్ 'ఉగ్రావతారం'. ఈ పాత్రకు నేను సరిపోతానని డైరెక్టర్ గురుమూర్తిగారు నమ్మారు. నా మొదటి పాన్ ఇండియన్ మూవీని అందరూ చూడాలని కోరుకుంటున్నాను'' అని నటి ప్రియాంకా ఉపేంద్ర అన్నారు. ప్రియాంకా ఉపేంద్ర లీడ్ రోల్‌లో

## ఉగ్రావతారం

గురుమూర్తి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఉగ్రావతారం'. ప్రియాంకా ఉపేంద్ర సమర్పణలో ఎస్‌జీ సతీష్ నిర్మించిన ఈ సినిమా నవంబరు 1న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో ఈ చిత్రం ట్రైలర్, సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. నిర్మాత రాజ్ కందుకూరి ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేయగా, నిర్మాత కరాటే రాజు, నటుడు సత్యప్రకాశ్ పాటను రిలీజ్ చేశారు. డైరెక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ– ''సమాజంలో జరిగే అన్యాయాలు, అఘాయిత్యాలపై మంచి సందేశాత్మక చిత్రంగా 'ఉగ్రావతారం' ఉంటుంది'' అన్నారు.

## యాక్షన్ బఘీర

శ్రీ మురళి హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'బఘీర'. రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్, రంగాయణ రఘు, అచ్యుత్ కుమార్ ఇతర కీలక పాత్రధారులు. 'కేజీఎఫ్, సలార్' చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ కథ అందించిన ఈ సినిమాకు డా. సూరి దర్శకత్వం వహించగా, హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించారు. ఈ చిత్రం అక్టోబరు 31న రిలీజ్ కానుంది. ఈ


● శ్రీ మురళి

కన్నడ చిత్రం తెలుగు వెర్షన్‌ను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పీ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయనుంది.''బఘీర' చిత్రం ప్రేక్షకులకు మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఈ చిత్రంలోని 'రుధిర హర..' పాటను ఈ నెల 17న రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్.

## డీల్ రెడీ


● ధరణి, హను, చందన

'ఈశ్వర్' సినిమాతో పరిచయమైన హను కోట్ల హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ది డీల్'. చందన, ధరణి ప్రియ హీరోయిన్లు. డా. అనితా రావు సమర్పణలో హెచ్. పద్మా రమాకాంతరావు, రామకృష్ణ కొలివి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హను మాట్లాడుతూ– ''ఈశ్వర్' తర్వాత నన్ను ఫ్రెండ్ క్యారెక్టర్స్ కోసమే అడిగారు. అయితే హీరో, దర్శకుడు కావాలనుకున్న నా కలను 'ది డీల్'తో నెరవేర్చుకున్నాను. మంచి థ్రిల్లర్ మూవీ ఇది. సెకండ్ పార్టు ఉంటుంది'' అన్నారు. ''ఈ సినిమాకు ప్రేక్షకాదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు అనిత.

## టైమ్ ట్రావెల్‌తో...

సాయి రోనక్, అమృతా చౌదరి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రివైండ్'. కల్యాణ్ చక్రవర్తి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ''కొత్త పాయింట్‌తో టైమ్ ట్రావెల్ బ్యాక్‌డ్రాప్‌లో 'రివైండ్' తీశాను. కొత్త కంటెంట్‌ను ఆదరించే తెలుగు ప్రేక్షకులు ఈ కోవలో ఉన్న మా సినిమానూ ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు కల్యాణ్ చక్రవర్తి.


● సాయి రోనక్, అమృత

## ఆర్కాడీ ప్రపంచంలోకి...

సాయిదుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎస్‌డీటీ 18' (వర్కింగ్ టైటిల్). నూతన దర్శకుడు రోహిత్ కేపీ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్యా రెడ్డి ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం (అక్టోబరు 15) సాయి దుర్గా తేజ్ పుట్టినరోజుని పురస్కరించుకుని 'ఇంట్రూడ్ ఇన్ టు ది వరల్డ్ ఆఫ్ ఆర్కాడీ' (ఆర్కాడీ ప్రపంచంలోకి ప్రవేశించండి) అనే వీడియోను విడుదల చేశారు మేకర్స్. ''హై పీరియడ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'ఎస్‌డీటీ 18'. మునుపెన్నడూ చేయని పవర్‌ఫుల్ క్యారెక్టర్ చేస్తున్నారు సాయిదుర్గా తేజ్. ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.


● సాయిదుర్గా తేజ్

## యూత్‌ఫుల్ పతంగ్

ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ లీడ్ రోల్స్‌లో, గాయకుడు–నటుడు ఎస్పీ చరణ్ ఓ కీలక పాత్రలో నటించిన కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వంలో విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాను డిసెంబరు 27న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ''ఈ సినిమాకు కథే హీరో. ఓ యూత్ ఫెస్టివల్‌గా మా సినిమా ఉంటుంది. కొత్త తరహా సినిమాలను ఆదరించే తెలుగు ప్రేక్షకులు మా సినిమాను ఆదరిస్తారని నమ్ముతున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● వంశీ, ప్రీతి

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 153 | 81,820 |
| నిఫ్టీ ▽ | 71 | 25,057 |

| విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 18,338 | ▽ 166 |
| డోజోన్స్ | 42,953 | ▽ 112 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,249 | ▽ 43 |
| డాక్స్ | 19,486 | ▽ 22 |
| షాంఘై | 3,201 | ▽ 83 |
| నికాయ్ | 39,911 | △ 305 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 75,930 | ▽ 71 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 75,626 | ▽ 71 |
| వెండి (కిలో) | 89,800 | ▽ 226 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 83.66 | 84.68 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 108.44 | 111.46 |
| € | యూరో | ఒకటి | 90.36 | 93.16 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 55.41 | 56.97 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 55.41 | 57.78 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 61.89 | 66.55 |
| SAR | సౌదీ రియాల్ | ఒకటి | 21.51 | 23.07 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఒకటి | 21.99 | 23.77 |
| ¥ | చైనా యువాన్ | ఒకటి | 10.93 | 12.75 |

## లాభాల్లోంచి నష్టాల్లోకి..

### 25,100 దిగువకు నిఫ్టీ



ముంబై: ఆరంభ లాభాలు కోల్పోయిన స్టాక్ సూచీలు మంగళ వారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో తొమ్మిది నెలల గరిష్టానికి చేరుకోవడం ఒత్తిడి పెంచింది. రిలయన్స్ ఇండస్ట్రీస్(–2%), బజాజ్ ఫైనాన్స్(–3%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(–0.25%) షేర్లు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ 153 పాయింట్లు నష్టపోయి 81,820 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 71 పాయింట్లు కోల్పోయి 25,057 వద్ద నిలిచింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా లాభాల్లో కదలాడాయి. అయితే ఆసియా, యూరప్ మార్కెట్లలో బలహీన సంకేతాలు, ఆయా రంగాల షేర్లలో లాభాల స్వీకరణ ప్రభావంతో ఆరంభ లాభాలన్నీ హరించుకుపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 337 పాయింట్లు క్షీణించి 81,636 వద్ద, నిఫ్టీ 120 పాయింట్లు కోల్పోయి 25,008 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి.

**గరుడ కన్‌స్ట్రక్షన్ అదుర్స్**



గరుడ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజనీరింగ్ లిస్టింగ్‌లో అదరగొట్టింది. ఇష్యూ ధర(రూ.95)తో పోలిస్తే 9% ప్రీమియంతో రూ.103 వద్ద లిస్టయ్యింది. ఈక్విటీ మార్కెట్ అనిశ్చితుల్లోనూ ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో 27% ఎగసి రూ.121 ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 12% లాభంతో రూ.107 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.994 కోట్లుగా నమోదైంది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 16-10-2024 | |
|---|---|
| విశాఖ | 515–00 |
| చిత్తూరు | 538–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 515–00 |
| విజయవాడ | 515–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 480–00 |
| వరంగల్ | 482–00 |
| రిటైల్ ధర | 5.40 |

## 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం..

### తయారీ రంగానికి టాటా గ్రూప్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తీపి కబురు



న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో తయారీకి సంబంధించి వివిధ విభాగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించనున్నట్లు టాటా గ్రూప్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వెల్లడించారు. సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ మొదలైన పరిశ్రమల్లో ఈ ఉద్యోగాలుంటాయని ఆయన పేర్కొన్నారు. ఇండియన్ ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చంద్రశేఖరన్ ఈ విషయం చెప్పారు. అస్సాంలో ఏర్పాటు చేస్తున్న సెమీకండక్టర్ ప్లాంటుతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ కోసం ఇతరత్రా పలు కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. వీటితో ప్రాథమికంగా ఒక వ్యవస్థ ఏర్పడుతుందని, ఈ వ్యవస్థలో కనీసం 5 లక్షల పైచిలుకు చిన్న, మధ్య తరహా సంస్థలుంటాయని చంద్రశేఖరన్ చెప్పారు. తయారీ రంగంలో ఉద్యోగాలు కల్పించకుండా వికసిత భారత్ లక్ష్యాలను సాధించలేమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి నెలా పది లక్షల మంది యువత ఉద్యోగాల మార్కెట్లోకి వస్తున్న నేపథ్యంలో పది కోట్ల పైచిలుకు ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యక్షంగా ఒక్క ఉద్యోగం కల్పిస్తే పరోక్షంగా ఎనిమిది నుంచి పది మందికి ఉపాధి కల్పించగలిగే సెమీకండక్టర్ల వంటి కొత్త తరం పరిశ్రమలు ఇందుకు దోహదపడగలవని పేర్కొన్నారు.

## లీజు కంపెనీలతో స్పైస్‌జెట్ వివాదం పరిష్కారం

ముంబై: విమానాలను లీజుకిచ్చిన ఎయిర్ క్యాజిల్, విల్మింగ్‌టన్ ట్రస్టు సంస్థలతో వివాదాలను పరిష్కరించుకున్నట్లు స్పైస్‌జెట్ వెల్లడించింది. సెటిల్మెంట్‌లో భాగంగా 23.39 మిలియన్ డాలర్లు చెల్లించినట్లు వివరించింది. దీని ప్రకారం స్పైస్‌జెట్‌పై వేసిన దావాలను రెండు సంస్థలు ఉపసంహరించుకోనున్నాయి. దీర్ఘకాలంగా ఎయిర్‌క్యాజిల్, విల్మింగ్టన్ ట్రస్ట్‌లతో ఉన్న వివాదాలను విజయవంతంగా పరిష్కరించుకున్నట్లు స్పైస్‌జెట్ చైర్మన్ అజయ్ సింగ్ తెలిపారు. కంపెనీ ఇటీవలే అమెరికాకు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ సంస్థ బీబీఏఎంతో కూడా ఇదే తరహా వివాదాన్ని సెటిల్ చేసుకుంది.



## జియోభారత్ ఫోన్లలో రెండు కొత్త మోడల్స్

న్యూఢిల్లీ: రిలయన్స్ జియో తాజాగా జియోభారత్ ఫీచర్ ఫోన్లకు సంబంధించి వీ3, వీ4 పేరిట రెండు కొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టింది. ధర రూ. 1,099గా ఉంటుంది. రూ. 123 నెలవారీ రీచార్జ్‌తో అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా వంటి ప్రయోజనాలు పొందవచ్చు.

**'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..**

| | |
|---|---|
| నష్టాల్లోకి పీవీఆర్ ఐనాక్స్ | 3 నెలల్లో రిలయన్స్‌లో వాల్ట్ డిస్నీ ఇండియా విలీనం |

## హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ భళా

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజిమెంట్ కంపెనీ (ఏఎంసీ) ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 32 శాతం జంప్‌చేసి రూ. 577 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కంపెనీ నికరలాభం రూ. 437 కోట్లు మాత్రమే. మొత్తం ఆదాయం మరింత అధికంగా 38 శాతం ఎగసి రూ.1,058 కోట్లను అధిగమించింది. గత క్యూ2లో రూ.765 కోట్ల టర్నోవర్ మాత్రమే అందుకుంది.

**ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ షేరు బీఎస్‌ఈలో 1.5 శాతం బలపడి రూ. 4,549 వద్ద ముగిసింది.**

### హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ గుడ్

ప్రయివేట్ రంగ బీమా సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ క్యూ2 నికర లాభం 15 శాతం పుంజుకుని రూ. 433 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 377 కోట్లు ఆర్జించింది. నికర ప్రీమియం ఆదాయం సైతం రూ. 14,756 కోట్ల నుంచి రూ. 16,570 కోట్లకు జంప్‌చేసింది. తొలి ప్రీమియం వసూళ్లు రూ. 2,566 కోట్ల నుంచి రూ. 3,253 కోట్లకు పెరిగాయి. సాల్వెన్సీ రేషియో ప్రామాణిక 150 శాతానికంటే అధికంగా 181 శాతంగా నమోదైంది.

**ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేరు బీఎస్‌ఈలో 3.5 శాతం క్షీణించి రూ. 714 వద్ద ముగిసింది.**

## కొచిన్ షిప్‌యార్డ్ @ రూ. 1,540

### నేడు ఓఎఫ్ఎస్ షురూ

న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం కొచిన్ షిప్‌యార్డ్ ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)కు ఫ్లోర్ ధరను షేరుకు రూ. 1,540గా ప్రభుత్వం నిర్ణయించింది. సంస్థాగత ఇన్వెస్టర్లకు బుధవారం (16న) ఈ ఓఎఫ్ఎస్ ప్రారంభం కానుంది. రిటైలర్లు, కంపెనీ ఉద్యోగులు గురువారం(17) బిడ్స్ దాఖలు చేసుకునేందుకు వీలుంటుంది. 5% వాటా ద్వారా ప్రభుత్వం రూ. 2,000 కోట్లు సమకూర్చుకునే అవకాశముంది. ఫ్లోర్ ధర మంగళవారం ముగింపు ధర రూ.1,672తో పోలిస్తే 8% తక్కువకాగా.. ప్రస్తుతం కంపెనీలో ప్రభుత్వ వాటా 72.86 శాతంగా ఉంది.

**బీఎస్‌ఈలో మంగళవారం కొచిన్ షిప్‌యార్డ్ షేరు 3% ఎగసి రూ. 1,672 వద్ద ముగిసింది.**

## బ్యాంక్ మహారాష్ట్ర.. జూమ్


### క్యూ2లో 44% వృద్ధితో రూ. 1,327 కోట్లకు అప్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 44 శాతం ఎగసి రూ. 1,327 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం మెరుగుపడటం ఇందుకు సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో సంస్థ లాభం కేవలం రూ. 920 కోట్లు. మొత్తం ఆదాయం సైతం రూ. 5,736 కోట్ల నుంచి రూ. 6,809 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం 15 శాతంపైగా పుంజుకుని రూ.2,807 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 3.88 శాతం నుంచి 3.98 శాతానికి బలపడ్డాయి. 12 ప్రభుత్వ రంగ బ్యాంకులలో బీవోఎం గరిష్ట మార్జిన్లు ఆర్జించినట్లు బ్యాంక్ ఎండీ నిధు సక్సేనా పేర్కొన్నారు. పూర్తి ఏడాదికి రూ. 5,000 కోట్ల నికర లాభం ఆర్జించే వీలున్నట్లు అంచనా వేశారు. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.19% నుంచి 1.84 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.23 % నుంచి 0.2 శాతానికి దిగివచ్చాయి.

**ఫలితాల నేపథ్యంలో బీవోఎం షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 54 వద్ద ముగిసింది.**

## పెట్టుబడులకు పెద్దన్నలు




- వచ్చే పదేళ్ల పాటు 800 బిలియన్ డాలర్లు
- కొత్త వ్యాపారాలు, ప్రస్తుత వ్యాపార విస్తరణపై దృష్టి
- టాటా, రిలయన్స్, అదానీ గ్రూప్‌ల ప్రణాళికలు

దేశీయంగా వినియోగం పెరుగుతున్న కొద్దీ వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా దిగ్గజ కంపెనీలు భారీగా కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. ఇందు కోసం భారీగా ఇన్వెస్ట్ చేయబోతున్నాయి. ఇటీవలి మూడీస్ రేటింగ్స్ ప్రకారం.. కొన్నాళ్ల పాటు ఏటా 45–50 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెడతాయనే అంచనాలు నెలకొన్నాయి. ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పన కోసం తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు కూడా ఈ పెట్టుబడులకు దోహదపడనున్నాయి. ఇక, స్టాండర్డ్ అండ్ పూర్ అంచనాల ప్రకారం వచ్చే దశాబ్దకాలంలో కార్పొరేట్ దిగ్గజాలు 800 బిలియన్ డాలర్లపైగా పెట్టుబడులు పెట్టబోతున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా, అదానీ, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్, వేదాంత వంటి దిగ్గజాలు ఈ మేరకు ప్రణాళికలు వేసుకుంటున్నాయి. ఇందులో దాదాపు 40 శాతం పెట్టుబడులు, అంటే సుమారు 350 బిలియన్ డాలర్లు హరిత హైడ్రోజన్, పర్యావరణహిత ఇంధనాలు, ఏవియేషన్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లు వంటి .. కొత్త వ్యాపారాల్లోకి రానున్నాయి. అలాగే, ప్రస్తుత వ్యాపారాలను కూడా మరింత పటిష్టం చేసుకోవడంపై బిర్లా, మహీంద్రా, హిందుజా, హీరో, ఐటీసీ, బజాజ్ వంటి పలు దిగ్గజాలు దృష్టి పెడుతున్నాయి. గడిచిన రెండేళ్లుగా ఆయా సంస్థల పెట్టుబడుల సరళిని చూస్తే ఇందుకోసం వచ్చే పదేళ్లలో దాదాపు 400 బిలియన్ డాలర్ల నుంచి 500 బిలియన్ డాలర్ల వరకు ఇన్వెస్ట్ చేయొచ్చని అంచనాలు నెలకొన్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

### రిస్కులూ ఉన్నాయి..!

దేశీ దిగ్గజాల వ్యాపార వృద్ధికి అవకాశాలు భారీగానే ఉన్నప్పటికీ.. పెట్టుబడులపరంగా కొన్ని రిస్కులు కూడా ఉంటాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. పెట్టుబడుల కోసం ఏవో కొన్ని సంస్థలు తప్ప చాలా మటుకు కంపెనీలు పెద్ద ఎత్తున రుణాలపైనే ఆధారపడాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. కాబట్టి లాభదాయకత ఎలా ఉంటుందో ఇంకా తెలియని కొత్త రంగాల్లో పెట్టుబడులపరంగా కావచ్చు ప్రణాళికల అమలుపరంగా కావచ్చు ఏవైనా సమస్యలు ఎదురైతే రుణభారం గణనీయంగా పెరిగిపోయే అవకాశాలు ఉన్నాయని ఆ వర్గాలు చెబుతున్నాయి. వీటిని గుర్తించే ఆయా కంపెనీలు కొత్త టెక్నాలజీలపై ఇన్వెస్ట్ చేసే విషయంలో ప్రత్యామ్నాయ ప్రణాళికలను కూడా సిద్ధంగా ఉంచుకుంటున్నాయి.

# భవిత

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## ఏఐ-ఎంఎల్.. ఫ్యూచర్ కెరీర్!

» డిజిటల్ యుగంలో అన్ని రంగాలకు విస్తరిస్తున్న కృత్రిమ మేధ
» భవిష్యత్‌లో భారీగా కొలువులుంటాయని నివేదికల అంచనా
» నైపుణ్యాలుంటే ఆకర్షణీయ వేతనాలు అందుకునే మార్గం

**ఏఐ-ఎంఎల్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్! ప్రస్తుత డిజిటల్ యుగంలో సంస్థల కార్యకలాపాల నిర్వహణలో కీలకంగా నిలుస్తున్న టెక్నాలజీ ఇది. ఇటీవల కాలంలో ఉత్పత్తులు, సేవలు వేగంగా అందించడంలో కృత్రిమ మేథ, మెషీన్ లెర్నింగ్ తోడ్పాటు ఎంతో ఉంది. అందుకే ఏఐ, ఎంఎల్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఏఐ-ఎంఎల్ స్కిల్స్ సొంతం చేసుకుంటే భవిష్యత్‌లో భారీగా కొలువులు లభిస్తాయని తాజా నివేదికల అంచనా. ఈ నేపథ్యంలో.. ఏఐ-ఎంఎల్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం, ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాలు పెంచుకునేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..**

ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ డిజిటల్ టెక్నాలజీ ఆధారిత కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. ఏఐ, ఎంఎల్ వినియోగం పెరుగుతోంది. ఐటీ నుంచి బ్యాంకింగ్ వరకు.. ఈ-కామర్స్ మొదలు ఎడ్యుకేషన్ సెక్టార్ దాకా.. కృత్రిమ మేథ కీలకంగా మారుతోంది. ఇదే ధోరణి బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్ తదితర రంగాల్లోనూ కనిపిస్తోంది. గతేడాది నియామకాల్లో అత్యంత వేగంగా వృద్ధి చెందే ఉద్యోగంగా మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్ ప్రొఫైల్ గుర్తింపు పొందింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంచనా ప్రకారం–2025 చివరికి మొత్తంగా 97 మిలియన్‌ల ఉద్యోగాలు ఏఐ -ఎంఎల్‌లో లభించనున్నాయి. ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ 2023 ప్రకారం–2027 నాటికి ఏఐ-ఎంఎల్ స్పెషలిస్ట్‌ల సంఖ్య ఏకంగా 40 శాతం పెరనుంది.

**ఏఐ-ఎంఎల్ పనిచేస్తుందిలా**

ఏఐ అంటే మానవ ప్రమేయం లేకుండా యంత్రాలే స్వయంగా పనిచేసేలా చూడటం. ఇటీవల కాలంలో చర్చనీయాంశమైన డ్రైవర్ లెస్ కార్లనే తీసుకుంటే.. వీటిల్లో ఏఐ సాంకేతికత, సెన్సార్లు, కెమెరాలు వంటివి పొందుపరుస్తారు. ఇందుకోసం అవసరమైన కోడింగ్, ప్రోగ్రామింగ్‌లను సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఈ కోడింగ్, ప్రోగ్రామింగ్ రూపొందించే వారినే ఏఐ-ఎంఎల్ నిపుణులుగా పేర్కొంటున్నారు. అదే విధంగా అమెజాన్ అసిస్టెంట్, అలెక్సా సర్వీసెస్ వంటివి కూడా ఏఐ పరిజ్ఞానంతోనే సాధ్యమవుతున్నాయి.

**మెషీన్ లెర్నింగ్**

మెషీన్ లెర్నింగ్ అనేది ఏఐకు అనుసంధాన విభాగం. డేటాను విశ్లేషించడం, ప్రోగ్రామింగ్‌లు రూపొందించడం మెషీన్ లెర్నింగ్ ప్రత్యేకతగా పేర్కొనొచ్చు. డేటాసైన్స్, డేటా మేనేజ్‌మెంట్, డేటా అనలిటిక్స్‌ల సమ్మిళితంగా మెషిన్ లెర్నింగ్ కార్యకలాపాలు ఉంటాయి. వీటిని నిర్వహించే నిపుణులకు డిమాండ్ నెలకొంది. మెషిన్ లెర్నింగ్ అభ్యర్థులు కంప్యూటర్ బేసిక్స్, ప్రోగ్రామింగ్ స్కిల్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ నైపుణ్యాలను పెంచుకోవాలి. మ్యాథమెటికల్ స్కిల్స్, కంప్యుటేషనల్ స్కిల్స్, డేటా మోడలింగ్, సాఫ్ట్‌వేర్ డిజైన్, డెవలప్‌మెంట్ వంటి అంశాలపై పట్టు సాధిస్తే.. మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్, కోడింగ్, ప్రోగ్రామింగ్ పరంగా మరింత మెరుగ్గా రాణించే అవకాశం ఉంటుంది.

**ఎన్ఎల్‌పీ.. ఎమర్జింగ్ స్కిల్**

ఏఐ-ఎంఎల్‌లో.. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ)అత్యంత కీలకమైన స్కిల్‌గా నిలుస్తోంది. ఏఐ యంత్రాలకు,సాంకేతిక సిబ్బందికి, వినియోగదారులకు మధ్య ఇంటరాక్టివ్ టూల్ ఎన్ఎల్‌పీ. ఉదాహరణకు గూగుల్ ట్రాన్స్‌లేట్, ఓకే గూగుల్, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ విధానంలో ఆన్‌లైన్ ద్వారానే మనకు సమాచారం లభిస్తోంది. ఇందుకు ఎన్ఎల్‌పీ దోహదపడుతోంది. దీంతో సంస్థలు ఎన్ఎల్‌పీ వినియోగంపై ఆసక్తి చూపుతున్నాయి. దాన్ని తమ కార్యకలాపాల్లో వినియోగిస్తున్నారు.

**డీప్ లెర్నింగ్**

మానవ మేధస్సుకు అనుగుణంగా కంప్యూటర్స్‌లో నిర్దిష్టంగా ఒక డేటా ప్రక్రియను పూర్తి చేసే విధానమే.. డీప్ లెర్నింగ్. ఫలితంగా చిత్రాలు, టెక్స్ట్, సౌండ్స్, ఇతర డేటాలను గుర్తించి కచ్చితమైన అంచనాలు రూపొందించే అవకాశం లభిస్తుంది. హ్యూమన్ ఇంటెలిజెన్స్ అవసరమైన విభాగాల్లో సైతం డీప్ లెర్నింగ్ ద్వారా ఆయా పనులు ఆటోమేటిక్ టాస్క్ రూపంలో పూర్తి చేయొచ్చు. డిజిటల్ అసిస్టెన్స్, ఫ్రాడ్ డిటెక్షన్, ఆటోమేటిక్ ఫేషియల్ రికగ్నిషన్ వంటి కార్యకలాపాలలో డీప్ లెర్నింగ్ మెథడ్స్ ఉపయోగపడుతున్నాయి. డీప్ లెర్నింగ్ మోడల్స్ అనేవి డేటా సైంటిస్ట్‌లు ఒక అల్గారిథమ్, లేదా అప్పటికే నిర్దేశించిన నమూనాలో ఆయా టాస్క్‌లను పూర్తి చేయడానికి ఉపయోగించే కంప్యూటర్స్ ఫైల్స్‌గానూ పేర్కొనొచ్చు.

**జావా లాంగ్వేజ్**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో జావా ప్రధానమైన కంప్యూటర్ లాంగ్వేజ్‌గా ఉంది. ఈ సాఫ్ట్‌వేర్ లాంగ్వేజ్ ద్వారా న్యూరల్ నెట్‌వర్క్స్, ఎన్ఎల్‌పీ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్‌ను సమర్థవంతంగా పూర్తి చేయొచ్చు. ముఖ్యంగా ఏఐ అల్గారిథమ్‌కు అనుగుణంగా కోడింగ్ రాయడానికి జావా ఎంతో కీలకం. ప్రస్తుతం ఏఐలో డేటా ప్రాసెస్, డెసిషన్ మేకింగ్, ఇంటెలిజెంట్ చాట్‌బోట్స్ రూపకల్పనలో ఎక్కువగా జావా లాంగ్వేజ్‌పైనే ఆధారపడుతున్నారు. దీంతో.. ఈ లాంగ్వేజ్ నైపుణ్యాలున్న వారికి ఏఐ-ఎంఎల్ విభాగంలో కొలువులు లభిస్తున్నాయి.

**పైథాన్**

కంప్యూటర్ లాంగ్వేజెస్‌లో జావా స్క్రిప్ట్, సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్‌ల ప్రాధాన్యం తెలిసిందే. వీటితోపాటు జనరల్ పర్పస్ కోడింగ్ లాంగ్వేజ్‌గా పేర్కొనే పైథాన్ లాంగ్వేజ్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం.. కోడింగ్‌తో పాటు ఇతర ప్రోగ్రామింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోణంలో ఇది అత్యంత సులభంగా ఉండడమే. ముఖ్యంగా బ్యాక్ ఎండ్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్, సిస్టమ్ స్క్రిప్ట్ రైటింగ్‌లో పైథాన్ ఉపయోగపడుతోంది. ఈ స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలు మెరుగుపరచుకోవచ్చు.

**టెన్సార్స్ ఫ్లో**

ఏఐ టూల్స్‌లో భాగంగా కంపెనీలు వినియోగిస్తున్న మరో స్కిల్‌గా.. టెన్సార్స్ ఫ్లో నిలుస్తోంది. పైథాన్ కోడింగ్ ద్వారా రూపొందించిన ప్రోగ్రామ్స్, సాఫ్ట్‌వేర్స్‌కు సంబంధించి న్యూమరికల్ కంప్యూటేషన్‌ను సులభంగా పూర్తి చేసి, మెషీన్ లెర్నింగ్ ప్రక్రియను పైథాన్-ఫ్రెండ్లీగా మార్చేందుకు గూగుల్ రూపొందించిన టెన్సార్‌ఫ్లో వైపు కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి.

**డేటా సైన్స్.. భారీ డిమాండ్**

ఏఐ-ఎంఎల్‌లో మరో డిమాండింగ్ స్కిల్.. డేటా సైన్స్. సంస్థలు మార్కెట్ ట్రెండ్స్ విశ్లేషణకు, సేవలు, ఉత్పత్తులు అందించేందుకు డేటా సైన్స్ పైనే ఆధారపడుతున్నాయి. కోర్ నుంచి మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ సెక్టార్‌లో సైతం డేటా సైన్స్ నిపుణుల ఏర్పడుతోంది. గణాంకాల ఆధారంగా తక్కువ వ్యయంతో, నాణ్యమైన ఉత్పత్తిని రూపొందించే విధానాలు, కస్టమర్లు కోరుకుంటున్న ఫీచర్స్ తదితర అంశాలతో నివేదిక ఇవ్వడం డేటా సైన్స్ విభాగంలో ప్రధానంగా నిలుస్తోంది.

డేటా సైన్స్ విభాగంలో విధులు నిర్వహించే అభ్యర్థులు స్టాటిస్టిక్స్, అల్గారిథమ్స్, డేటా అనాలిసిస్, మెషీన్ లెర్నింగ్, కోడింగ్, ప్రోగ్రామింగ్ బృందాలతో కలిసి పని చేయాల్సి ఉంటుంది. ఇలా అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ఒక ఉత్పత్తి లేదా సేవకు సంబంధించి.. కంపెనీలు వినియోగదారులకు చేరువయ్యే ప్రణాళిక రూపొందించడం డేటా సైన్స్ నిపుణుల విధులుగా ఉంటున్నాయి.

**నైపుణ్యార్జనకు మార్గాలు**

దేశంలోని ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు బీటెక్ స్థాయిలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌తో పూర్తి స్థాయి కోర్సులను అందిస్తున్నాయి. దీంతో పాటు పీజీ స్థాయిలో కూడా ఏఐ స్పెషలైజేషన్‌తో ఎంటెక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు ఐబీఎం, ఇంటెల్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ఏఐలో స్వల్పకాలిక ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. వీటి కాల వ్యవధి నెల రోజుల నుంచి నాలుగు నెలల వరకు ఉంటోంది. వీటిని పూర్తి చేసుకుని సంబంధిత పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే ఇండస్ట్రీ వర్గాల్లోనూ గుర్తింపు లభిస్తోంది. దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్వల్పకాలిక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఏఐ-ఎంఎల్ విభాగంలో స్థిరపడడానికి పైన పేర్కొన్న నైపుణ్యాలతోపాటు కంప్యూటింగ్ స్కిల్స్, స్టాటిస్టికల్ స్కిల్స్, డేటా సైన్స్ స్కిల్స్ కీలకంగా నిలుస్తున్నాయి.




**జాబ్ ప్రొఫైల్స్.. వేతనాలు**

ఏఐ-ఎంఎల్‌లో సంబంధిత నైపుణ్యాలు పొందిన వారికి ఏఐ/ఎంఎల్ ఇంజనీర్, ఏఐ అసోసియేట్, ప్రాజెక్ట్ మేనేజర్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ప్రారంభంలోనే సగటు వార్షిక వేతనం రూ.6 లక్షలుగా ఉంటోంది. ఐటీ సంస్థలే కాకుండా..బ్యాంకింగ్, హెల్త్‌కేర్, ఎడ్‌టెక్, ఈ-కామర్స్ వంటి పలు రంగాల్లోనూ ఉద్యోగాలు దక్కించుకునే అవకాశముంది.

## జాబ్ పాయింట్

### ఎన్ఎఫ్ఎల్, నోయిడాలో 336 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

నోయిడాలోని నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఎన్ఎఫ్ఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఎన్ఎఫ్ఎల్ యూనిట్లు/కార్యాలయాల్లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 336.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ప్రొడక్షన్)–108, జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(మెకానికల్ )–06, జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ఇన్‌స్ట్రుమెంటేషన్)–33, జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(ఎలక్ట్రికల్)–14, జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(కెమికల్ ల్యాబ్) –10, స్టోర్ అసిస్టెంట్–19, లోకో అటెండెంట్ గ్రేడ్-2–05, జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(మెకానికల్)–డ్రాఫ్ట్స్‌మన్–04, జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2(మెకానికల్)–ఎన్‌డీటీ–04, నర్స్–10, ఫార్మసిస్ట్–10, ల్యాబ్ టెక్నీషియన్–04, ఎక్స్-రే టెక్నీషియన్–02, అకౌంట్స్ అసిస్టెంట్–10, అటెండెంట్ గ్రేడ్ –1(మెకానికల్)–ఫిట్టర్–40, అటెండెంట్ గ్రేడ్ –1 (మెకానికల్)–వెల్డర్–03, అటెండెంట్ గ్రేడ్ –1(మెకానికల్)–ఆటో ఎలక్ట్రీషియన్–02, అటెండెంట్ గ్రేడ్–1(మెకానికల్)–డీజిల్ మెకానిక్–02, అటెండెంట్ గ్రేడ్–1 (మెకానికల్)–టర్నర్–03, అటెండెంట్ గ్రేడ్–1(మెకానికల్)–మెషినిస్ట్–02, అటెండెంట్ గ్రేడ్–1(మెకానికల్)–బోరింగ్ మెషిన్–01, అటెండెంట్ గ్రేడ్–1(ఇన్‌స్ట్రుమెంటేషన్)–04, అటెండెంట్ గ్రేడ్–1(ఎలక్ట్రికల్)–33, లోకో అటెండెంట్ గ్రేడ్–3–04, ఓటీ టెక్నీషియన్–03.
» **యూనిట్లు/కార్యాలయాలు:** నంగల్ యూనిట్, బటిండా యూనిట్, పానిపట్ యూనిట్, విజయపూర్ యూనిట్, మార్కెటింగ్ డివిజన్, కార్పొరేట్ ఆఫీస్.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ, బీకాం, బీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 30.09.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.11.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 10.11.2024 నుంచి 11.11.2024 వరకు.
» **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com



### ఈసీహెచ్ఎస్, సికింద్రాబాద్‌లో 102 పోస్టులు

సికింద్రాబాద్‌లోని ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ స్టేషన్(ఈసీహెచ్ఎస్).. ఒప్పంద ప్రాతిపదికన మెడికల్, పారా మెడికల్, నాన్ మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 102.
» **పోస్టుల వివరాలు:** ఓఐసీ పాలీక్లినిక్–06, మెడికల్ స్పెషలిస్ట్–03, మెడికల్ ఆఫీసర్–24, గైనకాలజిస్ట్–01, డెంటల్ ఆఫీసర్–08, డెంటల్ హైజనిస్ట్–03, ఫార్మాసిస్ట్–12, ల్యాబ్ టెక్నీషియన్–07, ల్యాబ్ అసిస్టెంట్–01, నర్సింగ్ అసిస్టెంట్–03, ఫిజియోథెరపిస్ట్–03, ఐటీ నెట్‌వర్క్ టెక్నీషియన్–01, ఫిమేల్ అటెండెంట్–02, చౌకీదార్–06, డ్రైవర్–05, సఫాయివాలా–09, క్లర్క్–05, డీఈవో–02, ప్యూన్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎనిమిదో తరగతి, ఇంటర్మీడియట్,డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ, ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ/జీఎన్ఎం/ఎండీ/ఎంఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ఓఐసీ పాలీక్లినిక్, మెడికల్ ఆఫీసర్, డెంటల్ ఆఫీసర్ పోస్టులకు రూ.75,000, మెడికల్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్ పోస్టులకు రూ.1,00,000, టెక్నీషియన్, క్లర్క్, డీఈవో, ప్యూన్, సఫాయివాలా, చౌకీదార్, అటెండెంట్ పోస్టులకు రూ.16,800, డ్రైవర్ పోస్టులకు రూ.19,700, మిగతా పోస్టులకు రూ.28,100.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, షార్ట్‌లిస్ట్, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.10.2024.
» **వెబ్‌సైట్:** https://www.echs.gov.in

### రైట్స్ లిమిటెడ్ గుర్గావ్‌లో 15 టెక్నీషియన్-2 పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్) ఒప్పంద ప్రాతిపదికన టెక్నీషియన్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. అప్రెంటిస్(సివిల్ ఇంజనీరింగ్) సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.22,000 నుంచి రూ.66,000
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్‌ల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.11.2024.
» **వెబ్‌సైట్:** https://www.rites.com

# కుటుంబసభ్యులే గూఢచారులు!

**టీజీ న్యాబ్‌కు డ్రగ్స్ బాధిత పిల్లలపై ఫోన్‌కాల్స్**

**వారి ప్రవర్తన, కదలికలపై పోలీసులకు సమాచారం**

**దీంతో వారిపై నిఘా పెట్టి పెడ్లర్ల పనిపడుతున్న ఖాకీలు**



హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు డ్రగ్స్‌కు బానిసయ్యాడు. మత్తు ఇంజక్షన్ కావాలని రోజుకు రూ.500 ఇవ్వాలంటూ తల్లిదండ్రులను వేధించేవాడు. ఎన్నిసార్లు వద్దని వారించినా వినిపించుకోకుండా పిచ్చిపిచ్చిగా ప్రవర్తించేవాడు. చివరకు ఆ యువకుడి తల్లిదండ్రులు ఈ సమాచారాన్ని పోలీసులకు అందించారు. దీంతో యువకుడ్ని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించగా, ఈ మత్తు ఇంజక్షన్లను బిహార్ నుంచి కొరియర్ ద్వారా తెప్పించుకుంటున్నట్టు చెప్పాడు. లావాదేవీలు, కొరియర్‌లపై నిఘా పెట్టిన పోలీసులు ఆ నెట్‌వర్క్‌ను బ్రేక్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు.

సాక్షి, హైదరాబాద్: మాదక ద్రవ్యాల నుంచి తమ పిల్లలను రక్షించేందుకు తల్లిదండ్రులు తపన పడుతున్నారు. కుటుంబసభ్యులే పోలీసులకు గూఢచారులుగా మారుతున్నారు. మాదక ద్రవ్యాల బాధిత కుటుంబసభ్యులను విశ్వసిస్తున్న పోలీసులు, వారి సమాచారంపై నిఘా పెట్టి డ్రగ్స్ పెడ్లర్లు, నెట్‌వర్క్‌ల ఆట కట్టిస్తున్నారు.

**డీ–అడిక్షన్ సెంటర్లకు..**

మత్తు మహమ్మారి నుంచి తమ పిల్లలను బయటపడేసి, వారిని మాములు మనుషులుగా మార్చాలని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్న తమ పిల్లలు ఉజ్వల భవిష్యత్ నాశనం చేసుకోవడమే కాకుండా నిత్యం తల్లిదండ్రులకు ఇంట్లో నరకం చూపిస్తున్నారు. గత నెల రోజుల్లో 20కు పైగా కుటుంబసభ్యులు తమ పిల్లల ప్రవర్తన గురించి తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో (టీజీ న్యాబ్)కు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, వారికి మాదక ద్రవ్యాల గుర్తింపు కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఇందులో కొంతమంది దగ్గర డ్రగ్స్, గంజాయి దొరకగా.. మరికొందరిలో డ్రగ్స్ తీసుకున్నట్టు పరీక్షల్లో తేలింది. మత్తుపదార్థాలు దొరికిన వారికి వినియోగదారుల కింద కేసులు నమోదు చేసి వారిని డీ–అడిక్షన్ కేంద్రాలకు పంపించారు. ఇలా కుటుంబ సభ్యుల నుంచి రోజుకు 3–5 కాల్స్ వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

**సోషల్ మీడియాలో ప్రచారం..**

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు డ్రగ్స్ నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. మాదక ద్రవ్యాలను తరిమికొట్టాలని ఇటీవల ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో సినీ హీరోలు, సెలబ్రిటీలతో లఘు చిత్రాలు చిత్రీకరించారు. జూనియర్ ఎన్టీఆర్ రిలీజ్ చేసిన ఓ వీడియోకు ఒక్క రోజే 3.75 లక్షలు, మెగాస్టార్ చిరంజీవి వీడియోకు లక్షల్లో వ్యూస్ రావడం గమనార్హం.



నల్లగొండలోని కౌన్సెలింగ్ కేంద్రం వద్ద అర్ధరాత్రి అభ్యర్థుల పడిగాపులు

## అర్ధరాత్రి వరకు డీఎస్సీ కౌన్సెలింగ్

నల్లగొండ: డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నల్లగొండలో అధికారులు నిర్వహించిన కౌన్సెలింగ్ మంగళవారం అర్ధరాత్రి వరకు సాగింది. ఈ సందర్భంగా వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా వారికి పాఠశాలలను కేటాయించారు. మంగళవారం మధ్యాహ్నం మొదలైన కౌన్సెలింగ్ ప్రక్రియలో.. తొలుత స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, ఆ తర్వాత పండిట్లు, పీఈటీలు, ఎస్జీటీ పోస్టుల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్జీటీ పోస్టుల కౌన్సెలింగ్ అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొనసాగింది. కౌన్సెలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థులు పడిగాపులు కాయగా.. మరికొందరు అక్కడే కునుకు తీశారు.





కౌన్సెలింగ్ కేంద్రం వద్దే నిద్రిస్తున్న అభ్యర్థులు



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.






రాష్ట్రస్థాయి ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ సిబ్బందికి మంగళవారం మానేరు డ్యాంలో శిక్షణ ఇచ్చారు. ఆ దృశ్య మాలిక...

# నేటి నుంచి సింగరేణిస్థాయి మైన్స్ రెస్క్యూ పోటీలు

తలపడనున్న ఆరు జట్లు • నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి • ఈసారి యువ కార్మికులకు అవకాశం

గోదావరిఖని: సింగరేణి 53వ జోనల్‌స్థాయి పోటీలకు మైన్స్ రెస్క్యూ పోటీలకు సర్వం సిద్ధ మైంది. గోదావరిఖనిలోని సింగరేణి మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. బుధవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో సింగరేణి సంస్థవ్యాప్తంగా ఆరు జట్లు పాల్గొననున్నాయి. ఈ నెల 16, 17వ తేదీల్లో ఈ జట్ల మధ్య పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలకు ఈసారి యువ కార్మికులను ఎంపిక చేశారు. ఆర్జీవన్, ఆర్జీ–2, 3, ఏఎల్పీ, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి, భూపాలపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు జట్లు పోటీల్లో పాల్గొంటాయి. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 16 మందిని ఎంపిక చేసి డిసెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి పోటీలకు రెండు జట్లుగా పంపించనున్నారు. కాగా, ఈ పోటీలకు సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్‌సింగ్, డీడీఎంఎస్ ఉమేశ్ ఎం.సావర్కర్ తదితరులు హాజరుకానున్నారు.



ముస్తాబైన మైన్స్ మెయిన్ రెస్క్యూ స్టేషన్



రెస్క్యూ స్టేషన్ ప్రధాన ద్వారం

**పోటీలు ఇవే..**

రెండురోజుల పాటు ఆరు జట్ల మధ్య ప్రథమ చికిత్స, డ్రిల్ అండ్ పరేడ్, రెస్క్యూ రిలే ఈవెంట్, స్టాట్యూటరీ, థియరీలో పోటీలు ఉంటాయి. జీడీకే-7ఎల్ఈపీ భూగర్భ గనిలో రెస్క్యూ రికవరీ, మైన్స్ రెస్క్యూస్టేషన్‌లో మిగతా పోటీలు జరగనున్నాయి.

**విజయవంతం చేయాలి**

ఆపదకాలంలో మేమున్నామంటూ అండగా నిలిచే రెస్క్యూ జట్ల మధ్య నిర్వహించే ఈ పోటీలకు కార్మిక కుటుంబాలు హాజరై ఈ పోటీలను విజయవంతం చేయాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. స్థానిక రెస్క్యూ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 16న రెస్క్యూపరేడ్‌తో ప్రారంభమయ్యే పోటీలు ఈ నెల 17 న బహుమతి ప్రదానంతో ముగుస్తాయని తెలిపారు. సమావేశంలో అధికారులు నెహ్రూ, అనిల్‌కుమార్, మాధవరావు, ఎర్రన్న, మురళీకృష్ణ, ధనుంజయ్, విజయ్‌కుమార్, డాక్టర్ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్‌తో నర్సాపూర్ ఎమ్మెల్యే భేటీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో ఎర్రవల్లి నివాసంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులు, రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల మనోగతం వంటి అంశాలు ఈ భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు కలిసేందుకు సమయం ఇవ్వాల్సిందిగా సునీతా లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా కేసీఆర్‌ను కోరారు. ఒకటి రెండు రోజుల్లో ఎర్రవల్లి నివాసంలో నర్సాపూర్ నియోజకవర్గ పార్టీ కేడర్‌తో భేటీకి కేసీఆర్ సుముఖత వ్యక్తం చేశారు. ఈ భేటీలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ కూడా పాల్గొన్నారు. కాగా, మంగళవారం హైదరాబాద్ నందినగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును పలువురు ఆ పార్టీ ఎమ్మెల్యేలు కలసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

## జాతీయ భద్రత అవగాహన నెలగా అక్టోబర్




సాక్షి, హైదరాబాద్: అక్టోబర్‌ను జాతీయ భద్రత అవగాహన నెలగా కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ నిర్వహిస్తోంది. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ (ఎన్ఎస్‌సీఎస్) నిర్ణయం మేరకు అంతర్జాతీయంగా అక్టోబర్ నెలంతా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఈ ఏడాది సైబర్ సురక్షిత్ భారత్ ఇతివృత్తంలో దేశవ్యాప్తంగా 50 ప్రముఖ విద్యా సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ది సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ–డీఏసీ) నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

## బస్‌పాస్ రాయితీ ఆర్టీసీకి చెల్లించాలి




సాక్షి, హైదరాబాద్: బస్‌పాస్ రాయితీ రీయింబర్స్‌మెంట్, పూచీకత్తు రుణాల చెల్లింపునకు సంబంధించి 2023–24లో ఆర్టీసీకి రూ.1782 కోట్లు చెల్లిస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో కేటాయించకపోవటం అన్యాయమని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. వెంటనే ఆ మొత్తాన్ని ఆర్టీసీకి చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మహాలక్ష్మి పథకం రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

## ఏపీ సీడ్స్ చైర్మన్‌తో తెలంగాణ సీడ్స్ చైర్మన్ భేటీ



అన్వేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ సీడ్స్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డితో తెలంగాణ సీడ్స్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి మంగళవారం విజయ వాడలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శెనగ, మినుము, వేరుశెనగ, వరి పంటలు, రాష్ట్రాలకు అవసరమైన విత్తనాలు, వాటి సరఫరాపై చర్చించినట్లు అన్వేశ్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా పరస్పర అంగీకారంతో అవసరానికి అనుగుణంగా విత్తనోత్పత్తి, సరఫరా చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ సీడ్స్‌కు సంబంధించిన ఉత్పత్తి, మార్కెటింగ్ మేనేజర్లు, ఏపీ సీడ్స్‌కి సంబంధించిన ప్రొడక్షన్, మార్కెటింగ్, ఫైనాన్స్ మేనేజర్లు పాల్గొన్నారు.

## నేడు గ్రేటర్ ఎమ్మెల్యేలతో కేటీఆర్ భేటీ

హైడ్రా, మూసీ కూల్చివేతలపై కార్యాచరణ



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ కానున్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి రావాల్సిందిగా వారికి సమాచారం పంపించారు. గ్రేటర్ పరిధిలో హైడ్రా, మూసీ సుందరీకరణ పేరిట జరుగుతు న్న కూల్చివేతలు, నిర్వాసితులను బలవంతంగా తరలించడాన్ని బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోంది. ఇప్పటికే కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు భరోసా ఇచ్చిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో కూల్చివేతలపై న్యాయపోరాటం కూడా చేస్తోంది. ఈ నేపథ్యంలో జరిగే సమావేశంలో కేటీఆర్ హైడ్రా, మూసీ పరీవాహక ప్రాంతంలో కూల్చివేతలపై పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణ ప్రకటిస్తారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

**రేపు బీఆర్ఎస్వీ ప్రతినిధుల సభ**

విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన ఆందోళనలు, నిరసన కార్యక్రమాలపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. ఉద్య మ కార్యాచరణపై చర్చించేందుకు 17వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘం ప్రతినిధుల సభ నిర్వహిస్తోంది. బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. గురుకుల విద్యా సంస్థల్లో సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల వంటి అంశాలపై విద్యార్థులతో కలిసి పోరాటం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో కేటీఆర్ దిశానిర్దేశం చేస్తారు.

## నేటి నుంచి బీజేపీ నేతలు జిల్లాల పర్యటన

సభ్యత్వ నమోదుపై సమీక్షకు జిల్లాల వారీగా బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న సభ్యత్వ నమోదుపై...బుధవారం నుంచి 24 వరకు జిల్లా స్థాయిల్లో నాయకులు సమీక్ష నిర్వహించాలని బీజేపీ రాష్ట్రనాయకత్వం నిర్దేశించింది. సభ్యత్వ నమోదు లక్ష్యాల సాధన విషయంలో జిల్లా, మండల యూనిట్లకు దిశానిర్దేశం నిమిత్తం జిల్లాల్లో నాయకులు పర్యటించనున్నారు. ఈ సమీక్షల నిర్వహణ నిమిత్తం 38 జిల్లాలకు పార్టీకి చెందిన ఎంపీలు,ఎమ్మెల్యేలు,ఇతర ముఖ్యనేతలకు సమీక్ష బాధ్యతలు అప్పగించినట్లు రాష్ట్ర సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి ఎన్.రామచంద్రరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధజిల్లాలో సభ్యత్వనమోదు సమీక్షకు నాయకులకు జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు అప్పగించిన వారిలో కేంద్రమంత్రి బండి సంజయ్ (హనుమకొండ) ఎంపీలు డా.కె.లక్ష్మణ్ (మేడ్చల్), డీకే అరుణ (నారాయణపేట), ధర్మపురి అర్వింద్ (జగిత్యాల), ఈటల రాజేందర్ (నిజామాబాద్) ఎం.రఘునందన్‌రావు (సంగారెడ్డి), కొండా విశ్వేశ్వరరెడ్డి (నల్లగొండ), గోడెం నగేశ్ (కొమురంభీం), ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి (గద్వాల), ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి (వికారాబాద్), రాజాసింగ్ (భాగ్యనగర్ మలక్‌పేట) కాటిపల్లి వెంకటరమణారెడ్డి (రంగారెడ్డి–రూరల్), పాయల్ శంకర్ (కామారెడ్డి) పైడి రాకేశ్‌రెడ్డి (రంగారెడ్డి–అర్బన్), పాల్వాయి హరీశ్ (పెద్దపల్లి), ధన్‌పాల్ సూర్యనారాయణ (కరీంనగర్), రామారావు పవార్ (మెదక్), మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ఉన్నారు.

## పంచాయతీల విలీనంపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు • తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా




సాక్షి, హైదరాబాద్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని రాంపల్లి దాయార, కీసర, బోగారం, యాద్గారపల్లి గ్రామాలను సమీప మున్సిపాలిటీలో విలీనం చేయడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు నోటీసులు జారీచేస్తూ తదుపరి విచారణ ఈనెల 21కి వాయిదా వేసింది. పైన పేర్కొన్న గ్రామాలను మున్సిపాలిటీల నుంచి తొలగించి పంచాయతీలుగానే కొనసాగించాలని రాంపల్లి దాయారకు చెందిన మాజీ వార్డు మెంబర్ ముక్క మహేందర్, మాజీ సర్పంచ్ గంగి మల్లేశ్, మాజీ ఉప సర్పంచ్ కందాడి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఆయా గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది పూస మల్లేశ్, బి.హనుమంతు, ఎం.నర్సింహ వాదనలు వినిపించారు. పైన తెలిపిన గ్రామాలను మున్సిపాలిటీల్లో కలుపుతూ సెప్టెంబర్ 2, 2024న రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 3ని వెంటనే రద్దు చేసి తమ గ్రామాలను పంచాయతీలుగానే కొనసాగించాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చడం అంటే భారత రాజ్యాంగంలోని 73వ రాజ్యాంగ సవరణ చట్టం నిబంధనలలోని పార్ట్–9ని ఉల్లంఘించినట్లేనని తెలిపారు. ఆర్టికల్ 243 ఈ ప్రకారం ఐదేళ్ల పదవీకాలం పూర్తి కాగానే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి కానీ, ఫిబ్రవరి 2, 2024 నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసినా నేటికి ఎన్నికలను నిర్వహించ లేదన్నారు. పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చాలంటే జనాభా పెరుగుదలపై ఆధారపడి ఉంటుందని.. అంతేకాకుండా గ్రామ పంచాయతీల్లో వ్యవసాయం, వివిధ ఉపాధి పనుల మార్పులపై ప్రభావం చూపుతుందని చెప్పారు. అయినా ప్రభుత్వం మార్చాలని నిర్ణయించినప్పుడు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని నిబంధనలను అనుసరించాలి కానీ అవేమీ అనుసరించకుండా పంచాయతీలను మార్చడంతో అక్కడ ఉపాధి కూడా కరువై మహాత్మాగాంధీ ఉపాధి పనుల కింద కీసర మండలంలో దాదాపు 2900 మందికి ఉపాధి లేకుండా పోతుందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. మున్సిపాలిటీల్లో కలిపిన గ్రామాలను తిరిగి పంచాయతీలుగా మార్చి అక్కడ నివసిస్తున్న జనాభాను ఆదుకోవాలని ధర్మాసనాన్ని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది. ఆలోపు కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## మంత్రి సురేఖకు నవ చండీయాగ రక్ష

సాక్షి, హైదరాబాద్ : జోగుళాంబ అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయాస్తమ సేవలో భాగంగా నిర్వహించిన నవ చండీయాగ రక్షను దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయ అర్చకులు అందించారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మంత్రి నివాసంలో మంత్రి సురేఖకు అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందించి, వేదాశీర్వచనం చేశారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంపై ఆలయ ఈవో పురేందర్ కుమార్, ఇతర సిబ్బందిని మంత్రి అభినందించారు.



మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నివాళులర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి.



## వరుణుడి కరుణ కోసం..

పైన వెండి మబ్బులు దోబూచులాడుతుంటే.. కింద వానచినుకు కోసం చెరువు ఆశగా నోరు తెరిచి ఎదురు చూస్తోంది. అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట చెరువులో ఇప్పటివరకూ నీరు చేరలేదు. తుపాన్ నేపథ్యంలో మబ్బులు కమ్ముకుంటుండటంతో చెరువులో నీరు చేరుతుందని రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



## ముసురుకున్న మబ్బులు

అల్పపీడనం నేపథ్యంలో విశాఖ నగరాన్ని దట్టమైన మేఘాలు చుట్టుముట్టాయి. నగరంలో చిరు జల్లులు కురుస్తున్నాయి. తూర్పు కనుమలు వరుణుడి రాకకోసం ఎదురు చూస్తుండగా, నగరవాసి రానున్న వర్షతీవ్రతను అంచనా వేసుకుని అందుకు సన్నద్ధమవుతున్నాడు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



## తెగులు దిగులు లేకుండా..

పంటల్ని తెగుళ్ల బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు వినూత్న పద్ధతులు అవలంభిస్తున్నారు. ఉద్యాన పంటల్లో ఈ పోకడ మరింత ఎక్కువగా ఉంది. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం అంపాపురం వద్ద డాక్టర్ కొండన్న విరగకాసిన తన దానిమ్మ తోటను తెగుళ్ల బారి నుంచి తప్పించేందుకు ఇలా ప్రతి చెట్టుకూ తెరను చుట్టారు.

- సాక్షి ఫొటో గ్రాఫర్, అనంతపురం

## ఏపీ సీడ్స్ చైర్మన్‌తో తెలంగాణ సీడ్స్ చైర్మన్ భేటీ

సాక్షి, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ సీడ్స్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డితో తెలంగాణ సీడ్స్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి మంగళవారం విజయవాడలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శెనగ, మినుము, వేరుశెనగ, వరి పంటలు, రాష్ట్రాలకు అవసరమైన విత్తనాలు, వాటి సరఫరాపై చర్చించినట్లు అన్వేశ్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా పరస్పర అంగీకారంతో అవసరానికి అనుగుణంగా విత్తనోత్పత్తి, సరఫరా చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ సీడ్స్‌కు సంబంధించిన ఉత్పత్తి, మార్కెటింగ్ మేనేజర్లు, ఏపీ సీడ్స్‌కి సంబంధించిన ప్రొడక్షన్, మార్కెటింగ్, ఫైనాన్స్ మేనేజర్లు పాల్గొన్నారు.

## కన్నకొడుకే కాలయముడు

- తండ్రిని కత్తితో నరికి చంపిన కుమారుడు
- విశాఖ జిల్లా నరవలో దారుణం



పెందుర్తి: విశాఖ జిల్లా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. కన్న కొడుకే కాలయముడై తండ్రిని నరికి చంపాడు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నరవ శివారు మనిపాలెంలో ఎంగలి దేముడు(60) కుటుంబంతో నివసిస్తున్నాడు. దసరా నేపథ్యంలో కొద్ది రోజులుగా కుమారుడు గోపితో కలిసి తరచూ మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇద్దరూ కలిసి మద్యం తాగారు. ఆ సమయంలో తండ్రీ కొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఇంటికి వచ్చి పడుకున్న తండ్రి గొంతును కొడుకు కత్తితో కోశాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై దేముడు అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడు గోపిని అదుపులోకి తీసుకున్నారు.

# ‘చెత్త’ పన్ను.. చంద్రన్న ఘనతే

### టీడీపీ హయాంలోనే గుంటూరు మున్సిపాలిటీలో అమలు

- 2018లో జీవీఎంసీలో యూజర్ చార్జీలు
- కేంద్ర నిబంధనలను అంగీకరించిన నాటి టీడీపీ సర్కారు
- జగన్ ప్రభుత్వంలో మెరుగైన పారిశుధ్య విధానాలను ప్రశంసించిన ఎన్‌జీటీ
- ఇంటింటి చెత్త సేకరణే ధ్యేయంగా ‘క్లాప్’ కార్యక్రమం
- 43 లక్షల ఇళ్లకు 1.20 కోట్ల చెత్త డబ్బాల పంపిణీ
- సేకరణకు 4 వేలకు పైగా వాహనాల వినియోగం
- చెత్త నుంచి విద్యుత్ తయారీకి 2 ప్లాంట్ల ఏర్పాటు

సాక్షి, అమరావతి: నిజం చెబితే తల వెయ్యి ముక్కలైపోతుందని చంద్రబాబుకు ముని శాపం ఉందంటారు! అందుకే ఆయన ఎప్పుడూ నిజం చెప్పరు. పైగా తాను చేసిన తప్పులను ఇతరులపై నెట్టేసి మంచిని మాత్రం తన ఖాతాలో వేసుకుంటారు. గత ప్రభుత్వం పురపాలక సంఘాల్లో చెత్త పన్ను విధించి ప్రజలను ఇబ్బంది పెట్టిందని డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర తీసిన సీఎం చంద్రబాబు అసలు విషయాన్ని దాచిపెట్టి అసత్య ప్రచారాలు చేస్తున్నారు. అసలు ఇళ్ల నుంచి చెత్త సేకరణకు యూజర్ చార్జీల పేరుతో డబ్బులు వసూలు ప్రారంభించిందే తానేననే విషయాన్ని కప్పిపుచ్చి మభ్యపెడుతున్నారు.



- 2014లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు సమాజాన్ని సమూలంగా మార్చేస్తామని, వీధుల్లో చెత్త అనేది లేకుండా చేస్తానని గొప్పగా ప్రకటించారు. తీరా కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు పెట్టి వీధుల్లో చెత్తను తీసుకెళ్లి నగరం నడిబొడ్డున గుట్టలుగా వేశారు. దాంతో అవి కొండల్లా పెరిగిపోయి ప్రజలకు రోగాలను తెచ్చిపెట్టాయి. ఈ పని చేసినందుకు ప్రతి ఇంటి నుంచి చెత్త పన్ను వసూలును ఆయన ఆనాడే ప్రారంభించారు. మున్సిపాలిటీల్లో చెత్త సేకరణకు ప్రజల నుంచి చార్జీల వసూలుకు ఆయా పాలక మండళ్లలో తీర్మానాలు చేయించారు. మున్సిపాలిటీలకు కేంద్రం నుంచి నిధులు రావాలంటే చెత్త సేకరణ చార్జీలు చెల్లించాలని నాడు చంద్రబాబే ప్రచారం చేశారు. 2016లో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లోను చెత్త సేకరణకు ఫీజు (చెత్త పన్ను) విధించి అమలు చేశారు.
- గుంటూరులో దుకాణాలు, థియేటర్లు, ప్రైవేట్ హాస్టళ్లు, ఫంక్షన్ హాళ్లు, సూపర్ మార్కెట్లు, టీస్టాళ్ల నుంచి చెత్త తరలించేందుకు యూజర్ చార్జీలు వసూలు చేయాలని నాటి టీడీపీ సర్కారు ఉత్తర్వుల మేరకు నగరపాలక సంస్థ 2015 ఏప్రిల్‌లో తీర్మానించింది. విస్తీర్ణం, జనాభాను బట్టి గరిష్టంగా రూ.6 వేలు, కనిష్టంగా రూ.200 వసూలు చేయాలని నిర్ణయించారు. అదే ఏడాది మే నెలలో చెత్తను రోడ్లపై వేసినా, తగులబెట్టినా భారీగా జరిమానా విధిస్తూ నిర్ణయించారు. ఈమేరకు 2016 జూన్ 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నట్టు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.
- గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ)లో 2018 డిసెంబర్ నుంచి మున్సిపల్ సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ రూల్స్–2016 ప్రకారం స్వచ్ఛ భారత్ మిషన్‌కు అనుబంధంగా ఘన వ్యర్థాల నిర్వహణను పటిష్టంగా అమలు చేసేందుకు యూజర్ చార్జీలు వసూలు చేయాలని చట్టం చేశారు. ప్రతి ఇంటికీ నెలకు రూ.50 చొప్పున, వాణిజ్య సముదాయాలైన సినిమాహాళ్లు, హోటళ్ల నుంచి రూ.5 వేలు, ఇతర సంస్థల నుంచి రూ.1,500 వసూలు చేశారు.

### ‘క్లాప్’తో మార్పు తెచ్చిన జగన్ ప్రభుత్వం

పట్టణాలు, గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు స్వచ్ఛ భారత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు 2021 అక్టోబర్ 2న వైఎస్ జగన్ ప్రభుత్వం ‘క్లీన్ ఆంధ్రప్రదేశ్–జగనన్న స్వచ్ఛ సంకల్పం’ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని సుమారు 43 లక్షల గృహాల్లో ప్రతి ఇంటికీ రెండు చొప్పున 1.20 కోట్ల చెత్త డబ్బాలను పంపిణీ చేసింది. చెత్తను ఇంటివద్దే సేకరించి గార్బేజ్ స్టేషన్లకు తరలించేందుకు పీపీపీ విధానంలో 3,097 డీజిల్ ఆటో టిప్పర్లను, మరో 1,123 ఎలక్ట్రిక్ ఆటోలను రూ.60 కోట్లకు కొనుగోలు చేశారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను శుద్ధి చేసేందుకు మున్సిపాలిటీల్లో 243 గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను(జీటీఎస్) రూ.227.89 కోట్లతో నిర్మాణం చేపట్టింది. మురుగు శుద్ధికి ఎస్టీపీల నిర్మాణం, ఎప్పటి నుంచో పట్టణాల్లో పేరుకుపోయిన చెత్త డంపింగ్ యార్డ్‌ల్లోని లెగసీని తరలించే ప్రక్రియను సైతం చేపట్టింది. ఏడాది కాలంలోనే సుమారు రూ.2 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చి పట్టణాలు, నగరాలకు కొత్త రూపు తీసుకొచ్చింది.

### బాబు తప్పును సరిదిద్దిన జగన్

- టీడీపీ హయాంలో పన్ను విధించి మరీ వసూలు చేసిన చెత్తను జనావాసాల మధ్యే డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసి పారేయడంతో 123 మున్సిపాలిటీల్లో దాదాపు 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దుర్వాసనతో పాటు ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా పరిణమించడంతో గత ప్రభుత్వ హయాంలో తరలింపునకు చర్యలు చేపట్టడంతో పాటు 243 గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను(జీటీఎస్) ఏర్పాటు చేసింది. వివిధ రకాల చెత్తను వేరు చేసి ఎరువు, విద్యుత్ కోసం వినియోగించారు. గుంటూరు, విశాఖపట్నం వద్ద చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేసింది.
- జగన్ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమాలు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నాయి. గతంలో కొండల్లా పేరుకుపోయిన చెత్తలో దాదాపు 50 లక్షల మెట్రిక్ టన్నులను వివిధ రూపాల్లో కరిగించారు. పట్టణాల్లో మధ్యలో ఉన్న డంపింగ్ యార్డులను పూర్తిగా తొలగించారు. 2021లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విజయవాడ తిరుపతి, విశాఖపట్నంతో పాటు పుంగనూరు, నెల్లూరు బెస్ట్ అవార్డులు అందుకున్నాయి. 2022లో కేంద్రం ప్రకటించిన అవార్డుల్లో టాప్–10 నగరాల్లో ఆరు రాష్ట్రానికే దక్కాయి. 2023లోనూ రాష్ట్రంలోని పలు నగరాలు అవార్డులను సొంతం చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన ఎన్‌జీటీ బృందం ఉత్తమ పారిశుధ్య విధానాలు, చెత్త నిర్వహణను అభినందించింది. ఎన్జీటీ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించని రాష్ట్రాలకు భారీస్థాయిలో జరిమానా విధించింది.

# ‘పల్లె పండుగ’కు దండగ ఖర్చు..

### గ్రామాల్లో ఆర్భాటంగా చేపడుతున్న కార్యక్రమాలకు నిధులు కేటాయించని ప్రభుత్వం

- అయినా.. ఒక్కో గ్రామంలో రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు



సాక్షి, అమరావతి: పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆర్భాటంగా నిర్వహిస్తున్నప్పటికీ దాని నిర్వహణకు మాత్రం ప్రత్యేకంగా ఎలాంటి నిధులు కేటాయించలేదు. అయినా.. ఇందుకు ఒక్కో గ్రామంలో కనీసం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వెచ్చిస్తున్నట్లు సమాచారం. మంత్రులు పాల్గొనే చోట ఈ ఖర్చు మరింత ఎక్కువగా ఉంటున్నట్లు తెలుస్తోంది. దీంతో.. ఈ ప్రభావం పనుల నాణ్యతపై తప్పనిసరిగా పడుతుందని అనుమానిస్తున్నారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కేటగిరి నిధులతో గ్రామాల్లో కొత్తగా చేపట్టే పనులకు భూమిపూజ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఈ ‘పల్లె పండుగ’ కార్యక్రమాన్ని సోమవారం నుంచి వారం రోజులపాటు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

### గతంలో ఎలాంటి ఆర్భాటం లేకుండా..

నిజానికి.. ఉపాధి నిధులతో చేపట్టే పనులకు భూమిపూజ, శంకుస్థాపన అంటూ ఎలాంటి ఆర్భాటాలు ఉండవు. పైగా.. ఉపాధి పనుల్లో కాంట్రాక్టరు ప్రమేయమే ఉండదు. కానీ, ఇతర నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టరు తన మిగులు కోసం అంచనా విలువ పెంచేస్తారు. అదే ఉపాధి పనుల అంచనాల తయారీలో ఎలాంటి మిగులు నిధులకు ఆస్కారం లేకుండా అంచనాలు రూపొందిస్తారు. గత సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఒక్కో గ్రామంలో రూ.కోట్లు ఖర్చుపెట్టి రాష్ట్రవ్యాప్తంగా 30 వేలకు పైగా శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టినా.. ఎలాంటి హడావుడి లేకుండానే వాటిని పూర్తిచేసింది. కానీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా పల్లె పండుగ అంటూ నానా హడావుడి చేస్తోంది.

### పల్లె పండుగ ఖర్చు టీడీపీ నేతలదే..

ఇక కేంద్ర నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పనుల వివరాలను గ్రామంలో ఒకచోట వాల్ పెయింట్ రాయడానికి రూ.3 వేల చొప్పున.. బ్యానర్ ఏర్పాటుకు మరో రూ.1,500 చొప్పున బిల్లులు పెట్టుకునే వెసులుబాటు ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే, అత్యధిక గ్రామాల్లో అధికార పార్టీ నాయకులే కాంట్రాక్టరు ముసుగులో ఆయా పనుల పర్యవేక్షణ బాధ్యతలు తీసుకుని పల్లె పండుగ కార్యక్రమ ఖర్చు భరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనివల్ల ఈ కార్యక్రమ నిర్వహణకు పెట్టే ఖర్చు మొత్తాన్ని అతను చేపట్టే పనుల నుంచి మిగుల్చుకోక తప్పదని.. చివరికి ఇది పనుల నాణ్యతపై ప్రభావం చూపుతుందన్న చర్చ అధికార వర్గాల్లో జోరుగా సాగుతోంది.

### తొలిరోజు 960 గ్రామాల్లో 1,600 పనులకు..

ఇదిలా ఉంటే.. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా తొలిరోజైన సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 960 గ్రామ పంచాయతీల్లో దాదాపు 1,600 కొత్త పనులకు భూమిపూజ జరిగినట్లు అధికారుల సమాచారం. ఇందులో 1,300 దాకా సిమెంట్ రోడ్ల పనులే ఉన్నాయి. మరోవైపు.. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లను పక్కనపెట్టడంతో అధికార టీడీపీ నేతల పెత్తనం కొనసాగింది.

# బెడిసికొట్టిన టీచర్ల సర్దుబాటు



### మునిసిపల్ హైస్కూళ్లకు జూనియర్ టీచర్లు

- ఖాళీగా 2,800 పోస్టులు.. సర్దుబాటులోనూ జరగని న్యాయం
- సబ్జెక్టు టీచర్లులేక కుంటుపడిన బోధన

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో సర్దుబాటు పేరిట ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ బెడిసికొట్టింది. పాఠశాలలు తెరిచిన తర్వాత దాదాపు 2 నెలల పాటు కసరత్తు చేసి, ఒక యూనిట్ పరీక్షలు పూర్తయ్యాక ప్రారంభించిన బదిలీలు ఇప్పటికీ కొలిక్కి రాలేదు. జిల్లా పరిషత్ ఉపాధ్యాయులను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన నిబంధనలను మునిసిపల్, ఎయిడెడ్ స్కూళ్లలోనూ అమలు చేయడంతో అక్కడ ఒకటి, రెండు తరగతులకు బోధిస్తున్న జూనియర్ ఉపాధ్యాయులను పదో తరగతి సిలబస్ బోధించేందుకు బదిలీ చేయడం గమనార్హం. సర్దుబాటుకు ముందు ప్రాథమిక పాఠశాలల్లో సీనియర్లు, అర్హత గల ఉపాధ్యాయులను సబ్జెక్టు టీచర్లుగా నియమించడంతో గతేడాది పదో తరగతి ఫలితాల్లో 91 శాతం ఉత్తీర్ణత సాధించారు. అయితే, ఈ సర్దుబాటు ప్రక్రియతో ప్రస్తుతం హైస్కూళ్లలో బోధిస్తున్న సీనియర్ ఎస్జీటీలను తిరిగి ఎలిమెంటరీ స్కూళ్లకు పంపించి, వారి స్థానంలో ఎలిమెంటరీ స్కూళ్లలోని జూనియర్లను హైస్కూళ్లకు పంపించారు. సబ్జెక్టుపై అవగాహన లేనివారిని హైస్కూళ్లకు పంపడంతో పాటు కొన్ని సబ్జెక్టులకు అసలు టీచర్లనే నియమించలేదు. దీంతో ఉత్తమ ఫలితాల సాధన అటుంచి, విద్యార్థులను పాస్ కూడా చేయలేమని మునిసిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చేతులెత్తేస్తున్నారు.

### పదో తరగతి ఫలితాలపై తీవ్ర ప్రభావం

ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ లేదా సబ్జెక్టు నిపుణుల కొరత ఉన్నప్పుడు గత ప్రభుత్వం అర్హత ఉన్న దాదాపు 8 వేల మంది ఎస్జీటీలను సీనియారిటీ ఆధారంగా సబ్జెక్టు టీచర్లు (స్కూల్ అసిస్టెంట్)గా పదోన్నతి కల్పించింది. విద్యా సంవత్సరం మధ్యలో ఎవరైనా స్కూల్ అసిస్టెంట్‌లు రిటైరైతే వారిస్థానంలో అర్హత గల సీనియర్ ఎస్జీటీని డిప్యుటేషన్‌పై నియమించింది. తద్వారా పదో తరగతిలో 91 శాతం ఉత్తీర్ణత సాధ్యమైంది. ప్రభుత్వంలోని అన్ని మేనేజ్‌మెంట్ స్కూళ్లకు ఇదే విధానం అనుసరించింది. మునిసిపల్ హైస్కూళ్లలో 8 ఏళ్లుగా పోస్టులను భర్తీ చేయకపోవడంతో దాదాపు 2,800 సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడింది. మునిసిపల్ ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్‌పై కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండటంతో సబ్జెక్టు టీచర్ల కొరతను తొలగించేందుకు ప్రాథమిక పాఠశాలల్లోని సీనియర్లు, సబ్జెక్టు నిపుణులను డిప్యుటేషన్‌పై నియమించి పదో తరగతి సిలబస్ బోధించేవారు. కానీ.. ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన ‘సర్దుబాటు’ ప్రక్రియలో నిబంధనల ప్రకారం విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఆధారంగా అత్యంత జూనియర్ టీచర్లను మిగులుగా చూపి బదిలీ చేశారు. ఇదే నిబంధనను మునిసిపల్ స్కూళ్లకు వర్తింపజేయడంతో ప్రాథమిక పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయుల్లో అత్యంత జూనియర్‌ను హైస్కూళ్లలో సర్దుబాటు చేసి, ప్రస్తుతం ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సీనియర్లను ఎలిమెంటరీ స్కూళ్లకు పంపించారు. మరోపక్క హిందీ, ఇంగ్లిష్ ఉపాధ్యాయుల కొరత ఉండటంతో ఈ ప్రభావం ఈ ఏడాది పదో తరగతి ఫలితాలపై తీవ్రంగా చూపనుంది.

### ఆధ్యాత్మిక సమాచారం

### శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైను ఏటీసీ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 75,361 మంది స్వామివారిని దర్శించుకోగా 28,850 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.91 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

### వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



కొత్తపేట: కోనసీమ జిల్లా కొత్తపేటలోని గౌతమి అయ్యప్పస్వామి వారి ఆలయం వద్ద మంగళవారం 54 కలశాలు, పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మండల దీక్ష చేపట్టిన అయ్యప్ప భక్తులు వివిధ పూజల్లో భాగంగా స్థానిక అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. దానిలో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వందలాది మంది అయ్యప్ప దీక్షాధారులు స్థానిక బోడిపాలెం వద్ద బొబ్బర్లంక–ముక్తేశ్వరం కాలువలో స్నానమాచరించి, కలశాలతో జలాన్ని శిరస్సుపై ఉంచుకుని అయ్యప్ప నామస్మరణతో ఊరేగారు. రాత్రి వేదపండితుడు బ్రహ్మశ్రీ కారుపర్తి కోటేశ్వరరావు వేద మంత్రోచ్చారణ నడుమ 54 కలశాలతో పడిపూజ నిర్వహించారు.

### పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు గడువు తేదీలు పొడిగిస్తున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యామండలి ఆదేశాల ప్రకారం పీజీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 21లోపు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని తెలియజేశారు. వివరాలకు 0877-2248589 నంబరులో సంప్రదించాలని సూచించారు.

### విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై సమీక్ష

తిరుపతి అర్బన్: స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్స్‌ను తయారు చేయడానికి తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణతో పాటు పలువురు సబ్జెక్ట్ నిపుణులతో వర్చువల్ పద్ధతిలో చర్చించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ పలువురు అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఐఐటీ నిపుణులతో వర్చువల్ విధానంలో సలహాలు తీసుకున్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎంటెక్ (కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజినీరింగ్) కోర్సులలో, ఫార్మసీ కళాశాలలో ఎమ్‌ఫార్మసీ, బీఫార్మసీ కోర్సులలో పేమెంట్ సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టనున్నట్లు రిజిస్ట్రార్ భూపతినాయుడు తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కేటగిరిలో ఎంటెక్‌లో అడ్మిషన్ పొందడానికి గేట్ -2024 మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్ -2024 రెండవ ప్రాధాన్యత, కేవలం బీటెక్ అర్హత ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే ఎంఫార్మసీలో చేరడానికి జీ ఫ్యాట్ 2024 అర్హత సాధించిన వారికి మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్ -2024 అర్హత ఉన్నవారికి రెండవ ప్రాధాన్యత, కేవలం బీఫార్మసీ ఉన్న వారికి చివరి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. బీఫార్మసీలో చేరడానికి ఈఏపీసెట్ -2024 రాసిన వారికి మొదటి ప్రాధాన్యత, కేవలం ఇంటర్మీడియెట్ అర్హతగల వారికి చివరి ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు.

### రేపు ‘నన్నయ’లో స్పాట్ కౌన్సెలింగ్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంఏ, ఎంకాం, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ కోర్సులలో ప్రవేశాలకు గురువారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. యూనివర్సిటీతో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో ఖాళీగా ఉన్న సీట్లను దీని ద్వారా భర్తీ చేస్తామన్నారు. ఏపీపీజీ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9.30 నుంచి 11 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ని సందర్శించవచ్చని సూచించారు.

### పకడ్బందీగా దూరవిద్య పరీక్షలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం తెలిపారు. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో మంగళవారం యూనివర్సిటీలో జరిగిన ప్రత్యేక సమావేశానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ పరీక్షలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించి యూనివర్సిటీ ప్రతిష్ట ఇనుమడింపజేసేందుకు పరీక్షా కేంద్రాలు, దూరవిద్యా కేంద్రం అధికారులు కృషి చేయాలని సూచించారు.

## బిజినెస్ రీల్

### నష్టాల్లోకి పీవీఆర్ ఐనాక్స్




**క్యూ2లో రూ. 12 కోట్లు**

**న్యూఢిల్లీ:** మల్టీప్లెక్స్ దిగ్గజం పీవీఆర్ ఐనాక్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో లాభాలకు బదులు నష్టాలు చవిచూసింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 12 కోట్లకుపైగా నష్టాలను ప్రకటించింది. సినిమా థియేటర్ల బిజినెస్ నీరసించడం ప్రభావాన్ని చూపించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కంపెనీ రూ. 166 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. మొత్తం ఆదాయం సైతం 19 శాతం క్షీణించి రూ.1,622 కోట్లకు పరిమితమైంది. మొత్తం వ్యయాలు 7 శాతం తగ్గి రూ. 1,679 కోట్లుగా నమోదయ్యాయి. మూవీ ఎగ్జిబిషన్ ఆదాయం 20 శాతం క్షీణించి రూ. 1,579 కోట్లకు పరిమితమైంది. అయితే మూవీ ప్రొడక్షన్, పంపిణీ బిజినెస్ 78 శాతం పెరిగి రూ. 108 కోట్లను చేరుకుంది.

**ఫలితాల నేపథ్యంలో పీవీఆర్ ఐనాక్స్ షేరు బీఎస్ఈలో 2.2 శాతం లాభంతో రూ. 1,622 వద్ద ముగిసింది.**

### న్యూజెన్ సాఫ్ట్‌వేర్ బంపర్ ఫలితాలు

**నికర లాభం 47 శాతం జంప్**

**న్యూఢిల్లీ:** సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల సంస్థ న్యూజెన్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో (క్యూ2) బలమైన పనితీరు నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 47 శాతం పెరిగి రూ.70 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.48 కోట్లుగా ఉండడం గమనార్హం. రూ.361 కోట్ల ఆదాయాన్ని సాధించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.293 కోట్లతో పోల్చి చూస్తే 23 శాతం పెరిగింది. ''అన్ని కీలక మార్కెట్లలో మెరుగైన పనితీరు సాధించాం. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వరుసగా రెండు త్రైమాసికాల్లో బలమైన వృద్ధి నమోదవుతోంది. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కీలక విభాగాలుగా ఉన్నాయి. ఇన్సూరెన్స్, ప్రభుత్వ విభాగాల్లోనూ డిమాండ్ పెరుగుతోంది''అని న్యూజెన్ సాఫ్ట్‌వేర్ సీఈవో వీరేందర్ జీత్ తెలిపారు. కంపెనీ ఉద్యోగుల సంఖ్య 4,400కు చేరింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో న్యూజెన్ సాఫ్ట్‌వేర్ షేరు ధర 4 శాతం వరకు క్షీణించి రూ.1,298 వద్ద ముగిసింది.

'ఫ్యూచర్ జనరాలీ'లో వాటాల కొనుగోలుకు..

### సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ:** ఫ్యూచర్ జనరాలీ ఇండియా ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరాలీ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్‌లో వాటాలు కొనుగోలు చేయడానికి సంబంధించి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం ఫ్యూచర్ జనరాలీ ఇండియా ఇన్సూరెన్స్‌లో 24.91 శాతం, ఫ్యూచర్ జనరాలీ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్‌లో 25.18 శాతం వాటాను బ్యాంకు కొనుగోలు చేయనుంది. దివాలా చర్యలు ఎదుర్కొంటున్న ఫ్యూచర్ ఎంటర్‌ప్రైజెస్‌కు (ఎఫ్ఈఎల్) ఈ రెండు సంస్థల్లో ఉన్న వాటాలను కొనుగోలు చేసేందుకు బిడ్డింగ్‌లో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంపికైంది.

### నేటి బోర్డు సమావేశాలు

బజాజ్ ఆటో, క్రిసిల్, ఎంఫసిస్, ఎల్అండ్‌టీ టెక్నాలజీ, సౌత్ ఇండియన్ బ్యాంక్, హిమాద్రి స్పెషాలిటీ కెమికల్, ఆదిత్య బిర్లా మనీ, ఆదిత్య ఫోర్జ్

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| BPCL | 349.35 | 2.52 |
| ICICIBANK | 1,256.00 | 1.97 |
| BHARTIARTL | 1,718.00 | 1.32 |
| BRITANNIA | 6,051.05 | 1.22 |
| ASIANPAINT | 3,075.00 | 1.18 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| HDFCLIFE | 714.05 | -3.58 |
| WIPRO | 532.7 | -3.07 |
| BAJAJ-AUTO | 11,537.90 | -3.04 |
| BAJFINANCE | 7,029.80 | -2.48 |
| HINDALCO | 726.75 | -2.19 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 5,994 |
| ఎన్ఎస్ఈ | 1,03,530 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,85,497 |
| ఎఫ్ఐఐ | - 1,749 |
| డీఐఐ | + 1,655 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 70.34 | $ 73.83 |
| బ్రెంట్ | 74.00 | $ 77.46 |

# 3 నెలల్లో రిలయన్స్‌లో వాల్ట్ డిస్నీ ఇండియా విలీనం

- దిగ్గజ మీడియా సంస్థగా అవతరణ
- ఇప్పటికే సీసీఐ, ఎన్‌సీఎల్‌టీ అనుమతులు
- విలీనానికి వీలుగా వ్యాపారాల్లో సర్దుబాట్లు
- రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రకటన




**న్యూఢిల్లీ:** ఇటీవలి ఒప్పందం మేరకు... రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన మీడియా ఆస్తుల్లో వాల్ట్ డిస్నీ ఇండియా ఈ డిసెంబర్ త్రైమాసికంలోపు విలీనం కానుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నాటికి విలీనం పూర్తవుతుందంటూ స్టాక్ ఎక్స్ఛేంజీలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ సమాచారం ఇచ్చింది. రిలయన్స్‌కు చెందిన వయాకామ్ 18, స్టార్ ఇండియా విలీనానికి కాంపిటిషన్ కమిషన్ (సీసీఐ), జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) నుంచి అనుమతులు లభించడం గమనార్హం. ''మిగిలిన అనుమతుల కోసం కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. విలీన లావాదేవీ 2024-25 సంవత్సరం మూడో త్రైమాసికంలో ముగుస్తుందని అంచనా వేస్తున్నాం''అని రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలిపింది. రిలయన్స్ మీడియా విభాగాలైన టీవీ18 బ్రాడ్‌కాస్ట్, ఈ18, నెట్‌వర్క్ 18 మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ విలీనానికి ఎన్‌సీఎల్‌టీ ఇప్పటికే ఆమోదం తెలియజేసిందని.. అక్టోబర్ 3 నుంచి విలీనం అమల్లోకి వచ్చిందని సంస్థ పేర్కొంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన వయాకామ్ 18 పరిధిలోని నాన్ న్యూస్ (వార్తలు కాకుండా), కరెంట్ ఎఫైర్స్ టీవీ ఛానళ్ల లైసెన్స్‌లను స్టార్ ఇండియాకు బదిలీ చేసేందుకు సెప్టెంబర్ 27న కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన విషయాన్ని కూడా ప్రస్తావించింది. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్, బోధిట్రీ సిస్టమ్స్‌కు చెందిన మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారానికి వయాకామ్ 18 హోల్డింగ్ కంపెనీగా ఉంది. విలీనం తుది దశలో ఉందని, సీసీఐ ఆదేశాలకు అనుగుణంగా వ్యాపారాల్లో సర్దుబాట్లు చేస్తున్నట్టు రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలిపింది.

**అతిపెద్ద మీడియా సంస్థ..**

రిలయన్స్ ఇండస్ట్రీస్ మీడియా విభాగాలు, వాల్ట్‌డిస్నీ ఇండియా వ్యాపారాల విలీనంతో రూ.70,000 కోట్ల విలువైన అతిపెద్ద మీడియా సంస్థ అవతరించనుంది. విలీనానంతర సంస్థలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 63.16 శాతం, వాల్ట్ డిస్నీకి 36.84 శాతం చొప్పున వాటాలుంటాయి. పోటీ సంస్థలైన సోనీ, నెట్‌ఫ్లిక్స్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా రూ.11,500 కోట్లను రిలయన్స్ ఇండస్ట్రీస్ పెట్టుబడిగా పెట్టనుంది.

## వేలానికి ఐదు కంపెనీల ప్రాపర్టీలు

**నవంబర్ 19న నిర్వహణ**



**న్యూఢిల్లీ:** మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, ఐదు కంపెనీలకు సంబంధించి 15 ప్రాపర్టీలకు (భూములు/భవనాలు) నవంబర్ 19న వేలం నిర్వహించనుంది. మంగళం ఆగ్రో ప్రొడక్ట్స్, సుమంగళ్ ఇండస్ట్రీస్, ఫాల్కన్ ఇండస్ట్రీస్ ఇండియా, రవికిరణ్ రియల్టీ ఇండియా, పురుషోత్తమ్ ఇన్ఫోటెక్ ఇండస్ట్రీస్ కంపెనీలకు సంబంధించిన ఆస్తులు ఇందులో ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇన్వెస్టర్ల నుంచి ఈ కంపెనీలు వసూలు చేసిన డబ్బులను.. ఈ వేలం ద్వారా రాబట్టే ప్రయత్నాన్ని సెబీ చేస్తోంది. పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల పరిధిలో ఈ కంపెనీలకు సంబంధించి ప్రాపర్టీలు.. ఫ్లాట్లు, భూములు, ప్లాంట్ మెషినరీ వేలానికి రానున్నాయి. ఆ ప్రాపర్టీలకు సంబంధించి బిడ్లను సెబీ ఆహ్వానించింది. 15 ప్రాపర్టీలలో ఏడు మంగళం ఆగ్రో ప్రొడక్ట్స్‌కు సంబంధించినవి ఉన్నాయి. సుమంగళ్ ఇండస్ట్రీస్, ఫాల్కన్ ఇండస్ట్రీస్‌కు సంబంధించి చెరో మూడు ప్రాపర్టీలు కూడా వేలం వేసే వాటిలో ఉన్నాయి. మంగళం ఆగ్రో ప్రొడక్ట్స్ నిబంధనలకు విరుద్ధంగా సెక్యూర్డ్ ఎన్‌సీడీలను జారీ చేసి రూ.11 కోట్లు సమీకరించినట్టు సెబీ తేల్చింది. అలాగే సుమంగళ్ ఇండస్ట్రీస్ కలెక్టివ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌ల ద్వారా రూ.85 కోట్లు, ఫాల్కన్ ఇండస్ట్రీస్ రెడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్ల జారీ ద్వారా రూ.48.58 కోట్ల చొప్పున సమీకరించడం గమనార్హం.

# డేటా షేరింగ్‌పై సెబీ చర్చాపత్రం



**న్యూఢిల్లీ:** డేటా గోప్యత, జవాబుదారీతనం మొదలైన వాటిపై పరిశోధనల కోసం డేటాను షేర్ చేసుకోవడానికి సంబంధించి స్టాక్ ఎక్స్ఛేంజీలు, ఇతర మార్కెట్ ఇన్‌ఫ్రా సంస్థలు (ఎంఐఐ) సొంత విధానాలను రూపొందించుకోవాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించింది. వాణిజ్య అవసరాలకు కోసం షేర్ చేసుకునే డేటాను ఈ విధానం నుంచి మినహాయింపునిస్తూ ఒక చర్చాపత్రాన్ని రూపొందించింది. సెబీలో భాగమైన మార్కెట్ డేటా అడ్వైజరీ కమిటీ సూచనల ప్రకారం మార్కెట్ డేటాకు బాధ్యత వహించాల్సిన సంస్థలు డేటా సేకరణ, ప్రాసెసింగ్, స్టోరేజ్, షేరింగ్, అలాగే గోప్యత పాటించడం, యాక్సెస్ ఇవ్వడం మధ్య సమతూకంతో వ్యవహరించేలా తగు విధానాలను రూపొందించుకోవాలి. ఎంఐఐలు డేటాను రెండు కేటగిరీల కింద వర్గీకరించాలి. బహిరంగంగా షేర్ చేసుకునే డేటా ఒకటి కాగా బహిరంగంగా షేర్ చేయకూడనిది రెండోది. రెండో కేటగిరీలోకి కేవైసీ వివరాలు అలాగే వ్యక్తులు, సంస్థలను గుర్తించేందుకు పరోక్షంగా ఉపయోగపడే డేటా వస్తుంది. మార్కెట్ సెగ్మెంట్లవ్యాప్తంగా స్థిరమైన విధానాలను పాటించేలా చూడటం ఈ పాలసీ లక్ష్యం. ఈ ప్రతిపాదనలపై అక్టోబర్ 29లోగా సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుంది.

# అమెరికా, మెక్సికోలకు ఆర్థికమంత్రి

**నేటి నుంచి 11 రోజుల పాటు పర్యటన**

**న్యూఢిల్లీ:** ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం నుంచి 11 రోజుల పాటు అమెరికా, మెక్సికోల్లో పర్యటించనున్నారు. మెక్సికోలో అక్టోబర్ 17-20 వరకు తన తొలి పర్యటనలో భాగంగా ఆమె ఆ దేశ ఆర్థిక శాఖ మంత్రి రోజెలియో రామిరేజ్ డి లా ఓతో ద్వైపాక్షిక సమావేశాన్ని కూడా నిర్వహిస్తారు. పార్లమెంటరీ సహకారాన్ని బలోపేతం చేయడానికి, ఆర్థికాభివృద్ధిని పెంపొందించడానికి ఆమె మెక్సికన్ పార్లమెంటులోని పలువురు సభ్యులతో చర్చలు జరుపుతారని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటన తెలిపింది. ఇక 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ ఆమె అమెరికాలో తన పర్యటనను కొనసాగిస్తారు. ఈ పర్యటనలో భాగంగా ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో పాల్గొంటారు. 4వ జీ20 ఆర్థికమంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల సమావేశాల్లో పాల్గొంటారు.

# టెక్ రంగంలోకి రూ. 5,330 కోట్లు



**న్యూఢిల్లీ:** భారతీయ సాంకేతిక రంగం 2024 జూలై-సెప్టెంబర్ కాలంలో 635 మిలియన్ డాలర్ల (రూ. 5,330 కోట్లు)విలువైన ఒప్పందాలను నమోదు చేసింది. విలువ పరంగా గతేడాదితో పోలిస్తే 31 శాతం పెరుగుదలను నమోదు చేసిందని కన్సల్టింగ్ కంపెనీ గ్రాంట్ థాంటన్ భారత్ వెల్లడించింది. 'యూఎస్ ఫెడ్ ఇటీవలి వడ్డీ రేటు తగ్గింపు, ఎన్నికల అనంతరం భారత్‌లో స్థిరత్వంతో పాటు, గుర్తించదగిన విలువ, పరిమాణం పెరుగుదలతో డీల్ ల్యాండ్‌స్కేప్‌లో కొత్త ఊపును నింపింది. సెప్టెంబర్ త్రైమాసికంలో 79 ఒప్పందాలు జరిగాయి. ఇది పరిమాణంలో 5 శాతం, విలువలలో 31 శాతం పెరుగుదలను సాధించింది. ఒక్కొక్కటి 20 మిలియన్ డాలర్లకు పైగా విలువ చేసే డీల్స్ 12 నమోదయ్యాయి. విలీనాలు కొనుగోళ్లు జూన్ త్రైమాసికంతో పోలిస్తే 44 శాతం, గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 53 శాతం అధికమై 26 డీల్స్‌కు చేరుకున్నాయి. ఈ డీల్స్ విలువ 205 శాతం దూసుకెళ్లి 116 మిలియన్ డాలర్లుగా ఉంది. దాదాపు 65 శాతం లావాదేవీలు డీల్ విలువలను వెల్లడించలేదు. ఇది కూడా మొత్తం డీల్ విలువ క్షీణతకు కారణమైంది' అని నివేదిక తెలిపింది.

**భారత్‌పట్ల బుల్లిష్‌గా..**

'పెట్టుబడిదారులు భారతీయ మార్కెట్‌పై చాలా బుల్లిష్‌గా ఉన్నారు. మార్కెట్లలోకి ప్రవహించే మూలధనం యొక్క ప్రధాన లబ్ధిదారులలో భారత్ ఒకటి. పెద్ద సంఖ్యలో ఐపీవోలు వరుసలో ఉండటంతో నిష్క్రమణ అవకాశాలపై పెట్టుబడిదారులకు తగినంత విశ్వాసం ఉంటుంది. కొంతమంది పెట్టుబడిదారులు ఈ ఐపీవోల నుండి మెరుగైన ప్రయోజనంతో నిష్క్రమించాలని భావిస్తున్నారు. స్టార్టప్ వ్యవస్థలో నిధుల కార్యకలాపాలు సంవత్సరానికి గణనీయంగా మెరుగుపడ్డాయి. ఒప్పందాల సంఖ్య 62 శాతం, నిధుల విలువ 40 శాతం పెరిగింది' అని నివేదిక వివరించింది.

# నిధుల సమీకరణకు బోర్డులు ఓకే

**జాబితాలో వరుణ్ బెవరేజెస్, ఫోర్టిస్ హెల్త్‌కేర్**



**న్యూఢిల్లీ:** పానీయాల గ్లోబల్ దిగ్గజం పెప్సీకోకు బాట్లింగ్ భాగస్వామిగా వ్యవహరిస్తున్న వరుణ్ బెవరేజెస్, ఆరోగ్య పరిరక్షణ రంగ దేశీ కంపెనీ ఫోర్టిస్ హెల్త్‌కేర్ తాజాగా నిధుల సమీకరణ బాట పట్టాయి. వివరాలు చూద్దాం..

**రూ. 7,500 కోట్లు**

అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా నిధులు సమీకరించే ప్రతిపాదనకు వరుణ్ బెవరేజెస్ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వృద్ధి ప్రణాళికల అమలుకు వీలుగా క్విప్ ద్వారా రూ. 7,500 కోట్లు మించకుండా సమకూర్చుకునేందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ తాజాగా వెల్లడించింది. ఈక్విటీ షేర్ల జారీ ద్వారా ఒకేసారి లేదా దశలవారీగా నిధులు సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలియజేసింది. అయితే ఇందుకు పోస్టల్ బ్యాలట్ ద్వారా వాటాదారుల అనుమతులు సైతం కోరనున్నట్లు పేర్కొంది. క్విప్‌లో కనీసం 10 శాతాన్ని మ్యూచువల్ ఫండ్స్‌కు కేటాయించనుంది. నిధులను అనుబంధ, భాగస్వామ్య లేదా సహచర సంస్థలలో పెట్టుబడులకు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. బిజినెస్‌ల వృద్ధి, కొత్త ప్రాడక్టులు, కొత్త ప్రాంతాలకు విస్తరణ, ఇతర సంస్థల కొనుగోళ్లు తదితర ప్రణాళికలున్నట్లు వివరించింది. వీటిలో రుణ చెల్లింపులు సైతం ఉన్నట్లు తెలియజేసింది.

**వరుణ్ బెవరేజెస్ షేరు బీఎస్ఈలో 3 % బలపడి రూ. 611 వద్ద ముగిసింది.**

**రూ. 1,500 కోట్లు**

**మా**ర్పిడిరహిత డిబెంచర్ల(ఎన్‌సీడీలు) జారీ ద్వారా నిధులు సమీకరించే ప్రతిపాదనకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ప్రయివేట్ రంగ సంస్థ ఫోర్టిస్ హెల్త్‌కేర్ తాజాగా వెల్లడించింది. ప్రయివేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో అర్హతగల ఇన్వెస్టర్లకు ఎన్‌సీడీల జారీ ద్వారా రూ. 1,500 కోట్లవరకూ సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. ఇన్వెస్టర్ల జాబితాలో డీబీఎస్ బ్యాంక్(డీబీఎస్), హెచ్ఎస్‌బీసీ, సిటీకార్ప్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(సింగపూర్), మిజుహో బ్యాంక్ సింగపూర్‌సహా ఇతర విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లున్నట్లు వివరించింది. ఐదేళ్ల కాలపరిమితితో ఎన్‌సీడీలను జారీ చేయనున్నట్లు వెల్లడించింది. వీటిని బీఎస్ఈలో లిస్ట్‌చేయనుంది.

**ఫోర్టిస్ హెల్త్‌కేర్ షేరు బీఎస్ఈలో 4 % పెరిగి రూ. 619 వద్ద ముగిసింది.**

# భారత్‌కు ఎఫ్‌డీఐల్లో అమెరికా టాప్

**తర్వాతి స్థానాల్లో మారిషస్, సింగపూర్, యూకే**



**ముంబై:** భారత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో (ఎఫ్‌డీఐ) ఎక్కువ భాగం అమెరికా నుంచే వస్తున్నాయి. మారిషస్, సింగపూర్, యూకే తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. వార్షిక గణన వివరాలను ఆర్‌బీఐ విడుదల చేసింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 75 శాతానికి పైగా విదేశీ కంపెనీల సబ్సిడరీలు రూపంలోనే వచ్చింది. ఎఫ్‌డీఐ ఈక్విటీలో 90 శాతం నాన్ ఫైనాన్షియల్ కంపెనీల నుంచి రావడం గమనార్హం. ''ఇప్పటికే ఉన్న పెట్టుబడుల విలువ పెరగడం, తాజా పెట్టుబడులు కలిపి.. 2023-24లో ఎఫ్‌డీఐల మార్కెట్ విలువ 23.3 శాతం పెరిగింది. ఓవర్సీస్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ (ఓడీఐ) (విదేశాల్లో భారత కంపెనీలు చేసే పెట్టుబడులు) 3.4 శాతం మేర వృద్ధి చెందింది''అని ఆర్‌బీఐ డేటా వెల్లడించింది. అన్‌లిస్టెడ్ కంపెనీల్లోకి వచ్చే ఎఫ్‌డీఐల్లో 17.5 శాతం వృద్ధి కనిపించింది. లిస్టెడ్ కంపెనీల్లో 29.8 శాతం వృద్ధి నమోదైంది. ఓడీఐ పెరుగుదల కంటే ఎఫ్‌డీఐ వృద్ధి ఎక్కువగా నమోదైంది. అవుట్‌వర్డ్ (బయటకు వెళ్లేవి) నుంచి ఇన్‌వర్డ్ (దేశంలోకి వచ్చే విదేశీ పెట్టుబడులు) పెట్టుబడుల రేషియో మార్కెట్ విలువలో 16.1 శాతానికి తగ్గింది. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో 19.3 శాతంగా ఉంది.

# రియల్టీలోకి పెట్టుబడులు 46 శాతం అప్

**జనవరి-సెప్టెంబర్‌లో 8.9 బిలియన్ డాలర్లు - సీబీఆర్ఈ నివేదిక**



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది జనవరి-సెప్టెంబర్ మధ్య కాలంలో దేశీ రియల్ ఎస్టేట్ రంగంలోకి ఈక్విటీ పెట్టుబడులు 8.9 బిలియన్ డాలర్ల మేర వచ్చాయి.గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 46 శాతం పెరిగాయి. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ నివేదిక ప్రకారం 2018లో ఈ పెట్టుబడులు 5.8 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2019లో 6.4 బిలియన్ డాలర్లు, 2020లో 6 బిలియన్ డాలర్లు, 2021లో 5.9 బిలియన్ డాలర్లు, 2022లో 7.8 బిలియన్ డాలర్లు, 2023లో 7.4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రైవేట్ ఈక్విటీ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్, సావరీన్ వెల్త్ ఫండ్స్, సంస్థాగత ఇన్వెస్టర్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు. రియల్ ఎస్టేట్ ఫండ్ - కమ్ - డెవలపర్లు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు, కార్పొరేట్ గ్రూప్‌లు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు మొదలైనవి చేసే ఇన్వెస్ట్‌మెంట్లను ఈక్విటీ పెట్టుబడులుగా వ్యవహరిస్తారు. డేటా ప్రకారం జూన్ త్రైమాసికంలో పెట్టుబడుల ప్రవాహం పెరగడంతో 2024 జనవరి-సెప్టెంబర్ మధ్య కాలంలో దేశీ రియల్ ఎస్టేట్‌లోకి ఇన్వెస్ట్‌మెంట్లు కొత్త గరిష్టాలకు ఎగిశాయి. జూలై-సెప్టెంబర్ మధ్య కాలంలో రియల్టీలోకి 2.6 బిలియన్ డాలర్ల ఈక్విటీ పెట్టుబడులు వచ్చాయి.

రాబోయే రోజుల్లోనూ ఇదే తీరు కొనసాగే అవకాశం ఉందని సీబీఆర్ఈ చైర్మన్ (భారత్, ఆగ్నేయాసియా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా) అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. సెప్టెంబర్ త్రైమాసికంలో దేశీ ఇన్వెస్టర్లు (ప్రధానంగా డెవలపర్లు) పెట్టుబడులకు నేతృత్వం వహించారు. ఆఫీస్ లీజింగ్ మార్కెట్ పుంజుకోవడం, గృహాల కొనుగోలు.. ఖర్చు చేసే విషయంలో వినియోగదారుల్లో రిస్కు సామర్థ్యాలు అసాధారణంగా పెరగడం తదితర అంశాలు ఈ ఏడాది తొలి తొమ్మిది నెలల్లో రియల్టీలోకి పెట్టుబడులు రావడానికి దోహదపడినట్లు నివేదిక వివరించింది.

## క్యూ3లో 25 రియల్ ఎస్టేట్ డీల్స్

**విలువ రూ. 11,760 కోట్లు**



**దే**శీ రియల్టీ రంగంలో ఈ కేలండర్ సంవత్సరం (2024) మూడో త్రైమాసికంలో 25 డీల్స్ జరిగినట్లు కన్సల్టింగ్ సంస్థ గ్రాంట్ థార్న్‌టన్ భారత్ నివేదిక పేర్కొంది. వీటి విలువ 1.4 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 11,760 కోట్లు)గా తెలియజేసింది. ప్రధానంగా డెవలపర్స్ చేపట్టిన అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్)దే వీటిలో ప్రధాన వాటాగా వెల్లడించింది. 'రియల్టీ, రీట్స్ డీల్ ట్రాకర్- ఎంఅండ్ఏ, పీఈ డీల్ ఇన్‌సైట్స్' పేరుతో విడుదల చేసిన నివేదిక వివరాలు చూద్దాం..

కొత్త రికార్డ్ రియల్టీ రంగ జోరును కొనసాగిస్తూ ఈ ఏడాది జులై-సెప్టెంబర్(క్యూ3)లో ఏకంగా 25 డీల్స్ నమోదయ్యాయి. పరిమాణంరీత్యా ఇది సరికొత్త రికార్డుకాగా.. విలువ(రూ. 11,760 కోట్లు)రీత్యా 2023 ఏడాది క్యూ2 తదుపరి గరిష్ట విలువగా నమోదైంది. ప్రధానంగా క్విప్ జారీ పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. వీటికి రెసిడెన్షియల్, వాణిజ్య విభాగాలలో పీఈ నిధులు జత కలిశాయి. అంతేకాకుండా రియల్టీ టెక్నాలజీ కంపెనీలలోనూ ఒప్పందాలు కలిసొచ్చాయి.

**డీల్స్ తీరిలా**

క్యూ2లో నమోదైన మొత్తం డీల్స్‌లో 5.1 కోట్ల డాలర్ల విలువైన 8 ఒప్పందాలు కొనుగోళ్లు, విలీనం(ఎంఅండ్ఏ) విభాగంలో జరిగాయి. ప్రయివేట్ ఈక్విటీ(పీఈ), వెంచర్ క్యాపిటల్(వీసీ) విభాగంలో 40.1 కోట్ల విలువైన 12 డీల్స్ నమోదయ్యాయి. అయితే ఏప్రిల్-జూన్(క్యూ2)లో లభించిన 1.4 బిలియన్ డాలర్లతో పోలిస్తే భారీగా క్షీణించాయి. కాగా.. క్యూ3లో 4.9 కోట్ల డాలర్ల విలువైన ఒక ఐపీవోసహా 94 కోట్ల డాలర్ల విలువైన క్విప్‌లు జారీ అయ్యాయి. ఇందుకు క్యాపిటల్ మార్కెట్లు బలపడటం సహకరించింది. క్విప్‌లో 94 కోట్ల డాలర్ల విలువైన 4 డీల్స్ జరిగాయి. ప్రెస్టీజ్ ఎస్టేట్స్ 60.2 కోట్ల డాలర్ల డీల్ దీనిలో కలసి ఉంది. ఇవి క్యూ2తో పోలిస్తే ఆరు రెట్లు అధికం.

# వృద్ధి బాటలోనే ఫార్మా ఎగుమతులు

**ఫార్మా విభాగం కార్యదర్శి అరుణీష్ చావ్లా**



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా మందగమనం నెలకొన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఫార్మా, మెడిటెక్ రంగాల ఎగుమతులు వృద్ధి బాటలోనే కొనసాగుతాయని ఫార్మా విభాగం కార్యదర్శి అరుణీష్ చావ్లా తెలిపారు. దేశీయంగా ఔషధాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం మద్దతు కల్పిస్తోందని సీఐఐ ఫార్మా, లైఫ్ సైన్సెస్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో క్యాన్సర్, మధుమేహం, హెచ్ఐవీ, క్షయ మొదలైన వాటి చికిత్సకు సంబంధించిన 16 బ్లాక్‌బస్టర్ మాలిక్యూల్స్‌ను దేశీయంగా ఉత్పత్తి చేయడంపై కసరత్తు జరుగుతోందని వివరించారు. ఇప్పటికే కొన్ని మాలిక్యూల్స్‌కి డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) అనుమతులు కూడా వచ్చాయని పేర్కొన్నారు. 'ఇటీవలి డేటా ప్రకారం ఎగుమతుల ధోరణులను పరిశీలించాం. అంతర్జాతీయంగా ఎగుమతులు సాధారణంగా మందగించినప్పటికీ భారత్ నుంచి ఫార్మా, బయోటెక్, బల్క్ డ్రగ్ ఎగుమతులు గతేడాదితో పోలిస్తే రెండంకెల స్థాయిలో వృద్ధి చెందడం సానుకూలాంశం' అని చావ్లా చెప్పారు. రాబోయే రోజుల్లో ఫార్మా, మెడిటెక్ పరిశ్రమ పటిష్టమైన పనితీరు కనపరుస్తాయని పేర్కొన్నారు. ఇమేజింగ్ డివైజ్‌లు, బాడీ ఇంప్లాంట్స్ మొదలైన విభాగాల్లోనూ ఎగుమతులు పెరుగుతున్నాయని చెప్పారు.



# మూడేళ్లుగా పురోగతి లేదు

- సారథ్య మార్పునకు సరైన సమయమిదే
- జెమీమాకు నాయకత్వ బాధ్యతలు ఇవ్వాలి
- భారత మహిళా జట్టు ఫిట్‌నెస్ పేలవం
- మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ మనోగతం

**న్యూఢిల్లీ:** భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ప్రస్తుత టి20 ప్రపంచకప్‌లో జట్టు వైఫల్యంపై స్పందించింది. లీగ్ దశలోనే నిష్క్రమణకు ప్రధాన కారణం గత మూడేళ్లుగా జట్టులో పురోగతే లేదని నర్మగర్భంగా వ్యాఖ్యానించింది. దుబాయ్‌లో ఉన్న ఆమె ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ బ్యాటింగ్, ఫీల్డింగ్ వైఫల్యాలపై, క్రికెటర్లలో కొరవడిన పట్టుదలపై తన అభిప్రాయాలను పంచుకుంది. 'ప్రపంచకప్‌కు సన్నాహంగా ఆడిన ఆసియా కప్‌లో చిన్న జట్లతో ఆడేటప్పుడు రిజర్వ్ బెంచ్‌ను పటిష్ఠం చేసేందుకు వారికి అవకాశాలివ్వాలి. పురుషుల జట్టు చేస్తోంది అదే. మెగా ఈవెంట్లు, పెద్ద టోర్నీలకు ముందు ఈ కసరత్తు చాలా అవసరం. కానీ మన మహిళల జట్టు విషయంలో అలాంటిదేదీ ఉండదు. రిజర్వ్ ఆటగాళ్లకు అవకాశాలివ్వరు. ఇది జట్టు నిర్మాణానికి ఇబ్బందికరంగా పరిణమిస్తుంది' అని వివరించింది. పలు ప్రశ్నలకు మిథాలీ ఇచ్చిన సమాధానాలు...

**టోర్నీలో టీమిండియా ప్రదర్శనపై మీ విశ్లేషణ?**

దీనిపై మాట్లాడాలంటే ముందుగా చెప్పుకోవాల్సింది ఆస్ట్రేలియాతో మ్యాచే గురించే! తప్పక గెలవాల్సిన పోరు అది. ఓ దశలో పటిష్ఠ స్థితిలో కనిపించినా... మళ్లీ కంగారే. మరో పాత కథే! గత రెండు, మూడేళ్లుగా జట్టు సాధించిన పురోగతి నాకైతే కనపించట్లేదు. గట్టి జట్లను 'ఢీ'కొట్టే ముందు చేసే కసరత్తు, ఆటలో ఎత్తుగడలేవీ మెప్పించడం లేదు. అంతర్జాతీయస్థాయిలో కొన్ని జట్లు క్రమంగా పుంజుకున్నాయి. దక్షిణాఫ్రికానే దానికి సరైన ఉదాహరణ.

**ఆస్ట్రేలియా కంటే కూడా న్యూజిలాండ్‌తో ఎదురైనా పరాజయమే భారత్ నిష్క్రమణకు కారణమని భావిస్తున్నారా?**

ఆశ్చర్యకర విషయం ఏమిటంటే మనం పరిస్థితులకు తగ్గట్లుగా వెంటనే మారకపోవడమే ఆ మ్యాచ్ ఓటమికి కారణం. మందకొడి వికెట్‌పై వన్డే ప్రపంచకప్‌లో అయితే ముందు నింపాదిగా ఆడి తర్వాత పుంజుకొని ఆడే సౌలభ్యం వుంటుంది. కానీ టి20 ఫార్మాట్‌లో అలాంటి అవకాశం ఉండదు. త్వరితగతిన సందర్భాన్ని బట్టి ఆటతీరు మార్చుకోవాలి. సోఫీ డివైన్ చేసింది అదే. కానీ మనం మాత్రం అలా ఆడలేకపోయాం.

**తరుచూ బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చడం వల్ల ఆయా స్థానాల్లో స్పష్టత కొరవడిందా?**

జెమీమా, హర్మన్‌ప్రీత్‌లు తరచూ 3, 4 స్థానాలు మార్చుకోవడం కారణమని నేననుకోను. బ్యాటింగ్‌లో ఓపెనర్ల శుభారంభమే అత్యంత కీలకం. షఫాలీ వర్మ దూకుడుగా ఆడుతుందని అందరికీ తెలుసు కానీ అలా జరగలేదు. ఓపెనర్లిద్దరు బాగా ఆడిఉంటే మిడిల్ ఓవర్లలో యథేచ్ఛగా ఆడే అవకాశముంటుంది. మొదట పవర్ ప్లే, ఆఖర్లో డెత్ ఓవర్లు మంచి స్కోరుకు బాట వేస్తాయి. అయితే దురదృష్టవశాత్తూ ఈ టోర్నీలోని కీలక మ్యాచ్‌ల్లో అలాంటి శుభారంభాలు, చివర్లో దూకుడు కరువయ్యాయి. ఆసియా కప్‌లో కనిపించిన లోపాలపై దృష్టి పెట్టాల్సింది. కానీ అలా ఏమీ జరగలేదు.

**ప్రపంచకప్ ముంగిట ఫీల్డింగ్ విభాగంపై దృష్టి సారించకపోవడం పెద్ద తప్పిదమని మీరు అంగీకరిస్తారా?**

ఈ విషయంలో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ నన్ను తీవ్రంగా నిరుత్సాహపరిచింది. రాధా యాదవ్, జెమీమా రోడ్రిగ్స్ తప్ప 11 మందిలో మిగతా వారంతా మైదానంలో చురుగ్గా కనిపించలేదు. కీలకమైన మ్యాచ్‌లో ఇద్దరితో కట్టడి ఎలా సాధ్యమవుతుంది. ఫిట్‌నెస్ అతిముఖ్యం. దీనిపై మనం ఒక బెంచ్‌మార్క్‌ను పెట్టుకోవాల్సిందే. నిజాయితీగా అడుగుతున్నా ఏడాదంతా ఎంత మంది మన క్రికెటర్లు ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెడుతున్నారో చెప్పగలరా! ఆ శ్రద్ధలేకే మైదానంలో ఫీల్డింగ్ విభాగంపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది.

**హర్మన్‌ప్రీత్ 2018 నుంచి కెప్టెన్‌గా ఉన్నా... ఫలితాలు మాత్రం రావడం లేదు. ఈ నేపథ్యంలో సారథ్య మార్పు అవసరమా?**

ఒకవేళ సెలక్టర్లు కెప్టెన్‌ను మార్చాలనుకుంటే మాత్రం నేను యువ క్రికెటర్‌కు పగ్గాలివ్వాలని కోరుకుంటాను. సారథ్య మార్పునకు ఇదే సరైన సమయం. ఇంకా ఆలస్యం చేస్తే... మనం ఇంకో ప్రపంచకప్‌కూ దూరమవుతాం. చేస్తే ఇప్పుడే కొత్త కెప్టెన్‌ను చేయాలి. మరీ ప్రపంచకప్ సమీపంలో చేస్తే ఒరిగే ప్రయోజనం కూడా ఉండదు. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అందుబాటులో ఉన్నప్పటికీ 24 ఏళ్ల జెమీమాకు పగ్గాలిస్తే మంచిదనిపిస్తుంది. ఆమెకు ఎక్కువకాలం సారథిగా కొనసాగే వీలుంటుంది. పైగా మైదానంలో చురుకుదనం, ఫీల్డింగ్‌లో అందరిలో ఉత్తేజం నింపే శక్తి ఆమెకుంది. ఈ టోర్నీ ఆసాంతం ఆమె కనబరిచిన చురుకుదనం నన్ను బాగా ఆకట్టుకుంది. అలాంటి జెమీమాకు పగ్గాలిస్తే జట్టులో కొత్త ఉత్తేజాన్ని నింపినట్లవుతుంది.

# కమ్రాన్ కమాల్

**అరంగేట్రం టెస్టులోనే సెంచరీ చేసిన పాక్ బ్యాటర్**

- తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 259/5
- ఇంగ్లండ్‌తో రెండో టెస్టు



కమ్రాన్

**ముల్తాన్:** అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కమ్రాన్ గులామ్ (224 బంతుల్లో 118; 11 ఫోర్లు, ఒక సిక్సర్) ఆడుతున్న తొలి టెస్టులోనే సెంచరీతో చెలరేగాడు. ఫలితంగా ఇంగ్లండ్‌తో మంగళవారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. తొలి టెస్టులో ఘోర పరాజయం అనంతరం పలు మార్పులు చేసిన పాకిస్తాన్ జట్టు... కమ్రాన్ గులామ్‌ను తుది జట్టులోకి ఎంపిక చేసింది. అయూబ్ (77; 7 ఫోర్లు) అర్ధ సెంచరీతో రాణించాడు. ఓపెనర్ అబ్దుల్లా షఫీఖ్ (7), కెప్టెన్ షాన్ మసూద్ (3), సౌద్ షకీల్ (4) విఫలమయ్యారు. ఒకదశలో 19 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ జట్టును అయూబ్‌తో కలిసి కమ్రాన్ ఆదుకున్నాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 149 పరుగులు జోడించడంతో జట్టు కోలుకుంది. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ ఆడే నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన 29 ఏళ్ల కమ్రాన్ చక్కటి ప్రదర్శన కనబర్చాడు. దేశవాళీ టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన చేసి గత కొంత కాలంగా జాతీయ జట్టులో చోటు దక్కించుకోవాలని చూస్తున్న అతడికి ఎట్టకేలకు అవకాశం దక్కగా... తొలి టెస్టులోనే సెంచరీతో సత్తా చాటాడు. 'ఈ అవకాశం కోసం నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నా. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తున్నా... దాన్నే ఇక్కడ కూడా కొనసాగించా. బాబర్ ఆజమ్ ఓ దిగ్గజం. అతడి స్థానంలో ఆడుతున్నా అనే విషయం పక్కనపెట్టి కేవలం అత్యుత్తమ ప్రదర్శన చేయాలనుకున్నా. క్రీజులోకి వచ్చిన సమయంలో జట్టు ఇబ్బందుల్లో ఉంది. దీంతో ఆచితూచి ఆడాలనుకున్నా. దేశవాళీ అనుభవం బాగా పనికొచ్చింది' అని కమ్రాన్ అన్నాడు. అరంగేట్రంలో టెస్టు సెంచరీ చేసిన 13వ పాకిస్తాన్ ప్లేయర్‌గా క్రమాన్ గులామ్ నిలిచాడు. ఇంగ్లండ్‌పై ఓ అరంగేట్ర పాకిస్తాన్ ఆటగాడు శతకం బాదడం ఇదే తొలిసారి. ఇంగ్లండ్ బౌలర్లలో షోయబ్ బషీర్ 2, జాక్ లీచ్, కార్స్, పాట్స్ తలా ఒక వికెట్ పడగొట్టారు. వికెట్ కీపర్ రిజ్వాన్ (37 బ్యాటింగ్; 4 ఫోర్లు), ఆఘా సల్మాన్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

**13** పాకిస్తాన్ తరఫున అరంగేట్రం టెస్టులోనే సెంచరీ చేసిన 13వ క్రికెటర్‌గా కమ్రాన్ గులామ్ గుర్తింపు పొందాడు. గతంలో ఖాలిద్ ఇబాదుల్లా (ఆస్ట్రేలియాపై 1966లో), జావేద్ మియాందాద్ (న్యూజిలాండ్‌పై 1976లో), సలీమ్ మాలిక్ (శ్రీలంకపై 1982లో), మొహమ్మద్ వసీమ్ (న్యూజిలాండ్‌పై 1996), అలీ నక్వీ (దక్షిణాఫ్రికాపై 1997లో), అజహర్ మహమూద్ (దక్షిణాఫ్రికాపై 1997లో), యూనిస్ ఖాన్ (శ్రీలంకపై 2000లో), తౌఫీక్ ఉమర్ (బంగ్లాదేశ్‌పై 2001లో), యాసిర్ హమీద్ (బంగ్లాదేశ్‌పై 2003లో), ఫవాద్ ఆలమ్ (శ్రీలంకపై 2009లో), ఉమర్ అక్మల్ (న్యూజిలాండ్‌పై 2009లో), ఆబిద్ అలీ (శ్రీలంకపై 2019లో) ఈ ఘనత సాధించారు.



నిసాంక

# శ్రీలంక ఘనవిజయం

**వెస్టిండీస్‌తో రెండో టి20**

**దంబుల్లా:** బౌలర్లు విజృంభించడంతో వెస్టిండీస్‌తో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో శ్రీలంక ఘనవిజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో శ్రీలంక 73 పరుగుల తేడాతో విండీస్‌ను ఓడించి సిరీస్‌ను 1–1తో సమం చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. ఓపెనర్ నిసాంక (49 బంతుల్లో 54; 9 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకంతో రాణించగా... కుశాల్ మెండిస్ (26; 2 ఫోర్లు, ఒక సిక్సర్), కుశాల్ పెరీరా (24; 3 ఫోర్లు, ఒక సిక్సర్) ఫర్వాలేదనిపించారు. విండీస్ బౌలర్లలో రొమారియో షెఫర్డ్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో వెస్టిండీస్ 16.1 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రొవ్‌మన్ పావెల్ (17 బంతుల్లో 20; ఒక ఫోర్, ఒక సిక్స్) టాప్ స్కోరర్. బ్రాండన్ కింగ్ (5), ఎవిన్ లూయిస్ (7), ఆండ్రూ ఫ్లెచర్ (4), రోస్టన్ చేజ్ (0) విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో దునిత్ వెల్లలాగె 3, మహీశ్ తీక్షణ, అసలంక, హసరంగ తలా రెండు వికెట్లు పడగొట్టారు. సిరీస్‌లోని చివరిదైన మూడో టి20 గురువారం జరుగుతుంది.

# రామ్‌కుమార్ శుభారంభం



**షెన్‌జెన్ (చైనా):** షెన్‌జెన్ లాంగ్‌హువా ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టెన్నిస్ టోర్నీలో భారత ప్లేయర్ రామ్‌కుమార్ రామనాథన్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 279వ ర్యాంకర్ రామ్‌కుమార్ 7–6 (7/4), 6–7 (6/8), 7–6 (10/8)తో ప్రపంచ 203వ ర్యాంకర్, నాలుగో సీడ్ ఉగో బ్లాన్‌చెట్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. 2 గంటల 25 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ ఏకంగా 25 ఏస్‌లు సంధించి ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. మరోవైపు బ్లాన్‌చెట్ 15 ఏస్‌లు కొట్టి, 12 డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. మ్యాచ్ మొత్తంలో ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడం విశేషం. అయితే నిర్ణాయక మూడో సెట్ టైబ్రేక్‌లో రామ్‌కుమార్ పైచేయి సాధించి విజయాన్ని అందుకున్నాడు. రెండో రౌండ్‌లో ప్రపంచ 385వ ర్యాంకర్ క్రిస్ వాన్ విక్ (దక్షిణాఫ్రికా)తో రామ్‌కుమార్ తలపడతాడు.

# మెయిన్ 'డ్రా'కు అపూర్వ, అభయ, చందన



అపూర్వ

**బెంగళూరు:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల డబ్ల్యూ15 టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణులు వేమూరి అపూర్వ, వేమూరి అభయ, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి పాటుగారి చందన మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు. అపూర్వ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో 6–2, 6–0తో సురభి (భారత్)పై, రెండో రౌండ్‌లో 6–2, 6–4తో ఎనిమిదో సీడ్ నొలానీ సారా టిసో (జపాన్)పై గెలిచింది. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో అభయ 6–3, 6–3తో జనని రమేశ్ (భారత్)పై, రెండో రౌండ్‌లో 6–2, 6–0తో నికోల్ జోల్ (భారత్)పై నెగ్గింది. మరోవైపు చందన క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో 7–6 (7/2), 6–0తో నిధి రాజ్‌మోహన్ (భారత్)పై, రెండో రౌండ్‌లో 6–3, 3–6, 11–9తో సేజల్ భుటాడా (భారత్)పై విజయం సాధించింది. భారత్‌కే చెందిన బేలా తమ్‌హంకర్, శ్రీనిధి బాలాజీ, సహీరా సింగ్ కూడా మెయిన్ 'డ్రా'కు అర్హత పొందారు. తెలంగాణకే చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక మెయిన్ 'డ్రా'లో టాప్ సీడ్‌గా బరిలోకి దిగనుంది. తొలి రౌండ్‌లో రష్మిక క్వాలిఫయర్ సహీరా సింగ్‌తో ఆడనుంది. మెయిన్ 'డ్రా' ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో బేలాతో చందన, ఆకాంక్షతో స్మృతి భాసిన్, హుమేరా బహార్మస్‌తో అపూర్వ, యశస్వినితో అభయ ఆడతారు.

# సోనమ్ గురికి రజతం

**వరల్డ్‌కప్ షూటింగ్ ఫైనల్స్ టోర్నీ**



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత జట్టు రజత పతకంతో బోణీ చేసింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో సోనమ్ మస్కర్ రజత పతకాన్ని సాధించింది. 22 ఏళ్ల సోనమ్ ఫైనల్లో 252.9 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానాన్ని దక్కించుకుంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో భారత షూటర్లు అర్జున్ (188.3 పాయింట్లు) ఐదో స్థానంలో, దివ్యాంశ్ (124 పాయింట్లు) ఎనిమిదో స్థానంలో నిలిచారు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో అర్జున్ సింగ్ (109.9 పాయింట్లు) చివరిదైన ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకోగా... మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో భారత షూటర్లు రిథమ్ (197.2 పాయింట్లు) నాలుగో స్థానంలో, సురభి (176.6 పాయింట్లు) 5వస్థానంలో నిలిచారు.



# సింధు ముందుకు...

- లక్ష్య సేన్, మాళవిక, ఆకర్షి ఇంటికి
- డెన్మార్క్ ఓపెన్ టోర్నీ

**ఓడెన్స్:** పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఆడుతున్న రెండో టోర్నమెంట్‌లో భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు విజయం రుచి చూసింది. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఆర్కిటిక్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే ఓడిన సింధు... మంగళవారం మొదలైన డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో చైనీస్ తైపీ క్రీడాకారిణి పాయ్ యు పోతో జరిగిన మ్యాచ్‌లో సింధు 21–8, 13–7తో గెలిచింది. తొలి గేమ్‌ను అలవోకగా నెగ్గిన సింధు రెండో గేమ్‌లో ఆరు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నపుడు ఆమె ప్రత్యర్థి గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలిగింది. నాలుగో సీడ్ హాన్ యువె (చైనా), పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్) మధ్య తొలి రౌండ్ మ్యాచ్ విజేతతో గురువారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు తలపడుతుంది. భారత్‌కే చెందిన రైజింగ్ స్టార్స్ మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మాళవిక 13–21, 12–21తో థుయ్ లిన్ ఎన్గుయెన్ (వియత్నాం) చేతిలో, ఆకర్షి కూడా 13–21, 12–21తో సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. నేడు జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌లో లౌరెన్ లామ్ (అమెరికా)తో ఉన్నతి హుడా పోటీపడుతుంది.

పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ లక్ష్య సేన్ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. ప్రపంచ 18వ ర్యాంకర్ లు గ్వాంగ్ జు (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 17వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21–12, 19–21, 14–21తో పోరాడి ఓడిపోయాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రుతూపర్ణ–శ్వేతాపర్ణ (భారత్) ద్వయం 18–21, 22–24తో చాంగ్ చింగ్ హుయ్–యాంగ్ చింగ్ టున్ (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓటమి పాలైంది.

# నడి సంద్రంలో 67 రోజులు

- రష్యా వాసిని కాపాడిన మత్స్యకారులు
- వెంటే ఉన్న సోదరుడు, అతడి కుమారుడు మృతి



మిఖాయిల్ పిచుగస్

మాస్కో: గడ్డకట్టుకుపోయే చలి..భీకర అలల తాకిడి మధ్య కేవలం చిన్న బోటులో రెండు నెలలకు పైగా గడిపిన, ఓ వ్యక్తి అనూహ్యంగా బతికి బట్టకట్టాడు. రష్యాలోని కంచట్కా ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తూర్పు సైబీరియా, కంచట్కా ద్వీపకల్పాన్ని చుట్టే ఒఖొట్స్క్ సముద్రం అక్టోబర్ నుంచి మార్చి వరకు మంచుతో గడ్డకట్టుకుని ఉంటుంది. తూర్పు ఆసియాలో అత్యంత చల్లనైన సముద్రంగా దీనికి పేరుంది. ఈ సముద్రంలోకి మిఖాయిల్ పిచుగస్(46) తన సోదరుడు(49), అతడి 15 ఏళ్ల కుమారుడితోపాటు ఆగస్ట్ 9వ తేదీన ఓ చిన్న పడవలో సఖాలిన్ దీవికి తిమింగలాలను చూసేందుకని బయలుదేరారు. వెంట రెండు వారాలకు సరిపడా ఆహారం, మంచినీరు ఉన్నాయి. ఆ తర్వాత వారి జాడ తెలియదు. దీంతో కుటుంబసభ్యుల సమాచారం మేరకు సహాయక బృందాలు సముద్రంలో గాలింపు చేపట్టినా ఫలితం లభించలేదు. అక్టోబర్ 14వ తేదీన ఉస్త్–ఖైర్యుజొవో ప్రాంతానికి సమీపంలో ఉన్న చిన్న బోటును స్థానిక మత్స్యకారులు గుర్తించారు. మొదట్లో అదేదో పనికిరాని వస్తువని భావించారు. పరికించి చూసి, చిన్న బోటులో ఓ మనిషి ఉండటం గుర్తించి వారు షాకయ్యారు. 'లైఫ్ జాకెట్ ధరించిన ఓ వ్యక్తి ఇటు రండి, కాపాడండి'అని అరుస్తూ ఉన్న వీడియోను అధికారులు విడుదల చేశారు. మత్స్యకారుల పడవలోకి చేరాక ఒంట్లో నాకిక శక్తి లేదు'అంటూ నిట్టూర్చాడు. 'కొంత దూరం వెళ్లాక, మాకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఎక్కడున్నామో తెలుసుకోలేకపోయాం. బోటు ఇంజిన్ చెడిపోయింది. దీంతో అలల మధ్యనే ఉండిపోయాం'అని అతడు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. సముద్రంలోకి వెళ్లిన సమయంలో పిచుగస్ బరువు 100 కిలోలు కాగా, రెండు నెలల్లో అతడి బరువు సగానికి సగం 50 కిలోలకు తగ్గిపోయింది. భయంకరమైన శీతల సముద్ర జలాల్లో రెండు నెలలకు పైగా ఎలా గడిపాడు? సోదరుడు, అతడి కుమారుడి మృతికి సంబంధించిన వివరాలను అతడు చెప్పలేకపోతున్నాడని అధికారులు వెల్లడించారు. పిచుగస్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. కాగా, ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా సముద్రంలోకి వెళ్లడం, ఇద్దరు చనిపోవడంపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# కొరియాలను కలిపే రోడ్ల ధ్వంసం

**సోదర దేశంపై ఉత్తర కొరియా ఆగ్రహం**



దక్షిణ కొరియా విడుదల చేసిన చిత్రం

సియోల్: దక్షిణ కొరియాతో కలిపే సరిహద్దుల్లోని ఉపయోగంలోని లేని రహదారులను మంగళవారం ఉత్తరకొరియా పేల్చేసింది. తమ రాజధాని ప్యాంగాంగ్‌పైకి దక్షిణ కొరియా ఇటీవల నిఘా డ్రోన్లను పంపిందని ఉత్తర కొరియా ఆరోపిస్తోంది. ఈ అంశం ఉభయ కొరియాల మధ్య మాటల చిచ్చు రాజేసింది. దక్షిణ కొరియాలో ప్రస్తుతమున్న కన్జర్వేటివ్ ప్రభుత్వం తీరుపై ఉత్తర కొరియా పాలకుడు కిమ్ మొదట్నుంచీ తీవ్ర అసహనంతో ఉన్నారు. శాంతియుత వాతావరణంలో ఉభయ కొరియాలు సమైక్యం కావాలన్న లక్ష్యాన్ని వీడుతామని, సోదర దేశంతో సంబంధాలను పూర్తిగా తెంచేసుకుంటామని ప్రకటించారు. తొలగించిన రహదారుల స్థానంలో భారీగా మందు పాతరలను, యాంటీ ట్యాంక్ బారియర్లను ఆ దేశం ఏర్పాటు చేస్తోందని దక్షిణ కొరియా తెలిపింది. తమ దేశంలో దక్షిణకొరియా అనుకూల వైఖరి కనిపించకుండా, తమ కుటుంబ పాలనను సుస్థిరం చేసుకునేందుకే కిమ్ ఇవన్నీ చేస్తున్నట్లు భావిస్తున్నారు. అయితే, ఇలాంటి చర్యలతో కిమ్ ఇప్పటికిప్పుడే భారీ స్థాయిలో యుద్ధానికి దిగే సాహసం చేయకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అత్యాధునిక ఆయుధ సంపత్తి కలిగిన అమెరికా, దక్షిణ కొరియాలతో పెట్టుకుంటే మొదటికే మోసం వస్తుందనే భయం ఆయనలో ఉందంటున్నారు. ప్యాంగ్యాంగ్ పైకి దక్షిణ కొరియా 'మిలటరీ గ్యాంగ్‌స్టర్స్'డ్రోన్లను పంపించినట్లు తమ దగ్గర పక్కా ఆధారాలున్నాయని కిమ్ సోదరి కిమ్ యో జొంగ్ మంగళవారం ఆరోపించారు. అందుకు తగిన మూల్యం ఆ దేశం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. సోమవారం జరిగిన ఒక సమావేశంలో కిమ్, తన అధికారులకు తక్షణ మిలటరీ చర్యల కోసం కొన్ని లక్ష్యాలను నిర్దేశించినట్లు అధికార మీడియా తెలిపింది. అవేమిటో వెల్లడించలేదు. ఈ నేపథ్యంలోనే ఆ దేశం అధికారులు దక్షిణ వైపు సరిహద్దుల్లోని రహదారులను పథకం ప్రకారం పేల్చేస్తున్నారు. కెసాంగ్ పట్టణ సరిహద్దులకు సమీపంలో పేలుడుకు సంబంధించిన వీడియోను దక్షిణ కొరియా సైన్యం విడుదల చేసింది. రహదారుల వ్యర్థాలను తరలించే ట్రక్కులు, ఇతర యంత్ర సామగ్రి కనిపిస్తున్నాయి. అక్కడి పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని, సర్వసన్నద్ధంగా ఉన్నామని దక్షిణ కొరియా ఆర్మీ స్పష్టం చేసింది.

## 'కృత్రిమ మేధ'కు అణు రియాక్టర్ల విద్యుత్

న్యూయార్క్: ఆధునిక కాలంలో కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతకు ఆదరణ విపరీతంగా పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని రంగాల్లో కృత్రిమ మేధ వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. తమ ఏఐ డేటా సెంటర్ కార్యకలాపాలకు అవసరమైన విద్యుత్ కోసం అణు రియాక్టర్లను ఉపయోగించుకోవాలని గూగుల్ సంస్థ నిర్ణయించింది. అణు విద్యుత్‌ను స్థిరమైన, కర్బన రహిత ఇంధన వనరుగా భావిస్తోంది. అణు ఇంధన రంగంలో ఇదొక విప్లవాత్మకమైన మార్పు అని నిపుణులు చెబుతున్నారు. గూగుల్ సంస్థ తమ విద్యుత్ అవసరాల కోసం 'కైరోస్ పవర్'సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం కైరోస్ పవర్ 2030 నాటికి మొదట స్మాల్ మాడ్యులర్ అణు రియాక్టర్‌ను రూపొందిస్తుంది. 2035 నాటికి మరికొన్ని రియాక్టర్లను తయారు చేస్తుంది. వీటితో 500 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ విద్యుత్‌ను తమ ఏఐ డేటా సెంటర్ల కోసం గూగుల్ ఉపయోగించుకోనుంది. ఇటీవలి కాలంలో ప్రపంచ స్థాయి టెక్నాలజీ సంస్థలు ఏఐ ఆపరేషన్ల విస్తరణ కోసం సుస్థిర ఇంధన వనరులకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. త్రీ మైల్ ఐలాండ్ అణు విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ కొనుగోలు చేయబోతున్నట్లు మైక్రోసాఫ్ట్ సంస్థ ఇటీవలే ప్రకటించింది. అమెజాన్ సంస్థ అణు విద్యుత్‌తో కూడిన డేటా సెంటర్‌ను నెలకొల్పింది.
అంతరిక్షంలో చైనా లూనార్ రీసెర్చ్ స్టేషన్

## 2028 నుంచి చైనా మూన్ స్టేషన్ నిర్మాణం

బీజింగ్: అంతర్జాతీయ ప్రయోగాలు, నూతన గ్రహాల అన్వేషణలో డ్రాగన్ దేశం చైనా దూకుడు ప్రదర్శిస్తోంది. స్పేస్ ప్రోగ్రామ్ విస్తరణలో భాగంగా మానవ సహిత లూనార్ స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు చైనా అంతరిక్ష సంస్థలు చైనా అకాడమీ ఆఫ్ సైన్సెస్(సీఏఎస్), చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్, చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశాయి. మానవ ఆవాస యోగ్యమైన గ్రహాలను అన్వేషించడానికి, ఇతర గ్రహాలపై జీవజాలం ఉనికి గుర్తించడానికి 'ఇంటర్నేషనల్ లూనార్ రీసెర్చ్ స్టేషన్'ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపాయి. 2028 నుంచి 2035 దాకా ఈ కేంద్రాన్ని నిర్మించబోతున్నట్లు సీఏఎస్ ఉపాధ్యక్షుడు డింగ్ చియాబావో వెల్లడించారు. స్పేస్ సైన్స్‌కు సంబంధించిన జాతీయ అభివృద్ధి ప్రణాళికలను చైనా అంతరిక్ష సంస్థలు విడుదల చేశాయి. 2024 నుంచి 2050 దాకా చేపట్టాల్సిన స్పేస్ సైన్స్ మిషన్లు, అంతరిక్ష పరిశోధనల ప్రణాళికలను ఇందులో పొందుపర్చారు. అంతరిక్ష ప్రయోగాల్లో డ్రాగన్ దేశం ముందంజలో ఉన్న తెలిసిందే. అంతరిక్షంలో చైనా సొంతంగా స్పేస్ స్టేషన్‌ను నిర్మించుకుంది.

# కాంగ్రెస్‌కు పెను సవాల్!

**మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటే ప్రధాన సమస్య**

- కాంగ్రెస్‌తో ఇతర పార్టీలకు పొరపచ్చాలు
- రెండు రాష్ట్రాల్లోనూ ఇండియా కూటమి గెలిచే అవకాశాలున్నా.. విభేదాలతో గట్టి పరీక్ష



రాహుల్‌తో ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల సంగ్రామం అనంతరం జరిగిన హరియాణా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు పొందిన కాంగ్రెస్‌కు మరో అగ్ని పరీక్ష ఎదురుకానుంది. నవంబర్‌లో జరుగనున్న మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఉత్తర్‌ప్రదేశ్ 9 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పోరాటానికి సిద్ధమైంది. కచ్చితంగా గెలుస్తామన్న ధీమాతో ఉన్న హరియాణాలో అంతర్గత కుమ్ములాటల కారణంగా అధికారానికి కూతవేటు దూరంలో ఆగిపోయిన కాంగ్రెస్‌కు మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలు గట్టి సవాల్‌ను విసిరే అవకాశాలున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లోనూ కూటమి పక్షాలతో సయోధ్య, టిక్కెట్ల పంపకాలు, అంతర్గత విభేదాలు కాంగ్రెస్‌కు పరీక్ష పెట్టనున్నాయి.

**జార్ఖండ్‌లో మొదలైన వేట..**

2019 ఎన్నికల్లో జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), కాంగ్రెస్ కూటమిగా పోటీచేసి సునాయస విజయాన్ని అందుకున్నాయి. మొత్తం 81 సీట్లకు గానూ కాంగ్రెస్ 17, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) పార్టీ 30 సీట్లతో ఇక్కడ అధికారంలోకి రాగా, ప్రతిపక్ష బీజేపీ కేవలం 25 సీట్లతో సరిపెట్టుకుంది. ఈ ఐదేళ్ల పదవీ కాలంలో అవినీతి ఆరోపణల కేసులో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జైలుకెళ్లడం, ఆ సమయంలో కొత్త ముఖ్యమంత్రిగా సీనియర్ నేత చంపాయి సోరెన్ బాధ్యతలు స్వీకరించడం, జైలుకెళ్లి బయటికొచ్చాక తిరిగి హేమంత్ బాధ్యతలు స్వీకరిస్తే, చంపాయ్ సోరెన్ ఏకంగా పార్టీని వీడి బీజేపీలో చేరిపోవడం చకచకా జరిగిపోయాయి. ఈ పరిణామాల మధ్య మళ్లీ 2019 మాదిరే ఎన్డీఏ, ఇండియా కూటమి పార్టీల మధ్య ప్రధాన పోటీ జరగనుంది. ఇప్పటికే ఎన్నికలపై ఫోకస్ పెట్టిన కాంగ్రెస్, జేఎంఎంలు పొత్తుల చర్చలు మొదలుపెట్టాయి. అయితే సీట్ల పంపకాల విషయంలో ఇద్దరి మధ్య సయోధ్య కుదరలేదు. జేఎంఎం కనీసంగా 50–55 సీట్లు కోరుతుండగా, కాంగ్రెస్ 30–35 సీట్లు ఆశిస్తోంది. రెండు పార్టీల మధ్య సుమారు 15 సీట్ల విషయంలో పేచీలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా 25 ఎస్టీ స్థానాల్లో పోటీకి రెండు పార్టీల నేతలు ఒత్తిడి చేస్తుండటం తలనొప్పులు తెస్తున్నాయి. దీనికి తోడు మైనింగ్, ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు, సీబీఐ కేసులు కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతున్నాయి. దీనికి తోడు ప్రభుత్వంలో సోరెన్‌కు బంధుప్రీతి ఎక్కువైందన్న ఆరోపణలు తీవ్రమవడం, పార్టీకి కీలకంగా ఉన్న చంపాయ్ సోరెన్ పార్టీని వీడటం కూటమికి చిక్కులు తెస్తున్నాయి. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి మొత్తం 14 స్థానాల్లో 5 సీట్లు మాత్రమే వచ్చాయి. ఇక ఎలాగైనా జార్ఖండ్‌లో అధికారంలోకి రావాలని పట్టుదలతో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో సుమారు రూ.90 వేల కోట్లకు పైగా కేంద్ర నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసింది. ఇప్పటికే ప్రధాని నరేందర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పలుమార్లు పర్యటనలు చేసి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇక్కడి అవినీతి ప్రభుత్వంపై పదేపదే ఆరోణలు గుప్పించడంతో పాటు..ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్‌లకు, వారి ఎదుగుదలకు ఇండియా కూటమి వ్యతిరేకమన్న ప్రచారాన్ని బలంగా చేస్తోంది.

**మహారాష్ట్రలో తేలని పంచాయతీ..**

ఇక మహారాష్ట్రలో 2019 ఎన్నికల అనంతరం గతంలో ఎన్నడూ లేనన్ని పరిణామాలు సంభవించాయి. శివసేన, ఎన్సీపీలు చీలిపోవడం, చీలిక వర్గాలు బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడం చకచకా జరిగిపోయాయి. ప్రస్తుతం 288 సీట్లున్న మహారాష్ట్రలో బీజేపీకి 103, శివసేన (షిండే) పార్టీకి 38, ఎన్సీపీ (అజిత్ పవార్) 41 సీట్లతో (మహాయుతి కూటమి) అధికారంలో ఉండగా, మహావికాస్ అఘాడిలో భాగంగా ఉన్న కాంగ్రెస్ 36, ఉద్ధవ్ థాక్రే శివసేనకు 15, ఎన్సీపీ (శరద్ పవార్) 12 సీట్లున్నాయి. ప్రస్తుతం సీట్ల పంపకాలపై మహా వికాస్ అఘాడిలో చర్చలు జరుగుతున్నా, అవి కొలిక్కి రావడం లేదు. మొత్తం సీట్లలో కాంగ్రెస్ 135–140 సీట్లను ఆశిస్తుండగా, ఇతర పార్టీలు 110–115 సీట్లు ఇచ్చేందుకే సమ్మతిస్తున్నాయి. ఎన్సీపీ సైతం గతం కన్నా కనీసంగా 20 సీట్లు అధికంగా కలిపి 65–70 సీట్లు కోరుతుండటంతో సమస్య జటిలమవుతోంది. ఇప్పటివరకు ఇండియా కూటమిలో 190 సీట్ల మధ్య సయోధ్య కుదిరిందని, మరో 100 సీట్లపై మాత్రమే పీఠముడి నెలకొందని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఈ స్థానాలే కూటమి గెలుపోటములను నిర్ణయించనున్నాయి.

## ఆన్‌లైన్ బుకింగ్ లేకున్నా.. శబరిమల దర్శనం

- కేరళ సీఎం విజయన్ స్పష్టీకరణ

తిరువనంతపురం: ఆన్‌లైన్‌లో బుకింగ్ లేకున్నా.. భక్తులందరికీ అయ్యప్ప స్వామి దర్శనం కల్పిస్తామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం స్పష్టం చేశారు. రాబోయే అయ్యప్ప సీజన్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వాళ్లకే దర్శనం కల్పించాలని తొలుత కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. నిరసనలు వెల్లువెత్తడంతో శబరిమలకు వచ్చిన భక్తులందరికీ సాధారణ పద్ధతిలో ఎప్పటిలాగే క్యూలైన్ ద్వారా దర్శనం కల్పిస్తామని స్పష్టం చేసింది. సీఎం విజయన్ మంగళవారం ఈమేరకు అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పద్ధతిపై అవగాహన లేకుండా శబరిమలకు వచ్చిన భక్తులకూ అయ్యప్ప దర్శనం కల్పిస్తామని తెలిపారు.

## సిద్దిఖీ హత్య కేసు.. నాలుగో నిందితుడి అరెస్ట్

ముంబై: ఎన్సీపీ నేత, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్య కేసులో నాలుగో నిందితుడు హరీశ్ కుమార్ నిషాద్(23)ను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. హత్య కుట్రదారులకు ఆర్థిక, ఆయుధ సాయం అందించింది ఇతడేనని చెప్పారు. యూపీలో బహ్రెయిచ్‌లో ఉండగా ఇతడిని పట్టుకున్నామన్నారు. కోర్టు ఇతడిని ఈ నెల 21వ తేదీ వరకు పోలీస్ కస్టడీకి అనుమతించిందని తెలిపారు. కాగా, ఇతడు ఎవరి ఆదేశాల మేరకు పనిచేశాడో తెలుసుకునేందుకు విచారణ జరుపుతామన్నారు.ఇప్పటి వరకు అదుపులోకి తీసుకున్న ముగ్గురు నిందితులకు కూడా కోర్టు ఈ నెల 21వ తేదీ వరకు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

## తీర రక్షక దళం డీజీగా శివమణి

సాక్షి, న్యూఢిల్లీ: భారత తీర రక్షక దళం(ఐసీజీ) 26వ డైరెక్టర్ జనరల్‌గా పరమేశ్ శివమణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది ఆగస్ట్ నుంచి ఆయన అదనపు డీజీగా వ్యవహరిస్తున్నారు.మూడున్నర దశాబ్దాల సర్వీసులో శివమణి 'సమర్', 'విశ్వస్త్'తదితర అన్ని ప్రధాన నౌకలపైన సేవలందించారు. నేవిగేషన్, డైరెక్షన్ రంగాల్లో నిపుణుడిగా పేరు తెచ్చుకున్నారు. నేషనల్ డిఫెన్స్ కాలేజీ, డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీలో చదువుకున్నారు. వివిధ ఆపరేషన్‌లలో సముద్ర మార్గంలో అక్రమంగా రవాణా అయ్యే భారీ మొత్తంలో డ్రగ్స్, కోట్లాది రూపాయల విలువైన బంగారాన్ని పట్టుకున్నారు. సముద్రంలో వివిధ ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని కాపాడారు. విశిష్ట సేవలకు గాను శివమణి 2019లో రాష్ట్రపతి తట్‌రక్షక్ పతకాన్ని అందుకున్నారు.

# మరో 7 విమానాలకు బాంబు బెదిరింపు

- 'ఎక్స్'ద్వారా మళ్లీ ఆగంతకుల హెచ్చరికలు
- అమెరికా వెళ్లే విమానం కెనడాకు దారి మళ్లింపు
- ధమ్మమ్ – లక్నో విమానం జైపూర్‌లో అత్యవసర ల్యాండింగ్
- ఉత్తుత్తి బెదిరింపులని తేలడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమం 'ఎక్స్'ద్వారా ఆగంతకులు మరోసారి విమానాల్లో బాంబులు పెట్టామంటూ బెదిరింపులకు దిగారు. సోమవారం అమెరికా వెళ్లాల్సిన విమానం సహా మూడు విమానాలకు బెదిరింపులు రావడం తెలిసిందే. మంగళవారం కూడా అమెరికా వెళ్లాల్సిన మరో విమానంతోపాటు మొత్తం ఏడు విమానాలకు వేర్వేరు 'ఎక్స్'ఖాతాల ద్వారా హెచ్చరికలు అందాయి. దీంతో, భద్రతా సిబ్బంది ఆయా విమానాశ్రయాల్లో కౌంటర్ టెర్రరిస్ట్ డ్రిల్స్ చేపట్టాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. చివరికి ఎటువంటి ప్రమాదకర, అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 'ఏడింటిలో ఒకటి ఎయిరిండియాకు చెందిన ఢిల్లీ–షికాగో సర్వీసు కాగా, మిగతావి జైపూర్ –బెంగళూరు వయా అయోధ్య ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం, దర్భంగా–ముంబై స్పైస్‌జెట్ సరీ్వస్, సిలిగురి–బెంగళూరు ఆకాశ విమానం. సౌదీఅరేబియాలోని ధమ్మమ్ నుంచి లక్నో ఇండిగో సర్వీసు, అమృత్‌సర్–ఢిల్లీ– డెహ్రాడూన్ అలయెన్స్ ఎయిర్ విమానం, మదురై–సింగపూర్ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్' అని వివరించారు. ఢిల్లీ నుంచి అమెరికాలోని షికాగోకు బయలుదేరిన విమానాన్ని భద్రతా పరమైన తనిఖీల కోసం కెనడాలోని ఇకాలుయిట్ విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. అదేవిధంగా, ధమ్మమ్ నుంచి లక్నోకు చేరుకోవాల్సిన విమానాన్ని జైపూర్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ప్రొటోకాల్ ప్రకారం ఆయా విమానాలను, ప్రయాణికులను మరోసారి క్షుణ్నంగా తనిఖీలు చేశారు. ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో అది ఉత్తుత్తి బెదిరింపని తేల్చారు. దీంతో తిరిగి అవి తమ గమ్యస్థానాలకు టేకాఫ్ తీసుకున్నాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా, జైపూర్ నుంచి టేకాఫ్ తీసుకున్న తర్వాత బెదిరింపు రావడంతో అయోధ్య విమానాశ్రయంలో సోదాలు జరిపారు. షెడ్యూల్ ప్రకారం తిరిగి 2.55కు టేకాఫ్ తీసుకోవాల్సిన ఈ సర్వీసు సాయంత్రం 5 గంటలకు బెంగళూరుకు బయలుదేరిందని అధికారులు తెలిపారు. స్పైస్ జెట్, ఆకాశ తదితర ఇతర విమానాలను కూడా విమానాశ్రయాల్లోనే తనిఖీలు చేపట్టి, ఎటువంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు లేవని తేలాకే అధికారులు టేకాఫ్‌కు అనుమతించారు. బెదిరింపు ఘటనలపై సైబర్ సెక్యూరిటీ విభాగాలు, పోలీసుల సాయంతో దర్యాప్తు చేపట్టిన బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ విభాగం అధికారులు తెలిపారు. బెదిరింపుల ఫలితంగా తమకు కలిగిన నష్టాన్ని రాబట్టే న్యాయపరమైన చర్యలను పరిశీలిస్తున్నామని ఎయిరిండియా తెలిపింది

# ఉచిత హామీలపై మీ వైఖరి తెలపండి

**కేంద్రం, ఈసీలకు సుప్రీంకోర్టు నోటీసులు**

న్యూఢిల్లీ: ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలపై వైఖరి తెలుపాల్సిందిగా సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్ (ఈసీ)కి నోటీసులు జారీచేసింది. పార్టీలు ఎన్నికల సమయంలో ఉచిత హామీలు ఇవ్వకుండా కట్టడి చేసేలా ఈసీని ఆదేశించాలని కూడా పిటిషనర్, బెంగుళూరు వాసి శశాంక్ జె.శ్రీధర కోరారు. అలవిగాని ఉచిత హామీల మూలంగా ప్రభుత్వ ఖజానాపై ఎనలేని భారం పడుతుందని పిటిషనర్ పేర్కొన్నారు. పైగా ఉచిత హామీలను ఇచ్చి ఓట్లు పొంది అధికారంలోకి వచ్చాక.. రాజకీయ పార్టీలు ఈ హామీలను అమలు చేసేలా చూసే వ్యవస్థ ఏదీ లేదని అన్నారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వానికి, ఈసీకి నోటీసులు జారీచేసింది. ఉచిత హామీలను సవాల్ చేస్తూ ఇదివరకు దాఖలైన పిటిషన్లకు శశాంక్ పిటిషన్‌ను జతచేసింది. ప్రజాకర్షక ఉచిత హామీలపై పూర్తిగా నిషేధం విధించాలని న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ ఇదివరకే ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీన్ని విచారించడానికి సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. రాజకీయ లబ్ధి పొందడానికి ఇష్టానుసారంగా ఉచిత హామీలు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని, వీటిని నిరోధించేలా ఈసీ చూడాలని ఉపాధ్యాయ కోరారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఉచిత హామీలు ఇవ్వడం ఇటీవల పరిపాటిగా మారిందని, ప్రజాస్వామ్య విలువలకు ఇది పెను ప్రమాదమని పేర్కొన్నారు. అనైతిక ఉచిత హామీలంటే.. అధికారంలోకి రావడానికి ప్రభుత్వ ఖజానా నుంచి ఓటర్లకు లంచం ఇవ్వడమేనని వాదించారు. ప్రజాస్వామ్య విలువలను, సంప్రదాయాలను కాపాడటానికి ఉచితాలను నిరోధించాలని కోరారు.

# 40 శాతం వైకల్యం ఎంబీబీఎస్‌కు అడ్డుకాదు

**వైద్యవిద్యకు తగరని నిపుణుల నివేదిక ఉండాలి**

న్యూఢిల్లీ: నిర్దిష్ట 40 శాతం అంగవైకల్యం ఉందని ఎంబీబీఎస్‌లో సీటు నిరాకరించడం కుదరదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. వైద్యవిద్యను అభ్యసించడానికి తగిన శారీరక సామర్థ్యం సదరు అభ్యర్థికి లేదని నిపుణుల నివేదిక కూడా ఉండాలని మంగళవారం స్పష్టం చేసింది. దివ్యాంగులైన సుధా చంద్రన్ (భరతనాట్యం), అరుణిమా సిన్హా (ఎవరెస్ట్‌ను అధిరోహించిన పర్వాతారోహకురాలు), హెచ్.బి.ప్రభు (ప్రముఖ క్రీడాకారుడు), శ్రీకాంత్ బొల్లా (వ్యాపారవేత్త), డాక్టర్ సతేంద్ర సింగ్ (ఇన్ఫినైట్ ఎబిలిటీ వ్యవస్థాపకులు)లు సాధించిన విజయాలను మర్చిపోకూడదని వ్యాఖ్యానించింది. అవరోధాలను అధిగమించి వీరు ఉన్నత శిఖరాలను చేరుకున్నారని జస్టిస్ విశ్వనాథన్ అన్నారు. 40 శాతం, లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు ఎంబీబీఎస్‌లో ప్రవేశానికి అనర్హులనే నిబంధనను ఓంకార్ అనే విద్యార్థి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఓంకార్ 40–45 శాతం మాట, భాషాపరమైన వైకల్యంతో బాధపడుతున్నారు. ఓంకార్ వైద్యవిద్యను అభ్యసించడానికి అర్హుడేనని జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. ఓంకార్ ఎలాంటి అవరోధాలు లేకుండా ఎంబీబీఎస్ చదవొచ్చని మెడికల్ బోర్డు అభిప్రాయపడిన విషయాన్ని ప్రస్తావించింది. దివ్యాంగులను మెడిసిన్ చదవడానికి అర్హులా? కాదా? అనే విషయాన్ని వైకల్య నిర్ధారణ బోర్డు ప్రతికేసులో పరిశీలించాలని తెలిపింది. వైద్య విద్యను చదవడానికి సదరు అభ్యర్థి వైకల్యం అడ్డవుతుందో? లేదో? మదింపు చేయాలని స్పష్టం చేసింది. ప్రవేశానికి అనర్హుడని తేలిస్తే అందుకు కారణాలను కూడా మెడికల్ బోర్డు ఇవ్వాలని ధర్మాసనం పేర్కొంది.

## ప్రజల ఆకలిలో 'విశ్వ గురువు'ను చేశారు

- ప్రధాని మోదీపై ఖర్గే విసుర్లు

న్యూఢిల్లీ: బీజేపీ హయాంలో ద్రవ్యోల్బణం రేటు పైపైకి పోతోందని, దేశాన్ని ప్రధాని మోదీ ప్రజల ఆకలిలో 'విశ్వ గురువు'లుగా చేశారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన 'ఎక్స్'లో..'పేద ప్రజలకు ఆహార భద్రత కింద రేషన్ సరుకులను అందిస్తున్న మోదీజీ, ప్రజలను ఆకలిలో 'విశ్వగురువు'గా మార్చే స్థాయిలో ద్రవ్యోల్బణం ఉంది. ప్రపంచ ఆకలి సూచీలో భారత్ 105వ స్థానానికి చేరుకుంది'అని పేర్కొన్నారు. 'ఆగస్టులో 3.65 శాతమున్న ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 5.49 శాతానికి చేరింది. గత తొమ్మిది నెలల్లో ఇదే అత్యధికం'అంటూ ఖర్గే కూరగాయల ధరల పట్టికను షేర్ చేశారు.

## నిబంధనలకు విరుద్ధంగా వక్ఫ్ జేపీసీ సమావేశాలు

- లోక్‌సభ స్పీకర్‌కు విపక్ష ఎంపీల ఫిర్యాదు

న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశాలు నియమావళికి విరుద్ధంగా చైర్మన్ జగదాంబికా పాల్ నిర్వహిస్తున్నారని విపక్ష ఎంపీలు మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు లేఖ రాశారు. సోమవారం జేపీసీ ముందు హాజరైన కర్నాటక మైనారిటీ కమిషన్ చైర్మన్ అన్వర్ మణిప్పాడి.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర నాయకులు వక్ఫ్ ఆస్తులను ఆక్రమించుకున్నారని ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర వాదోపవాదాలు జరిగి.. జేపీసీ సమావేశాన్ని విపక్ష ఎంపీలు బహిష్కరించారు. వక్ఫ్ (సవరణ) బిల్లు–2024పై ఎలాంటి సూచనలు చేయకుండా అన్వర్.. రాజ్యసభలో విపక్ష నేత ఖర్గేపై ఆరోపణలు చేశారని విపక్ష ఎంపీలు స్పీకర్ రాసిన లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన, గౌరవప్రదమైన పదవిలో ఉన్న వ్యక్తి (ఖర్గే)పై ఆరోపణలు చేయడంపై తాము తీవ్ర అభ్యంతరం తెలిపినప్పటికీ జగదాంబికా పాల్.. అన్వర్‌ను మాట్లాడటానికి అనుమతించారని ఆక్షేపించారు. ఈ అంశంపై తమ నిరసనను తెలియజేయడానికి కూడా పాల్ సమయం ఇవ్వలేదని ఆరోపించారు. మంగళవారం కూడా విపక్ష ఎంపీలు గంటసేపు జేపీసీ భేటీని బహిష్కరించారు.

# చెన్నైలో భారీ వర్షాలు



చెన్నైలో వరద నీటిలో జనం ఇక్కట్లు

సాక్షి, చెన్నై/బెంగళూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తమిళనాడు వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెన్నై, చుట్టుపక్కలున్న చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల్లో రహదారులు, నివాసప్రాంతాల్లో మోకాలి లోతు వరద చేరడంతో జనజీవనం స్తంభించింది. ప్రజా రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో బస్సులు నడవలేదు. దక్షిణ రైల్వే నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసింది. కొన్ని దేశీయ విమాన సర్వీసులు కూడా నిలిచిపోయాయి. బుధవారం అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ కేంద్రం హెచ్చరికలతో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

**బెంగళూరులో జనజీవనం అస్తవ్యస్తం**

కర్ణాటక రాజధాని బెంగళూరు సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కురిసిన భారీ వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తమైంది. బెంగళూరులోని చాలా ప్రాంతాల్లో వరద నీరు నిలిచి, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వర్థూర్, హెబ్బాళ్, కడుబీసనహళ్లిల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. టెక్ కంపెనీలున్న ఔటర్ రింగ్ రోడ్డు, సర్జాపూర్‌లలోనూ వాహనాలు వరదలో చిక్కుకున్నాయి. హెబ్బాళ్ ఫ్లై ఓవర్ కింద నిలిచిన నీటిని మోటార్లతో తోడి వేసి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే రహదారిలో వాహనదారులు అవస్థలు పడ్డారు. దీంతో, బుధవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.



షాంఘై సహకార సంఘం(ఎస్‌సీఓ) సమావేశంలో పాల్గొనేందుకు విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ మంగళవారం పాకిస్తాన్ వెళ్లారు. రావల్పిండి ఎయిర్‌బేస్‌లో పుష్పగుచ్ఛమిచ్చి ఆయనకు స్వాగతం పలుకుతున్న ఓ బాలిక, అధికారులు

## టాస్క్‌ఫోర్స్ వేగంగా పనిచేయాలి

- పనితీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ: ఆసుపత్రుల్లో డాక్టర్లు, వైద్య సిబ్బందికి భద్రతపై తగిన సిఫారసులు చేయడానికి తాము నియమించిన జాతీయ టాస్క్‌ఫోర్స్ పనితీరు నిదానంగా ఉండటంపై సుప్రీంకోర్టు మంగళవారం అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలి హత్యాచారం ఉదంతాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు వైద్యుల భద్రత, పని పరిస్థితులు మెరుగుపర్చడం, ఆసుపత్రుల్లో సదుపాయాల కల్పనపై తగు సిఫారసులు చేయడానికి నిపుణులతో జాతీయ టాస్క్‌ఫోర్స్ (ఎన్‌టీఎఫ్)ను నియమించిన విషయం తెలిసిందే. ఆగస్టు 27 సమావేశమైన టాస్క్‌ఫోర్స్.. భాగస్వాములందరితో మాట్లాడి అభిప్రాయాలు తీసుకోవడానికి నాలుగు సబ్ గ్రూపులను ఏర్పాటు చేసిందని, ఆపై సెప్టెంబరు 9 తర్వాత ఒక్కసారి కూడా సమావేశం కాకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది సీజేఐ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. 'సెప్టెంబరు 9న తర్వాత టాస్క్‌ఫోర్స్ ఏం చేసింది? ఎందుకు పురోగతి లేదు? పనిలో వేగాన్ని పెంచాలి'అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

# ప్రజా పదవుల దుర్వినియోగాన్ని ప్రశ్నించే కోవారంటో

### వివిధ రిట్లు-అర్థం-పరిధి - ప్రాముఖ్యత

#### ప్రొహిబిషన్ (నిషేధం)

భాషా పరంగా ప్రొహిబిషన్ అంటే నిషేధించడం అని అర్థం. ఏదైనా దిగువ కోర్టు లేదా ట్రిబ్యునల్ తన పరిధిని అతిక్రమించి కేసులు విచారిస్తున్నప్పుడు ఆ విచారణను తదుపరి ఆదేశాల వరకు నిలిపివేయాలని కోర్టు ఆదేశిస్తుంది. దిగువ కోర్టులు తమ పరిధులను అతిక్రమించకుండా నిరోధించడమే ఈ రిట్ ముఖ్య ఉద్దేశం. ప్రొహిబిషన్ న్యాయ సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది. పాలనా సంస్థలు, చట్టపర సంస్థలకు వర్తించదు.

#### సెర్షియోరరి (ఉన్నత న్యాయస్థాన పరిశీలన అధికారం)

భాషాపరంగా సెర్షియోరరి అంటే 'సుపీరియర్' లేదా 'టు బి సర్టిఫైడ్' లేదా 'బ్రింగ్ ద రికార్డ్స్' అని అర్థం. ఏదైనా దిగువ కోర్టు తన పరిధిని అతిక్రమించి కేసును విచారించి తీర్పు వెలువరించినప్పుడు దాన్ని రద్దు చేసి, కేసును పై స్థాయి కోర్టుకు బదిలీ చేయాలని ఇచ్చే ఆదేశం. ఈ రిట్ ఉద్దేశం కూడా దిగువ న్యాయస్థానాలు తమ పరిధులను అతిక్రమించకుండా నిరోధించడమే.

సెర్షియోరరిని ప్రైవేటు సంస్థలు, శాసన సంస్థలకు వ్యతిరేకంగా జారీ చేయరు. ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే పరిపాలనా సంస్థలకు వ్యతిరేకంగా జారీచేయవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఎన్విరాన్-లీగల్ యాక్షన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1996) కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.

#### ప్రొహిబిషన్, సెర్షియోరరి మధ్య తేడాలు

ప్రొహిబిషన్, సెర్షియోరరిల రిట్ల ఉద్దేశం ఒక్కటే. దిగువ కోర్టులు తమ పరిధులను అతిక్రమించకుండా నియంత్రించడం. అయితే వీటి ప్రక్రియలో తేడా ఉంది. కేసు ప్రారంభదశలో ఉంటే ప్రొహిబిషన్ రిట్, తీర్పు వెలువడిన తర్వాత సెర్షియోరరి రిట్‌ను జారీ చేస్తారు.

సెర్షియోరరి రిట్ దిగువ కోర్టులను నియంత్రించడంతోపాటు, అవి చేసిన తప్పులను కూడా సవరిస్తుంది. ప్రొహిబిషన్ రిట్ కేవలం నిలుపుదల చేస్తుంది. (Prohibition is preventive where as certiorari is curative)

#### కోవారంటో (అధికార పృచ్ఛ)

భాషాపరంగా దీన్ని 'బై వాట్ వారంట్' (By What Warrant) అంటారు. అంటే 'ఏ అధికారంతో' అని ప్రశ్నించడం. ప్రజా పదవుల దుర్వినియోగాన్ని అరికట్టడం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ప్రజా సంబంధమైన పదవుల్లోకి అక్రమంగా ప్రవేశించిన లేదా ప్రజా పదవులను దుర్విని యోగం చేసిన వ్యక్తి ఆ పదవిలో కొనసాగడానికి చట్టబద్ధంగా ఉన్న అధికారాన్ని న్యాయస్థానాలు ప్రశ్నిస్తాయి. చట్టబద్ధత లేకపోతే ఆ పదవి నుంచి వెంటనే తొలగిపోవాలని ఆదేశిస్తాయి. ప్రజా పదవి అంటే చట్టంతో ఏర్పాటైన స్వతంత్ర పత్రిపత్తి సంస్థ. ఉదాహరణకు ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, మంత్రులు, ముఖ్యమంత్రులు మొదలైనవి.

ఈ రిట్ కోసం బాధితుడు మాత్రమే న్యాయస్థానాల్లో కేసు వేయాలనే నియమం లేదు. ప్రజా పదవులను దుర్వినియోగం నుంచి కాపాడాలనే సామాజిక స్పృహ ఉన్న ఏ పౌరుడైనా కోర్టును ఆశ్రయించవచ్చు. మూడో వ్యక్తికి (Third Person) ఇందులో జోక్యం చేసుకునే హక్కు (Locus Standi- లోకస్ స్టాండై) ఉంటుంది.

#### ఇన్‌జంక్షన్ (నిలుపుదల ఆదేశం)

ఈ రిట్ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించలేదు. కేవలం సివిల్ వివాదాల్లో యధాతథస్థితిని (Status-Quo-Ante) కొనసాగించడానికి దీన్ని జారీ చేస్తారు. భర్తీ చేయడానికి వీలుపడని నష్టాన్ని అరికట్టేందుకు ఇన్‌జంక్షన్‌ను జారీ చేస్తారు. కాబట్టి ప్రాథమిక హక్కుల రక్షణకు, ఈ రిట్‌కు సంబంధం లేదు.

#### ప్రాథమిక హక్కులు - ఇతర నిబంధనలు

ప్రకరణ 33ను అనుసరించి, ప్రాథమిక హక్కులు కింది వర్గాలకు వర్తించే విషయంలో పార్లమెంటు చట్టం ద్వారా కొన్ని పరిమితులు విధించవచ్చు.

ఎ) సైనిక, పారా మిలటరీ దళాలు.
బి) పోలీసులు, ఇతర రక్షణపరమైన విధులు నిర్వర్తిస్తున్న సంస్థలు, అధికారుల ప్రాథమిక హక్కులపై పరిమితులు విధించవచ్చు.
సి) గూఢచార సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు.
డి) అత్యవసర సర్వీసులైన టెలి కమ్యూనికేషన్లు, ఇతర శాఖల్లో పనిచేసే ఉద్యోగులు.

#### ప్రకరణ 34-సైనికచట్టం (Marshal Law) - ప్రాథమిక హక్కులపై పరిమితులు

దేశంలోని ఏదైనా ప్రాంతంలో సైనిక చట్టం ప్రకటించినప్పుడు ఆ సమయంలో సైనిక బలగాలు చేపట్టిన చర్యలు, తద్వారా జరిగిన నష్టాలకు, పరిణామాలకు వారిని బాధ్యులను చేయడానికి వీలులేదు. పార్లమెంటు ఒక చట్టం ద్వారా వారి చర్యలకు రక్షణ కల్పిస్తుంది. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిందని న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి వీలులేదు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

#### ప్రకరణ 34, 35ల మధ్య తేడా


ప్రకరణ 34లో ప్రస్తావించిన అంశాలు కేవలం కొన్ని వర్గాల ఉద్యోగులు, వారి హక్కులపై విధించిన పరిమితులు. ప్రకరణ 35లో ప్రస్తావించిన అంశాలు కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో ప్రాథమిక హక్కులను పరిమితం చేయడానికి రూపొందించినవి. కాబట్టి ఒకటి వర్గానికి సంబంధించింది, మరొకటి ప్రాంతానికి సంబంధించినది.

**ఉదా:** 1958లో రూపొందించిన సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (Armed Forces (Special Power) Act- AFSPA). దీన్ని పలు పర్యాయాలు సవరించి అసోం, మణిపూర్ రాష్ట్రాల్లోని కల్లోలిత ప్రాంతాల్లో విధించారు. అలాగే 1983లో పంజాబ్, చండీగఢ్‌లో కూడా ప్రయోగించారు. అక్కడి పరిస్థితుల కారణంగా శాంతి భద్రతల నిర్వహణలో పోలీసులు విఫలమైనప్పుడు ఈ చట్టం ద్వారా సాయుధ బలగాలకు ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

#### ప్రకరణ- 35 చట్టబద్ధత, శిక్షలు

మూడో భాగంలో పేర్కొన్న నిబంధన అమలుకు చట్టబద్ధత కల్పించడం, శిక్షలు నిర్ణయించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. శాసనసభలకు ఉండదు. ప్రాథమిక హక్కుల అమలుకు సంబంధించి దేశవ్యాప్తంగా ఒకే పద్ధతి లేదా ప్రక్రియ ఉండాలనే ఉద్దేశంతో ఈ అధికారాన్ని పార్లమెంటుకు మాత్రమే ఇచ్చారు.

**ఉదా:** ప్రకరణ 16(3) ప్రకారం రిజర్వేషన్ల అమలు, ప్రకరణ 32(3) ప్రకారం రిట్లు జారీ చేసే అధికారాన్ని న్యాయస్థానాలకు సంక్రమింపజేయడం, ప్రకరణ 33 ప్రకారం సాయుధ బలగాల ప్రాథమిక హక్కులపై పరిమితులు విధించడం, ప్రకరణ 34 ప్రకారం సైనిక పాలన, మొదలైన అంశాలపై పార్లమెంటుకు మాత్రమే చట్టాలు చేసే అధికారం ఉంటుంది. అదే విధంగా ఈ భాగంలో



పేర్కొన్న నేరాలకు, (ఉదాహరణకు ప్రకరణ 17లో పేర్కొన్న అస్పృశ్యత, 23లో పేర్కొన్న దోపిడీ, 24లోని బాలకార్మిక వ్యవస్థ మొదలైన వాటికి) శిక్షలు నిర్ణయించే అధికారం పార్లమెంటుకే ఉంటుంది.

ప్రకరణ 35(బి) ప్రకారం, పై విషయాలకు సంబంధించి రాజ్యాంగం అమల్లోకి రాక పూర్వం ఉన్న చట్టాలు అలాగే కొనసాగుతాయి. అయితే ప్రకరణ 372 ప్రకారం పూర్వ శాసనాలకు మార్పులు, చేర్పులు, సవరణలు చేసి పార్లమెంటు కొత్త చట్టాలు రూపొందించుకోవచ్చు.

#### ప్రాథమిక హక్కులు - ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (Public Interest Litigation-PIL)

ప్రాథమిక హక్కుల రక్షణ, అమలుకు సంబంధించి రాజ్యాంగంలో ప్రత్యేక ఏర్పాట్లను ప్రకరణ 32, ప్రకరణ 226లో పేర్కొన్నారు. హక్కులకు భంగం వాటిల్లినప్పుడు లేదా అమలు కానప్పుడు బాధితుడే కోర్టును ఆశ్రయిస్తాడు. అయితే బాధితుడికి సరైన అవగాహన లేకపోవడం లేదా ఆర్థిక, సామాజిక స్థితి పరంగా కోర్టును ఆశ్రయించే పరిస్థితి ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో బాధితులకు సంబంధించి ప్రజాప్రయోజనం అందులో ఇమిడి ఉంటే వారి తరఫున మూడో వ్యక్తి కూడా కోర్టులో వ్యాజ్యం వేయవచ్చు. దీన్నే ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం అంటారు.

సాధారణంగా కోర్టు జోక్యాన్ని కోరే హక్కు (Locus Standi) బాధితులకే ఉంటుంది. కానీ సుప్రీంకోర్టు ఆ హక్కును ఇతరులకు కూడా సంక్రమింపజేసింది. ఈ వెసులుబాటును పబ్లిక్ ఇంట్రస్ట్ లిటిగేషన్ (పీఐఎల్) లేదా సోషల్లీ ఇంట్రస్ట్ లిటిగేషన్ అని అంటారు.

**గమనిక:** పీఐఎల్ భావన మొదట అమెరికా న్యాయ వ్యవస్థలో ప్రారంభమైంది. ఆ తర్వాత ఆస్ట్రేలియాలో బాగా ప్రచారంలోకి వచ్చింది. ఇండియాలోని పీఐఎల్ భావన అమెరికా నమూనాలాంటిదే. కానీ కొన్ని మార్పులతో పాటిస్తుంది.

రాజ్యాంగంలో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం గురించి ప్రస్తావన లేదు. అయితే సుప్రీంకోర్టులో మొదటిసారి ఈ భావనను ప్రవేశపెట్టింది జస్టిస్ వి.ఆర్. కృష్ణ అయ్యర్. ఆ తర్వాత జస్టిస్ పి.ఎన్. భగవతి నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్‌కి మొదటిసారిగా 1979లో బిహార్ జైల్లో ఖైదీల తరఫున పీఐఎల్ దాఖలు చేశారు. దీన్నే హుస్నార ఖతూన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసు అంటారు.

1981లో ఎస్.పి.గుప్తా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసును పీఐఎల్‌కు సంబంధించిన అతి ముఖ్యమైన కేసుగా పేర్కొంటారు. జస్టిస్ పి.ఎన్.భగవతి పీఐఎల్‌ను చక్కగా నిర్వచించి, తగిన వివరణ ఇచ్చారు.

ప్రకరణ 32ప్రకారం, సుప్రీంకోర్టులో, ప్రకరణ 226 ప్రకారం హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దాఖలు చేయవచ్చు. ఇతర న్యాయస్థానాలకు ఈ అధికారం లేదు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి కుంభకోణాలు పీఐఎల్ ద్వారానే దేశంలో వెలుగులోకి వచ్చాయి.

పీఐఎల్‌ను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించరాదు. ప్రచారం కోసం ప్రత్యర్థులను ఇబ్బందులకు గురి చేయాలనే దురుద్దేశంతో ప్రజాప్రయోజనాల నెపంతో పీఐఎల్ ను దాఖలు చేస్తే అలాంటి వ్యక్తులపై న్యాయస్థానాలు భారీ జరిమానాలు విధిస్తాయి.

**ఉదా:** సంజీవ్ భట్నాగర్ జాతీయగీతం నుంచి సింధ్ అనే పదాన్ని తొలగించాలని సుప్రీంకోర్టులో పీఐఎల్ దాఖలు చేశారు. అది అనవసరమైన, ఆర్భాటమైన కేసుగా భావించి కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు భారీ జరిమానా విధించింది.

#### ప్రాథమిక హక్కులపై పరిమితులు- జాతీయ అత్యవసర పరిస్థితి ప్రభావం

నిబంధన 352 ప్రకారం, జాతీయ అత్యవసర పరిస్థితి విధించినప్పుడు మూడో భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులు రద్దవుతాయి. దీనికి సంబంధించి రాజ్యాంగంలో ప్రకరణలు 358, 359లలో వివరణలు ఉన్నాయి.

#### ప్రకరణ 358 ప్రకారం బాహ్య అత్యవసర పరిస్థితి

యుద్ధం, దురాక్రమణ కారణంగా అత్యవసర పరిస్థితి విధించినప్పుడు మాత్రమే వర్తిస్తుంది. దీని ప్రకారం ప్రకరణ 19లో పేర్కొన్న స్వేచ్ఛలను మాత్రమే రద్దు చేస్తారు. ఇతర ప్రాథమిక హక్కులు రద్దు కావు.

ప్రకరణ 358 ప్రకారం జాతీయ అత్యవసర పరిస్థితిలో ప్రకరణ 19లో పేర్కొన్న స్వేచ్ఛలు వాటంతట అవే రద్దవుతాయి.

#### ప్రాథమిక హక్కులు - ముఖ్య వివాదాలు - సుప్రీంకోర్టు తీర్పులు

**ఎ.కె. గోపాలన్ వర్సెస్ తమిళనాడు -1950:**
**1950లో చేసిన నివారక నిర్బంధ చట్టంలోని సెక్షన్ 4 న్యాయ సమీక్షాధికారానికి విరుద్ధంగా ఉన్నందున అది చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయితే ఈ చట్టం కింద ముందస్తు అరెస్టు సమంజసమేనని పేర్కొంది.**

**శంకర్ ప్రసాద్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా-1951:**
**మొదటి రాజ్యాంగ సవరణకు సంబంధించిన అంశాన్ని ఈ వివాదంలో సుప్రీం కోర్టు పరిశీలించింది. ఈ సవరణ రాజ్యాంగబద్ధమేనని తీర్పు చెప్పింది. ఈ కేసులోనే సుప్రీం కోర్టు మొదటిసారి న్యాయ సమీక్షాధికారాన్ని వినియోగించింది.**

**బేలా బెనర్జీ వర్సెస్ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం-1954:**
**ఈ వివాదం కూడా ఆస్తి హక్కుకు సంబంధించిందే. ప్రభుత్వం ప్రజల ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు అందుకు మార్కెట్ విలువతో కూడిన నష్టపరిహారాన్ని చెల్లించాలని తీర్పు చెప్పింది.**

కానీ ప్రకరణ 359 ప్రకారం ప్రాథమిక హక్కులు రద్దు చేయడానికి రాష్ట్రపతి ప్రత్యేక ఆదేశాన్ని జారీ చేయాలి. ఎమర్జెన్సీ విధించినంత మాత్రాన వాటంతట అవే రద్దు కావు.

నిబంధన 358 పరిధి దేశవ్యాప్తంగా వర్తిస్తుంది. కానీ ప్రకరణ 359 పరిధి దేశంలో కొన్ని ప్రాంతాలకు లేదా మొత్తం భాగానికి వర్తింపజేయవచ్చు.

జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ కారణంగా విధించినప్పటికీ (బాహ్య, అంతరంగిక కారణాలు) ప్రకరణ 20, 21 రద్దుకావు. ఈ అంశాన్ని 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా పొందుపరిచారు.

ప్రకరణలు 358, 359 మధ్య కొంత సామీప్యం ఉంది. ఇవి అత్యవసర పరిస్థితి విధించడం ద్వారా జరిగే పరిణామాలకు రక్షణ కల్పిస్తాయి కానీ ఎమర్జెన్సీతో సంబంధం లేని చట్టాలకు వర్తించవు.

#### ప్రాథమిక హక్కులు- మినహాయింపులు

ప్రకరణ 31-ఎ లో పేర్కొన్న ఐదు రకాల చట్టాలు తమ ప్రాథమిక హక్కులకు విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీలులేదు. ఈ అంశాలను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చారు.

నిబంధన 31-బిలో కూడా ఇలాంటి పరిమితులనే పేర్కొన్నారు. 31-సి ప్రకారం నిర్దేశిక నియమాల్లో పొందుపరిచిన 39-బి, 39-సి అమలు కోసం ప్రాథమిక హక్కులపై పరిమితులు విధిస్తే, అది రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానంలో ప్రశ్నించరాదు.

# Where did he complete his education?

### Question Tags

We use question tags to confirm the information. It is very small, may be contains 2 or 3 words. We write positive tag to negative statement and negative tag to positive statement.

**Ex:** Kiran is a doctor.

**Question Tag:** Isn't he.

**Steps to write question tags:**

1. Write auxiliary verb of the sentence as a beginning word (am, is, are, was, were, will, would, shall, should, can, could, do, does, did, has, have, had, may, might, need, ought to etc.)
2. If there are no auxiliaries use "do, does, did" depend on the tense of the verb.
3. Do not write no, not & never if they are in the sentence.
4. Write no, not & never if they are not in the sentence.
5. Write subject or reflexive pronoun (I, we, you, he, she, it, they) as the last word. Use question mark (?) at the end.
6. Use positive tags only for the negative words "few, little, never, rarely, scarcely, hardly, seldom".

**Examples:**

| Statement | Question Tag |
|---|---|
| Sita sings well. | Doesn't she? |
| They came yesterday. | Did they? |
| I like sweets. | Don't I? |
| Raju cannot swim. | Can he? |
| I am right. | Aren't I? |
| You will help me. | Won't you? |

**Vocabulary:**

The knowledge of words is called vocabulary. Generally synonyms (same meaning words), Antonyms (opposite meaning words), Spellings, Silent letters will be given in TET.

**Synonyms:**

***Abandon:*** leave, relinquish, forsake, resign

***Appreciate:*** estimate, value, recognize

***Bliss:*** happiness, joy, delight, facility, rapture

***Capital:*** chief, principal, pre-eminent, excellent

**Antonyms:**

| | | |
|---|---|---|
| Abstract | × | concrete |
| Barren | × | fertile |
| Cheerful | × | gloomy |
| Dawn | × | dusk |
| Expand | × | contract |
| Foreign | × | native |

**Silent Letters:**

The letters in brackets are not pronounced. They are silent.

- clim(b), com(b), dum(b), dou(b)t, de(b)t
- mus(c)le
- han(d)kerchief, san(d)wich, we(d)nesday
- champa(g)ne, forei(g)n, si(g)n
- bou(gh)t, brou(gh)t, cau(gh)t, thou(gh)t, borou(gh), dau(gh)ter, hei(gh)t, hi(gh), li(gh)t, mi(gh)t, kni(gh)t, nei(gh)bour, ni(gh)t, ri(gh)t, strai(gh)t, throu(gh), ti(gh)t, wei(gh)
- w(h)at, w(h)en, w(h)ere, w(h)ether, w(h)ich, w(h)ip, w(h)y
- (h)onest, (h)onour, (h)our
- (k)nee, (k)nife, (k)nob, (k)nock, (k)now and similarly in other words beginning **kn**
- ca(l)m, cou(l)d, ha(l)f, sa(l)mon, shou(l)d, ta(l)k, pa(l)m, sta(l)k, wa(l)k, wou(l)d, autum(n), hym(n)
- (p)neumatic, (p)sychiatrist, (p)sychology, (p)sychotherapy, (p)tero-dactyl and similarly in other words beginning pn, ps or pt.
- cu(p)board
- i(r)on
- (w)rap, (w)rite, (w)rong
- (w)ho, (w)hom, (w)hose, (w)hole

**Phrasal Verbs:**

Phrasal verbs are verbs followed by prepositions and adverbs which give them special idiomatic meanings. Here is a list of important phrases.

1. Break down = collapse
   **Ex:** The woman broke down when she heard the news of her husband's death.
2. Call in = bring in
   **Ex:** Please call in your friend.
3. Draw out = take out from his pocket
   **Ex:** He drew out the knife.
4. Fall off = declined
   **Ex:** The demand for scooters has fallen off.
5. Get over = recover from
   **Ex:** She got over the shock.




**Sentences:**

There are 4 types of sentences depend on no. of clauses they have. They are

**Simple sentence:**
A simple sentence is one which has only one subject and one predicate. That means it has only one clause.
**Ex:**Ramu is a doctor.

**Compound sentence:** Compound sentence is made up of two or more clauses and combined by coordinating conjunctions like "and, so, but".
**Ex:**He ran fast but missed the train.
'He ran fast' is one clause and 'missed the train' is another clause.

**Complex sentence:**
Some clauses cannot stand independently. They depend upon main clauses. Complex sentence is one which has one main clause and one or more subordinate clauses.
**Ex:**He told me that he was a doctor.
He told me- main clause
That he was a doctor - subordinate clause.

**Compound-Complex sentence:** If there are more than one main clauses and at least one subordinate clause it becomes Compound-Complex sentence.
**Ex:**When Sachin completed the century the audience clapped and the cheer girls danced.
The audience clapped – main clause 1
The cheer girls danced – main clause 2
When Sachin completed the century – subordinate clause

**Transformation of sentences**

1. **Simple to compound:** Change the phrase as another main clause and combine them with conjunction.
   **Ex:** I praised him for his intelligence (simple)
   Change the phrase as clause.
   For his intelligence => he was an intelligent
   Use conjunction 'so'.
   He was an intelligent, so I praised him. (Compound)
2. **Compound to Complex:** Change one main clause as subordinate clause.
   **Ex:** He was sick and so he could not come to school. (Compound)
   As he was sick, he could not come to school. (Complex)
3. **Compound to Simple:** Change a main clause into a phrase.
   **Ex:** Ravi felt hungry, he had his lunch. (Compound)
   Being hungry, Ravi had his lunch. (Simple)
4. **Complex to Simple:** Change the subordinate clause into phrase and use it along with main clause.
   **Ex:** He doesn't know where she works. (Complex)
   Where she works (sub. Clause) => her working place. (Phrase)
   He doesn't know her working place. (Simple)
5. **Complex to Compound:** Change the subordinate clause into main clause and combine with conjunction (and, or, but).
   **Ex:** Though Ravi is irregular, he is a bright student. (Complex)
   Ravi is irregular but he is a bright student. (Compound)

**Letter writing:**

We can divide the letters into Personal and business. In multiple choice questions few things only can be asked from this.

**Salutations of the Personal letters:** Dear father, My dear mother, Dear Ravi, Dear friend.

**Salutations of the Business letters:** Sir, Madam, M/s

**Subscriptions of the personal letter:** Yours affectionately, Yours sincerely (only for friends), Yours lovingly, Your

**Subscriptions of the business letters:** Yours faithfully, Yours truly.

No apostrophe in subscriptions.

**Often confused phrase:**
Your's faithfully (wrong)
Yours faithful (wrong)
Yours faithfully (correct)
-ly comes compulsory at the end, if it started with 'yours'.
-ly doesn't come if it is 'your'
Yours loving son (wrong)
Your loving son (correct)

### Comprehension passage:

Read the passage once carefully before reading the questions corresponding. Again read the paragraph. Then you can get central idea of the passage. Finally answer the questions. Model passage is given here.

Louis Braille lost his sight accidentally as a child. Nevertheless, he was able to complete his education at a school for the blind in Paris and became a teacher. In his days, the few books that were available for blind people were printed in big, raised type, the letters used were those of the ordinary alphabet. The reading of such books required immense effort. Writing was almost impossible for a blind person was still restricted to an alphabet which was extraordinarily difficult to reproduce on paper.

Braille's idea was to use raised dots instead of raised letters. He evolved a system which used only six dots in all. By various combinations of these dots, it not only proved possible to represent each letter in the alphabet, but punctuation marks, numbers and musical notations as well. Reading and writing have thus been enormously simplified. The sensitive fingers of a blind person can travel rapidly over the dots.

**Choose the correct answer from the given four alternatives:**

1. **Louis Braille**
   1.was blind by birth
   2. lost his sight gradually
   3. became blind accidentally
   4. became blind after he completed his education
2. **The books for blind before Braille were**
   1. printed in raised letters
   2. used raised dots
   3. used a special alphabet
   4.were not available
3. **Braille's new system:**
   1. introduced a new alphabet for the blind
   2.used six dots in different combinations
   3. introduced a new typewriter
   4. trained the blind to use their fingers
4. **His new system can represent**
   1. alphabets & numbers
   2. punctuation marks
   3. musical notations
   4. all of the above
5. **Where did he complete his education?**
   1. New York 2. Paris
   3. London 4. Russia

**Answers:**

1) 3 2) 1 3) 2 4) 4 5) 2

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com



# దేశంలో మొదటి బయోస్పియర్ రిజర్వ్?

**జీవ వైవిధ్య సంరక్షణ**
**(అటవీ వనరుల, వన్యజాతి జీవుల సంరక్షణ)**

జీవావరణంలోని సమస్త జీవజాతుల మధ్య ఉన్న జన్యుపరమైన, జాతులపరమైన, ఆవరణ వ్యవస్థల పరమైన తేడాలు, వైవిధ్యతలనే జీవ వైవిధ్యతగా పరిగణిస్తారు. పర్యావరణ, ఆహార, వైద్య, వాణిజ్య, పారిశ్రామిక, సామాజిక, సాంస్కృతిక, సౌందర్యపరంగా జీవ వైవిధ్య ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత, భవిష్యత్ తరాలకు జీవ వనరులను అందుబాటులో ఉంచుతూ, సుస్థిరాభివృద్ధి సాధించడానికి సాంకేతిక విజ్ఞానం ద్వారా జీవ వైవిధ్యతను సమర్థంగా నిర్వహించడమే జీవ వైవిధ్య సంరక్షణ.

**జీవ వైవిధ్య సంరక్షణలో ఇమిడి ఉన్న అంశాలు:**

1. మానవ చర్యల వల్ల ప్రమాదస్థితిలో ఉన్న వన్య, వృక్ష, జంతుజాతులను గుర్తించి, వాటిని పునఃస్థాపితం చేసే రక్షణ ప్రణాళికలను రూపొందించాలి.
2. ప్రమాద స్థితిలో ఉన్న జాతుల బీజద్రవ్యాలను, విత్తనాలను, పిండాలను భద్రపరిచే ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలి
3. దేశవాళి రకాల జాతుల ఆవాసాలను గుర్తించి, వాటి పరిరక్షణకు రక్షిత ప్రాంతాలను గుర్తించాలి. జీవ జాతుల అక్రమ రవాణాను, అంతర్జాతీయ వ్యాపారాన్ని అరికట్టే శాసనాలు, చట్టాలను అమలు చేయాలి.
4. బహుళ జాతి కంపెనీలు సాగించే జీవ చౌర్యాన్ని అరికట్టే చర్యలు చేపట్టాలి.

* జీవ వైద్య సంరక్షణకు రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తున్నారు. అవి..
  1) IN-Situ సంరక్షణ (ఆవాసాంతర సంరక్షణ)
  2) Ex-Situ సంరక్షణ(ఆవాసేతర సంరక్షణ)

| బయోస్పియర్ రిజర్వ్ | రాష్ట్రం |
|---|---|
| నీలగిరి (దేశంలోని మొదటి బయోస్పియర్, 1986లో ప్రకటించారు. | తమిళనాడు |
| అగస్త్యమలై | కేరళ |
| గల్ఫ్ ఆఫ్ మన్నార్ | తమిళనాడు |
| గ్రేట్ నికోబార్ | అండమాన్ నికోబార్ |
| సిమ్లిపాల్ | ఒడిశా |
| అమర్ కంటక్-అదానకర్ | మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ |
| పాంచ్‌మర్హి | మధ్యప్రదేశ్ |
| సుందర్‌బన్ | వెస్ట్‌బెంగాల్ |
| దిబ్రూసికాయ్ | అసోం |
| మానస | అసోం |
| నోక్రేక్ | మేఘాలయ |
| దిబాంగ్-దెహాంగ్ | అరుణాచల్‌ప్రదేశ్ |
| కాంచనజంగా | సిక్కిం |
| నందాదేవి | ఉత్తరాఖండ్ |
| రాణ్ ఆఫ్ కచ్ | గుజరాత్ |
| కోల్డ్ డెసర్ట్ | హిమాచల్‌ప్రదేశ్ |
| శేషాచల | ఆంధ్రప్రదేశ్ |
| పన్నా | మధ్యప్రదేశ్ |

**IN-Situ సంరక్షణ:**
ఏదైనా భౌగోళిక ప్రాంతంలో అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జీవజాతులను వాటి జన్యు సంపదను అదే భౌగోళిక ప్రాంతంలో మానవ ప్రమేయంతో రక్షించే విధానమే IN-Situ సంరక్షణ. ఈ పద్ధతిలో సమాజానికి లాభం కలిగించే విభిన్న రకాల రక్షిత ప్రాంతాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ విధానంలో 4 రకాల కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నారు. అవి..

**ఎ) జాతీయ పార్కులు:**
ప్రకృతి సంపద, సుందర ప్రదేశాలు, దృశ్యాలు, వన్యజీవులను సంరక్షించేందుకు జాతీయ పార్కులను ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాంతాల నుంచి వంట చెరకును సేకరించుకోవడం, పశువులను మేపుకోవడం, అటవీ ఉత్పత్తులను సేకరించడం నిషిద్ధం. ఈ ప్రాంతాలపై వ్యక్తిగత హక్కులు ఉండవు. జాతీయ పార్కుల హద్దులను శాసనం ద్వారా నిర్ణయిస్తారు. ప్రస్తుతం దేశంలో 4.2 మిలియన్ హెక్టార్లలో (దేశ భూభాగంలో 1.3శాతం) 97 జాతీయ పార్కులు ఉన్నాయి.

**బి) వన్యమృగ సంరక్షణ కేంద్రాలు (అభయారణ్యాలు):**
వీటిని వన్యప్రాణుల సంరక్షణకు కేటాయించినప్పటికీ వీటి సరిహద్దులను శాసనం ద్వారా నిర్ణయించరు. ఇక్కడి వన్యప్రాణులకు కీడు కలిగించనంత వరకు అటవీ కార్యకలాపాలను చేపట్టేందుకు అనుమతి ఉంది. ప్రస్తుతం 12 మిలియన్ల హెక్టార్ల భూభాగంలో (దేశభూభాగంలో 3.7 శాతం) 512 జాతీయ పార్కులు ఉన్నాయి.

**సి) బయోస్పియర్ రిజర్వ్:**
ఏదైనా భౌగోళిక ప్రాంతంలో వృక్ష, జంతుజాతులు, వాటి జన్యువుల పరిరక్షణ, గిరిజనుల జీవనశైలి, పెంపుడు మొక్కల, జంతువుల జన్యు ఆధారాలను సంరక్షించేందుకు ఏర్పాటైన బహుళ ప్రయోజనకర రక్షిత ప్రాంతాలే బయోస్పియర్ రిజర్వ్‌లు. యునెస్కో ఆధ్వర్యంలో ఏర్పాటైన మ్యాన్ అండ్ బయోస్పియర్ ప్రోగ్రామ్ (1971) ప్రస్తుతం దేశంలో 19 బయోస్పియర్ ప్రాంతాలను ప్రకటించింది.

**గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం**
**జనరల్ స్టడీస్**
**జాగ్రఫీ**

**డి) దుర్బల, ప్రమాద స్థితిలో ఉన్న జీవజాతుల పరిరక్షణకు ప్రత్యేక పథకాలు:**

**ప్రాజెక్టు టైగర్:**
అంతరించిపోతున్న పులుల సంతతిని పరిరక్షించడానికి, వాటి సంఖ్యను పెంపొందించడానికి, వాటిలోని సౌందర్య, సాంస్కృతిక, వాణిజ్య, ఆవరణ వ్యవస్థల పరమైన విలువలను కాపాడడానికి 1973 నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పథకం కింద దేశంలో 55 పులి సంరక్షణా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పులిసంరక్షణా కేంద్రాలు, పులులు ఎక్కువ సంఖ్యలో ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్. అందుకే దీన్ని పులి రాష్ట్రంగా పిలుస్తారు. అంతేకాకుండా పులిని 1973లో జాతీయ జంతువుగా ప్రకటించారు.

**ప్రాజెక్టు ఎలిఫెంటా:** ఏనుగుల సంతతిని పెంచడానికి 1992లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం దేశంలోని 13 రాష్ట్రాల్లో 33 ఏనుగు సంరక్షణా కేంద్రాలున్నాయి.

**ప్రాజెక్టు క్రోకోడైల్:** మొసళ్ల పరిరక్షణకు 1975 నుంచి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఎనిమిది రాష్ట్రాల్లో 34 మొసలి సంరక్షణా కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

**ప్రాజెక్టు సీ టర్టుల్స్:** సముద్ర తాబేళ్ల పరిరక్షణకు 1975లో ఈ పథకాన్ని ఒడిశాలోని గహిర్‌మతాబీచ్‌లో ఏర్పాటు చేశారు. ఇందులో రిడ్లే రకానికి చెందిన తాబేళ్లను పరిరక్షిస్తున్నారు.

| జాతీయ పార్కు/ వన్యమృగ సంరక్షణ కేంద్రం | రాష్ట్రం/ కేంద్రపాలిత ప్రాంతం | ప్రత్యేకత |
|---|---|---|
| దచిగాం జాతీయ పార్కు | జమ్మూ కాశ్మీర్ | హంగుల్ (కాశ్మీరి దుప్పి) |
| సలీం అలీ పక్షి సంరక్షణ కేంద్రం | జమ్మూ కాశ్మీర్ | హిమాలయన్ మంచుకోడి |
| జిమ్ కార్బెట్ జాతీయ పార్కు (దేశంలోనే తొలి జాతీయ పార్కు) | ఉత్తరాఖండ్ | పులులు |
| ఘనా పక్షి సంరక్షణ కేంద్రం | రాజస్థాన్ | సైబీరియన్ కొంగలు |
| ఖాజీరంగా జాతీయ పార్కు | అసోం | ఒంటికొమ్ము ఖడ్గమృగం |
| వాలీ ఆఫ్ ఫ్లవర్స్ జాతీయ పార్కు | ఉత్తరాఖండ్ పరిరక్షణ | భిన్నరకాల పుష్పజాతుల |
| సరిస్కా వన్యమృగ సంరక్షణ కేంద్రం | రాజస్థాన్ | పులులు |
| కన్హా జాతీయ పార్కు | మధ్యప్రదేశ్ | పులులు |
| కన్నేర్‌ఘాట్ జాతీయపార్కు | చత్తీస్‌గఢ్ | పులులు |
| కంచర గాడిదల సంరక్షణా కేంద్రం | గుజరాత్ | కంచర గాడిదలు |
| గిర్ వన్యమృగ సంరక్షణ కేంద్రం | గుజరాత్ | సింహాలు |
| బోరివిల్లా జాతీయపార్కు | మహారాష్ట్ర | అరిచే జింకలు |
| బన్నేర్‌ఘాట్ జాతీయపార్కు | బెంగళూరు | ప్రపంచంలో అతిపెద్ద సీతాకోక చిలుకల సంరక్షణ కేంద్రం |
| సైలెంట్ వ్యాలీ జాతీయ పార్కు | కేరళ | మకాక్ కోతులు (సింహపు తోక ఉన్న కోతులు) |
| పెరియార్ వన్యమృగ సంరక్షణ కేంద్రం | కేరళ | ఏనుగులు, పులులు |
| రాజీవ్‌గాంధీ పులుల సంరక్షణ కేంద్రం | ఆంధ్రప్రదేశ్ | పులులు |

**2) Ex-Situ సంరక్షణ:**
ఏదైనా భౌగోళిక ప్రాంతంలో అంతరించే స్థితిలో ఉన్న జీవ జాతులను వాటి సహజ ఆవాసాలకు వెలుపల పరిరక్షించే విధానమే Ex-Situ సంరక్షణ. ఈ విధానంలో జీవజాతులు, వాటి నమూనాలను, విత్తన, పిండ నిల్వల బ్యాంకులు, కణజాల వర్ధన కేంద్రాలు, జన్యుబ్యాంకులు, బీజ ద్రవ్య బ్యాంకులు, చేపల గుడ్ల నిల్వ కేంద్రాలు, జంతు ప్రదర్శనశాలలో సంరక్షిస్తారు.

పైన తెలిపిన విధానాలతోపాటు దేశంలో అనేక చట్టాలు, పరిశోధనా కేంద్రాలను కూడా జీవ వైవిధ్య సంరక్షణలో భాగంగా రూపొందించి అమలు చేస్తున్నారు. అవి..

1. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, కోల్‌కతా
2. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, డెహ్రాడూన్
3. ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, డెహ్రాడూన్
4. అరిడ్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్-జోధ్‌పూర్(రాజస్థాన్)
5. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్రీ-డెహ్రాడూన్
6. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ ఆఫ్ టెక్నాలజీ-బెంగళూరు
7. ట్రోఫికల్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - జబల్‌పూర్(మధ్యప్రదేశ్)
8. హిమాలయా ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, సిమ్లా(హిమాచల్ ప్రదేశ్)
9. సెంటర్ ఫర్ సోషల్ ఫార్రెస్ట్రీ ఆఫ్ ఎకొలాజికల్ రిహాబిలిటేషన్-అలహాబాద్
10. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్-భోపాల్
11. వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, డెహ్రాడూన్
12. జీబీ పంథ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్-అల్‌మోరా(ఉత్తరాఖండ్)
13. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్- నాగ్‌పూర్

### మాదిరి ప్రశ్నలు

1. in-Situ జీవ వైవిధ్య సంరక్షణా విధానంలో ఒక కార్యక్రమం కానిది?
   1) జాతీయ పార్కులు 2) ప్రాజెక్ట్ టైగర్
   3) బయోస్పియర్ రిజర్వ్
   4) ఉద్యానవనాలు
2. కన్హా జాతీయపార్కు ఏ నది ఒడ్డున ఉంది?
   1) చంబల్ 2) బెట్వా
   3) కెన్ 4) సోన్
3. సైబీరియన్ కొంగలకు ప్రసిద్ధి చెందిన పక్షి సంరక్షణా కేంద్రం?
   1) నేలపట్టు 2) సలీంఅలీ
   3) ఘనా 4) సుల్తాన్‌పూర్
4. కన్నేర్‌ఘాట్ జాతీయ పార్కు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) జార్ఖండ్ 2) కర్ణాటక
   3) చత్తీస్‌గఢ్ 4) మధ్యప్రదేశ్
5. దేశంలో మొదటి బయోస్పియర్ రిజర్వ్?
   1) సుందర్‌బన్
   2) గల్ఫ్ ఆఫ్ మన్నార్
   3) కాంచనజంగా 4) నీలగిరి
6. అరిచే జింకలకు ప్రసిద్ధి చెందిన వన్యమృగ సంరక్షణా కేంద్రం?
   1) కన్హా 2) సైలెంట్ వ్యాలీ
   3) బోరివిల్లా 4) రణతంబోర్
7. సైలెంట్ వ్యాలీ జాతీయ పార్కు దేనికి ప్రసిద్ధి?
   1) పులులు 2) ఏనుగులు
   3) మకాక్ కోతులు
   4) సీతాకోక చిలుకలు
8. నేలపట్టు పక్షి సంరక్షణా కేంద్రం ఏ సరస్సు ఒడ్డున ఉంది?
   1) కొల్లేరు 2) సాంబార్
   3) చిల్కా 4) పులికాట్
9. పులి రాష్ట్రంగా దేన్ని పిలుస్తారు?
   1) చత్తీస్‌గఢ్ 2) మధ్యప్రదేశ్
   3) ఆంధ్రప్రదేశ్ 4) అసోం

**సమాధానాలు**
1) 4 2) 2 3) 3 4) 3 5) 4
6) 3 7) 3 8) 4 9) 2

# How will RIGHT be written in the same code?

In this chapter a word or message is coded according to a definite pattern or rule. An aspirant is expected to identify the pattern or rule to decode the given word or message so that the same pattern can be applied to code or decode another word or message.

**Types of coding-decoding**

I. **Letter Coding:** In this coding certain letters of alphabet stand for certain other letters of the alphabet.

II. **Number Coding:** In this coding letters are replaced by position of the letter in English alphabet.

Now let us look at different types of letter coding.

1. **Forward Sequence Pattern:** Here each letter is coded by its next letter in alphabet.
   For ex: If 'DREAMS' is coded as "ESFBNT" then how will you code 'POLICE'?
   Here D, R, E, A, M and S
   ↓ ↓ ↓ ↓ ↓ ↓
   E, S, F, B, N and T... are coded by next letters in alphabet
   So the letters of the word "POLI CE" will be coded by their next letters of alphabet "QPMJDF".
2. **Backward Sequence Pattern:** In this type each letter is coded by its preceding letter in English alp habet.
   For ex: If 'DREAMS' is coded as "CQDZLR" then how 'CARNAGE' will be coded?
   In the above pattern the letters of the word 'DREAMS' viz
   D, R, E, A, M and S are
   ↓ ↓ ↓ ↓ ↓ ↓
   C Q DZ L and R
   coded by the preceding letters in English alphabet
   In the same way the letters of the word "CARNAGE" will be coded as "BZQMZFD"
3. **Skipped Sequence Pattern:** In this pattern each letter is coded by a letter obtained after skip ping certain number of letters in English alphabet. In such patterns continuity of letters is maintained i.e Z is followed by A without disturbing the continuity.
   For e.g. If 'DREAMS' is coded as "FUIFSZ" then how will you code 'SAKSHI'?
   In the above coding D, R, E, A, M and S are coded by letters obtai ned after skipping 1, 2, 3, 4, 5 and 6 letters i.e 'D' by 'F' (skip 1), 'R' by 'U' (skip 2), 'E' by 'I' (skip 3) and so on.
   In the same way skip 1, 2, 3, 4, 5 and 6 letters for the letters S, A, K, S, H and I to obtain U, D, O, X, N and P. Therefore 'SAKSHI' will be coded as "UDOXNP".
4. **Coding in fictious language:** *Here a new fictious language is used to code words. In such questions, the codes for a group of words is usually given. By eliminating the common words we may find out the codes for each word. The procedure is explained below:*
   In a certain code language 'hit bit mit' means 'git rim nit', 'sit pit mit' means 'lit git tit' and 'fit zit pit' means 'dit vit tit'. What does 'sit' stand for in that code lang uage?
   In the first two sentences 'mit' is a common word and in the corres ponding codes 'git' is common word. Therefore 'mit' is coded as 'git'. Similarly in the second and third sentences the word 'pit' is common and in the correspo-nding code language 'tit' is common word. Therefore 'pit' is coded as 'tit'.
   So the remaining word 'sit' in second sentence is coded by remaining word 'lit'.

**PRACTICE QUESTIONS**

1. In a certain code, IDEAS is written as HEDBR and WOULD is written as VPTMC. How will RIGHT be written in the same code?
   1) QJHIS 2) QJFGS
   3) SHHGU 4) QJFIU 5) QJFIS

A: 5;
In the given words IDEAS and WOULD, the first, third and fifth letters are replaced with the preceding letters of the alphabet. The second and the fourth letters of the given words are replaced by the next letters.
I D E A S W O U L D
-1 +1 -1 +1 -1 -1 +1 -1 +1 -1
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
H E D B R V P T M C
So the letters of the word RIGHT will be coded as R → Q, I → J, G → F, H → I, T → S.
So the coded word will be QJFIS.



2. In a certain code PAUSE is written as OBVTD and SHIFT is written as RIJGS. How will THI NK be written in the same code?
   1) UGHML 2) SIJOJ 3) SILOJ
   4) SIJQJ 5) SIJ0L

A: 2;
In the given words PAUSE and SHIFT, the first and fifth letters are replaced with the preceding letters of the alphabet. The second, third and the fourth letters of the given words are replaced by the next letters.
P A U S E S H I F T
-1 +1 +1 +1 -1 -1 +1 +1 +1 -1
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
O B V T D R I J G S
∴ THINK will be coded as SIJOJ.

3. In a certain code, DRENCH is written as CSFODG and GEMI NI is written as FFNJOH. How will PIGEON be written in the same code?
   1) QJHFPO 2) RJHFPO
   3) OJFHPM 4) OJHFMP
   5) None of these

A: 5;
In the two given words, the first and the last letters are replaced with the preceding letters of the word. The letters between are replaced with the next letters of the alphabet.
D R E N C H G E M I N I
-1 +1 +1 +1 +1 -1 -1 +1 +1+1+1 -1
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
C S F O D G P I G E O N
∴ PIGEON is coded as OJHFPM

4. If PAPER is written as OZODQ then how PENCIL can be written in that code?
   1) ODMBHK 2) DOMBHK
   3) ODMHBK 4) OMDBHK 5) None of these

**BANK EXAMS**
**CODING - DECODING**

A: 1;
All the letters of the given word are replaced by the preceding letters of the alphabet.
P A P E R
-1 -1 -1 -1 -1
↓ ↓ ↓ ↓ ↓
O Z O D Q
In the same way PENCIL can be coded as
P E N C I L
-1 -1 -1 -1 -1 -1
↓ ↓ ↓ ↓ ↓ ↓
O D M B H K

5. In a certain code 'PAINT' is coded as 'RCKPV' and 'STOMP' is written as 'UVQOR'.
   In the same code 'HELPS' will be coded as '_____'.
   1) JGNRU 2) GJNRU
   3) KGNRU 4) JGNSU
   5) JGNRV

A: 1;
All the letters of the given words are replaced by second next letter of the alphabet.
P A I N T S T O M P
+2 +2 +2 +2 +2 +2 +2 +2 +2 +2
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
R C K P V U V Q O R
In the same way HELPS can be coded as
H E L P S
+2 +2 +2 +2 +2
↓ ↓ ↓ ↓ ↓
J G N R U

6. If in a certain code, 'O' is written as 'E', 'A' as 'C', 'M' as 'I', 'S' as 'O', 'N' as 'P', 'E' as 'M', 'I' as 'A', 'P' as 'N' and 'C' as 'S', then how will 'COMPANIES' be written in that code?
   1) SEIACPAMO 2) SMINCPAMO
   3) SEINCPAMO 4) SEINCPMIO
   5) None of these

A: 3;
O → E, A → C, M → I, S → O, N →P, E → M, I → A, P → N,
C →S
C O M P A N I E S
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
S E I N C P A M O

7. In a certain code, 'what else can you do for me, Mr.Ajay' is written as 'You Mr. what can Ajay else do me for'. How will 'anyone else who can do such favour to me' be written in that code?
   1) can to who anyone me else do favour such
   2) can favour anyone who me else do such
   3) can to anyone who me else do such favour
   4) can to anyone who me do else favour such
   5) None of these

A: 3;
By looking at the given sentence and its code it can be said that the words are same in both the cases. Also the words are not arranged in dictionary order, because the word 'Mr.' comes before 'You' in a dictionary. So the words are arranged among themselvesin different positions. To solve such questions use the following method. First number the words of the given sentence.
1 2 3 4 5 6 7 8 9
what else can you do for me, Mr. Ajay
Now look at the order in which these words are arranged in coded form
You Mr. what can Ajay else do me for
4 8 1 3 9 2 5 7 6
In the same way words of the given sentence is coded as
1 2 3 4 5 6 7 8 9
anyone else who can do such favour to me
Then decoding the above one:
4 8 1 3 9 2 5
can to anyone who me else do
7 6
favour such

**Directions (8-12):** *Study the following information carefully and answer the questions given below:*
In a certain code language '5 1 6 7 2 1' is written as 'the black dog frightened the cat', '6 4 5 8 1' is written as 'the frightened cat run away', '3 6 2 1' is written as 'the cat was black' and '7 4 1' is written as 'the dog run'.

8. What is the code for 'away'?
   1) 8 2) 6 3) 3 4) 1
   5) Can't be determined

A: 1;

9. What is the code for 'black'?
   1) 2 2) 4 3) 6 4) 5
   5) Can't be determined

A: 1;

10. What is the code for 'frightened'?
    1) 2 2) 6 3) 7
    4) 5 5) Can't be determined

A: 4;

11. What is the code for 'the cat was frightened'?
    1) 5267 2) 5371 3) 8475
    4) 5367 5) None of these

A: 5;

12. Which of the following words is represented by '4'?
    1) cat 2) dog
    3) run 4) the
    5) Can't be determined

A: 3;

**SOLUTIONS (8-12)**

Try to identify which number is assigned to each word.
'5 1 6 7 2 1' → 'the black dog frightened the cat' ...... (i)
'6 4 5 8 1' → 'the frightened cat run away' ............ (ii)
'3 6 2 1' → 'the cat was black' ... (iii)
'7 4 1' → 'the dog run' ........... (iv)
'the' is common in all the four sets. So the code for 'the' is 1.
Considering the (iv) statement, it has 7 and 4.
Comparing the '7' in (i) and (iv), 7 → dog & 4 → run.
Comparing (i) & (iii), 3 →was
Now comparing (ii) & (iii), 6 → cat
Now in (iii), 2 → black Comparing(i) &(ii), 5→ frightened & 8 → away
Now answer the questions based on the above data.